ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 7-1-2018 ఆదివారం సిటీ సంపుటి 44 సంచిక 148

రూ. 6-00. పేజీలు 16+16+32 www.eenadu.net

Dwaraka

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

రైతుకు రొక్కం

పెట్టుబడి మద్దతు పథకంపై కమిటీ కసరత్తు • నేరుగా నగదు రూపంలో పంపిణీకే మొగ్గు!

- 1.42 కోట్ల ఎకరాలకు ఖరీఫ్‌లో రూ.5680 కోట్లు
- ఎకరాకు రూ.8 వేలిస్తే రూ.11,360 కోట్లు
- యాసంగిలో ఎంత ఇవ్వాలన్నదే ప్రశ్న

ఈనాడు - హైదరాబాద్



రైతులకు ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇచ్చే పెట్టుబడి పథకం అమలుపై వ్యవసాయశాఖ ప్రాథమిక కసరత్తు పూర్తి చేసింది. రెవెన్యూశాఖ తాజాగా సాగు భూముల లెక్కలను ప్రాథమికంగా నిర్ధరించడంతో ఈ పథకానికి అవసరమైన నిధులపై అవగాహన వచ్చింది. మొత్తం రాష్ట్రంలో 71 లక్షల మంది రైతులకు 1.42 కోట్ల ఎకరాల సాగు భూములున్నట్లు రెవెన్యూశాఖ తేల్చింది. ప్రతి ఎకరానికి రూ.4 వేలు ఒక్కో సీజన్‌లో ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈలెక్కన వచ్చే జూన్‌కల్లా వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో రైతులకు తొలివిడతగా రూ.5,680 కోట్లు విడుదల చేయాల్సి ఉంటుందని లెక్క తేలింది. వచ్చే అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే యాసంగి(రబీ)లో అన్ని భూములకు ఇస్తారా లేక సాధారణ విస్తీర్ణం ప్రకారమే విడుదల చేస్తారా అన్నది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. భారీగా నిధులిస్తున్నందున వీటిని రైతుల చేతికి నేరుగా నగదు రూపంలో అందించినపుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

కీలక అంశాలపై రేపు చర్చ

రైతుల పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేస్తే వారి చేతికి నగదును బ్యాంకులు చాలా వరకూ ఇవ్వవని, దీనివల్ల పథకం లక్ష్యం నీరుగారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఎలా పంపిణీ చేస్తే రైతుల చేతికి నగదు సులభంగా అందుతుందనేది తేల్చడానికి మార్గాలు సూచించాలని మంత్రుల కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై చర్చించేందుకు సోమవారం కమిటీ సమావేశమవుతోంది. ఖరీఫ్‌లో కోటి ఎకరాల దాకా సాగవుతుంటే (మిగతా 2లో)



అమెరికాలోని న్యూజెర్సీలో మంచులో కూరుకుపోయిన కారు

అమెరికా, కెనడాలను వణికిస్తున్న మంచు తుపాను

న్యూయార్క్: అమెరికా తూర్పు తీరం, కెనడా దేశాలను మంచు తుఫాన్ వణికిస్తోంది. శనివారం అమెరికాలోని ఉత్తర ఫ్లోరిడా, న్యూయార్క్ నగరం, న్యూఇంగ్లాండ్ తదితర ప్రాంతాల్లోని కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా నమోదయ్యాయి. బయటకు వెళ్లడం ప్రమాదకరమని వాతావరణ నిపుణులు హెచ్చరించడంతో పాఠశాలలు, విమానాశ్రయాలను మూసివేశారు. గంటకు 113 కి.మీ.ల వేగంతో మంచు తుఫాన్ గాలులు వీస్తుండడంతో కొన్ని చోట్ల 56 సెంటీమీటర్ల మందంలో మంచు పేరుకుపోతోంది. హ్యూస్టన్ నుంచి బోస్టన్ వరకు ఉన్న నగరాల్లో గూడులేని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. టెక్సాస్‌లో ఇళ్లు లేని ముగ్గురు వ్యక్తులు చలికి తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయారు. కెనడాలోని టొరాంటోలో ఇలాంటి వారి కోసం అత్యవసర సౌకర్యాలు కల్పిస్తున్నారు. రహదారులపై పేరుకుపోయిన మంచును తొలగించడానికి కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. ఆదివారం కూడా పరిస్థితిలో మార్పు ఉండకపోవచ్చు.

శీతల భూతలం

- ఉత్తర భారతంలో హిమపాతాలు, చలిగాలులు
- కశ్మీర్‌లో –15.6, హిమాచల్‌లో –22 డిగ్రీలు -2లో
- మంచు తుపాను బాధితుల్లో 11 మృతదేహాల వెలికితీత



ట్రంప్ విస‘వీసా’తో అమెరికాకు నష్టమే!

ట్రంప్ రాజేస్తున్న వీసా కుంపటి ఇటు భారత్‌లోనే కాకుండా అటు అమెరికాలోనూ సెగ పుట్టిస్తోంది. దీనివల్ల లక్షలమంది విదేశీయుల (ముఖ్యంగా భారతీయులు) భవిష్యత్తు అగమ్యగోచరం కానుండటం ఒక కోణమైతే... వృత్తి నిపుణులు వెళ్లిపోతే అమెరికాకు కలిగే నష్టం అపారంమే. నిపుణులైన మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్న అమెరికా ఆర్థికవ్యవస్థకు ట్రంప్ యోచన శరాఘాతమే. విదేశీయుల ప్రతిభాపాటవాలతో కొత్త పుంతలు తొక్కుతున్న సిలికాన్ వ్యాలీ చిన్నబోతుంది. ప్రపంచ సాంకేతిక సామ్రాజ్యంపై అమెరికా గుత్తాధిపత్యానికి ఎసరు తప్పదు. హెచ్-1 బీ వీసా పొడిగింపును నియంత్రించాలన్న ట్రంప్ యోచన వల్ల అమెరికాకు కలిగే నష్టాలు.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు విదేశీయులు అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం

మిస్టర్ ట్రంప్..
వీరి శ్రమ అమెరికా కోసం కాదా? –11లో

జీశాట్ 11 = 30 ఉపగ్రహాలు

- అత్యంత శక్తిమంతమైన శాటిలైట్ ప్రయోగం
- ఇస్రో సన్నద్ధం



దిల్లీ: భారత్ ఇప్పటివరకూ నిర్మించినవాటిలో అత్యంత బరువైన ఉపగ్రహం జీశాట్-11.. ప్రయోగానికి సిద్ధమవుతోంది. దీని బరువు ఆరు టన్నులు. ఇది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన ‘డిజిటల్ ఇండియా’ కార్యక్రమానికి ఊతమివ్వనుంది. దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను మరింత మెరుగుపరచనుంది. ఇది గ్రామీణ భారతానికి ఒక వరమని నిపుణులు చెబుతున్నారు. ఈ ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ గయానాలోని కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి (మిగతా 2లో)



లాలూకు జైలు

- మూడున్నరేళ్ల ఖైదు
- రూ.10 లక్షల జరిమానా
- దాణా కుంభకోణంలో సీబీఐ న్యాయస్థానం తీర్పు -2లో

మార్కులే సరి!

- ఇంటర్‌లో ‘శ్రేణుల’ పద్ధతికి సర్కారు అభ్యంతరం
- ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులను నిర్ణయించడం కష్టమవుతుందన్న విద్యాశాఖ

ఈనాడు - హైదరాబాద్

ఫలితాల్లో శ్రేణుల (గ్రేడుల) విధానాన్ని అమలు చేస్తామన్న ఇంటర్మీడియట్ బోర్డు ప్రతిపాదనలకు తెలంగాణ సర్కారు అభ్యంతరం తెలిపింది. ఈ పద్ధతి వల్ల వివిధ ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులకు ర్యాంకులను నిర్ణయించడం సమస్యగా మారుతుందనీ, ఈసారికి కుదరదని తేల్చి చెప్పేసింది.

రెండు నెలల క్రితం ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలు అధికంగా జరగడంతో... వారిపై ఒత్తిడిని తగ్గించేందుకు పదోతరగతి మాదిరిగా శ్రేణుల విధానాన్ని తీసుకురావాలన్న సూచనలొచ్చాయి. ఈ విషయమై ఇంటర్ బోర్డు... ప్రవేటు జూనియర్ కళాశాలల యజమానులు, అధ్యాపకులు, ప్రధానాచార్యులు, డీఐఈవోలతో పాటు చుక్కా రామయ్య తదితర విద్యావేత్తలతో సలహా సంఘాన్ని నియమించింది. రెండు సార్లు సుదీర్ఘంగా చర్చించింది. సభ్యుల్లో అధికశాతం మంది శ్రేణుల విధానాన్ని అమలుచేయాలనీ, ఇది సాధ్యమేనని అభిప్రాయపడ్డారు. దీంతో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షల ఫలితాల్లో శ్రేణుల విధానాన్ని అమలుచేస్తామని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్యకు బోర్డు ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ఆమె... శ్రేణుల విధానంతో పలు సమస్యలు ఉన్నాయనీ, మార్కుల విధానాన్ని యథావిధిగా అమలుచేయాలని బోర్డు అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఇవీ సమస్యలు..

- ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం పొందడానికి ఇంటర్‌లో 75% మార్కులు తెచ్చుకోవాలి. లేదంటే చదివిన బోర్డు టాప్ 20 పర్సంటైల్‌లోనైనా ఉండాలి. శ్రేణుల విధానంలో ఒక్కో సబ్జెక్టుకు ఏ1, ఏ2, బీ1, బీ2...ఇలా గ్రేడులిస్తారు. బీ1 గ్రేడు అంటే... 71-80% మార్కులు వచ్చినట్టు లెక్క. అలాంటప్పుడు ఇంటర్‌లో బీ1 తెచ్చుకున్నవారిని ఐఐటీల్లో ప్రవేశాలకు ఎలా పరిగణిస్తారు?
- ఇంటర్ మార్కులకు ఎంసెట్‌లో 25% వెయిటేజీ ఉంది. బీ1 గ్రేడు తెచ్చుకున్నవారందరికీ ఒకే వెయిటేజీ ఇస్తే... ఎక్కువ మార్కులు వచ్చినవారు తమకు నష్టం జరిగిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించే (మిగతా 2లో)

త్వరలో ఎంబీసీ రుణాలు

- 82 కులాలకు ఇవ్వాలని యోచన
- తెలంగాణలో కొత్తగా మూడు సమాఖ్యల ఏర్పాటు
- కసరత్తు చేస్తున్న సర్కారు

ఈనాడు - హైదరాబాద్



తెలంగాణలో అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధి సంస్థ (ఎంబీసీ కార్పొరేషన్) ద్వారా 82 బీసీ కులాలకు రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎంబీసీల గుర్తింపు ఆలస్యం కానున్న నేపథ్యంలో ప్రభుత్వమే కొన్ని బీసీ కులాలను ఎంబీసీలుగా పరిగణించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు బీసీల సంక్షేమం, అభివృద్ధిపై రూపొందించిన నివేదికలో పలు విషయాలను కమిటీ పొందుపరిచినట్లు తెలిసింది. బీసీల్లోని మొత్తం 113 కులాల్లో ముస్లిం మైనార్టీలు, బీసీ-సీలను తీసివేయగా.. 82 కులాలను ఎంబీసీలుగా గుర్తించి ప్రభుత్వం రుణాలివ్వనుంది. బీసీ కులాల్లో సహకార సమాఖ్యలున్న వారికి ఆయా సమాఖ్యల ద్వారానే రుణాలివ్వాలని, లేనివారికి మాత్రమే ఎంబీసీ కార్పొరేషన్ కింద సహకారం అందించాలని సర్కారు నిర్ణయించింది. బీసీ-డీలోని అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపు, పెరిక, ముదిరాజ్ కులాలకు ప్రత్యేక సహకార సమాఖ్యలు ఏర్పాటు చేయనున్నారు. సంక్రాంతి తరువాత అధికారికంగా సంక్షేమ పథకాలు ప్రకటించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రూ.1420 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినా.. మార్చి నాటికి కనీసం రూ.500 కోట్ల వరకు ఖర్చుచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇవీ ప్రతిపాదనలు..

- బీసీ-ఏ గ్రూపులోని 43 సంచార కులాలను ఎంబీసీలుగా పరిగణిస్తారు. మత్స్యకార, రజక, మేదర, పూసల, నాయీబ్రాహ్మణ, వాల్మీకి బోయ, వడ్డెర కులాలకు ఆయా సమాఖ్యల ద్వారా రుణాలు అందిస్తారు. మిగతా 37 కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా సాయం చేస్తారు.
- బీసీ-బీ గ్రూపులో 17 కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలిస్తారు. కల్లుగీత, కుమ్మరి-శాలివాహన, గొర్రెలు-మేకల సహకార సంఘం, చేనేత, విశ్వబ్రాహ్మణ (మిగతా 2లో

ఇదీ సంగతి!



హైకోర్టు విభజనకు మూడు కమిటీలు

ఉద్యోగుల విభజన, భవనాల పరిశీలన, దస్త్రాల డిజిటలైజేషన్లపై ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టును విభజించి, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏపీ హైకోర్టును ఏర్పాటుచేసే క్రతువులో భాగంగా మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఉద్యోగుల విభజన; ఆంధ్రప్రదేశ్ సర్కారు ప్రతిపాదించిన భవనాల పరిశీలన; రికార్డుల డిజిటలైజేషన్ పర్యవేక్షణ నిమిత్తం... ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ వీటిని ఏర్పాటుచేశారు.

- ఉద్యోగుల విభజన కమిటీలో జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సురేష్‌కుమార్ కైత్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ ఎ.శంకరనారాయణ, జస్టిస్ షమీమ్ అక్తర్‌లు ఉన్నారు.
- భవనాల కమిటీలో జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ టి.సునీల్‌చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలు సభ్యులు.
- డిజిటలైజేషన్ కమిటీలో జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావులు ఉన్నారు.

ఫిబ్రవరి తొలివారంలో భవనాల పరిశీలన!: అమరావతి పరిధిలో ఆంధ్రప్రదేశ్ శాశ్వత హైకోర్టును తాత్కాలిక భవనంలో ఏర్పాటు (మిగతా 2లో)

రామోజీ ఫిల్మ్‌సిటీకి మరో ఘనత

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 'లార్జెస్ట్ ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్‌సిటీ ఆఫ్ ది వరల్డ్'గా గుర్తింపు
- రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావుకు ధ్రువీకరణ పత్రం అందజేత



రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' భారత అధ్యక్షుడు సంతోష్ శుక్లా

ఈనాడు, హైదరాబాద్: చలనచిత్రాల నిర్మాణానికి సకల సౌకర్యాల నిలయంగా ఖ్యాతికెక్కిన రామోజీ ఫిల్మ్‌సిటీ మరో ఘనతను సొంతం చేసుకుంది. సినిమా నిర్మాణ సదుపాయాలన్నింటినీ పర్యావరణ హితంగా అంతర్జాతీయ స్థాయిలో ఒకేచోట అందిస్తోందంటూ రామోజీ ఫిల్మ్‌సిటీని 'లార్జెస్ట్ ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీ ఆఫ్ ది వరల్డ్'గా 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' గుర్తించింది. రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావును శనివారం ఫిల్మ్‌సిటీలో కలిసిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' భారత అధ్యక్షుడు సంతోష్ శుక్లా ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. "హాలీవుడ్, బాలీవుడ్‌లలోని చిత్ర నిర్మాణ ప్రదేశాలన్నింటినీ పరిశీలించాం. ఆర్కే స్టూడియో వంటి సంస్థలకు గుర్తింపు ఇచ్చాం. కానీ, రామోజీ ఫిల్మ్‌సిటీలో సుందర ప్రదేశాలు, మరీ ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యంపై 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రతినిధులు సంతృప్తి వ్యక్తంచేశారు. ఇక్కడ ఏ పనైనా పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని అంకితభావంతో చేస్తున్నారు" అని శుక్లా పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రం అందజేసే కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ రామ్మోహన్‌రావు, ఈటీవీ సీఈవో బాపినీడు, ఫిల్మ్‌సిటీ సీఈవో రాజీవ్ జల్నా పుర్కర్ తదితరులు పాల్గొన్నారు.

శీతల భూతలం

దిల్లీ: అతి శీతల గాలులు ఉత్తరాదిని వణికిస్తున్నాయి. జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, యూపీ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. జమ్మూ-కశ్మీర్‌లో 40 రోజుల చలికాలం(చిల్లై-కలన్) కొనసాగుతుండగా.. ఉష్ణోగ్రతలు 'సున్నా' కన్నా దిగువకు పడిపోయాయి. లద్దాఖ్ ప్రాంతంలోని లేహ్‌లో -15.6, గుల్‌మార్గ్‌లో -9.4, శ్రీనగర్‌లో -1.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో -15 నుంచి -22 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. దిల్లీలో 4.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. దట్టమైన మంచు కురుస్తుండటంతో 36 రైళ్లను పూర్తిగాను, మరో 30 పాక్షికంగాను రద్దుచేశారు. 85 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. విమానాల రాకపోకలకు కూడా అంతరాయం కొనసాగుతోంది. పంజాబ్, హరియాణా తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలను దాటడం లేదు.

11 మృతదేహాల వెలికితీత

శ్రీనగర్: కశ్మీర్‌లో మంచు తుపాను ధాటికి సమాధి అయిపోయినవారిలో 11 మృతదేహాలను శనివారం వెలికితీశారు. కుప్వారా జిల్లాలో ప్రయాణికుల వాహనంపై శుక్రవారం మంచు చరియ విరిగిపడిన విషయం తెలిసిందే. ఘటనాస్థలి నుంచి ముగ్గురిని సజీవంగా బయటకు తీయగలిగారు. ప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే ఒక అధికారి మృతదేహాన్ని, శనివారం మరో 10 మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. ప్రమాదంపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ విచారం వ్యక్తం చేశారు. గాయపడినవారిని ఆదుకునేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

చైనాలో హిమపాతానికి 13 మంది బలి

బీజింగ్: చైనాలోని అన్హుయీ ప్రావిన్సులో హిమపాతానికి మూడు రోజుల వ్యవధిలో 13 మంది బలయ్యారు. ప్రజలంతా మరో రెండ్రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం నాలుగో స్థాయి హెచ్చరిక ప్రకటన (బ్లూ అలెర్ట్) జారీ చేసింది. తొమ్మిది నగరాల్లో అత్యవసర బృందాలు రంగంలో దిగాయి. ప్రజల్ని ఇళ్లలోనే ఉండాల్సిందిగా అధికారులు సూచించారు.

హైకోర్టు విభజనకు మూడు కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు సిద్ధంగా ఉన్నామనీ, ప్రతిపాదిత భవనాలను పరిశీలించాలని కోరుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు... ఏసీజేకు లేఖరాశారు. ఈ క్రమంలో హైకోర్టు న్యాయమూర్తులందరూ ఇటీవల సమావేశమయ్యారు. ఆ సందర్భంగా తీసుకున్న నిర్ణయం మేరకు ప్రస్తుత కమిటీలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపాదిత భవనాలను ఫిబ్రవరి తొలివారంలో పరిశీలించే అవకాశమున్నట్లు సమాచారం.

జీశాట్ 11 = 30 ఉపగ్రహాలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే కొన్నివారాల్లో ప్రయోగించనున్నారు. ఏరియాన్-5 రాకెట్ ద్వారా దీన్ని కక్ష్యలోకి పంపుతారు. ప్రస్తుతం దీన్ని ఫ్రెంచ్ గయానాకు పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఉపగ్రహం ఖరీదు రూ.500 కోట్లు. దీని సౌరఫలకాలూ భారీగానే ఉన్నాయి. ఒక్కో ఫలకం పొడవు నాలుగు మీటర్లు. "దేశానికి కొత్త సామర్థ్యాన్ని కల్పించే దిశగా మేం సాగిస్తున్న కసరత్తు ఇది. గ్రామ పంచాయతీలు, తాలుకాలు, భద్రతా దళాలకు ఇది ఉపయోగకరం" అని ఇస్రో ఛైర్మన్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటివరకూ భారత్ ప్రయోగించిన అన్ని సమాచార ఉపగ్రహాల ఉమ్మడి సామర్థ్యం కన్నా జీశాట్-11 శక్తిమంతమైనది. ఇదొక్కటే 30 ఉపగ్రహాలకు సమానం.

వైఫల్యం తర్వాత తొలి ప్రయోగం..

పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం విఫలమైన నాలుగు నెలల తర్వాత మరో ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోంది. ఈ నెల 12న మరోసారి ఆ రాకెట్‌ను ప్రయోగిస్తోంది. అందులో కార్టోశాట్‌తో 31 ఉపగ్రహాలను పంపుతున్నారు. ఇందులో విదేశీ శాటిలైట్లు కూడా ఉన్నాయి. పీఎస్ఎల్వీ వైఫల్యం చెందినప్పటికీ ఆ రాకెట్‌పై విదేశీ సంస్థలు ఆసక్తి కనబరిచాయా అన్న ప్రశ్నకు.. "ఔను. వారికి గొప్ప నమ్మకం ఉంది. జరిగినదానిపై వారు ఆందోళన చెందలేదు. వాహకనౌక కార్యకలాపాల్లో కొన్నిసార్లు ఏదో ఒక సమస్య తలెత్తుతుంటుందని వారికి తెలుసు" అని కిరణ్ కుమార్ తెలిపారు. ఆగస్టు 31న పీఎస్ఎల్వీ ప్రయోగం విఫలమైన సంగతి తెలిసిందే. నాడు ఉష్ణకవచం విడిపోకపోవడంతో.. ఉపగ్రహం అందులోనే ఉండిపోయింది.

త్వరలో ఎంబీసీ రుణాలు

(మొదటి పేజీ తరువాయి)

సహకార సంఘాల ద్వారా ఆయా కులాలకు రుణాలివ్వాలి.

- బీసీ-డీలో 28 కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ కింద రుణాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ప్రస్తుతమున్న కృష్ణబలిజ, మత్స్య సహకార, ఉప్పర-సగర, యాదవ సమాఖ్యలకు అదనంగా మున్నూరు కాపు, పెరిక, ముదిరాజ్ సమాఖ్యలు ఏర్పాటు చేయాలి. ఆయా కులాల వారికి సమాఖ్యల కింద రుణాలివ్వాలి.

నాలుగు కేటగిరీలుగా రుణాలు..

ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా నాలుగు కేటగిరీలుగా రుణాలివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలుత బ్యాంకుల అనుసంధానం ద్వారానే కార్యాచరణ చేపట్టాలని భావించింది. అయితే అనుసంధానం లేకుండా రుణాలివ్వాలని మంత్రుల కమిటీ ప్రతిపాదించింది. ఈ విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోనున్నారు. నాయిబ్రాహ్మణ సమాఖ్యల కింద కొత్తగా దుకాణాలు పెట్టేవారికి సామగ్రి అందించాలని, ఆధునికీకరణ చేసేవారికి ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక సాయం రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఉండనుంది. రజక సమాఖ్యల కింద బృందాలవారీగా రూ.10 లక్షల వరకు సాయం అందించనున్నారు. ఈ రెండు సమాఖ్యలను మినహాయిస్తే లబ్ధిదారుల సంఖ్య 1.05 లక్షలుగా ఉంది. వీరిలో 25 వేల మంది లబ్ధిదారులకు రూ.50 వేలు, 40 వేల మందికి రూ.లక్ష వరకు, 21 వేల మందికి రూ.2 లక్షల వరకు, 3100 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

2017-18 ఏడాదికి అంచనాలిలా..

కేటగిరీ	జనాభా	లబ్ధిదారులు	ఖర్చు (రూ.కోట్లు)
సంచారజాతులు	6,35,000	23,181	200
విశ్వబ్రాహ్మణ	7,65,000	23,181	200
కుమ్మరి శాలివాహన	3,64,000	11,183	100
★ ఇతర సమాఖ్యలు	6,43,159	17,176	170
కల్లుగీత కార్మికులు	15,81,000	11,183	100
ఇతర ఎంబీసీ కులాలు	50,00,000	15,893	150
రజక సమాఖ్య	8,66,243	18,220	250
నాయీబ్రాహ్మణ	3,09,798	20,109	250
మొత్తం	**95,29,200**	**1,40,126**	**1420**

★ వడ్డెర, సాగర ఉప్పర, వాల్మీకి బోయ, కృష్ణ బలిజ, పూసల, భట్రాజ, మేదర సమాఖ్యలు

నిరంతర విద్యుత్తుపై స్వామినాథన్ ప్రశంస

సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక లేఖ

ఈనాడు, హైదరాబాద్: సాగుకు 24 గంటలపాటు(నిరంతర) విద్యుత్తు సరఫరా చేయడమనేది మంచి నిర్ణయమని, దీని ద్వారా రైతులకు గొప్ప శక్తికలుగుతుందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ ప్రశంసించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. '24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు చేసిన ప్రకటన నాకు ఎంతో సంతోషం కలిగించింది. అత్యధిక వర్షాధార సేద్యమున్న రాష్ట్రం తెలంగాణ. వ్యవసాయంలో విజయం సాధించడానికి పంటలను కాపాడేందుకు అందించే సాగునీరే కీలకం. నిరంతర విద్యుత్తు సరఫరాతో సాగునీటి పరంగా రైతులకు భద్రత లభిస్తుంది. అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని నిర్ణయించినందుకు వారి తరపున నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మీ కుటుంబంతోపాటు రాష్ట్ర ప్రజలకు 2018 సంవత్సరం పూర్తి సంతృప్తికరంగా సాగాలని కోరుకుంటున్నాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు.

సింగరేణిలో 10 మెగావాట్ల సౌరవిద్యుత్కేంద్రం నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్: సింగరేణి థర్మల్ విద్యుత్కేంద్రంలో 10 మెగావాట్ల సౌరవిద్యుత్కేంద్రం నిర్మాణం చేపట్టాలని ఆ సంస్థ సీఎండీ శ్రీధర్ అధికారులకు సూచించారు. శనివారం సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్కేంద్రం అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. గత నెలలో థర్మల్ కేంద్రం మొదటి యూనిట్‌లో 100 శాతం, రెండో యూనిట్‌లో 99.5 శాతం విద్యుదుత్పత్తి జరిగిందని తెలిపారు. వీటితో కలిపి గత 9 నెలల్లో ఈ రెండు కేంద్రాల్లో సగటున 90 శాతం ఉత్పత్తితో దేశంలో నాలుగో స్థానంలో నిలిచినట్లు వివరించారు.

లాలూకు జైలు

రాంచీ: బిహార్‌లోని దేవ్‌గఢ్ ఖజానా కార్యాలయం నుంచి పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం రూ.89.27 లక్షలను తప్పుడు పత్రాలతో తీసుకోవడానికి సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మూడున్నరేళ్ల కారాగార శిక్ష విధించింది. పశుగ్రాసం కుంభకోణంలో ఆయనకు కారాగార శిక్ష విధించడం ఇది రెండోసారి. 2013లో ఒక కేసులో ఆయనకు అయిదేళ్ల జైలుశిక్ష పడింది. రెండున్నర నెలల పాటు కారాగారంలో ఉన్న తర్వాత సుప్రీంకోర్టు నుంచి బెయిల్ మంజూరయింది. మోసగించడం, నేరపూరిత కుట్రకు పాల్పడడం తదితర అభియోగాల కింద అవినీతి నిరోధక చట్టం (పీసీఏ) ప్రకారం లాలూకు ఇప్పుడు రెండో కేసులో శిక్ష విధించారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ) కింద రూ.5 లక్షలు, పీసీఏ కింద రూ.5 లక్షలు... వెరశి రూ.10 లక్షలు జరిమానాగా చెల్లించాలని కూడా న్యాయమూర్తి శివ్‌పాల్‌సింగ్ శనివారం తీర్పునిచ్చినట్లు సీబీఐ న్యాయవాది రాకేశ్ ప్రసాద్ తెలిపారు. ఒకవేళ జరిమానా చెల్లించడంలో విఫలమైతే మరో ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం బిర్సా ముండా కేంద్ర కారాగారంలో ఉన్న లాలూకు శిక్ష గురించి ప్రత్యక్ష ప్రసార సదస్సు పద్ధతిలో న్యాయమూర్తి తెలిపారు.

పశుపోషణ తెలుసుగా... ఆరుబయలు జైలే మంచిది

లాలూ కేసు విచారణలో కొన్ని హాస్యోక్తులు చోటు చేసుకుంటూ వస్తున్నాయి. చివరిరోజు కూడా అలాంటిదొకటి కొనసాగింది. ముద్దాయిలందరికీ పశుపోషణలో అనుభవం ఉన్న దృష్ట్యా వారికి ఆరుబయలు కారాగారమే మంచిదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కారాగారంలో తనకు చలిగా ఉందని ఇంతకుముందు లాలూ చెబితే తబలా వాయించుకోండని న్యాయమూర్తి చెప్పిన విషయం తెలిసిందే. పెళ్లి చేసుకోవాల్సిందిగా జైల్లో ఖైదీలను ఒక ట్రాన్స్‌జెండర్ వేధిస్తున్నారని కూడా లాలూ చెప్పారు. 'మీరు అక్కడ ఉన్నారుగా... అన్నీ పరిష్కారమవుతాయిలెండి' అని న్యాయమూర్తి కూడా చమత్కారంగా బదులిచ్చారు. వృద్ధాప్యం, అనారోగ్యం దృష్ట్యా తక్కువ శిక్ష విధించాలని లాలూ తన న్యాయవాది ద్వారా కోరిన విషయం తెలిసిందే. కేసులో మరో అయిదుగురు నిందితులకు శిక్షపై వాదోపవాదాలు ముగిశాయి.

హైకోర్టును ఆశ్రయిస్తాం: లాలూ తనయుడు

న్యాయవ్యవస్థపై తమకు విశ్వాసం ఉందనీ, తాజా తీర్పు సారాంశాన్ని పూర్తిగా చూసిన తర్వాత బెయిల్ నిమిత్తం పట్నా హైకోర్టును ఆశ్రయిస్తామని లాలూ తనయుడు తేజస్వీ యాదవ్ విలేకరులకు తెలిపారు. 'బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌తో కలిసి భాజపా పన్నిన కుట్రకు లాలూ బలయ్యారు. దీనిని వివరించడానికి సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్తాం. భాజపాపై రాజీలేని వైఖరిని అవలంబిస్తున్నందుకు నా తండ్రి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఒకవేళ రాజీపడి ఉంటే ప్రత్యర్థులు సయితం లాలూను రాజా హరిశ్చంద్రగా పిలిచేవారు. పార్టీలో చీలికకు ఆస్కారమే లేదు. లాలూ అంటే ఒక వ్యక్తి కాదు... సిద్ధాంతం' అని చెప్పారు.

సామాజిక న్యాయం కోసం ప్రాణాలైనా ఇస్తా: లాలూ

సామాజిక న్యాయం, సమానత్వం, ఐక్యతల కోసం తన ప్రాణాలైనా ఇస్తానేగానీ కాషాయధారుల అడుగులకు మడుగులొత్తేది లేదని లాలూ ట్వీట్ చేశారు. అన్యాయం, అసమానతలపై సామాన్య ప్రజల పేరుతో ఒక లేఖను ఆయన విడుదల చేశారు.

చట్టం ముందు అందరూ సమానమే: భాజపా

చట్టం ముందు ప్రతిఒక్కరూ సమానమేనని భాజపా పేర్కొంది. దాణా కేసులో వెలువడిన తీర్పు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పార్టీ నేత షానవాజ్ హుస్సేన్ వ్యాఖ్యానించారు. దేశ సంపదను దోచుకున్నవారు ఎంత పెద్దవారైనా చట్టం మాత్రం అందరినీ ఒకేలా చూస్తుందన్నారు. తప్పుడు పనులు చేయడానికి రాజకీయ నాయకులు భయపడేరీతిలో తీర్పు వెలువడిందని జేడీ(యు) సెక్రటరీ జనరల్ కె.సి.త్యాగి చెప్పారు.

అసలు కేసు ఇదీ...

లాలూకు శిక్షపడిన కేసు సరిగ్గా 22 ఏళ్ల క్రితం నాటిది. 1996 జనవరిలో పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఛాయ్‌బసా కలెక్టర్ సోదాలు జరిపినప్పుడు కుంభకోణం వెలుగు చూసింది. తప్పుడు పత్రాలతో దాదాపు రూ.950 కోట్లు స్వాహా చేయడంపై పట్నా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు మొదలుపెట్టింది. 56 మంది నిందితులపై 64 కేసులు నమోదయ్యాయి. అభియోగపత్రంలో పేరు చోటు చేసుకోవడంతో 1997 జులైలో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేశారు. ఆయన భార్య రబ్రీదేవి పేరు కూడా కేసులో చోటుచేసుకొంది. 2013 సెప్టెంబరులో ఒక కేసులో లాలూకు ప్రత్యేక న్యాయస్థానం శిక్ష విధించగా ఆ ఏడాది డిసెంబరులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2014 మార్చిలో ప్రత్యేక న్యాయస్థానం తీర్పుతో లాలూ కనీసం ఆరేళ్లు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడయ్యారు. ఆయనతో పాటు 15 మంది దోషులేనని గత నెలలో సీబీఐ న్యాయస్థానం తేల్చింది. ప్రస్తుత కేసు కాకుండా లాలూపై మరో మూడు దాణా కేసులున్నాయి. దమ్‌కా ఖజానా నుంచి రూ.3.97 కోట్లు, ఛాయ్‌బసా ఖజానా నుంచి రూ.36 కోట్లు, దొరాండా ఖజానా ద్వారా రూ.184 కోట్లు అక్రమంగా పొందినట్లు ఈ కేసులు పేర్కొంటున్నాయి. ఈ కేసుల్లోనూ మరో నెలరోజుల్లో తీర్పు వెలువడే అవకాశాలున్నాయి. దీంతో లాలూకు మరిన్ని చిక్కుముళ్లు తప్పకపోవచ్చని భావిస్తున్నారు.


లాలూకు శిక్ష పడటంతో పట్నాలో విషణ్ణ వదనాలతో రబ్రీదేవీ, తేజస్వీ యాదవ్

మీసా భారతిపై రెండో అభియోగపత్రం.. న్యాయస్థానం అసహనం

- సీబీఐని తప్పుపట్టిన న్యాయమూర్తి

దిల్లీ: అక్రమ నగదు చెలామణీ ఆరోపణలపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విభాగం శనివారం రెండో అభియోగపత్రం నమోదు చేసింది. గత నెల 23న దాఖలు చేసిన ఛార్జిషీట్‌తో పాటు దీనినీ ఫిబ్రవరి 5న పరిశీలిస్తామని దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ప్రకటించింది. మరిన్ని వివరాలు సమర్పించాల్సి ఉందని సీబీఐ న్యాయవాది చెప్పడంతో న్యాయమూర్తి ఎన్.కె.మల్హోత్రా అసహనం వ్యక్తం చేశారు. విచారణ ప్రారంభింపజేస్తారా, అనుబంధ అభియోగపత్రాలు దాఖలు చేస్తూనే ఉంటారా అని ప్రశ్నించారు. ఎంతో పేరున్న సీబీఐ ఇలా చేయడం తగదనీ, ఫిర్యాదును పకడ్బందీగా రూపొందించినట్లు లేదనీ వ్యాఖ్యానించారు

మార్కులే సరి!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశముంది.

- డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. శ్రేణులు ఇస్తే ప్రతిభ ఆధారంగా సీట్లు ఎలా కేటాయిస్తారు?

- సీబీఎస్ఈతోపాటు మరో రెండు మూడు రాష్ట్రాలు గ్రేడింగ్ విధానంతో పాటు మార్కులను కూడా ఇస్తున్నాయి. ఒకవేళ దాన్ని అమలుచేస్తే... విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలన్న లక్ష్యం ఎలా నెరవేరుతుంది?
- ఈ సమస్యలు ఉన్నందునే శ్రేణుల విధానం ప్రతిపాదనను ఈసారికి పక్కన పెట్టాలని రంజీవ్ ఆచార్య తేల్చిచెప్పినట్లు సమాచారం. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాత్రం ఓ కమిటీని నియమిస్తున్నామనీ, నియమించిన 15 రోజుల్లో నివేదిక వస్తుందని, తర్వాత తుదినిర్ణయం తీసుకుంటామని ఇటీవల వెల్లడించారు. అయితే ఈలోగానే ప్రభుత్వం అంతర్గతంగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రైతుకు రొక్కం

(మొదటి పేజీ తరువాయి)

యాసంగిలో సాధారణ విస్తీర్ణం 40 లక్షల ఎకరాలేనని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి తెలిపింది. మిగిలిన 60 లక్షల ఎకరాలు యాసంగిలో పూర్తిగా సాగు కాలేదనుకుంటే పొరపాటే. వానాకాలం ప్రారంభంలో జూన్‌లో పత్తి, మిరప, అరటి, చెరకు వంటి పైర్లు వేస్తే అవి ఏడాది పొడవునా సాగులో ఉంటాయి. ఈ పంటల విస్తీర్ణాన్ని ఖరీఫ్ సాగులో చూపించి, యాసంగి సాధారణ విస్తీర్ణంలో చూపడం లేదు. ఇందువల్లనే యాసంగి సాగు విస్తీర్ణం తక్కువగా కనిపిస్తోంది. ఇలా ఏడాదికాలం సాగయ్యే పంటలకు ఒకేసారి రూ.8 వేలు ఇస్తారా లేక జూన్‌లో రూ.4 వేలు, మరోసారి అక్టోబరులో మరో రూ.4 వేలు ఇస్తారా అన్నది నిర్ణయించాలి. రూ.4 వేలు ఇచ్చి ప్రభుత్వం సరిపెడుతుందా అన్నదానిపైనా స్పష్టత లేదు. దీనిదృష్ట్యా గత జూన్‌లో వ్యవసాయశాఖ నిర్వహించిన సమగ్ర సర్వేలో ఎక్కువ మంది రైతులు రెండు సీజన్లలో పంటలను సాగు చేస్తున్నట్లు వరి, మినుము, పెసర వంటి స్వల్పకాలిక పైర్లను నమోదు చేయించారు. దీనివల్ల పంటల విస్తీర్ణం లెక్కలు సరిగా తేలలేదు. మరోవైపు రైతు చేతికి నగదు అందాలంటే 'గిఫ్ట్ కార్డు' లేదా ప్రీలోడెడ్ కార్డు వంటివి అందజేయాలని ఉన్నతాధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. మంత్రుల కమిటీ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. అనంతరమే తుది నిర్ణయాలను అధికారికంగా ప్రకటిస్తారు.


కెనడాలోని టొరంటోలో ఓ విమానాశ్రయంలో ఒక విమానాన్ని మరో విమానం ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అంతర చిత్రంలో విమానాలు ఒకదానినొకటి తాకిన చోట చెలరేగిన మంటలు

గ్రహం అనుగ్రహం

7-1-2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
షష్ఠి రా. 9-49 తదుపరి సప్తమి
పుబ్బ నక్షత్రం: ఉ. 7-04 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: రా. 11-36 నుంచి 1-10 వరకు
వర్జ్యం: మ. 2-09 నుంచి 3-44 వరకు
దుర్ముహూర్తం: సా. 4-08 నుంచి 4-52 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-36

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.4	31.0
మెదక్	10.3	34.6
రామగుండం	11.2	30.0
హన్మకొండ	12.5	30.0
హైదరాబాద్	13.1	29.6
నిజామాబాద్	14.0	30.0
కరీంనగర్	15.5	30.0
మహబూబ్‌నగర్	16.1	31.0
ఖమ్మం	18.0	27.0
సూర్యాపేట	20.0	32.5

జౌళి పార్కు వద్ద రైల్వే వంతెన

- నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం
- అధ్యయనానికి టీఎస్‌ఐఐసీ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ గ్రామీణ జిల్లాలో నిర్మిస్తున్న అంతర్జాతీయ కాకతీయ మెగా జౌళి పార్కు వద్ద రైల్వే ఉపరితల వంతెన (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అంతరాయాలు లేకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా దీని నిర్మాణానికి ఆమోదం తెలిపింది. గంగదేవిపల్లి మీదుగా చింతలపల్లి-ఊకల్లును కలుపుతూ నిర్మించే బాహ్యవలయ రహదారి, చింతలపల్లి, ఊకల్లు వైపు వెళ్లే పాత రహదారిని అనుసంధానిస్తూ ఆర్వోబీ నిర్మించేందుకు ప్రాథమిక ముసాయిదా సిద్ధమైంది. దీనిపై వెంటనే అధ్యయనం చేయించాలని నోడల్ ఏజెన్సీగా ఉన్న రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్‌ఐఐసీ)ని ఆదేశించింది. వరంగల్ గ్రామీణ జిల్లా సంగెం, గీసుగొండ మండలాల్లోని చింతలపల్లి-శాయంపేటల మధ్య 1,190 ఎకరాల్లో జౌళి పార్కును రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. దీనికి సంబంధించిన పనులు సాగుతున్నాయి. జౌళి పార్కు మీదుగా విజయవాడ-వరంగల్ రైల్వే మార్గం ఉంది. జౌళి పార్కు మార్గంలో శాయంపేట, చింతలపల్లి, ఎల్గూరు రంగంపేటల వద్ద మూడు రైల్వే లెవెల్ క్రాసింగ్‌లున్నాయి. ఈ మార్గంలో రోజూ వందకుపైగా రైళ్లు తిరుగుతుంటాయి. ఈ సమయంలో రైల్వే క్రాసింగ్‌లను మూసివేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దాదాపు ఆరు ప్యాసింజర్ రైళ్లు చింతలపల్లి, ఎల్గూరు స్టేషన్ల వద్ద ఆగుతున్నాయి. అందులో ప్రయాణికులకూ సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ జౌళి పార్కు శంకుస్థాపనకు వచ్చినప్పుడు పారిశ్రామికవేత్తలు, కార్మికులు, స్థానిక ప్రజలు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. దేశంలో అతిపెద్ద విస్తీర్ణంలో నిర్మించే ప్రతిష్ఠాత్మక జౌళి పార్కుకు ఇది ప్రధాన సమస్యగా గుర్తించిన సీఎం అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సీఎం కేసీఆర్ భావించారు. దీనిపై ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శాస్త్రీయ అధ్యయనం చేయించి, వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు. దీని ఆధారంగా రైల్వే శాఖతో చర్చించి నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తున్నారు.



సర్వేకు టీఎస్‌ఐఐసీ సన్నాహాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా జౌళి పార్కు వద్ద సాంకేతిక ఆర్థిక సంభావ్యత అధ్యయనానికి టీఎస్‌ఐఐసీ సన్నాహాలు చేపట్టింది. దక్షిణ మధ్య రైల్వే ప్యానల్‌లో నమోదైన అనుభవం గల సంస్థను ఎంపిక చేసి, ఈ బాధ్యతలను అప్పగించేందుకు బిడ్లను పిలిచింది. నెలరోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

మోదీ, గాంధీ.. అలరించారు ఇలా..!



జాతిపిత మహాత్మాగాంధీతో ప్రధాని నరేంద్ర మోదీ కలిసి ఉన్న ఈ దృశ్యం మన భాగ్యనగరంలోని చారిత్రక చార్మినార్ వద్ద శనివారం సాక్షాత్కరించింది. గాంధీ మహాత్ముడితో ప్రధాని మోదీ భేటీ ఎలా సాధ్యం..? ఇందుకు అవకాశమే లేదు కదా..?? అని తీవ్రంగా ఆలోచిస్తున్నారా..! మీరు అనుకుంటున్నది అక్షరాలా నిజమే.. ఈ ఫొటోలోని ఇద్దరు వ్యక్తులూ.. ఎంతమాత్రం నరేంద్ర మోదీ, గాంధీజీలు కాదు.. అచ్చుగుద్దినట్టు వారి పోలికలతో కనిపిస్తోన్న సదానంద్‌నాయక్, అగస్టీన్‌లు.. కర్ణాటక, గోవాల నుంచి హైదరాబాద్ సందర్శనకు వచ్చిన ఈ ఇద్దరూ చార్మినార్ వద్ద యాదృచ్ఛికంగా కలిశారు. దీంతో పర్యాటకులు, స్థానికులు వీరిని చూసేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా యువత వారితో పెద్దఎత్తున సెల్ఫీలు దిగడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. —ఈనాడు, హైదరాబాద్

కశ్మీర్ యువతను రెచ్చగొడుతున్న పాక్: రాజ్‌నాథ్

టేకన్‌పుర్ (మధ్యప్రదేశ్): భారత్‌కు వ్యతిరేకంగా కశ్మీర్ యువతను రెచ్చగొట్టేందుకు పాకిస్థాన్ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. శనివారం ఇక్కడ డీజీపీలు, ఐజీల వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భారత్ వ్యతిరేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత్ వ్యతిరేక చర్యల్లో పాల్గొనే యువతకు, ఉగ్రవాదులకు నిధులు అందిస్తోందని ఆరోపించారు. కశ్మీర్‌లో వేర్పాటువాదులకు పాక్ మద్దతు లభిస్తుండువల్లనే శాంతి, భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. అక్కడ పరిస్థితులను అదుపు చేయడంలో భద్రత బలగాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. నక్సలైట్ల సమస్య చాలా వరకు తగ్గిందని, వారు లొంగిపోవడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ చొరబాట్లు తగ్గాయని, అయితే మయన్మార్‌లో ఉన్న రహస్య స్థావరాలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు.

అంతర్జాతీయ తీపి పండుగకు భారీ స్పందన

- పెద్ద ఎత్తున ముందుకొస్తున్న మహిళలు
- ప్రభుత్వ సలహాదారు రమణాచారి, కార్యదర్శి వెంకటేశం
- సచివాలయంలో వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఈనెల 13 నుంచి 15వరకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న అంతర్జాతీయ తీపి పదార్థాల పండుగ (స్వీట్స్ ఫెస్టివల్) కోసం ఇప్పటి నుంచే భారీ స్పందన లభిస్తోందని, 15 దేశాలు, 25 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు దీనికి హాజరవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీరమణాచారి, పర్యాటక, సాంస్కృతిక శాఖల కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ పండుగకు సంబంధించిన వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్‌ను శనివారం సచివాలయంలో వారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరేడ్ మైదానంలో అంతర్జాతీయ పతంగుల పండుగతో పాటు దేశంలోనే తొలిసారిగా నిర్వహించే తీపిపదార్థాల పండుగలో పాల్గొనేందుకు వంటల తయారీలో పేరొందిన మహిళలు పెద్దఎత్తున పోటీ పడుతున్నారని చెప్పారు. వీలైనంత ఎక్కువ మందికి అవకాశమిస్తామన్నారు. దేశవిదేశాలకు చెందిన వేయికి పైగా తీపి పదార్థాలను ప్రదర్శిస్తామన్నారు. ప్రవేశం ఉచితమని, అందరూ హాజరుకావచ్చని చెప్పారు.

అజ్ఞాతవాసిని తిలకించరూ!

– మంత్రి తలసానికి దర్శక, నిర్మాతల ఆహ్వానం

ఈనెల పదో తేదీన విడుదల కానున్న సినీనటుడు పవన్ కల్యాణ్ నటించిన చలనచిత్రం 'అజ్ఞాతవాసి'ని తిలకించాలని చిత్ర దర్శక నిర్మాతలు త్రివిక్రమ్ శ్రీనివాస్, రాధాకృష్ణలు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానించారు. శనివారం సచివాలయంలో వారు మంత్రితో భేటీ అయ్యారు. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్‌గౌడ్‌ను నియమించినట్లు సంఘం అధ్యక్షుడు పద్మాచారి తెలిపారు. టి.శ్రీకాంత్‌రావును సెక్రటరీ జనరల్‌గా, పి.కృష్ణమూర్తిని ఆర్థిక కార్యదర్శిగా, రవీందర్‌రావును సహాధ్యక్షునిగా ఎన్నుకున్నామన్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌లు, నారాయణరావులు, మహిళా విభాగం ప్రధనా కార్యదర్శిగా సునీత, ఉపాధ్యక్షురాలిగా పద్మ, కార్యదర్శిగా అరుంధతిలను నియమించామని తెలిపారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, రమణాచారి, గౌరీశంకర్, వెంకటేశం

హైదరాబాద్‌లో 18 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన

ఈనాడు, హైదరాబాద్: జాతీయ పుస్తక ప్రదర్శనను ఈ నెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. దాదాపు 15 రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు హాజరవుతున్నారని.. ఇందులో అన్ని రంగాలకు చెందిన పుస్తకాలు దొరుకుతాయని ప్రదర్శన కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరీ గౌరీశంకర్ తెలిపారు. సచివాలయంలో శనివారం గౌరీశంకర్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, పర్యాటక, సాంస్కృతిక, బీసీ సంక్షేమ శాఖల కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కమిటీ కార్యదర్శి చంద్రమోహన్‌లు పుస్తక ప్రదర్శనల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. జ్ఞానసాధనకు పుస్తకం మాలమన్నారు. అన్ని వయస్సుల వారికి సంబంధించిన పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయని వెంకటేశం చెప్పారు. గౌరీశంకర్ మాట్లాడుతూ.. "పుస్తక ప్రదర్శనకు రావాలని సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించాం. గత ఏడాది ప్రదర్శనకు పది లక్షల మంది పుస్తక ప్రియులు హాజరయ్యారు. ఈ ఏడాది మరింత అధికసంఖ్యలో వస్తారు. ప్రదర్శనలో సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనాలు ఉంటాయి" అని తెలిపారు.

హైదరాబాద్‌లోనే స్థిరాస్తి ధరలు తక్కువ

- రాష్ట్ర పురపాలకశాఖ కార్యదర్శి నవీన్‌మిత్తల్
- 'ఈనాడు' మెగా ప్రాపర్టీ షో ఏర్పాటు అభినందనీయం

మాదాపూర్, న్యూస్‌టుడే: దేశంలోని మిగిలిన నగరాలతో పోల్చుకుంటే హైదరాబాద్ నగరంలో స్థిరాస్తి ధరలు తక్కువగా ఉన్నాయని రాష్ట్ర పురపాలకశాఖ కార్యదర్శి నవీన్‌మిత్తల్ అన్నారు. హైదరాబాద్ కంటే తక్కువ జనాభా ఉన్న నగరాల్లో ఇక్కడి కంటే అధికంగా ధరలున్నాయన్నారు. శనివారం నగరంలోని మాదాపూర్ సైబర్‌సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఈనాడు' మెగా ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి మిత్తల్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో గతంలో నాలుగైదేళ్లు స్థిరాస్తి రంగం కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం మంచి వృద్ధి సాధించిందన్నారు. స్థిరమైన ప్రభుత్వం ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, విశాలమైన అవుటర్ రింగ్‌రోడ్డు తదితర వసతులు స్థిరాస్తి రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయన్నారు. దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు తదితర నగరాల విస్తరణకు అవకాశాల్లేవని, హైదరాబాద్ విస్తరణకు అన్ని వైపులా అవకాశాలున్నాయని పేర్కొన్నారు. నగరంలో పేరొందిన బిల్డర్లను, డెవలపర్లను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ కొనుగోలుదార్లకు అవసరమైన నిర్మాణాలకు సంబంధించిన సమాచారం ఒక్కచోట తెలుసుకునేలా 'ఈనాడు' ప్రాపర్టీ షో ఏర్పాటు హర్షణీయమన్నారు. అందరికీ నివాస యోగ్యమైన నగరంగా హైదరాబాద్‌కు మంచి గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీఈఓ సత్యరాజు, ఈనాడు మార్కెటింగ్ విభాగం జీఎం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



'ఈనాడు' మెగా ప్రాపర్టీ షోను ప్రారంభించిన అనంతరం ఓ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న పురపాలక శాఖ కార్యదర్శి మిత్తల్. చిత్రంలో ఈనాడు మార్కెటింగ్ విభాగం జీఎం శ్రీనివాస్‌రావు

ప్రపంచంలోనే శక్తిమంతమైన రాకెట్

నెలాఖరులోగా ప్రయోగం: స్పేస్‌ఎక్స్ సంస్థ

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ'ని ఈ నెలాఖరులోగా ప్రయోగించనున్నట్లు అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రకటించింది. ఈ ప్రయోగంలో రాకెట్ మొదటి దశలోని మూడు కోర్‌లను తిరిగి సేకరించి, మళ్లీ వినియోగించనున్నట్లు తెలిపింది. ఇప్పటివరకూ ఒకే కోర్‌ను ఆ సంస్థ తిరిగి సేకరించగలిగింది. శక్తిమంతమైన రాకెట్.. 2500 టన్నుల శక్తిని ఉత్పత్తి చేస్తుందని స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ చెప్పారు. 'ఫాల్కన్ హెవీ'.. 54 టన్నుల బరువును రోదసిలోకి మోసుకెళ్లగలదని తెలిపారు. దీని పొడవు 230 అడుగులన్నారు. ఫ్లోరిడాలోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి దీన్ని ప్రయోగించనున్నట్లు వివరించారు. ఈ రాకెట్‌ను వచ్చేవారం ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. అందులోవిద్యుత్‌తోనడిచే టెస్లా రోడ్‌స్టర్ స్పోర్ట్స్ కారును పంపనున్నారు. టెస్లా సంస్థకు కూడా మస్క్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. 'ఫాల్కన్ హెవీ' పూర్తిస్థాయి ప్రయోగ తేదీని ప్రకటించాలి.

1000 విమానాలపై గణతంత్ర దినోత్సవ సన్నాహాల ప్రభావం!

దిల్లీ: గణతంత్ర దినోత్సవ కవాతు సన్నాహాలు దాదాపు 1000 విమానాల సేవలపై ప్రభావం చూపనున్నాయి. దిల్లీకి వచ్చే, ఇక్కడి నుంచి బయలుదేరే వీటిలో కొన్నింటిని రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. మరికొన్నింటి ప్రయాణ సమయాల్లో మార్పులు చేయనున్నట్లు సమాచారం. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకూ రోజూ ఉదయం 10.35 నుంచి మధ్యాహ్నం 12.15 వరకూ ఎలాంటి విమానాలూ నడపకూడదని నిర్ణయించినట్లు ఇందిరా గాంధీ అంతర్జాతీయ(ఐజీఐ) విమానాశ్రయ అధికారులు తెలిపారు. దీంతో దాదాపు 500 దేశీయ విమాన సేవలు రద్దుకానున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాలకు మాత్రం సమయాల్లో మార్పులు చేస్తామని, వీటిని రద్దుచేసే అవకాశం లేదని వివరించారు. ఈ విషయంపై విమానాశ్రయ ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఇప్పటికే అన్ని విమానయాన సంస్థలకూ ఆదేశాలు పంపినట్లు వివరించారు. ప్రయాణికులకు అసౌకర్యం తగ్గించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఈనాడు

వ్యసనాల వధ్యశిల

పెద్ద పండగ అన్నారు... వెళ్లాం! సరదాగా పేకాట అన్నారు... ఆడాం! మజా కోసం పందెం అన్నారు... కాశాం! చేయి బాగా తరుగు ఆడింది. జేబు పూర్తిగా ఖాళీ అయింది. వెంటనే ఒంటి మీదకు తెలివి తెచ్చుకొని ఇంటికి తిరిగొచ్చేయడం వివేకం! కాదని, పక్కనే స్టాంపు కాగితాలతో కాచుకు కూర్చున్న దస్తావేజుల లేఖరిని పిలిచి గబగబా సంతకాలు పెట్టేయడం మాత్రం పరమ మూర్ఖత్వం. వినోదానికి, వ్యసనానికి అదే తేడా! 'పాపవృత్తంబు జూదంబు పార్థివులకు... ప్రభువులు జూదం ఆడటం మహాపాపం' అని సభలో వారందరికీ హితవు పలికినవాడు ధర్మరాజు. 'కితవుడు' అంటే జూదరి. 'కుటిల మార్గులైన కుత్సిత కితవుల తోడగడగి జూదమాడ జనదు... అట్టివారు ధర్మ వివర్జితులు అగుదురు' అన్నదీ ఆయనే. అయినా, ఆగలేక కుటిలుడైన శకునితోనే జూదం ఆడాడు, ఓడాడు! రాజ్యశ్రీని, సిరిసంపదలనే కాదు- 'తమ్ములను, అత్యంత ధర్మసమేతులను ఆజి జేయులను(యుద్ధ విజేతలను) ఒడ్డి' ఓడిపోయాడు. ఆఖరికి తనను తానే పణంగా పెట్టి పరాజితుడయ్యాడు. అవమానంతో తలదించుకున్నాడు. అలాంటి దుస్థితిలో శకుని మరో వల విసిరాడు. 'నీకును ఒండు(మరో) ధనము గలదు... కమలాక్షి పాంచాలకన్య నీకు ధనము కాదె!' అని గుర్తు చేశాడు. పందెం ఓడేకొద్దీ పంతం పెరగడం సహజం. కనుక ముందూ వెనకా చూడకుండా ధర్మజుడు 'అలయక(ఆలస్యం చేయక) అక్ష రతుండయి(పాచికలకు దాసుడై) ద్రౌపదిన్... కులభామను పణంబుగ చేసి' మళ్ళీ ఓడిపోయాడు. ద్యూత వ్యసనం ఆయన వివేకానికే ఎసరు పెట్టింది. ఇంత జరిగినా, రెండోసారి పిలవగానే మళ్ళీ వెళ్ళాడు. అరణ్యవాసం, అజ్ఞాతవాసం కొనితెచ్చుకొన్నాడు. 'పెక్కుభంగులు వివేకభ్రష్ట సంపాతముల్' అన్న భర్తృహరి మాటను స్వయంగా రుజువు చేశాడు.

ధర్మరాజును మహోదాత్త నాయకుడిగా చిత్రిస్తూనే, ఒక్క ద్యూత వ్యసనం ఆయనను ఎంతటి అధోగతిపాలు చేసిందో నన్నయభట్టు వివరించాడు. మనిషి ఏ వ్యసనాల జోలికీ పోరాదని సూచించాడు. 'వెలది పానంబు జూదంబు...' అంటూ తిక్కన సప్తవ్యసనాల చిట్టా విప్పాడు. కామవ్యసనం గురించి చెబుతూ వేమన 'కాంచనంబుపైన, కాంతలపైనను బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు' అని హెచ్చరించాడు. మద్యపాన వ్యసనం గురించి చెప్పే పనే లేదు. 'తెలుగు రాష్ట్రాలు తెగ తాగేస్తున్నాయి' అని పత్రికలు పతాక శీర్షికలను ప్రచురిస్తూనే ఉన్నాయి. మద్యపాన వ్యసనం ముదిరే క్రమాన్ని వివరిస్తూ ఒక ఆంగ్లసూక్తి 'మనిషి తొలుత మధువును గోరు, పిదప మధువు మధువును గోరు, అది తుదకు మనిషినే బలిగోరు' అని వ్యాఖ్యానించింది. నిజానికి ప్రతి వ్యసనం అంతిమ లక్ష్యం అదేనంటుంది వైద్యరంగం! వ్యసనం అనే మాటకు శబ్దార్థ చంద్రిక 'కామ క్రోధముల వల్ల కలిగే దోషం' అనే అర్థాన్ని చెబుతోంది. పానం స్త్రీ జూదం... వంటివి కోరికల్లోంచి పుడతాయి కనుక వాటిని కామజాలు అంటారు. వాక్పారుష్యం, దండపారుష్యం- అంటే మాటలో దండనలో దురుసుతనానికి కోపం మూలం కనుక వాటిని క్రోధజాలుగా చెబుతారు. 'బుక్కెడన్నము కోరి బుజ్జి మేకను చంపు రొక్కమ్ము మెక్కగా రొయ్య జంపు' అని కవులు వర్ణించారు. 'బోడి పందెములకై కోడిపుంజులను' చంపడం ప్రస్తుతం తీవ్ర వివాదానికి దారితీసింది. బాదం పిస్తాలతో బలిష్ఠంగా కోళ్లను మేపేది, అపురూపంగా సాకేది- కోడి మీద ప్రేమతో కాదు, గెలుపుమీద కసితో. అది వ్యసన స్వరూపం! మనిషి అంతరాంతరాల్లో దాగిన 'పరమ కిరాతక ప్రకృతి(ప్రవృత్తి) భళ్లున పైకి తన్ను...' సందర్భాలను మనస్తత్వ రీత్యా సూక్ష్మంగా అధ్యయనం చేయాలన్నది సామాజికవేత్తల అభిప్రాయం. ఎందుకంటే 'మనిషిలో రహస్యంగా అణచిపెట్టిన హింసాప్రవృత్తి కోళ్ల పందాల రూపంలో బయటకు వస్తోంది' అన్నది వారి పరిశోధనలో తేలిన విషయం. 'ఇన్ని చంపి తాను ఏనాటికిని చావనంచు తలచి కొంప ముంచుకొనెడి' మనిషి గురించే వారి ఆందోళన.

వ్యసనాలు పాపహేతువులని ప్రపంచంలో అందరికీ తెలుసు. 'ప్రపంచ జూదశాల'గా పేరొందిన 'లాస్ వెగాస్'ను సిన్‌సిటీ(పాతక నగరం)గా పిలవడంలోని ఆంతర్యం అదే! తెలిసినా వ్యసనాలు ఎందుకు అలవడతాయంటే- దుర్జన సాంగత్యం ఒక బలమైన కారణం అంటారు మనస్తత్వవేత్తలు. 'దుర్జన సహవాసంబును దుర్జన సంభాషణములు దుర్జను తలపుల్...' వ్యసనాలను ప్రోత్సహిస్తాయి అన్నారు కవులు. 'సిరి అంటినా అంటకపోయినా, చీడ మాత్రం బాగా అంటుకుంటుంది' అని సామెత. మూక మనస్తత్వంలో ఉచ్ఛం నీచం గాని ఎంగిలి కాని తోచవన్నాడొక కవి. 'పొగ క్రోవికి సతిమోవికి అమృతమ్మునకున్ (మద్యానికి) తగ ఉచ్ఛిష్టము(ఎంగిలి) లేదు పో' అన్నాడాయన. సావాసాలను ఎలాగూ అదుపు చేయలేం కనుక వ్యసనాలనైనా తగ్గిద్దామనే ఆలోచనతో అరబ్ దేశం ఒకటి(యూఏఈ) పొగాకు, పానీయాల వంటివాటిపై భారీగా పన్నులు విధించింది. దాని పేరే పాపం పన్ను(సిన్ టాక్స్)! పేరును బట్టి దాని లక్ష్యం అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రభుత్వాశయం ఎంతవరకు నెరవేరుతుందో చెప్పలేమంటున్నారు పరిశీలకులు. 'అత్తవారిచ్చిన అంటుమామిడి తోటలు' చింతామణులకు అవలీలగా రాసిచ్చేసే భవానీ శంకరులతో నిండిపోయిందీ లోకం. 'అమ్మ చనిపోయిందిరా' అని చెబితే ఈ దారినే వెళ్ళాలిగా, మధ్యలో కలుస్తాలే, నువ్వు ముక్క కొట్టు' అనే పేకాటవికులున్న రోజులివి. ఈ నేపథ్యంలో, అప్పులు చేసి అయినా వ్యసనాలకు సిద్ధమైపోతారు తప్ప పన్నులకు జడుస్తారా అనేది చాలామంది వాదన. 'మృత్యువును చూసి కాదు, నేను జీవితాన్ని చూసి జంకుతున్నాను' అంటూ ప్రసిద్ధ కవి బైరాగి తన 'ఆగమగీతి'లో చెప్పింది- వ్యసనపరులందరికీ వర్తించే మాట.



పథకాలు చాలు ప్రక్షాళనే మేలు

సామాజిక భద్రత-సర్కారు బాధ్యత



డాక్టర్ పీఎస్ఎం రావు

మనుషులందరికీ జీవించే హక్కు ఉంటుందన్న సిద్ధాంతాన్ని కనుక ఆమోదిస్తే, వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటై తీరుతుంది. అనారోగ్యం, ప్రమాదాలు, నిరుద్యోగిత, అంగవైకల్యం, మాతృత్వం, వృద్ధాప్యం- తదితర సందర్భాల్లో వ్యక్తులు నిస్సహాయులుగా మిగిలిపోతారు. అలాంటప్పుడు వారికి సామాజిక భద్రత అవసరమవుతుంది. ఎక్కడి నుంచీ వారికి ఎలాంటి సహాయం అందకపోతే బతుకే దుర్భరమైపోతుంది. భారత రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కు కల్పించింది. ప్రపంచ మానవ హక్కుల ప్రకటన, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడిక వంటి అంతర్జాతీయ ఒప్పందాలూ బతికే హక్కుకు భరోసా ఇస్తున్నాయి. అయినప్పటికీ, ఆపత్సమయంలో ప్రభుత్వ చేయూత అందక వ్యక్తులు నిస్సహాయంగా ఉండిపోవలసివస్తే, అలాంటి ఒడంబడికలన్నీ కాగితాలకే పరిమితమైపోతాయి.

సుదూర స్వప్నం

ఆర్థిక, సామాజిక న్యాయం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని రాజ్యాంగ పీఠికలో స్పష్టం చేశారు. ఆ స్ఫూర్తికి అనుగుణంగానే రాజ్యాంగంలో పలు నిబంధనలను పొందుపరచారు. ప్రజలకు సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యంగా ప్రభుత్వ విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాల్లోని నిబంధనలు తేటతెల్లం చేస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించి 70 ఏళ్లు గడచిన తరవాతా అత్యధిక ప్రజానీకానికి తగిన సామాజిక భద్రత చేకూరకపోవడం దురదృష్టకరం. ఇది, ఆదేశిక సూత్రాలను పరిహసించడమే. సంక్షేమ రాజ్యభావనపై పెట్టుకొన్న ఆశలను వమ్ము చేయడమే. ప్రజల్లో పేదరికం పెరిగింది. ఆదాయాల్లో అసమానతలు పెచ్చరిల్లాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఇలాంటప్పుడు వృద్ధులకు, అంగవికలురకు భద్రత మరింత అవసరం. వారికే కాదు- వ్యాధిగ్రస్తులు, నిరుద్యోగులకు సైతం నేడు సామాజిక భద్రత చేకూరడం లేదు. ముందుగా వృద్ధుల విషయానికి వద్దాం. దేశంలో 60 ఏళ్లు పైబడినవారి సంఖ్య 2011 లెక్కల ప్రకారం 10.4 కోట్లు. (వారిలో మహిళలు 5.3 కోట్లు, పురుషులు 5.1 కోట్లు.) దేశం మొత్తం జనాభాలో వారు 8.6 శాతంగా ఉన్నారు. (1961లో వారు 5.6 శాతమే). గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖకు చెందిన కేంద్ర గణాంక కార్యాలయం (సీఎస్ఓ) 2016లో భారతదేశంలో వృద్ధులపై క్రోడీకరించిన వివరాలివి. వారిలో 41.6 శాతం వృద్ధులు పనిచేసుకొని బతకాల్సి వస్తోంది. ఆ వృద్ధుల్లో 56.5 శాతం నిరక్షరాస్యులు. పెద్దగా నైపుణ్యాలు లేనివారు. వయోభారం కుంగదీస్తున్నా ఏదో ఒక పనిచేస్తే తప్ప వారి బతుకుబండి ముందుకు నడవదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధుల సంఖ్య 82.8 లక్షలు. రాష్ట్ర మొత్తం జనాభాలో అది 9.8 శాతం. జాతీయ సగటుకన్నా 1.2 శాతం ఎక్కువ. మరో పది రాష్ట్రాలూ జాతీయ సగటుకన్నా ఎక్కువ సంఖ్యలో వృద్ధులను కలిగి ఉన్నాయి. అవి: హరియాణా, ఉత్తరాఖండ్, ఒడిశా, పుదుచ్చేరి, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళ. 12.6 శాతంతో జాబితాలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) 60వ దఫా గణాంక వివరాల (2004) ప్రకారం- గ్రామీణ ప్రాంతాల్లోని 61.5 శాతం వయోవృద్ధుల నెలవారీ వినియోగ వ్యయం రూ.525 కన్నా తక్కువ. పట్టణ ప్రాంతాల్లో 64 శాతం వృద్ధులు నెలకు రూ.1,120 కన్నా తక్కువ వ్యయం చేస్తున్నారు. దిగువ స్థానంలోని 5.5 శాతం వృద్ధుల నెలవారీ వ్యయం రూ.350కన్నా తక్కువగా ఉంది. దేశంలో ఇతరుల మీద ఆధారపడే వయోవృద్ధుల సంఖ్య 1961లో 10.9 శాతం నుంచి 2011లో 14.2 శాతానికి పెరిగింది. వారిలో మహిళలు 14.9 శాతం, పురుషులు 13.6 శాతం. 60-64 ఏళ్ల వయోవర్గంలోని మహిళల్లో 22 శాతం వితంతువులు. పెళ్లి చేసుకోనివారు లేదా విడాకులు తీసుకున్నవారు రెండు శాతం. వారిపట్ల మరింత శ్రద్ధ అవసరమవుతుంది. వయోవృద్ధుల్లో తమ భార్య లేదా భర్త మీద ఆధారపడుతున్నవారు గ్రామీణ ప్రాంతాల్లో 13 శాతం, పట్టణ ప్రాంతాల్లో 15 శాతం ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 78 శాతం, పట్టణ ప్రాంతాల్లో 76 శాతం వయోవృద్ధులు కన్నబిడ్డల మీద ఆధారపడుతున్నారు. మనవలు, మనవరాళ్ల మీద ఆధారపడుతున్నవారు రెండు ప్రాంతాల్లోనూ మూడు శాతం ఉంటే, ఆరు శాతం వయోవృద్ధులు ఇతరుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి బతుకులీడుస్తున్నారు. వృద్ధాప్యంలో అంగవైకల్యం, కీళ్ళు, కండరాల నొప్పులు, పక్షవాతం, అంధత్వంతోపాటు గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటివి బాధిస్తుంటాయి. కానీ, దేశంలోని ప్రజారోగ్య వ్యవస్థ వృద్ధులు సహా ఎవరి వైద్య చికిత్స అవసరాలూ తీర్చగలిగేలా లేదు. ఫలితంగానే వృద్ధులు మరింత కునారిల్లుతుంటే- పెరుగుదల లేక పిల్లలు, రక్తహీనతతో మహిళలు కుంగి కృశించిపోతున్నారు. 71వ దఫా జాతీయ నమూనా సర్వే (2014 జనవరి-జూన్) వివరాల ప్రకారం, దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 72 శాతం, పట్టణ ప్రాంతాల్లో 79 శాతం పౌరులు వైద్య చికిత్సలకోసం ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం, పట్టణ ప్రాంతాల్లో 68 శాతం 'ఇన్‌పేషెంట్' చికిత్సలను ప్రైవేటు ఆస్పత్రులే నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్నో ఆరోగ్య పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ- 86 శాతం గ్రామీణులకు, 82 శాతం పట్టణ వాసులకు ఏ పథకం కిందా ఎలాంటి సహాయమూ అందడంలేదు.

నిరుద్యోగం మరో పెను సమస్య. ఉద్యోగుల్లో 90 శాతం అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్నవారికి సామాజిక భద్రత దాదాపుగా లేదు. పని పరిస్థితులూ దారుణంగా ఉంటున్నాయి. వేతనాలు చాలా తక్కువ. ఈ రంగంలో స్వయంఉపాధి పొందుతున్నవారికీ సామాజిక భద్రత లేదు. సంఘటిత రంగంలో ఉద్యోగిత 2006లో 2.69 కోట్ల నుంచి 2012లో 2.95 కోట్లకు పెరిగింది. కానీ అధిక వేతనాలు, మంచిపని పరిస్థితులు, సామాజిక భద్రత ఉండే ప్రభుత్వరంగంలో మాత్రం అది 1.81 కోట్ల నుంచి 1.76 కోట్లకు తగ్గిపోయింది. దేశంలో అత్యధికులు అందుకుంటున్న వేతనాలు చాలా తక్కువ. 2014 నాటి భారత కార్మిక, ఉద్యోగ నివేదిక ప్రకారం వేతనాల్లో తారతమ్యాలు అధిక స్థాయిలో ఉన్నాయి. 2012 గణాంకాల ప్రకారం- ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న మహిళలు కేవలం 17.88 శాతం మాత్రమే. ప్రైవేటు రంగంలో అది 22.22 శాతం. మొత్తం సంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలు 20.45 శాతం. మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించడంతోపాటు వారికి తగిన సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు చాటి చెబుతున్నాయి.

పింఛను అరకొర



సంఘటిత రంగంలో లక్ష రూపాయల దాకా జీతం పొందిన ఉద్యోగికి పదవీవిరమణ అనంతరం ఈపీఎఫ్ పింఛనుగా లభిస్తున్నది నెలకు కేవలం రూ.1,500, లేదా అంతకన్నా కొంచెం ఎక్కువ మాత్రమే. అది కంటితుడుపు పింఛను తప్ప మరొకటి కాదు. పింఛను సంస్కరణల కారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు సైతం సరైన పింఛను అందని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా అసంఘటిత రంగంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ పథకాలు ఎలాంటి సామాజిక భద్రత చేకూర్చడంలేదు. విద్య, వైద్య రంగాల్లో సేవలు పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలే లక్ష్యంగా సాగుతున్నాయి. కిందిస్థాయి వారికి పెద్దగా ప్రయోజనం కలగడం లేదు.

ప్రయోజనం నామమాత్రం

స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో అనేక సామాజిక భద్రత పథకాలను ప్రవేశపెట్టారు. వాటిలో కొన్ని తప్పనిసరి అయితే మరికొన్ని ఐచ్ఛికమైనవి. కొన్నింటికి ప్రభుత్వం నిధి సమకూరుస్తుంటే, మరికొన్నింటి వ్యయాన్ని యజమాని భరించాల్సి వస్తోంది. సామాజిక భద్రత ఒడంబడికలో ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) పేర్కొన్న నియమ నిబంధనలకు అనుగుణంగానే అవన్నీ ఉన్నాయి. ఉదాహరణకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి కోసం ఉద్దేశించిన ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛను పథకాలు (ఐజీఎన్ఓఏపీఎస్) ఆమ్ ఆద్మీ బీమా యోజన (ఏఏబీవై), ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పింఛను పథకం (ఐజీఎన్‌డీపీఎస్), జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్, రాష్ట్రీయ స్వాస్థ్యబీమా యోజన (ఆర్ఎస్‌బీవై) వంటివాటిని కేంద్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ఎంపిక చేసిన లబ్ధిదారులకోసం వృద్ధాప్య పింఛను పథకం, వికలాంగుల పింఛను పథకం, మహాత్మాగాంధీ బున్‌కర్ బీమా వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అమలు చేస్తున్నాయి. సంఘటిత రంగంలోని ఉద్యోగులకు గ్రాట్యుటీ, మాతృత్వ ప్రయోజనాల వంటి పథకాలను యాజమాన్యాలు అమలుపరుస్తున్నాయి. సంఘటిత రంగంలోని ఉద్యోగులు, యజమానులు సమకూర్చే నిధులతో ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల పింఛను పథకం, ఉద్యోగుల రాజ్యబీమా (ఈఎస్ఐ) వంటి పథకాలను నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)తో పాటు బీడీ కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలు స్వచ్ఛందమైనవి. ఇన్ని పథకాలు అమలులో ఉన్నప్పటికీ, అవేవీ సరైన సామాజిక భద్రత కల్పించలేకపోతున్నాయి. చాలా సందర్భాల్లో నామమాత్ర ప్రయోజనమే చేకూరుతోంది. వివిధ సామాజిక భద్రత పథకాలకు ప్రభుత్వం సమకూరుస్తున్న నిధులూ చాలా తక్కువగా ఉన్నాయంటూ ఇటీవలే 60 మంది ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తపరచారు. 2018-19 బడ్జెట్‌లోనైనా ఈ అంశానికి ప్రాధాన్యం ఇచ్చి తగినన్ని నిధులు సమకూర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా జాతీయ వృద్ధాప్య పింఛను, వితంతు పింఛను, మాతృత్వ ప్రయోజన పథకాల మొత్తాలను పెంచాలని సూచనలు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రస్తుత పథకాలన్నింటినీ ప్రక్షాళించి, సర్వజనహితమే లక్ష్యంగా నిర్దిష్ట పంథాలో ముందడుగు వేయవలసిన తరుణమిది!

బోగస్ చదువుల బాగోతం

ప్రపంచానికి సున్నాను పరిచయం చేసి గణిత శాస్త్రాన్ని సమున్నతీకరించిన ఘన యశస్విగా భారతావనికి గొప్ప పేరు. ఆ మాటకొస్తే... నలంద, తక్షశిల వంటి జ్ఞానభిక్షా కేంద్రాల సాక్షిగా ఒకనాడు భారత్- సాక్షాత్తు విశ్వగురు! 'మా తాతలు నేతులు తాగారు' అన్న చందాన గతించిన గొప్పల్ని చెప్పుకోవడానికే తప్ప, నేటి విద్యారంగం నేతిబీర చందంగా మారిందని మనస్ఫూర్తిగా ఒప్పుకోవడానికి, అవసరమైన దిద్దుబాట్లు చేపట్టడానికీ నేతాగణానికి మనసొప్పదు! చదువుకోవడం రూపుమాసిపోయి చదువు'కొనడం' మొదలయ్యాక- సర్టిఫికెట్లకు, పట్టాలకు విలువ పెరిగింది. ఏం నేర్చుకొన్నారన్నది కాదు, ఏం ఉత్తీర్ణులయ్యారన్నదే ప్రధానంగా మారింది. ఏడాది పొడవునా బడుల్లో ఉపాధ్యాయులకు కంఠశోష, విద్యార్థులకు వృథాప్రయాస ఎందుకు... దండగ! చూచిరాతలతో పై చదువులకు ఎగబాకే సదవకాశం ఉండగా! పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సామూహిక చూచిరాతలతో (మాస్ కాపీయింగ్) విద్యాప్రమాణాలు పడిపోతున్నాయని ఉమ్మడి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తాజాగా వాపోయింది. అసలైన పరీక్ష ఒక్క విద్యార్థులకే అనుకొంటే పొరపాటు. సార్వత్రిక పరీక్షల్లో ఫలితాలు నేలబారుగా వస్తే- ఉపాధ్యాయులకు, విద్యాధికారులకు, ప్రభుత్వాలకు, ప్రైవేటు బడులకు, అన్నింటికీ మించి తిమ్మిని బమ్మి చేసే మాఫియా శక్తులకు ఎంత నగుబాటు! విద్యాప్రమాణాలు ఎలా చితికిపోయినా, రేపటి తరాలు ఎందుకూ కొరగాకుండా పోయినా ఎవరికీ పట్టింపు లేనట్లున్న ప్రస్తుత ధోరణి- దేశ భవిష్యత్తునే బలిపీఠం మీదకు నెడుతోంది. అదెలాగో చిత్తగించండి!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాస్ కాపీయింగ్ విచ్చలవిడిగా సాగుతున్నా నిరోధించడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణలో భాగంగా ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేస్తేనే చూచిరాతల జాడ్యం అదుపులోకి వస్తుందని స్పష్టీకరించింది. పోయినేడు పదో తరగతి పరీక్షల సందర్భంగా తెలంగాణలో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క కేసు మాత్రమే నమోదు కావడంపై న్యాయపాలిక- 'అసలు చట్టాన్ని అమలు చేస్తున్నారా?' అని సందేహించింది. విద్యార్థులు అడ్డదారులు తొక్కకుండా తల్లిదండ్రులు చూడాలనీ హితవు పలికింది. ఎంసెట్ సహా ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలు 'లీక్' అయ్యాయని, లక్షల రూపాయలు చేతులు మారాయని, అలాంటి అనైతిక చర్యలతో విద్యావ్యవస్థే భ్రష్టుపట్టిపోతోందని నిరుడు అక్టోబరులోనూ హైకోర్టు ఆవేదన చెందింది. ప్రాథమికం నుంచి స్నాతకోత్తరం దాకా దేశవ్యాప్తంగా విద్యారంగంలో ప్రమాణాలు దేవతావస్త్రంగా మారబట్టే- చదువుల వ్యవస్థ నానాటికీ తీసికట్టుగా మారిపోతోంది. ఉత్తర్ ప్రదేశ్ బోర్డు పరీక్షల్లో సామూహిక చూచి రాతలకు సర్వం సిద్ధం చేస్తున్న మాఫియా పీచమణచడానికి ఈసారి ప్రత్యేక లక్షిత బలగాల్ని (ఎస్‌టీఎఫ్) బరిలోకి దించనున్నట్లు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రకటించింది. యూపీలోని 75 జిల్లాల్లో ఏకాయెకి 50 జిల్లాలు సామూహిక చూచిరాతల కేంద్రాలుగా భ్రష్టుపట్టాయి. పరీక్షల్లో కాపీదందాకు పెట్టింది పేరైన బిహారులో విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఓ కన్నేసి ఉంచడానికి నితీశ్ ప్రభుత్వం జిల్లా సాయుధ పోలీసుల్ని, హోంగార్డుల్ని నియమిస్తోంది. పొట్టకోసినా అక్షరం ముక్క రాకపోతేనేం- ఏదో ఒక సర్టిఫికెట్ చేతుల్లో ఉంటే, చదువు 'కొన్నట్లే' ఉద్యోగాల్ని కొనేయచ్చన్న ధీమా విద్యార్థిలోకంలో ఊడలు దిగింది. ఆ నమ్మకమే పెట్టుబడిగా అక్రమాలు ఏ స్థాయిలో విక్రమిస్తున్నాయో గమనించండి!



పుణ్యభూమి

దేశవ్యాప్తంగా శాఖలతో పరిఢవిల్లిన 'బోర్డు ఆఫ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్, ఢిల్లీ' 2012 నుంచి ప్రైవేటు పాఠశాలలకు అనుబంధ గుర్తింపునిచ్చి, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మార్కుల జాబితాలు అందిస్తోంది. మూడు వందల దాకా పాఠశాలలకు అనుబంధ హోదా అనుగ్రహించి, ఎనిమిదో తరగతి తప్పినవారికీ నేరుగా పదో తరగతి, పన్నెండో తరగతి ఉత్తీర్ణులైనట్లుగా మార్కుల జాబితాలు, ధ్రువపత్రాల జారీలో పేరెన్నికగన్న ఈ సంస్థ అసలు సిసలు నకిలీదని ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు నెల రోజులనాడు కనిపెట్టారు. ఈ నకిలీబోర్డు ద్వారా ధ్రువపత్రాలు పొందిన ప్రబుద్ధులు ప్రస్తుతం ప్రభుత్వోద్యోగాల్లోనూ, విదేశాల్లోనూ ఉన్నట్లు వెల్లడైంది. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎకసెక్కాలాడటం ఎంత సహజమో- ఇదీ అంతే! ఆ మాటకొస్తే, ధృతరాష్ట్రుడికి నకలుగా మారిన ప్రభుత్వ యంత్రాంగాలదీ- నకిలీల్ని తలదన్నే కళాకౌశల ప్రదర్శనల తంతే!

అక్షరాభ్యాసం చేసుకొన్న చిన్నారులకు ప్రపంచాన్ని పరిచయం చేసే సమున్నత వేదికలు ప్రాథమిక పాఠశాలలు. వాటిలో బోధకులుగా ఉండేవారు అత్యున్నత శ్రేణి శిక్షకులు అయి ఉండాలంటున్నాయి అంతర్జాతీయంగా అమలులో ఉన్న మౌలిక సూత్రాలు. అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్న పంజాబు స్థితిగతుల్ని- సమాచార హక్కు చట్టం కింద సంధించిన ప్రశ్న బయటపెట్టింది. పంజాబ్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యాప్రమాణాలు కొన్నేళ్లుగా ఎందుకు పడకేస్తున్నాయన్నది తెలుసుకోదలచిన ఓ సమాచార కార్యకర్త అడిగిన ప్రశ్నతో- గురువుల గుట్టు రట్టు అయింది. పది జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న 313మంది టీచర్లు- పదో తరగతిలో తాము తప్పిన సబ్జెక్టులే విద్యార్థులకు బోధిస్తున్న భయానక వాస్తవం తాజాగా వెలుగుచూసింది. మొగ, ముక్త్‌సర్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్ వంటి జిల్లాల్లో ఆయా ఉపాధ్యాయుల బారినపడి ఎంతమంది బాలల బతుకులు బండలైపోతున్నదీ తలచుకొంటే గుండె బరువెక్కుతుంది. పదో తరగతి తప్పినవారు ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఎలా కుదురుకోగలిగారన్నది వెర్రి ప్రశ్న! అక్రమాలు హెచ్చి, అవినీతితో పుచ్చిన వ్యవస్థలో ఏదీ అసాధ్యం కాదు కదా?

బిహార్ పాఠశాల విద్యాబోర్డు నిరుడు సెప్టెంబరులో ఉపాధ్యాయ అర్హతాపరీక్ష ఫలితాల్ని ప్రకటించింది. రెండు లక్షల పదివేలమంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైతే, ఉత్తీర్ణులైంది కేవలం 17 శాతమే. రాష్ట్రంలో ప్రాథమిక చదువుల సంత ఇంత తలవంపులుగా ఉండటం ఏమిటంటూ, మంచి ఫలితాలు సాధించలేని ఉపాధ్యాయుల్ని బలవంతంగా పదవీ విరమణ చేయిస్తామని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హెచ్చరిస్తున్నారు. అంతకంటే విశేషం ఏమిటంటే, తమిళనాట సైతం ఉపాధ్యాయ నియామక బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 95 శాతం పల్టీ కొట్టారు. సైన్స్, గణిత శాస్త్రాల్లో ఉత్తీర్ణులైనవారు కేవలం 2.72 శాతం అంటే అన్నిచోట్లా ప్రాథమిక విద్యారంగం ఎంతగా భ్రష్టుపట్టిపోయిందో అవగతం అవుతుంది. పైఎత్తున కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో 14 లక్షల మంది అధ్యాపకులు ఉండగా, వారిలో లక్షా 30 వేలమంది 'బోగస్' అని ఆధార్ అనుసంధానిత గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. దీన్నిబట్టి అర్థం అవుతున్నదేమిటి? చూపులకు ఏపుగా ఉన్న భారతీయ విద్యావ్యవస్థ వాస్తవానికి, మేడిపండు. అదే దేశ ప్రగతి స్ఫూర్తిమత్వాన్ని కబళించేస్తున్న రాచపుండు! కాదంటారా?

– పర్వతం మూర్తి

కృష్ణ శక్తి

భక్తి, ప్రేమ నిండిన ఆరాధకులకు శ్రీకృష్ణ తత్వం బోధపడుతుంది. ఆయన లీల మధురామృతం, శక్తి అనంతం. మహావిష్ణువు ధరించిన రామావతారం మానవుడు ఎలా మెలగాలో ప్రస్ఫుటం చేస్తుంది. అందులో ఎటువంటి మహిమలూ ఉండవు. కృష్ణావతారం ఆది నుంచీ లీలల మయం.

మానవాళికి ఆయన మహోపదేశాల్ని ప్రసాదించాడు. జీవన ప్రస్థానంలో మానవుడు ఎప్పుడైనా స్తబ్ధుడైనప్పుడు- అతణ్ని తిరిగి కర్తవ్యోన్ముఖుణ్ని చేయగలిగేది, నరనరాల్లోనూ ఉత్తేజాన్ని నింపేది కృష్ణ ప్రబోధమే!

కృష్ణభక్తిని రాధ ఆస్వాదించింది. అటువంటి నిష్కళంక ప్రేమకు మాత్రమే వశమవుతానని ఆయన నిరూపించాడు. తనను సేవించేందుకు పత్రం, పుష్పం, ఫలం, తోయం (జలం) చాలునన్నాడు. సఖ్య భక్తిమార్గంలో సదా తనను స్మరించే కిరీటిని విజయుణ్ని చేశాడా భగవానుడు! గీతోపదేశంతో కటాక్షించాడు. పరమాత్మ మూలతత్వాన్ని మురళీ గాన ప్రియత్వం ద్వారా గోప గోపికా జనావళికి తేటతెల్లం చేశాడు.

విస్తృతంగా, రసపూర్ణంగా ఉండే మురళీకృష్ణ గాథ లోకానికి బాహ్యాంతర సౌందర్యాల్ని వివరించే వేదాంత గ్రంథం. శ్రీకృష్ణ సౌందర్యాన్ని, అవతార ఆంతర్యాన్ని తెలుసుకునే ప్రయత్నం అంటే- అనంతశక్తిని ఆవాహన చేయడమే!

కవిరాజు జయదేవ 'గీతగోవిందం', లీలాశుకుడి 'శ్రీకృష్ణ కర్ణామృతం', నారాయణ తీర్థులవారి 'లీలా తరంగిణి'- నీలమేఘ శ్యాముడి వైభవాన్ని అపూర్వంగా వర్ణించాయి. రాధాకృష్ణుల ప్రణయ ప్రపంచాన్ని జయదేవ కవి 'అష్టపదులు' మనోహరంగా విశదీకరించాయి.

రాక్షస మాయలన్నింటినీ ఛేదించి, నంద

అంతర్యామి

గోకులాన్ని సంరక్షించి, అందరినీ సంఘటితపరచి, వాస్తవిక దృక్పథాన్ని చాటిన దార్శనికుడు శ్రీకృష్ణుడు. జీవకోటిని పెంచి పోషిస్తున్న ప్రకృతినీ అర్చించాలని బోధించిన మార్గ నిర్దేశకుడు. ఆయన గోవర్ధన గిరిని ఎత్తే ఘట్టం ఈ సత్యాన్ని వెల్లడిస్తుంది.



కృష్ణుడు యశోదాదేవి ఇంట పెరిగాడు. బాల్యదశలోని మాధుర్యాన్ని లోకానికి చాటిచెప్పాడు. ఆయన ఎక్కడ ఉంటే- అదే బృందావనం, అదే యమునా తీరం, అదే మహదానందం. దాన్ని పొందగోరేవారికి భక్తి ఒక్కటే మార్గం. ఆనందాన్ని అందరికీ పంచేవాడాయన. తనను విశ్వసించినవారిని కాపాడే కారుణ్యమూర్తి.

తాను విశ్వం అంతటా నిండి ఉన్నానన్న సత్యాన్ని తల్లికి ఎరుకపరచాడు. మట్టి తిన్న నోటిలో విశ్వాన్ని చూపిన విరాట్ స్వరూపుడు.

నిష్కామ భక్తికి దాసుడు కృష్ణ భగవానుడు. మధురలో తన ప్రతిమను నిత్యమూ పూలదండలతో పూజించే సుదాముడి ఆతిథ్యాన్ని స్వీకరించి అనుగ్రహించాడు. స్నేహబంధం అంతరాలను పాటించదని, ఆ మధురిమ కలిమి లేములకు అతీతమైనదని కుచేలోపాఖ్యానం చెబుతుంది.

మహాభారత గాథ మొత్తం శ్రీకృష్ణుడి చుట్టూ తిరుగుతుంది. అన్నింటికీ ఆద్యంతాలు ఆయనే. కథను నడిపిన నాయకుడు. ఎందరినో ప్రభావితం చేసిన రాజనీతిజ్ఞుడు. పాండవ పక్షాన రక్షణ కోటగా నిలిచాడు. కృష్ణ 'భగవద్గీత' అందరి వ్యక్తిత్వ ఉన్నతికీ ఉపయుక్తమయ్యే దివ్య ప్రబోధిని. అది భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను పెంచి; ఆధ్యాత్మికతను పంచిన వికాస వాహిని.

ఎవరి వల్ల ఏది ఎలా జరగాలో అలా జరిపించాడు కృష్ణ భగవానుడు. అవతార ధర్మాన్ని పాటించాడు. ఆయనది ఓ దివ్య పురుషుడి చరిత్ర. ధర్మ, కర్మ, నీతి శాస్త్రాలకు అది నిలువెత్తు దర్పణం!

– దానం శివప్రసాదరావు

పునరావాసంలో వేగం పెంచండి

- మధ్య మానేరు సమీక్షలో హరీశ్‌రావు

ఈనాడు - హైదరాబాద్

మధ్య మానేరు ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం కల్పించడంలో వేగం పెంచాలని, ఫిబ్రవరి 15 లోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం పనులు ఊపందుకున్నాయని, ఆ ప్రాజెక్టు పనుల్లో మధ్యమానేరు అత్యంత కీలకమన్నారు. ప్రాజెక్టు కింద 7,419 ఇళ్లు కోల్పోగా 7,159 ఇళ్లకు పరిహారం చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన 260 ఇళ్లకు వారంలోగా పరిహారం చెల్లించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇళ్లు కోల్పోయిన వారికి మొత్తం మూడు వేల గృహాలు నిర్మించి ఇచ్చామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో నిరాశ్రయులవుతున్న 12 గ్రామాల ప్రజలకు పరిహారం పంపిణీ వెంటనే పూర్తి చేయాలని హరీశ్ ఆదేశించారు. చింతల్‌ఠాణా, కొదురుపాక, శాబాసుపల్లి, కొడిముంజ, చీర్లవంచ, అనుపురం, ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, వరదవెల్లి గ్రామాల నిర్వాసితులకు పరిహారం పంపిణీ, ఇతర సమస్యలపై సమీక్షించారు. ఆ గ్రామాల్లో రోడ్లు, ఇందిరా ఆవాస్ యోజన కింద ఇళ్లకు నిధులు మంజూరు చేయాలని హౌసింగ్ ఎండీ చిత్రా రామచంద్రన్‌కు సూచించారు. నష్టపరిహారం కోసం తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినవారు, మండల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టు స్పిల్‌వే, గేట్ల పనుల పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

చనాకా- కొరాటా పనుల తీరుపై ఆగ్రహం

పదిహేను రోజుల్లో చనాకా- కొరాటా ప్రాజెక్టు పనులు ఊపందుకోకపోతే గుత్తేదారులపై చర్యలు తప్పవని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు వెయ్యి క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని జరగాలని, జూన్‌లోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. 11 ప్రాంతాల్లో భూ యజమానులతో సమస్యలున్నట్లు విద్యుత్ అధికారులు చెప్పగా వాటిని పరిష్కరించాలని ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగు రామన్నను హరీశ్ ఫోన్‌లో కోరారు.

'కాళేశ్వరం'పై ప్రత్యక్ష ప్రసారంలో సమీక్ష

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మూడు బ్యారేజీలు, మూడు పంపుహౌస్‌లు, గ్రావిటీ కాలువ, గేట్ల నిర్మాణ పనులను మంత్రి హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లోని జలసౌధ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి, సమీక్షించారు. అన్నారం బ్యారేజీ ప్రాంతంలో గుత్తేదారు ఇంజినీర్లు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో మాట్లాడారు. ఎంత కాంక్రీటు వేశారు, లక్ష్యాన్ని ఎంతవరకు చేరుకున్నారనేది వీక్షించి సిబ్బందితో మాట్లాడారు. ఫేస్‌మెంట్ రిజర్వ్‌ను పరిశీలించారు. క్వాలిటీ ఇంజినీర్లు నిత్యం పని ప్రాంతానికి వస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. మరో కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావును బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులు నరేంద్రకుమార్, పీఎల్ గజ్‌భాయ్ తదితరులు కలిశారు. ఆరు, ఎనిమిది ప్యాకేజీలకు అవసరమైన పంపులు, మోటార్లు, ఇతర పరికరాలను సకాలంలో సరఫరా చేస్తామని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కొనసాగింపు

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిని మారుస్తారంటూ కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి, ఉత్కంఠకు తెరపడింది. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతారని తేలింది. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులను, కమిటీలను యథాతథంగా కొనసాగించాలని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయించినట్లు శనివారం దిల్లీ లోని ఏఐసీసీ కార్యాలయం నుంచి ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది పేరుతో ప్రకటన వెలువడింది. దీంతో టీపీసీసీ శ్రేణులు గాంధీభవన్‌లో సంబరాలు నిర్వహించాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, బండి సుధాకర్ గౌడ్, ప్రేమ్‌లాల్, అఫ్జలుద్దీన్, జంగయ్య యాదవ్, తదితరులు మిఠాయిలు పంచిపెట్టి, బాణసంచా కాల్చారు. మరోవైపు టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నించిన ఆశావహులకు చుక్కెదురైంది. రాహుల్‌గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు అన్ని రాష్ట్రాల పీసీసీలను మార్చేసి, పాత కొత్త కలయికతో కొత్త కమిటీలను వేసి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతారని ప్రచారం జరిగింది. తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడి మార్పుతో పాటు, సీఎల్పీలోనూ మార్పులు చేర్పులు ఉంటాయని అంతా భావించారు. పార్టీలో సీనియర్ నాయకులను అధ్యక్ష పదవి వరిస్తుందని భావించారు. అధిష్ఠానం నిర్ణయంతో పార్టీ శ్రేణులు ఒకింత ఆశ్చర్యానికి గురైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ వస్తే గిట్టుబాటు ధర

- ఆర్మూర్ వ్యవసాయ డిక్లరేషన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ వెల్లడి
- పంటలకు మద్దతు ధరల ప్రకటన
- బీమా పథకం ప్రీమియం చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదే..


రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉత్తమ్

ఆర్మూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని పంటలను మార్క్‌ఫెడ్ తదితర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయడమే కాకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఆలూరులో మాజీ సభాపతి కె.ఆర్.సురేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్మూర్ వ్యవసాయ డిక్లరేషన్ పేరిట అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ విధానాన్ని ప్రకటించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వాణిజ్య పంటలైన పసుపు, ఎర్రజొన్న పశుగ్రాస విత్తనోత్పత్తి పంటలకు సైతం మద్దతు ధర కల్పిస్తామని పేర్కొన్నారు. ధాన్యానికి (గ్రేడ్-ఏ, సాధారణ రకం) రూ.రెండు వేలు, పత్తి పంటకు (పొడవు పింజ రకం, మధ్యరకం పొడవు పింజ రకం) రూ.ఆరువేలు, మొక్కజొన్న, సజ్జ, జొన్న (హైబ్రిడ్, మలదండి)లకు రూ.రెండు వేలు, సోయాబీన్‌కు రూ.3,500, కందులు, మినుములు, పెసర్లకు రూ.ఏడు వేలు, వేరుశెనగకాయ, పొద్దుతిరుగుడు పువ్వు పంటలకు రూ.అయిదువేలు, మిర్చి పంటకు రూ.పది వేలు, పసుపు పంటకు రూ.పదివేలు, ఎర్రజొన్న విత్తనోత్పత్తి పంటకు రూ.మూడువేలకు తక్కువ కాకుండా కనీస మద్దతుధర కల్పిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఏటా రూ.5 వేల కోట్లతో మార్కెట్ జోక్య నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, పంటల బీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం వచ్చేలా నిర్దిష్టమైన పంటల బీమా పథకాన్ని తెస్తామని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ కనీస మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి బోనస్‌ను ఇస్తామన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ ఏకకాలంలో కాకుండా నాలుగు విడతలుగా మాఫీ చేసి రైతులను మోసం చేశారని విమర్శించారు. మూడున్నరేళ్లలో 3500 మంది రైతులు జీవితంపై ఆశలు వదులుకొని ఆత్మహత్య చేసుకున్నారంటే తెరాస ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. భూరికార్డులను ఎప్పటికప్పుడు సరిచేయడానికి మండలస్థాయిలో జమాబందీ విధానాన్ని ప్రవేశపెడతామనీ, వ్యవసాయ రంగంపై, రైతులపై జీఎస్‌టీ భారం పడకుండా చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గవర్నర్‌పై కేసు పెట్టే విషయమై ఆలోచన: యాస్కి

దళితున్ని పెలో అన్న గవర్నర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టే విషయమై ఆలోచన చేస్తున్నామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాస్కిగౌడ్ తెలిపారు. ఆలూరు సదస్సులో ఆయన మాట్లాడుతూ కృష్ణమాదిగ అరెస్టును ఖండించడానికి ఒక కాంగ్రెస్ నాయకుడు వెళ్లగా.. గవర్నర్ మాట్లాడిన తీరును ఆక్షేపించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఇసుక, ఇతర అక్రమ వ్యాపారాలపై ఫిర్యాదు చేస్తామని, ముఖ్యమంత్రి, మంత్రులు, గవర్నర్‌పై కూడ సీబీఐకి ఫిర్యాదు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు షబ్బీర్ అలీ, శాసనసభలో కాంగ్రెస్ పక్ష ఉపనాయకుడు, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ సభాపతి సురేష్ రెడ్డి, కిసాన్‌ఖేత్ మజ్దూర్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండ రెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు హాజరయ్యారు.

పంచాయతీ ఎన్నికలకు అర్హత లేని నేతల సంఖ్య 4,826

వీరంతా నాలుగు జిల్లాల వారే

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో త్వరలో నిర్వహించతలపెట్టిన పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కోల్పోయిన స్థానిక నేతల సంఖ్య ప్రస్తుతానికి 4,826కు చేరింది. వీరంతా కేవలం జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, వరంగల్ అర్బన్, సిద్దిపేట జిల్లాలకు చెందినవారు. తెలంగాణలో 2013లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసిన వ్యయానికి తుది నివేదికలు ఇవ్వనందుకు వారిపై ఎన్నికల సంఘం వేటు వేసింది. మిగతా జిల్లాల పరిశీలన పూర్తయ్యేసరికి అనర్హుల జాబితా పెరిగే అవకాశం ఉంది. జిల్లాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ఒక్కో జిల్లాకు చెందిన అనర్హుల పేర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తోంది. 2014లో భూపాలపల్లి జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసి వ్యయ నివేదికలు ఇవ్వని 1,189 మందిని, తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో ఇలాంటి సమాచారాన్ని అందివ్వని 2,166 మందిని ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించింది. మొత్తంమీద స్థానిక సంస్థల్లో ఇలాంటి వారి సంఖ్య ఇప్పటికి 8,181కి పెరిగింది. ఇలా అనర్హులను ప్రకటించటం ఇదే తొలిసారి కావడంతో రాష్ట్రంలో చర్చనీయాంశం అయింది. మూడేళ్లపాటు పంచాయతీ ఎన్నికల్లో పోటీకి వీల్లేకుండా వేటుపడ్డ నేతల్లో ప్రస్తుత పదవుల్లో ఉన్న ఆరుగురు సర్పంచులు, 769 మంది వార్డు సభ్యులు ఉన్నారు.

వేములవాడ సమగ్రాభివృద్ధికి చేయూత

ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రసిద్ధ దేవస్థానాల్లో ఒకటైన వేములవాడ సమగ్రాభివృద్ధికి చేయూతనందిస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శివరాత్రి ఏర్పాట్లు, సాంస్కృతిక సమ్మేళనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారమిక్కడ వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు మంత్రి కేటీఆర్‌తో ప్రగతిభవన్‌లో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. దేవస్థానాన్ని వంద రోజుల్లో అభివృద్ధి చేస్తామని కేటీఆర్ చెప్పారు. దేవస్థాన అభివృద్ధి ప్రణాళిక, పట్టణాభివృద్ధి, నిరంతర తాగునీటి సరఫరా, రహదారులు తదితర అంశాలపై చర్చించారు.

'సీఎం దృష్టికి సాంకేతిక సహాయకుల సమస్యలు'

జాతీయ ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఛైర్మన్ వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో సాంకేతిక సహాయకుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు సర్కారు వత్తాసు

- నేరెళ్ల బాధితులకు అండగా నిలుస్తాం: కోదండరాం
- సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల పాదయాత్ర


సిద్దిపేటలో పాదయాత్ర చేస్తున్న కోదండరాం, తమ్మినేని వీరభద్రం, చాడ వెంకటరెడ్డి

సిద్దిపేట అర్బన్ -న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్-సిరిసిల్ల: రాష్ట్రంలో ఇసుక మాఫియా దందాకు సర్కారు వత్తాసు పలుకుతోందని, ఇది సరికాదని తెలంగాణ ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం అన్నారు. శనివారం సిద్దిపేట నుంచి సీపీఐ, సీపీఎంతోపాటు ప్రజాసంఘాల నాయకులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల వరకు పాదయాత్ర చేపట్టారు. కోదండరాం మాట్లాడుతూ నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం ఆపబోమన్నారు. పోలీసులు వారిని చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఇసుక దందా ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా చూసేందుకే సిద్దిపేట నుంచి నేరెళ్ల వరకు పాదయాత్రగా వచ్చామని చెప్పారు. రాష్ట్రంలో కలెక్టర్లు, ఎస్పీలు సర్కారుకు తొత్తులుగా మారారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. నేరెళ్ల ఘటనపై రాష్ట్రపతి, గవర్నర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. నేరెళ్ల బాధితులను ఆదుకోవడంలో తాత్సారం చేస్తూ ప్రభుత్వం తన పతనానికి తానే గోతులు తవ్వుకుంటోందని వ్యాఖ్యానించారు. బాధితులపై కేసుల్ని ఎత్తివేసి, అక్కడి పోలీసులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మాఫియా దోపిడీ చేస్తోందని, ముఖ్యమంత్రి బంధువులే ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. దాడికి గురైన దళితులను పరామర్శించిన మంత్రి కేటీఆర్ ఇప్పటివరకు వారికి అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలేమిటో చెప్పాలన్నారు. ప్రభుత్వం అనుకున్నట్లు బంగారు తెలంగాణ కాదు.. బతుకు తెలంగాణ కావాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలతో ప్రమాదాలు జరుగుతుంటే వాటిపై చర్యలు తీసుకోవడం మానేసి.. అడ్డుకున్నవారిపై విచక్షణారహితంగా ప్రవరించడం ప్రభుత్వ నిరంకుశపాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. పాదయాత్రలో టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లమాస కృష్ణ, ఆయా సంఘాల ప్రతినిధులు రంగారావు, గోవింద్, చలపతిరావు, ఆదిరెడ్డి, సురేందర్ రెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ రూపకల్పనపై 8న సీఎస్ సమావేశం

రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూపకల్పనపై ఈ నెల 8న సీఎస్ ఎస్పీ సింగ్ సమీక్షసమావేశం ఏర్పాటు చేశారు. అన్నిశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు ఇందులో పాల్గొననున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై సాయిలుకు సమాచారం లేదు

కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్వేత

కామారెడ్డి, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాంలో మృతి చెందిన బోయిని సాయిలుకు ఇసుక అక్రమ రవాణాపై సమాచారం లేదని కామారెడ్డి ఎస్పీ శ్వేత శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సాయిలు మృతి వ్యవహారంచర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. కేసు తదుపరి విచారణలో భాగంగా శనివారం సాంకేతిక సాక్ష్యాధారాలను సేకరించగా సాయిలుకు ఇసుక అక్రమ రవాణాపై సమాచారం అందలేదని తేలిందని ఎస్పీ చెప్పారు. శవ పరీక్ష జరిపిన వైద్యాధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం.. సాయిలు చనిపోయిన సమయంలో ఎక్కువ మోతాదులో మద్యం తాగి ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సేకరించిన పత్రాలు, సాంకేతిక ఆధారాలు, సాక్షులు, గ్రామస్థులు చెప్పిన ప్రకారం బోయిని సాయిలుకు ఇటుక ట్రాక్టర్ వల్లే ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇంట్లో గొడవపడి కుమార్తె ఇంటికి బయలుదేరాడని, మద్యం తాగి ఉండడం వల్ల కారేగావ్ శివారులో పడిపోయాడన్నారు. ఈ క్రమంలోనే ఎర్ర దుర్గయ్య ట్రాక్టర్‌ను వేగంగా నడపడం వల్ల సాయిలుపై నుంచి తీసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

నకిలీ పురుగు మందుల తయారీ గుట్టు రట్టు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: నకిలీ పురుగుల మందులను తయారీ చేసి విక్రయిస్తున్న వ్యవహారం ఆదిలాబాద్ జిల్లాలో శనివారం వెలుగుచూసింది. ఆదిలాబాద్ పంజాబ్ చౌరస్తా సమీపంలోని నర్మద ఫెస్టిసైడ్స్‌కి చెందిన ముగ్గురు దుకాణ యాజమానులు గోల్డెన్ ఫైన్‌కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ(గుజరాత్) నుంచి పురుగుల మందులను దిగుమతి చేసుకోవాల్సి ఉంది. కాగా వీరు ముడి సరకును తెప్పించుకుని స్థానికంగా పురుగుల మందులు తయారు చేయిస్తున్నట్లు వ్యవసాయ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు మావల మండలం దస్నాపూర్‌లో వారికి సంబంధించిన గోదాంను తనిఖీ చేశారు. అక్కడ పురుగుల మందుల ముడి సరకులు, ప్యాకింగ్ యంత్రం, కంపెనీ స్టిక్కర్లను పరిశీలించగా నకిలీ పురుగుల మందులు తయారవుతున్నట్లు గుర్తించారు. దీంతో వారు రూ.19 లక్షల సరకులను జప్తు(సీజ్) చేయడంతో పాటు నర్మదా ఫెస్టిసైడ్స్ కెమికల్ పేరిట 2018 డిసెంబరు వరకు ఉన్న లైసెన్స్‌ను రద్దు చేశారు. నకిలీ పురుగుల మందుల సూత్రదారిపై కేసు నమోదు చేసినట్లు మావల వ్యవసాయ అధికారిణి సంధ్యారాణి తెలిపారు.





వధువు కావలెను

Reddy/ B.Tc (IIT) M.Tc (IIT) 30/ 5'7"/ 35 Lakhs/ Yr/ Bang ★ NIT/ 30/ 5'9"/ 16L/ Y ★ IIM/ MBA/ 21L/Yr/ 30/ 5' 10" ★ NIT/ 27/ 6'/ 12L/Y/ 50Cr ★ Cont. K.C.Reddy- Hyd- Ph: 9849321309 (A)

Reddy/ B.Tec (IIT) M.Tech (IIT) Ph.D/ USA/ MS/ ★ 31/ 6'/ 300K ★ 31/ 6'/ 150 K/ 30Cr ★ 30/ 5'11"/ 180K ★ 30/ 5'7"/ 150K/ 50Cr ★ 29/ 5'10"/ 105K ★ Cont. K.C.Reddy- Hyd- Ph:9849321309 (A)

Reddy/ Business/ B.Tech/ MBA ★ 30/ 5'9"/ 50 Cr ★ 30/ 5'8"/ 50Cr ★ 28/ 5'8"/ 50Cr ★ 28/ 6'/ 50Cr ★ 30/ 5'10"/ 50Cr ★ 32/ 6'/ 50 Cr ★ Cont. K.C.Reddy- Hyd. Ph: 9849321309/ 9347807015 (A)

దేవాంగ /32Y/5.7"/కుల ప్రసక్తి లేదు. /డాక్టర్ అమెరికా వరునకు MBBS చేసి అమెరికా వెళ్ళగల వధువు కావలెను. ✆ 94907 93010 (M).

రెడ్డి 40 ప్రైవేట్ జాబ్ డైవర్సీ వరునకు 35 వయసులోపు గల డైవర్సీ విడో సంప్రదాయ కుటుంబం పేదవారైనా వధువు కావలెను. హైదరాబాద్ 9908921725 (A)

రెడ్డి/ 26/ 5'11"/ MBBS, MD జనరల్ మెడిసిన్ చేస్తున్న వరుడికి తగిన డాక్టర్/ SWE వధువు కావలెను. 9494038701. (A)

విశ్వబ్రాహ్మిణ్: 26/ 5'11"/ MBBS, MD జనరల్ మెడిసిన్ చేస్తున్న వరుడికి డాక్టర్/ SWE వధువు కావలెను. Ph: 7675984352. (A)

ముదిరాజ్: 28/ 5'8"/ MBBS, MS జనరల్ సర్జన్ చేస్తున్న వరుడికి తగిన డాక్టర్/ SWE వధువు కావలెను. Ph: 8142540968. (A)

SC/ 28/ 5'9"/ MBBS, MS Ortho చేస్తున్న అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన డాక్టర్/ SWE వధువు కావలెను. 8125210356. (A)

Kamma/ B.Tech, IIT/ 6'/ 27/ 48L PA/ 1 Cr. ★ B.Tech, IIT, MBA, IIM/ 6'/ 29/ 24L PA/ 60 Cr. ★ B.Tech, BITS, MBA, IIM/ 6'/ 27/ 35L PA/ 5 Cr. తుమ్మల సుజాత ✆ 81217 95786. (B)

Kamma/ Group-I/ 5'.9"/ 28/ 10 Cr. ★ M.Tech/ 5'.9"/ 29/ AEE, Govt./ 25 Cr. ★ B.Tech/ 26/ AE, Govt./ 10 Cr. ★ B.Tech/ Postal/ 5'.8"/ 28/ 10 Cr. తుమ్మల సుజాత, ✆ 99632 32758. (B)

Kamma/ BEMS/ 5'.9"/ 25/ 120K/ 10 Cr. ★ B.Tech, IIT, MS/ 5'.11"/ 25/ 140K/ 5 Cr. ★ BEMS/ 5'.10"/ 24/ 100K/ 90 Cr. ★ B.Tech, BITS, MS/ 5'.11"/ 27/ 10 Cr. తుమ్మల సుజాత, ✆ 98482 17771. (B)

మాల: MBBS, MS (Gen. Surgeon)/ 5'.11"/ 26Y/ V.Fair/ 20 Cr/ డాక్టర్‌గా చేస్తున్న వరుని కొరకు (అర్జంట్)గా సంప్ర: ✆ 81065 01199, 92484 94810. (B)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాదిగ: B.Tech (IIT), MBA (IIM)/ 5'.8"/ 29Y/ V.Fair/ 10 Cr/ నెలకు 2 లక్షల జీతంతో జాబ్ చేస్తున్న వరుని కొరకు (అర్జెంట్)గా సంప్రదించండి. ✆ 81214 94810, 90320 94810. (B)

కమ్మ/ 26 సం./ 5'.9"/ Software/ Canada/ 1 లక్ష డాలర్లు P.A. గల వరునికి, కెనడా వెళ్ళగల సాఫ్ట్‌వేర్ కమ్మ వధువు కావలెను. ✆ 96668 21247. (B)

కమ్మ/ 27/ 6'.1", V.Fair, B.Tech, MBA, 9 Lak P/A, 12 ఎ॥ తోటలు, Job in Hyd. తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574. (B)

CNB/ MBBS, MS/ 37/ 6'.1"/ 18 Lacs/ Divorcee/ Seek a Beautiful working Girl/ 27-33/ 5'.5" ✆ 99665 80669 D/P. (B)

గౌడ, B.Tech, IIT, MBA/ C.Govt డిప్యూటీ Exq. ఇంజనీర్ (రైల్వే), 11 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854 (A).

పద్మశాలి, M.Tech, IIT, C.Govt ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్ 11 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A).

క్రిస్టియన్ మాదిగ, M.Tech, C.Govt క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (FCI), 10 Lakhs PA, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A).

విశ్వబ్రాహ్మణ M.Tech (IIT), C.Govt AE (BHEL)/ 80,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A).

గౌడ, B.Tech, MBA, C.Govt కస్టమ్స్ ఆఫీసర్, 80,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A).

బెస్త, B.Tech, Govt. AE (RWS), 62000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A).

బ్రాహ్మణ, రెండోపెళ్లి 35, 5'8" PG, Govt జాబ్ 1 Lakh PM, పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ వరునికి వధువు కావలెను. చదువు సమస్య కాదు ✆ 9030056547, 9676812525. (A).

రెడ్డి (Now Hyd) 1986/ 5'7", B.Tech/ MBA/ 100K/ US/10Cr ★ 1989/ 5'10"/ B.Tech/ MS/ US/ 10K/ నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1986/ 5'10", B.Tech/ PGDM/ Bajaj Fin (Hyd) 9.8L.PA ★ 1989/ 5'10"/MS/ US/ 25L. PA/ Pune/ 25Cr. 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1989/ 5'9", NIT/ B.Tech/ MBA/ 18.5L. P.A/ Rich ★ 1989/ 5'9", B.E/ M.Tech (BITS) 33L.P.A (Banglore) 9848221166/ 9505551788 (A)

Yadava, 37, 5'8" B.Tech, MS, USA, 70K, Mahaboobnagar, 9440831748 ★ 28, 5'11" B.Tech, MS, USA, 60K, Eluru, 9441735157 ★ 30, 5'11" M.Tech, Mahendra, Ongole 9440759945 (A).

విశ్వబ్రాహ్మణ 26 5.8 B.Tech SWE MNC 70,000 PM వరునికి తగిన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9866158793 (A)

కమ్మ 28 5'9" B.Tech SWE Deloitte 12 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9618483383 (A)

క్షత్రియ Any BC, Hyd. 34, 5'11" B.Tech, MS, UK, SWE Hyd. 1 Lack P/M డైవర్స్, బాగా స్థిరపడిన వరునికి డిగ్రీ (or) above తగిన వధువు కావలెను. 9346344474 / 7702346670 (A)

SC మాల కట్నప్రసక్తి లేదు 29/6' B.Tech IIT/ MBA/ IIM పంచాయతిరాజ్ గెజిటెడ్ ఆఫీసర్ 80 వేలు P/M వరుడికి అందమైన వధువు కావలెను. 9666148352 అర్జెంటు (A)

రెడ్డి 28 6' B.Tech MBA/ SWE Infosys 12 లక్షలు P/A వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. అర్జెంటు ✆ 9666567123 (A)


వాల్మీకిబోయ: B.Tech/ C.Govt Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో/ 45,000/-PM, 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

క్రిస్టియన్ మాదిగ: M.Tech/ C.Govt ఎలక్ట్రికల్ ఇంజనీర్/ BHEL/ 72,000/-PM, 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618009352 (A)

కాపునాయుడు: MBA/ C.Govt. మేనేజర్/ సిండికేట్ బ్యాంక్/ 65,000/-PM, "6'" ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8297439565 (A)

కమ్మ: B.Tech/ C.Govt JTO/ BSNL/ 60,000/-PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8297439565 (A)

అందానికి.. బంధానికి జంటగా వ్యాయామం!



పరిణయమాడిన ప్రతి జంటా కలకాలం కలిసి ఉండాలనే కోరుకుంటారు. అలా చివరివరకూ జంటగా కొనసాగే దంపతులకు ఒకరి గురించి మరొకరికి అవగాహన అత్యావశ్యకం. భాగస్వామి అలవాట్లు, అభిరుచులు, ఇష్టాయిష్టాలు, సాధకబాధకాలు క్షుణ్ణంగా తెలియాలి. ఒకే పనిని ఇద్దరూ కలిసి చేయడం వల్ల కొంత మేరకు ఎదుటి వ్యక్తి గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. కబుర్లు చెప్పుకునే సమయమూ చిక్కుతుంది. ప్రస్తుత ఉరుకులు పరుగుల కాలంలో ప్రత్యేకంగా ఓ పనిని ఇందు కోసం కేటాయించుకోవడం కష్టసాధ్యమే. ప్రతిరోజూ వ్యాయామాన్ని ఎవరికి వారు కాకుండా దంపతులిద్దరూ కలిసి చేయడం ఈ సమస్యకు సమాధానమవుతుంది. దీనివల్ల ఇద్దరికీ కొంత సమయం ప్రత్యేకంగా దొరుకుతుంది. ఇలా కలిసి వ్యాయామం చేయడం వల్ల శరీర ధారుఢ్యం, ఆరోగ్యంతో పాటు దాంపత్యజీవితానికి అనేకరకాలుగా మేలు చేకూరుతుందంటున్నారు నిపుణులు. దంపతుల మధ్య తలెత్తే చిన్నచిన్న సమస్యలకు కుటుంబ సలహా కేంద్రా (ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్)ల వరకు వెళ్లవలసిన అవసరమూ రాదంటున్నారు.

- భాగస్వామితో కలిసి వ్యాయామం చేయడం వల్ల ఇద్దరిలోనూ ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. శారీరకంగానే కాదు, మానసికంగానూ దృఢపడతారు. ఇది అన్యోన్య దాంపత్యానికి దారితీస్తుంది.
- ఎండార్ఫిన్ హార్మోన్లు (హ్యాపీ హార్మోన్లు) సహజంగా విడుదలయ్యేందుకు జతగా వ్యాయామం చేయడం చక్కని మార్గం. అవి మానసిక స్థితిని మార్చి ఆనందం వైపు మళ్లిస్తాయి.
- జంటగా వ్యాయామం చేయడం వల్ల ప్రత్యేకంగా కొంత సమయం దొరుకుతుంది. అది ఒకరి భావాలను మరొకరు పంచుకోవడానికి చక్కని అవకాశం. ఇద్దరి మధ్యా బంధం చిక్కబడుతుంది.
- ఒకేరకమైన వ్యాయామం కలిసి చేయడం, దాన్నే ఒకరి తరువాత మరొకరు చేస్తూండడం వల్ల మాటలు లేని ఆ వాతావరణంలో మనసులు మరింత దగ్గరైన మధురమైన అనుభూతి కలుగుతుంది.
- నిర్దేశించుకున్న ఫిట్‌నెస్ లక్ష్యాలను త్వరగా చేరుకోవచ్చు. బద్ధకంగా ఉన్నా, మనసు బాగా లేకున్నా ఒకర్నొకరు ఉత్సాహపరుచుకుని వ్యాయామం చేసే వీలుంటుంది.
- వ్యాయామం మిషగా ప్రతిరోజూ కాసేపు అలా కబుర్లు కలబోసుకోడం వల్ల ఒత్తిడి, అలసట దరిదాపుల్లోకి రావు. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. చిన్నచిన్న విషయాలకు చిరాకుపరాకులు కలగనేకలగవు.
- కలిసి వ్యాయామం చేయడం వల్ల తమపై తమకు నమ్మకం పెరిగి అది శృంగారం పైనా దృష్టి పెట్టేలా చేస్తుందంటున్నారు నిపుణులు. ఇద్దరిలోనూ దగ్గరితనం మరింత కుదురుకుంటుంది. జీవితం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. కలిసి బరువులెత్తడం వల్ల శృంగార పరమైన హార్మోనులు విడుదలవుతాయంటున్నారు.
- మెదడులోని ఆనందానికి కేంద్రమైన డోపమైన్‌ను ఉత్తేజపరిచి జ్ఞాపకశక్తిని ఇనుమడింపజేస్తుందని అధ్యయనకారులు చెబుతున్నారు. ఒకరివి ఒకరు పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి ముఖ్యతేదీలను గుర్తుపెట్టుకుని మరింత సంతోషకరమైన వాతావరణాన్ని ఏర్పరచుకునేందుకు దోహదం చేస్తుంది.
- వ్యాయామం చేస్తున్నపుడు ఏర్పడే కదలికలు కణజాలానికి సరిపడా ఆక్సిజన్, పోషకాలు అందేలా చేసి శరీర దృఢత్వాన్ని పెంచుతుంది. అది గుండె పనితీరును మరింత మెరుగుపరిచి ఏ సమయంలోనైనా, ఏ పని చేయడానికైనా ఉత్సాహం చూపుతారు.
- వారానికి నూటయాభై నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల అరవై ఐదు శాతం నిద్ర నాణ్యత పెరుగుతుందని చెబుతున్నారు పరిశోధకులు. అంతేకాదు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మధ్యాహ్నం నిద్ర వచ్చే అవకాశం కూడా తక్కువై రోజువారీ పనిలో చురుకుదనమూ పెరుగుతుంది.
- చెమటలు పట్టేవరకు వ్యాయామం చేయడం వల్ల మెదడుకు ధారాళంగా ఆక్సిజన్ అంది చక్కని నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ఆయా అంశాలపై ఇద్దరి మధ్య సానుకూలమైన చర్చలు జరుగుతాయి. అది దంపతులకే కాక కుటుంబపరంగానూ మేలు చేస్తుంది.
- ప్రతిరోజూ వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమై జీవితకాలమూ పెరుగుతుంది.

- సంధ్యారాణి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

రజక: M.Tech/ C.Govt అకౌంటెంట్ ఆఫీసర్/ AG ఆఫీస్/ 40,000/-PM 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

కుమ్మరి: B.Tech/ C.Govt P.O/ ఆంధ్రాబ్యాంక్/ 36,000/-PM, 5'11" ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

Reddy 28/ 6'/ B.Tech/ M.S./ 70L PA/ SWE ★ 29/ 5'11"/ M.Tech/ 15L PA IT Manager ★ 27/ 5'7"/ MD/ Doctor/ 7.5L PA ★ Shyam ✆ 9963978829 Blue Trend Matrimonial. (A)

Kamma 27/ 5'8"/ B.Tech/ MBA WIPRO/ 14L/ 12 Cr ★ 29/ 5'7"/ IIM/ MBA/ 25L/ 6 Cr. ★ 30/ 5'11"/ B.Tech/ IIT/ MS/ 15L/ 5 Cr ★ Shyam ✆ 9949233422 Blue Trend Matrimonial. (A)

BRAHMIN 35y 5'8" B.Com Bank Job TL B'lore 9.6 lakh P.A. second marriage own house no children only for brahmins direct 09916575168, 09482505997 (Whats App) (E)

కమ్మ 53 సం॥ 6HT IAS ఆఫీసర్ స్వంత ఇల్లు 18 ఎకరాలు పొలము పిల్లలులేని ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తికి రెండవ వివాహానికి వధువు కావలెను. Ph: 7095336641. (E)

కాపు, డైవర్సీ, 34/ 5'9" B.Tech, MBA/ మేనేజర్ 1L వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వరుడికి వధువు కావలెను./ కుల పట్టింపు లేదు./ 9705345003/ 8790246602 (A)

తమిళనాడుపిల్లే/ Hydలో సెటిల్డ్ అయిన 36/ MBA, 50K/ సొంత ఇల్లు ఉన్న వరుడికి/ తమిళనాడు అమ్మాయి కావలెను. (CNB)/ 9393939962/ w- 9441039962 (A)

కులపట్టింపులేదు: ఆర్యవైశ్య 30/ 5'6"/ P.G 60 వేలు, 75 (L) ఆస్తిగల వరునికి చదువుకున్న వధువు కావలెను. సంప్ర: 8499890813 (A)

వైశ్య 30y 5'7" B.Tech SWE 80,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9059158811. (A)

కమ్మ/33y/6' ఎత్తు/80 వేలు/జాబు Hyd/ ఆస్థి 75 లక్షలు/M.Tech, Ph.d, వరుడుకు వధువు కావలెను. రెడ్డి, కాపు అయిన సరే Father 73964 77178 (Min 5'4" ఎత్తు, Q:డిగ్రీ). (I)

బ్రాహ్మణ /5'8"/ 36 M.B.A Private Job, జీతం: 35,000/- గల వరుడుకి ఏదైన డిగ్రీ గల అందమైన వధువు కావలెను. ✆ 9246399962 (A)

Age '50' విడోవర్, బిజినెస్ నో చిల్డ్రన్స్, కుల పట్టింపులేదు, ఎంప్లాయి/ బిజినెస్ వధువు కావలెను. ✆ 7729879685, 8179467184. (C)


తండ్రిబ్రాహ్మణ, తల్లివైశ్యుల ఏకైక కుమారుడు 31 సం॥లు BE (పిలాని) డిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుకి (30 లక్షలు P.A.) తడిన వధువు కావలెను. ✆ 7330745342. (C)

కమ్మ /US నుండి వచ్చి కొంచెము Stay చేయుచున్న సాంప్రదాయమైన కుటుంబముకు చెందిన వరునకు అదే పద్ధతి గల వధువు కావలెను. మిగతా వివరాలకు ✆ 8179951899 (A)

★ ★ ★

Madiga/ Hindu/ MCA/ C.Govt, Bank (OBC, Clerk/ Hyd) Fair 29/ 5'5" 32K Seeks Bride Prefer Banker Hyd/ TG Direct Ph: 9885065983 (A)

★ ★ ★



వరుడు కావలెను

Reddy/ B.Tc (Amritha Univ)/ Bang/ MS/ USA/ 50 Cr/ 26/ 5'3"/ ★ IIT/ BITS/ MS/ USA 29/ 5'5"/ 200 K ★ 28/ 5'4"/ 180K ★ Cont. K.C.Reddy - Hyd- Ph:9849321309 (A)

Reddy/ Rich★ B.Tc/ MS/ MBA ★ 25/ 5' 3 1/2"/ 40cr ★ 27/ 5'5"/ 40Cr ★ 27/ 5'7"/ 50Cr ★ 27/ 5'4"/ 50Cr ★ 31/ 5'4"/ 70Cr ★ 27/ 5'6"/ 50Cr ★ 30/ 5' 2 1/2"/ 50Cr ★ Cont: K.C.Reddy - Hyd - Ph: 9347807015 (A)

Reddy/ MBBS/ PG ★ 27/ 5'7"/ 50 Cr ★ 26/ 5'5"/ 50 Cr ★ 28/ 5'7"/ 25Cr ★ 26/ 5'7"/ 50 Cr ★ 30/ 5'4"/ 50 Cr ★ 26/ 5'8" ★ 28/ 5'5"/ 10 Cr ★ BDS/ 30/ 5'3"/ 50 Cr ★ Cont. K.C.Reddy - Hyd. Ph: 9849321309 (A)

రెండోపెళ్ళి/ కులపట్టింపులేదు/ 54/ 5'3/ Govt/ 75 వేలు / ఒకకోటి & 45/ 5'4'/ Govt/ 60 వేలు/ 90 లక్షలు & 36/ 5'2/ 40 వేలు/ 50 లక్షలు / మాసేవ. ✆ 9291503949 (A)

కమ్మ/ 26/ 5'5"/ MBBS MD రేడియేషన్ ఆంకాలజి చేస్తున్న అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9494038601. (A)

కాపు: 26/ 5'4"/ MBBS, MS గైనిక్ చేస్తున్న వధువుకు అందమైన వెల్‌సెటిల్డ్ డాక్టర్/ SWE వరుడు కావలెను. 8125210344. (A)

Kamma/ M.Tech/ 5'.5"/ 23/ IBM/ 5 Cr. ★ B.Tech/ 5'.7"/ 25/ FCI/ 10 Cr. ★ B.Tech, IIT, MBA, IIM/ 5'.7"/ 25/ 15L PA/ 20 Cr. ★ B.Tech/ 24/ 5'.5"/ 100 Cr. తుమ్మల సుజాత, ✆ 81217 95786. (B)

Kamma/ B.Tech, IIT, Ph.D/ 5'.5"/ 23/ 15 Cr. ★ B.Tech, BITS, MS/ 5'.7"/ 23/ 140K/ 5 Cr. ★ B.Tech, MS/ 5'.5"/ 23/ 50 Cr. ★ B.Tech, MS/ 5'.5"/ 24/ 25 Cr. తుమ్మల సుజాత, ✆ 98482 17771. (B)

Kamma/ MD, Gynec/ 5'.7"/ 24/ 25 Cr. ★ MD Genl/ 26/ 20 Cr. ★ BDS/ 5'.5"/ 23/ 20 Cr. ★ MS Gynec/ 5'.8"/ 25/ 10 Cr. ★ MCh/ Nuero/ 5'.4"/ 27/ 15 Cr. తుమ్మల సుజాత, ✆ 99632 32758. (B)

కమ్మ/ 24Y/ 5'.5"/ ఫెయిర్/ B.Com/ Pvt జాబ్/ 22000 PM/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల తండ్రిలేని వధువుకు సాంప్రదాయం గల మధ్యతరగతి వరుడు కావలెను. ✆ 7396744797. (C)

కమ్మ/ 24/ 5'.6", V.Fair, B.Tech, 3L P/A, 4 Cr. ప్రాపర్టీకి తగిన కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

ఆర్యవైశ్య/ 23/ 5'4/ 10 లక్షలు & 29 / 5'3/ 17 లక్షలు/ రెండోపెళ్ళి/ 32/ 5'2"/ 19 లక్షలు & 39/ 5'3/ 50 లక్షలు / జి.సుప్రజాగుప్తా/ మా సేవ ✆ 9493163996. (A)

కుమ్మరి/ B.Tech, C.Govt Asst. మేనేజర్ (బ్యాంక్ ఆఫ్ బరోడా) 32,000/-PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854 (A).

పద్మశాలి, ఏకైక కుమార్తె, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, B.Tech, C.Govt PO (SBH), 30,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A).

మాల, B.Tech, C.Govt ఎలక్ట్రానిక్ ఇంజనీర్ (ECIL), 38000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A).

మాల/ B.Tech/ C.Govt JTO (BSNL)/ 60,000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9581317506 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt. బ్యాంక్ P.O (కెనరా బ్యాంక్)/ 35,000/PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

మాదిగ/ ఏకైక కుమార్తె/ M.Tech (NIT)/ Govt. A.E (ఇరిగేషన్ Dept)/ 60,000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724 (A)

రజక/ ఏకైక కుమార్తె/ M.Sc/ Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ 28000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

కాపు/ B.Tech/ Govt. J.E (R&B)/ 52000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను ✆ 8886512010 (A)

రెడ్డి/ B.Tech/ C.Govt. A.E (రైల్వే)/ 34000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9985395014 (A)

బ్రాహ్మణ, 24, 5'3", B.Com ★ 21, B.Tech ★ 25, B.Tech, MBA Infosys ★ 26, 5'4", M.Pharm, wkg ★ 23, B.Tech, MS (US) ★ 27, MBBS ★ 8555024711 (A)

రెడ్డి 1992/ 5'5", B.Tech/ MS/ US/ V.Fair/ 6Cr ★ 1990/ 5'4" B.Tech/ M.S/ Germany/V.Fair & Rich 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1994/ 5'6" B.Tech/ MBA/ V.Fair/ 10Cr ★ 1992/ 5'5", B.Tech/ 5L. P.A/ Chennai, నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 9505551788 F(A)

రెడ్డి 1993/ 5'4" B.Tech (HMDA) Hyd/ Fair ★ 1992/ 5'3 1/2/ B.Tech/ M.Tech (JNTU)/ V.Fair/ R&B/ 6L.PA (Hyd) 9848221166/ 9505551788 (A)

SC మాదిగ హిందూ, 27, 5'3", M.Sc బయోకెమిస్ట్రీ, జాబ్ 20,000/- PM, V.V. ఫెయిర్ వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8712865419 (A).

రెడ్డి / లేట్ మ్యారేజ్ /29Y/ 5'5"/ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, 6కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9515337427 (A)

కుల పట్టింపులేదు (2వపెళ్ళి) 56/5'3" ఇంటర్/ బెంగుళూరు & Hydలో ఓన్ బిస్కెట్ ఫ్యాక్టరీలు 70 వేలు PM Hydలో ఓన్ హౌస్ గల వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. 9908105567 (A)

కమ్మ ఓన్లీ డాటర్ 23/ 5'6" B.Tech SWE TCS 35,000 P/M వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. సంప్రదించండి.✆ 9948005247 (A)

కులపట్టింపులేదు / కమ్మ / 49Y/ 5'5"/ 2nd మ్యాచ్/ విడో /Govt టీచర్ /75K (PM)/ ఫెయిర్ పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం OK) ✆ 7893688483 (A)

ముదిరాజ్ / డైవర్సీ /30Y/ 5'4"/ Own ఫర్నీచర్ బిజినెస్ 8 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 8790788977 (A)

వడ్డెర: MBA/ C.Govt క్వాలిటి ఇన్స్పెక్టర్/ FCI/ 35,000/-PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

హిందుమాల: B.Tech/Govt Asst. ఇంజనీర్/ R&B/ 55,000/-Pm, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618009352 (A)

గంగపుత్ర, బెస్త: B.Tech/ C.Govt JTO/ BSNL/ 40,000/-PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

కాపునాయుడు B.Tech/ C.Govt Asst మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 45,000/-PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

కమ్మ: B.Tech/ C.Govt మేనేజర్/ IOB బ్యాంక్/ 50,000/-PM, 5'6" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

రజక: 20 లక్షల ఆస్థి, B.Tech/ SWE/ 40,000/-PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

Reddy 24/ 5'6"/ B.Tech/ SWE/ Fair ★ 25/ 5'3"/ B.Tech/ SWE/ 5L PA ★ 27/ 5'5"/ M.Tech/ SWE/ 5L. PA/ Fair Contact: Shyam ✆ 9963978829 Blue Trend Matrimonial. (A)

Kamma 24/ 5'4"/ B.Tech/ 3L PA/ SWE Fair ★ 25/ 5'4"/ B.Tech/ 4L PA/ SWE/ Fair ★ 28/ 5'4"/ MBA/ 3L PA/ Fair Cont: Shyam ✆ 9949233422 Blue Trend Matrimonial. (A)

కమ్మప్రత్యేకం: 24 to 39- B.Tech, M.Tech, MBA, MS- అందమైన, ఆస్తిగల Ind/ US వధువులకు వరుడు కావలెను. శారద: 9849413031 (A)

కాపు/ విడో/ 26Y/ డిగ్రీ/ 5'5"/ అందమైన వధువుకు/ వరుడు కావలెను./ కులప్రసక్తిలేదు/ (బిజినెస్ Or జాబ్) Ok. 9100634922 (A)

రెడ్డి, డైవర్సీ 40, 5'4" గౌట్ జాబ్, 60K, రెంట్స్ 35K, 6Cr ఆస్తిగల వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి, పట్టింపులేదు ✆ 8519914020/ 8519914060 (A)

SC, మాల, హిందూ B.Tech 25Y 5'4" TCS, SWE HYD 40k PM చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 9705960270 (A)

రెడ్డి విడో, 35, 5'5", V.ఫేర్, సొంత బిజినెస్ 80K, రెంట్స్ 30K, 2Cr ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. ✆ 9505437430/ 9666376030 (A)

SC/ 24/ 5'4"/ B.Tech, SWE/ 40 KPM,/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి కలిగిన వధువుకి/ తగిన వరుడు కావలెను. ✆ 9676968974/ 9951049449 (A)

కమ్మ / 24/ 5'5", B.Tech/ SWE 40K, 2Cr/ ప్రాపర్టీ కలిగిన/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 7673939882/ 7702274416 (A)

కమ్మ 52 సం॥ 5.3 HT ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ విడో పిల్లలులేరు స్వంత ఇల్లు 27 ఎకరాలు పొలము గల ఉన్నత కుటుంబానికి చెందిన మహిళకు, వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 7095336641. (E)

కాపు కులపట్టింపులేదు 45 సం॥ 5.2 HT గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ M.Sc., B.Ed., P.hd., 98000/- P/M 41 ఎకరాలు పొలముగల పిల్లలులేని విడో మహిళకు ఇల్లరికం వరుడు కావలెను. Ph: 7095336641. (E)

విడో/35 సం॥/కాపు/ఇద్దరు పిల్లలు/5.3 ఎత్తు/Msc(Maths) 50L ప్రాపర్టీ/అందమైన వధువుకు (డాక్టర్స్/ఇంజనీర్స్ 35-40 సం॥) వరుడు కావలెను. No Caste). ✆ 93468 03795 (I)

బలిజ *23 Yrs * B.Tech * 25 కోట్లు ప్రోపర్టీ కలిగిన అందమైన ఏకైక హైదరాబాద్ వధువుకి ఇల్లరికపు అల్లుడు కావలెను. ఆస్తి కుల ప్రసక్తిలేదు. Contact. Whatsapp. 8121016556. (C)

బ్రాహ్మణ/ 29సం॥/ 5'4"/ Sandilyasa గోత్రం/ B.Sc, B.Ed/ టీచర్/ రిక్రైర్‌మెంట్/ వెల్‌సెటిల్ ఫ్యామిలీ/ పురోహితం, ప్రైవేట్ Or Govt Job Also/ 7285997452/ 8187000164 (A)

Christian: M.Tech, 5'.4"/ 41 Late Marriage, Slim, V.Fair, Sr. S/WE in USA. Seeks S/WE Doctor, IAS, India/ USA. ✆ 73308 45011, Urgent. (B)

రెడ్డి *24 * B.Tech *30 కోట్ల ప్రోపర్టీ కల్గి పెళ్లి ఆగిపోయిన అందమైన ఏకైక వధువుకి అర్జంటుగా వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తిలేదు) Contact. Whatsapp: 9030916673. (C)

కమ్మ / విడో /44/ 5'5"/ రీజనల్ Transport Officer RTO/ 3L PM/ హైద్రాబాద్‌లో ఓన్‌హౌస్/ 18 Cr ప్రాపర్టీ గల వెల్‌సెటిల్డ్ అమ్మాయికి కుల ప్రసక్తిలేని వరుడు కావ॥ ✆ 7893357075 (A)

రెడ్డి 25 Y/ V.Fair/ 5.5/ B.Tech. (IT)/ S/W in Ban/ 40,000 PM/ 3 Cr. Property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 97041 88499. (D)


కమ్మ: 24 Y/ V.Fair/ 5.4/ B.Tech. (CSE)/ S/W in Hyd/ 43,000 PM/ 2 Cr. Property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 83097 63574. (D)

క్షత్రియ/ రాజులు: 25 Y/ Fair/ 5.5/ B.Tech. (IT)/ S/W in Chennai/ 45,000 PM/ 3 Cr. Property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 93938 63645 (D)

★ ★ ★

ముదిరాజ్ 1987 M.Tech, ఫెయిర్ 5'6" SWE వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. (No బ్రోకర్స్) ✆ 7995232472 (A)

★ ★ ★



వివాహ వేదిక

రజక: BSNL ఇస్రో DRDO HAL IOC Rly IT SBI బ్యాంకు ఉద్యోగుల సంబంధాలకు సంప్ర: RR తాళ్ళూరి. ✆ 98481 34411. (B)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్నిమతాల, కులాల 1 వ, 2 వ, లేట్, విడో/ డైవర్సీలకై వివాహాలు & Govt. ఎంప్లాయిస్ సంబంధాల కొరకు వెరిఫైడ్ సెటిల్‌కై ✆ 9000185415 (A).

బ్రాహ్మణ వధువు వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ Hyd ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A).

P.Supriyareddy, Rich Reddy, Boys & Girls. India & abroad Matches. All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/MS/ MCH/DM/ BDS & బిజినెస్‌మ్యాన్స్‌కి 1వ/2వ/ విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయావ్ www.gokulmarriage.com, Hyd. 9440831748, Gunt ✆ 9440759945, VSP. 9441735157 (A).

డాక్టర్స్ మ్యారేజ్ లింక్స్, అన్ని కులాలు (కాపు/ కమ్మ/ రెడ్డి/ బ్రాహ్మణ్/ వెలమ/ యాదవ/ నాయిబ్రాహ్మణ్/ పద్మశాలి/ రజక (ఆల్) SC మాల/ మాదిగ/ క్రిస్టియన్, హిందూ, ముస్లిమ్స్. All డాక్టర్స్ (MD/ MBBS) ఆంధ్ర, & తెలంగాణ వధూవరుల సంబంధాలకై సంప్రదించండి. Ph: 7729988578/ 9491392166 (A).

Whatsapp your Photo & Biodata to 9347262769. We will send the suitable matches. www.pellisandadi.com ESTD. 1991, Ph: 9290287458 (A).

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ॥కు ఫ్రీ. పు॥ సర్వీస్‌ఛార్జ్ ✆ 7893688248 (A).

ఉభయరాష్ట్రాలు, TS & AP అన్ని జిల్లాలు 1వ, 2వ, లేటు, విడో, విడోయర్స్, డైవర్సీ, ఒంటరి, ఇల్లరికం, రిటైర్డ్, పెన్షనర్స్: 9949595523 (ఫ్రీ కౌన్సిలింగ్: 4PM - 8PM) (A)

ఓన్లీ కమ్మచౌదరి: కమ్మ కన్వర్టెడ్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, MBA, Govts, హైరిచర్స్, బిజినెస్‌మెన్స్, & All 1వ / 2వ విడో, దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

కుల పట్టింపులేనివారికి 2వ/ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM - 5PM పరిచయవేదిక జరుగును. 1000 మంది నంబర్లు లిస్ట్ ఇవ్వబడును. Hyd. ✆ 9440937900. (A)

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక 11-02-2018న జ్యోతిగార్డెన్స్ ECIL Hydలో జరుగును. Time: 1Pm to 6Pm ✆ 9704656103/ 9533608887 (A)

20 సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707. (I)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, భట్రాజులు, MBBS, MD, B.Tech, MS, Govt.హైరేంజ్ జాబ్స్ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st, 2nd, అబ్బాయిలు, అమ్మాయిలు సంప్ర: (M. ధనలక్ష్మీ) 8374514056 (A)

విశ్వబ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ బ్రహ్మముడి, గుంటూరు, కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725. (I)

kapunadupellipandiri.com కాపు కులస్థులకు సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, బ్యాంక్స్, వెల్‌సెటిల్డ్ కుటుంబాల అత్యధిక సంబంధాలు 18 సం॥ అనుభవం. ఫీ॥ 999/- W/P: 9390557592 (A)

కాపు పెళ్ళిసంబంధములు మాత్రమే కుదర్చబడును. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్, డాక్టర్స్, ఎంప్లాయిస్, హైలెవెల్ మ్యాచెస్, ఇండియా, ఎబ్రాడ్ మ్యాచెస్ కొరకు సంప్ర: VJA. ✆ 95055 78732. (B)

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్‌సెటిల్‌మెంట్ చేయబడును. ✆ 9885144375 (A)

కేవలం మాల, మాదిగ, హిందూ & క్రిస్టియన్ TS & AP రాష్ట్రాల్లో అన్ని జిల్లాల్లో అన్ని కులాల వారికి Govt, IT, PVT, బిజినెస్, జాబ్స్ లేటు డైవర్సీ సంప్ర॥ ✆ 7075217461 (A)

కేవలం రెడ్డీస్, కమ్మ, కాపు, నాయుడు, మున్నూరు కాపు మా ప్రత్యేకత TS & AP అన్ని జిల్లాల్లో Govt, IT, PVT బిజినెస్, జాబ్స్ 1వ లేటు డైవర్సీ దేశ విదేశీ సంబంధాలకై బ్రాంచీలు ✆ 8185811429 (A)

★ ★ ★

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరులకై దేశ, విదేశ, 1వ, 2వ, డా॥ ఇంజనీర్, P.G, డిగ్రీ సం॥లకై సంప్ర॥ B.S.గౌడ్స్, హైద్రాబాద్ ✆ 9246214511 (A)

"భావన వివాహవేదిక" గత 27 సం॥లుగా మీ సేవలో అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్ర ✆ 8008106262/ 9885444980 (A)

★ ★ ★

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్. డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్ర: భ్రమరాంబ M.B. ✆ 99484 83542. (F)

అభ్యంతరాలపై సమగ్రంగా విచారించండి

- **ఆ తర్వాతే భూసేకరణపై ముందుకెళ్లండి**
- **మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై అధికారులకు హైకోర్టు విస్పష్టం**
- **19(1) డిక్లరేషన్ రద్దు**

ఈనాడు, హైదరాబాద్: సిద్దిపేట్ జిల్లా తొగుట మండలంలోని వేముల ఘాట్ పరిధిలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం సేకరించదలచిన భూముల వ్యవహారంలో... ప్రభావితుల/రైతుల అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరపాలని భూసేకరణ అధికారులకు హైకోర్టు తేల్చిచెప్పింది. ఆ తర్వాతే భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లాలని స్పష్టం చేసింది. నూతన భూసేకరణ చట్టం సెక్షన్ 19(1) ప్రకారం అధికారులు జారీచేసిన డిక్లరేషన్‌ను రద్దుచేసింది. పరిహారం చెల్లింపు నిమిత్తం జరుగుతున్న విచారణను నిలుపుదల చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలిచ్చారు. నూతన భూసేకరణ చట్ట నిబంధనలను అనుసరించకుండా, తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా అధికారులు పరిహార నిర్ధరణ (అవార్డు ఎంక్వయిరీ) చేపడుతున్నారంటూ వేముల ఎల్లవ్వ, మరో 22 మంది హైకోర్టును ఆశ్రయించారు.

పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ- పిటిషనర్లతో పాటు సుమారు ఆరు వందలమంది సమర్పించిన అభ్యంతరాల్ని పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు అవార్డు ఎంక్వైరీ నిర్వహిస్తున్నారన్నారు. పరిహార చెల్లింపు విచారణకు ముందే పిటిషనర్ల అభ్యంతరాల్ని పరిష్కరించాల్సి ఉందన్నారు. దీంతో 'చట్ట నిబంధనలను అనుసరించకుండా అవార్డు ఎంక్వైరీ వరకు ఎలా వచ్చారు?' అని ప్రభుత్వ న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు.

ఆ జలాశయ నిర్మాణంలో తొందరపాటు వద్దు: హైకోర్టు

నిజామాబాద్ జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో... కొండం చెరువు, ముంచిప్ప చెరువులను కలుపుతూ నిర్మించతలపెట్టిన జలాశయ ప్రాంతం వద్ద తవ్వకాలు, చెట్ల కొట్టివేత విషయంలో తొందరపాటు వద్దని అధికారులకు హైకోర్టు స్పష్టంచేసింది. జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి ఈ మేరకు ఆదేశిస్తూ, విచారణను ఈనెల 18కి వాయిదా వేశారు. జలాశయ ఏర్పాటుతో తమ పొలాలు, అటవీ భూములు మునిగిపోతాయంటూ ముగుపాల్ మండలం ముంచిప్పకు చెందిన బానోత్ ఈశ్వర్‌సింగ్, మరో 60 మంది హైకోర్టును ఆశ్రయించారు.

రుణగ్రస్తురాలిని పిస్తోలుతో బెదిరించిన ఏఎస్ఐ!

కరీంనగర్‌లో మోహన్‌రెడ్డిపై మరో కేసు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: అప్పు తీసుకుని చెల్లిస్తున్న క్రమంలో ఇల్లు లాక్కున్నారనీ, న్యాయం కోసం అడిగిన తనను ఏఎస్సై మోహన్‌రెడ్డి ముఠా చంపుతానని బెదిరించిందని కరీంనగర్‌కు చెందిన గుర్రం అమరేంద్రి శనివారం రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవీందర్ నాయుడు కథనం ప్రకారం- కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన అమరేంద్రి కుటుంబ అవసరాల నిమిత్తం 2009లో ఏఎస్సై బొబ్బల మోహన్‌రెడ్డి వద్ద రూ.13 లక్షలను అప్పుగా తీసుకున్నారు. ఇందుకాయన ఆమె నుంచి 7 ఖాళీ బ్యాంకు చెక్కులు; 6 ప్రామిసరీ నోట్లు, ఖాళీ బాండ్‌పేపర్లు, తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నాడు. అంతేకాకుండా... ఆమె పేరున మంకమ్మతోటలో ఉన్న రూ.కోటి విలువైన ఇంటిని తన బినామీ తిరుపతిగౌడ్ పేరున విక్రయ ఒప్పందం, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు చేయించుకున్నారు. చెల్లించాల్సిన డబ్బులో రూ.7 లక్షలను రెండు నెలల్లో చెల్లిస్తామని అమరేంద్రి గడువు కోరగా... మోహన్‌రెడ్డి, తిరుపతిగౌడ్, వారి అనుచరులు ఆమె ఇంటికి వెళ్లి గొడవ చేశారు. ఆ సందర్భంగా మోహన్‌రెడ్డి తన రివాల్వరుతో బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఇప్పటికే వరంగల్ జైలులో ఉన్న మోహన్‌రెడ్డి, మరో పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖ్యాతి చాటిన పంజాగుట్ట ఠాణా

ఈనాడు, హైదరాబాద్: ప్రజామిత్ర పోలీసింగ్.. ఫిర్యాదిదారులతో సత్ప్రవర్తన.. కేసుల ఛేదనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం.. ఇలా ఉత్తమ సేవలందిస్తున్న పంజాగుట్ట పోలీస్‌ఠాణాకు దేశవ్యాప్తంగా ద్వితీయ స్థానం లభించింది. మధ్యప్రదేశ్‌లోని టేక్నాపూర్ బీఎస్ఎఫ్ అకాడమీలో శనివారం ప్రారంభమైన డీజీపీల వార్షిక సమావేశంలో హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఈ పురస్కారం అందుకున్నారు. పోలీస్ శాఖలో సంస్కరణలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న పోలీస్‌ఠాణాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఠాణాలపై గతేడాది సర్వే నిర్వహించింది. ప్రాథమికంగా 10 ఠాణాలను పరిగణనలోకి తీసుకున్నారు. అధికారులు స్వయంగా వెళ్లి అక్కడ పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, నేరనియంత్రణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు.



రాజ్‌నాథ్‌సింగ్ నుంచి అవార్డులు తీసుకున్న.. తొలి మూడు స్థానాలు దక్కించుకున్న ఠాణాల ఇన్‌స్పెక్టర్లు (చిత్రంలో ఎడమ నుంచి మూడో వ్యక్తి రవీందర్)

అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలందిస్తున్న తొలి మూడు స్థానాలకు వరుసగా కోయంబత్తూరులోని ఆర్ఎస్, హైదరాబాద్‌లోని పంజాగుట్ట, లఖ్‌నవూ నగరంలోని గుడుంబా ఠాణాలు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా రెండోస్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు.

నయనతార చేయను అంది

ఈతరం కథానాయికల్లో నయనతారంటే నాకు ఇష్టం. పద్ధతైన అమ్మాయి. నాతో కలిసి చేసిన ప్రతీ సినిమా హిట్టే. 'శ్రీరామరాజ్యం' కథ చెప్పడానికి బాపుగారొచ్చారు. 'చేసేద్దాం' అన్నాను. కానీ లోపల భయం. 'నాన్నగారు చేసిన పాత్ర చేయగలనా?' అనిపించింది. కానీ 'బాపుగారున్నారులే' అనే ధైర్యంతో ఒప్పుకొన్నా. 'సీత ఎవరు' అనే చర్చ వచ్చింది. వెంటనే నేను ఫోన్ అందుకుని నయనతారతో మాట్లాడా. 'నేను సినిమాలు మానేయాలన్న నిర్ణయానికి వచ్చా.. క్షమించండి' అని హుందాగా చెప్పింది. 'ఈ సినిమా చేస్తే చరిత్రలో నిలిచిపోతావు, నీ కుటుంబ సభ్యులూ నిన్ను చూసి గర్వపడతారు' అన్నాను. నయనతార ససేమీరా అంది. 'ఏం ఫర్వాలేదు.. రేపు ఈ సమయానికి నయనతార నుంచి ఫోన్ వస్తుంది చూడండి' అని బాపుగారితో చెప్పాను. అన్నట్టుగానే.. నయన ఫోన్ చేసి 'ఈ సినిమా చేస్తా' అని మాట ఇచ్చింది



నా మాట నేనే వినను

తెల్లవారుజామున మూడున్నరకు లేస్తా. గంట పాటు వ్యాయామం చేస్తా. మెడిటేషన్, యోగా నా స్వభావానికి పడవు. సూర్యోదయం అవ్వకముందే పూజ అయిపోతుంది. ఈ రోజు నా కోసం నేనేం చేస్తున్నా? అనే ప్రశ్న నన్నెప్పుడూ వెంటాడుతుంటుంది. నా కుటుంబం కోసం ఏమిచ్చాను? నాకోసం నేనెంత కేటాయించుకున్నానో ఆలోచిస్తుంటా. ఓ భర్తగా, తండ్రిగా నా కర్తవ్యాన్ని ఏనాడూ విస్మరించలేదు. వాళ్లకు ఇవ్వాల్సిన సమయం తప్పకుండా ఇస్తా. శరీరం, మనసు వేరువేరు. మనసు చెప్పినట్టే చేస్తుంటా. ఆహారం విషయంలోనూ అంతే. 'ఈరోజు కాస్త కారంగా ఏమైనా తిందామా' అనుకుంటే అస్సలు ఆలోచించను. నాలుక రుచి కోరుకుంటున్నప్పుడు దానికి నచ్చిన ఆహారాన్ని అందివ్వడమే మంచిది. పాత్ర కోసం తగ్గాలి అనుకున్నప్పుడు నా శరీరాన్ని కష్టపెట్టుకుంటా. 'గౌతమిపుత్ర శాతకర్ణి' కోసం చేసిన కసరత్తులు ఇంకే చిత్రం కోసం చేయలేదు. పాత్ర నన్ను నడిపించాలి. ఓసారి పాత్రలోకి వెళ్లిపోతే.. నా మాట నేనే వినను. పాత్రే నన్ను నడిపిస్తుంటుంది.

తొడగొట్టి పౌరుషం చాటే బాలయ్యకు తొడపాశమంటే భయం


మీసం మెలేసి రాజసం చూపించే బాలకృష్ణకు రామానుజాచార్యులు ఆదర్శం

ఎన్టీఆర్ సినిమాలు తప్ప వేరేవి చూడని నటసింహం

నటసార్వభౌముడి పౌరాణికాలకు దూరం

చిత్రాలు, రాజకీయాలతో బిజీగా ఉండే నందమూరికి కుటుంబంతో ప్రేమానుబంధం

వరుస సినిమాలు, రాజకీయాలు, ప్రజలు, అభిమానులతో తీరికలేకుండా ఉండే బాలకృష్ణ 'హాయ్'తో తన మనసు విప్పారు. నాన్న నేర్పిన క్రమశిక్షణ, కొడుకుకు ఇచ్చిన స్వేచ్ఛ, పాత్రల్లో లీనమయ్యే తత్వం, భాషా పటిమ వంటి ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. వరుసగా మూడో ఏటా సంక్రాంతికి 'జైసింహా' అంటూ తన సినిమాతో మనముందుకొస్తున్న నందమూరి బాలయ్య చెప్పిన కబుర్లు...



తొడపాశానికి భయపడి తెలుగు నేర్చుకున్నా

కొత్తవాళ్లు వచ్చినా కాదనను

గతంలో యేడాదికి ఏడెనిమిది సినిమాలు చేసిన రోజులు ఉన్నాయి. ఆమధ్య కాస్త వేగం తగ్గింది. దానికి కారణం క్రమశిక్షణ కలిగిన నిర్మాతలు లేకపోవడమే. నిర్మాతలు చాలా తక్కువగా ఉండేవారు. అదేదో కొంతమందికే పరిమితం అయిన రంగంలా ఉండేది. నిర్మాతగా మారాలంటే సినిమా నేపథ్యం తప్పని సరి అనుకునేవారు. 'ఈయన తప్ప మరొకరు నిర్మాత కాడు' అనే భ్రమలు ఉండేవి. నా వరకూ కొత్త నిర్మాతల్ని ప్రోత్సహిస్తుంటాను. 'మీతో సినిమా చేస్తాం' అని అభిమానంతో వచ్చినవాళ్లని కాదనను. ఈమధ్య నాపై నాకు నమ్మకం బాగా పెరిగింది. 'నిర్మాత, నటీనటులు ఎవరైతే ఏంటి?' అనిపిస్తోంది. ఆరోజుల్లో నాన్నగారూ అంతే. 'కాశ్మీర్‌లో పాట తీద్దాం.. విదేశాలకు వెళ్దాం' అంటే.. 'అవన్నీ ఎందుకు బ్రదర్.. నన్ను గోడ ముందు పెట్టి తీయండి.. జనం చూస్తారు' అనేవారు. సినిమాలు చక చకా చేసేయడం ఒక ఎత్తు అయితే, నాణ్యత పాటించడం మరో ఎత్తు. ఎక్కువ సినిమాలు చేస్తే.. కార్మికులూ బతుకుతారు కదా? అందుకే కొంచెం వేగం పెంచా.

62 గెటప్పుల్లో కన్పించనున్నా

ఎన్టీఆర్ జీవితంలో తెలియని కోణాల్నీ చూపిస్తున్నాం. బయోపిక్ అంటే అంతే కదా? నాన్నగారు అందరినీ 'నా' అనుకునేవారు. అజాత శత్రువని ఆయన నమ్మకం. కానీ.. ప్రతీ ఒక్కరి జీవితంలో ఆత్మీయులు, బంధువులు, స్నేహితులతో పాటు శత్రువులూ ఉంటారు. అలాంటి ఆసక్తికరమైన విషయాల్ని బయోపిక్‌లో పొందుపరిచాం. పుట్టినప్పటి నుంచీ చివరి వరకూ చరిత్ర మొత్తం చూపిస్తున్నాం. ఆయన ఎదిగిన క్రమం, చిన్నప్పుడు ఆలోచనా ధోరణి ఎలా ఉండేది? ఆయన్ని ఏయే విషయాలు ప్రభావితం చేశాయి? ఇవన్నీ అందులో ఉంటాయి. దాదాపుగా 62 గెటప్పుల్లో కనిపించబోతున్నా. అవేంటి? ఎలా ఉంటాయి? అనేది ఇప్పుడే చెప్పకూడదు.

నమ్మకమే దేవుడు

దేవుడంటే నమ్మకం.. నమ్మకమే దేవుడు. ఏ దేవుణ్ణయినా నమ్మకంగా నమ్మండి! పూజలు, పునస్కారాలు మనలో ఆత్మధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్నీ పెంచేలా ఉండాలి. మంత్రాలు, బీజాక్షరాలు పఠిస్తున్నప్పుడు శరీరంలో ఉన్న చక్రాలన్నీ ప్రేరేపితం అవుతుంటాయి. మన శరీరాన్ని మనం అధీనంలోకి తీసుకురావచ్చు. జాతకాలు, ముహూర్తాలంటే నమ్మకం ఉంది. అదీ సంప్రదాయాన్ని గౌరవించడంలో ఓ భాగం అనుకుంటా.

ఏపీలో స్టూడియో నిర్మిస్తా

ఆంధ్రప్రదేష్‌లో అందమైన లొకేషన్లు ఉన్నాయి. అయితే చిత్రసీమ మొత్తం హైదరాబాద్ నుంచి అమరావతికి తరలిపోవాలి అని కూడా కోరుకోకూడదు. తెలంగాణ అన్నా.. మన తెలుగువాళ్లే కదా? రెండు తెలుగు రాష్ట్రాలూ చిత్రసీమకు రెండు కళ్లు. మద్రాస్ నుంచి చిత్రసీమ హైదరాబాద్ రావడానికి ఓ బలమైన కారణం ఉంది. ప్రాంతీయత, భాష ప్రభావం చూపించాయి. ఇప్పుడు రెండూ తెలుగు రాష్ట్రాలే. ఎవరి ఇష్టం వాళ్లది. నేను మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఓ స్టూడియో నిర్మిస్తా.

> **జీవితం అమ్మానాన్నల భిక్ష. దీన్ని ఏ రకంగా నడిపించుకోవాలన్నది మన చేతుల్లో ఉంటుంది. అందుకే 'సుచిత్వం మాతృరూపేణా..' అంటూ ఓ శ్లోకం చెబుతారు పెద్దలు. మాతృమూర్తి వల్ల సుచిత్వం అబ్బుతుంది. సంస్కారం, ధర్మాధర్మాల పట్ల విచక్షణ ఇవన్నీ నాన్న దగ్గర్నుంచి నేర్చుకుంటాం. పరిపాలన దక్షత, దర్పణం.. ఇవన్నీ వంశపారంపర్యంగా వస్తాయి. కీర్తి ప్రతిష్టలు, గౌరవం మనకు మనమే సంపాదించుకోవాలి.**
>
> **"కొన్నిసార్లు 'ఈ సినిమా ఆడుతుంది' అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేయొచ్చు. అలా నేను అనుకున్న ప్రతీ సినిమా ఆడింది. 'సమరసింహారెడ్డి' షూటింగ్ కర్నూలు పరిసరాల్లో జరిగింది. జయప్రకాష్‌రెడ్డి చేయి నరికి.. కొన్ని డైలాగులు చెప్పా. యూనిట్‌లో సభ్యులే కాదు, ఆ షూటింగ్ చూడ్డానికి వచ్చిన వాళ్లంతా చప్పట్లు కొట్టారు. దర్శకుడు బి.గోపాల్‌ని పిలిచి.. 'ఈ సినిమా ఏ స్థాయిలో ఆడుతుందో చూడు.. దీనికి ఆకాశమే హద్దు' అన్నాను. అదే జరిగింది. 'జై సింహా' విషయంలోనూ ఇలాంటి అనుభవాలు ఎదురయ్యాయి. పతాక సన్నివేశాలు తీస్తున్నప్పుడు సెట్లో ఉన్నవాళ్లంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. డబ్బింగ్ చెబుతున్నప్పుడు సహాయ దర్శకులు ఏడ్చేశారు. 'ఏంటి? ఏమైంది?' అని అడిగా. 'ఏం సెంటిమెంట్ సార్.. అదిరిపోయింది' అని కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పారు.**

❖ **ప్రపంచ తెలుగు మహాసభల్లో మాతృభాష గొప్పదనం గురించి ఆకట్టుకునేలా మాట్లాడారు.. భాషపై మమకారం ఎప్పటిది?**

మొదటి నుంచి తెలుగు అంటే చాలా ఇష్టం. అది మన భాష.. మన జీవితం. దాన్ని గౌరవించుకోవాలి. భాషలోని సొగసు తెలుసుకొంటే దాని అందాన్ని ఇంకా పరిపూర్ణంగా ఆవిష్కరించుకోగలం. చాలా విషయాల్లో నాకు రామానుజాచార్యులు స్ఫూర్తి. 'అష్టాక్షరి మంత్రం ఎవ్వరికీ చెప్పొద్దు. విన్నవాళ్లు స్వర్గానికి వెళ్తారు. చెప్పినవాళ్లు నరకానికి వెళ్తారు' అని గురువు హెచ్చరించినా.. 'నేను నరకానికి వెళ్తే వెళ్తాను.. ఇంతమందిని స్వర్గానికి పంపుతున్నా కదా' అంటూ 'ఓం నమో నారాయణయ' అంటూ ఎలుగెత్తి చాటాడు ఆయన. చదువు, సంపాదించుకున్న జ్ఞానం మన కోసం కాదు. పది మందికీ పంచాలి. అప్పుడే సార్థకత. అందుకే సినిమాలు, సభల ద్వారా నాకు తెలిసిన విషయాల్ని పదిమందికీ చెబుతుంటా.

❖ **పద్యాలు బాగా చెబుతారు.. ఎలా సాధన చేసేవారు?**

నాకు తెలుగు భాష, పద్యాలు, పురాణాల గురించి చెప్పడానికి ప్రత్యేకంగా ఓ మాస్టారుని నియమించారు. వాటికి సంబంధించిన విషయాలు కొన్ని నాన్నగారి బయోపిక్‌లో చెప్పబోతున్నాం. బడ్డపాటిగారని ఓ మాస్టారు ఉండేవారు. కొన్ని సినిమాల్లో వేషాలేశారు. ఆయన తెలుగు బ్రహ్మాండంగా చెప్పేవారు. పద్యాలు నేర్పారు. తిరిగి అలానే చెప్పకపోతే తొడపాశం పెట్టేవారు. ఆ భయం కొద్దీ తెలుగు పద్యాలు కంఠతా పట్టేవాడ్ని. నాన్నగారి సినిమాలు చూడ్డం మొదలెట్టాక భాషపై ప్రేమ పెరిగింది.

❖ **మన భాష, సంస్కృతి గురించి ఎన్టీఆర్ ఎప్పుడైనా చెప్పేవారా?**

ఆయనకు అంత సమయం ఉండేది కాదు. ఆయన చెన్నైలో సినిమాల హడావిడిలో ఉండేవారు. నేను హైదరాబాద్‌లో. ఎప్పుడైనా కలవాలనుకుంటే షూటింగులకు వెళ్లేవాడ్ని. అక్కడ పలకరించి పంపేసేవారు. దృష్టి ఎప్పుడూ చేసే పనిపైనే నిమగ్నమై ఉండాలి అనేది నాన్నగారి సిద్ధాంతం. మేమంతా కనిపిస్తే.. సినిమాలపై నుంచి ధ్యాస మళ్లుతుందేమో అని ఆయన భయం.



❖ **జానపదాలు, పౌరాణికాలు, సాంఘికాలు.. ఇలా మీ ఎన్టీఆర్ అన్నీ చేసేశారు. వీటిలో ఏ సినిమాలు మీకు బాగా నచ్చేవి?**

పౌరాణికాలు పెద్దగా చూసేవాడ్ని కాదు. దానికో కారణం ఉంది. చిన్నప్పుడే నాకు పద్యాలు, శ్లోకాలు అన్నీ కంఠతా వచ్చేశాయి. అవన్నీ ఓ శ్రుతిలో పాడుకోవడం అలవాటు. నాన్నగారి సినిమాలు కొన్నింటిలో నాకు తెలిసిన శ్లోకాలు, పద్యాలు వేరే శ్రుతిలో వినిపించేవి. అలాంటి చోట.. 'అదేంటి? ఇక్కడ పాజ్ ఇచ్చారు.? అలా ఇవ్వకూడదు కదా' అంటూ నాలో చాలా సందేహాలు వచ్చేస్తుంటాయి. ఇక ఆ తరవాత ఆ సన్నివేశాన్ని సరిగా ఆస్వాదించలేకపోయేవాడ్ని. అందుకే.. నాన్నగారి పౌరాణికాల కంటే సాంఘికాలు, జానపదాలు ఎక్కువగా చూస్తుంటా. కొన్ని కొన్ని సినిమాల్లో 'నిజమైన ఎన్టీఆర్' కనిపిస్తుంటారు. అంటే ఆయన బయట ఎలా ఉంటారో, సినిమాల్లోనూ అలా కనిపిస్తారన్నమాట. అలాంటి సినిమాలంటే చాలా ఇష్టం.

❖ **మోక్షజ్ఞ విషయంలోనూ మీరు ఇలానే ఉన్నారా?**

నా విషయంలో నాన్నగారు ఎలా వ్యవహరించారో, నేను నా బిడ్డ విషయంలోనూ అలానే ఉన్నా. దగ్గర కూర్చోబెట్టుకుని ఏవీ రుద్దను. అవన్నీ తనకు తానుగా తెలుసుకోవాలి. భాషపై, మన సంస్కృతిపై తనకు తానుగా ఇష్టం పెంచుకోవాలి. పెంచుకుంటాడు కూడా. నందమూరి వంశం నుంచి వచ్చాడు కదా! (నవ్వుతూ)

❖ **అనర్గళంగా సంభాషణలు చెబుతుంటారు... ఇదెలా సాధ్యమైంది?**

అంతా మా నాన్నగారి ప్రభావమే. తండ్రయినా గురువైనా ఆయనే. ఆయన సినిమాలు చూస్తూనే పెరిగా. ఇప్పటికీ చెబుతా.. నేను నాన్నగారి సినిమాలు తప్ప ఏవీ చూడను. నా లైబ్రరీలో నాన్నగారి సినిమాలు కాకుండా వేరే కథానాయకుడి చిత్రాలూ ఉన్నాయంటే... అవి ఏఎన్నార్‌వి మాత్రమే. అవీ పరిమితంగానే. నాన్నగారి సినిమా అంటే అది ఎలా ఉన్నా.. చూడాల్సిందే. ప్రతీరోజూ.. ఆయన సినిమా చూసే నిద్రపోతా. సంభాషణలు ఎలా పలకాలి? ఆ సమయంలో మన హావభావాలు ఎలా ఉండాలి? ఇవన్నీ ఆయన నేర్పినవే. అనర్గళంగా సంభాషణలు చెప్పే విద్య అంటారా? నేనేంటి? నాన్నగారి అభిమానులు అంతా ఆయన సంభాషణలు పొల్లుపోకుండా వల్లెవేస్తుంటారు. నేనూ ఆయన అభిమానినే కదా?

❖ **ఇందులో మీ పాత్ర ఎంత ఉంటుంది? మోక్షజ్ఞ కనిపిస్తాడా?**

నేనుండేది ఒకట్రెండు సన్నివేశాలే. నా పాత్రకు అంతగా ప్రాధాన్యం లేదు. అందులో ఎవరు కనిపిస్తారు? మిగిలిన పాత్రలేంటి? అనే విషయంలో ఇంకా ఆలోచించలేదు. ఈ చిత్రాన్ని బాలీవుడ్‌కీ తీసుకెళ్తాం. నాకు హిందీ బాగా వచ్చు. తెలుగుకంటే చాలా బాగా మాట్లాడతా.

❖ **'జై సింహా'లో అంతలా డాన్సు ఎలా సాధ్యమైందనిపిస్తోంది?**

నాకున్న అభిమానులు ఏ కథానాయకుడికీ లేరు. రిజిస్టర్ అయిన అభిమాన సంఘాల్ని చూస్తే ఈ విషయం అర్థం అవుతుంది. వాళ్లందరినీ సంతృప్తి పరచడం నా బాధ్యత. అయితే సినిమాకొచ్చేది అభిమానులు ఒక్కరే కాదు... కుటుంబ ప్రేక్షకులు, యువత కూడా. వాళ్లందరినీ దృష్టిలో ఉంచుకోవాల్సిందే. 'నాకు ఇలాంటి స్టెప్పులు కావాలి' అని ఎప్పుడూ అడగను. 'బాలయ్య లాంటి మాస్ హీరో దొరికాడు.. మమ్మల్ని మేం నిరూపించుకోవాలి' అని మాస్టర్లు అనుకుంటుంటారు. జానీ మాస్టర్ అలా భావించే డాన్సులు కంపోజ్ చేశారు. నేనూ నా వంతు కష్టపడుతుంటా.

❖ **పాత్రలో రెండు రకాల షేడ్స్, ఇద్దరు ముగ్గురు కథానాయికలు, ఓ ఫ్లాష్ బ్యాక్... ఇవన్నీ మీ సినిమాల్లో ఉండాల్సిందేనా?**

అలాంటి సినిమాలన్నీ బాగా ఆడాయి కదా? అభిమానులకు నన్ను అలా చూడడం ఇష్టం. కొన్ని సినిమాల్ని ప్రత్యేకంగా అభిమానుల కోసమే చేస్తుంటా. 'పైసా వసూల్' చూడండి. పూరికో శైలి ఉంది. తన కథలో నన్ను నేను ఊహించుకున్నా. 'అభిమానులకు తప్పకుండా నచ్చుతుంది' అనుకునే ఆ సినిమా ఒప్పుకున్నా. నేను దర్శకుడ్ని నమ్ముతా. 'ఈ కథ మీకు బాగుంటుంది' అని చెప్పి, నన్ను మెప్పిస్తే ఇంకేం ఆలోచించను.

❖ **నంది అవార్డుల పండగ ఎప్పుడు?**

మార్చిలో ఉంటుంది. అన్ని అవార్డులూ ఒకేసారి ఇస్తాం. రెండు రోజుల పాటు ఓ పండగలా నిర్వహిస్తాం. అవార్డులు వచ్చినవాళ్లే కాదు.. చిత్రసీమకు చెందిన వాళ్లంతా ఈ వేడుకకు హాజరవుతారు. ఇది తెలుగు సినిమా పండగ.

– మహమ్మద్ అన్వర్, (ఫొటోలు: మధు)

ఎన్టీఆర్ ఆత్మకథని సినిమాగా తీయాలని ఎందుకనుకున్నారు?

ఆయన తెలుగు జాతికి మాత్రమే చెందినవాడు కాదు. దేశం గర్వించదగిన మహనీయుడు. ఓ నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన ముద్ర సుస్పష్టం. ఆయన చేపట్టిన కార్యక్రమాలనే ఇప్పుడు పేర్లు మార్చి జనంలోకి తీసుకెళ్తున్నారు రాజకీయ నాయకులు. ఆయన చరిత్ర అందరికీ తెలియాలి. ఓ కొడుకుగా అది నా బాధ్యత. అందుకే 'ఎన్టీఆర్' బయోపిక్‌ని మొదలెట్టాం.

ఈనాడు సినిమా


అనుష్క


కాజల్

వీళ్లంతా రెండో రకం!

అప్పట్లో సావిత్రి.. ఇప్పుడు ???
అప్పట్లో సౌందర్య.. ఇప్పుడు???
అప్పట్లో విజయశాంతి... మరి ఇప్పుడు??

ఈ ప్రశ్నార్థకాలే చిత్రసీమలో ప్రస్తుతం నాయిక స్థానానికి అద్దం పడుతుంటాయి. కథానాయికలు రెండు రకాలు. ఓ రకం గ్లామర్ పాత్రలతో సర్దుకుపోతుంటారు. రెండోరకం గ్లామర్ పాత్రలు చేస్తూనే అప్పుడప్పుడూ తమలోని నటిని సంతృప్తిపరచుకునే పాత్రల వైపు దృష్టి సారిస్తుంటారు.

సావిత్రి.. వన్ అండ్ ఓన్లీ! ఆమె స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరు. ఆమె తరవాత ఎంతోమంది నటీనమణుల్ని చూసింది చిత్రసీమ. జయప్రద, జయసుధలది ఓ తరం. ఒకరు అందంతో, మరొకరు అభినయంతో కట్టిపడేశారు. మరో తరంలో సౌందర్య ఓ వెలుగు వెలిగింది. అగ్ర కథానాయకులందరితోనూ జోడీ కట్టింది. గ్లామర్ తారగా వెలుగుతూనే అభినయ ప్రధానమైన పాత్రలు చేసింది. విజయశాంతి కూడా అంతే! కమర్షియల్ కథానాయికగా తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్నా.. నటిగా తన 'కర్తవ్యం' మర్చిపోలేదు. హీరోలకు ఏమాత్రం తగ్గకుండా ఫైటింగులు గట్రా చేసి 'లేడీ సూపర్‌స్టార్' అనిపించుకుంది. ఈతరంలో నయనతార, అనుష్క, ఛార్మి, భూమిక, అంజలి... వీళ్లంతా నాయికా ప్రాధాన్య చిత్రాలపై దృష్టి సారించడానికి ఓ విధంగా విజయశాంతిలాంటి కథానాయికలే ఆదర్శం.


తమన్నా

ప్రతి సీజన్‌లోనూ నాయికా ప్రాధాన్యం ఉన్న సినిమాలు వస్తుంటాయి. వాటిలో నిలబడేవి ఉన్నా, లేకున్నా - ఆ తరహా కథలకు కొరత ఉండదు. కాకపోతే గత కొంతకాలంగా 'హీరోయినిజం' కాస్త తగ్గింది. అగ్ర కథానాయికలంతా రిలాక్స్ అయిపోయారు. ఫక్తు వ్యాపార చిత్రాలు చేసి సరిపెట్టుకుంటున్నారు. అయితే కథ 'డిమాండ్' చేసినప్పుడు వాళ్లు రంగంలోకి దిగడం తప్పడం లేదు. అనుష్క మనసు ఇప్పుడు నాయికా ప్రాధాన్యం ఉన్న సినిమాలపైనే ఉంది. ప్రస్తుతం 'భాగమతి'గా సిద్ధం అవుతోంది. తెలుగులో ఇక మీదట తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న కథలనే ఒప్పుకోవాలని గట్టిగా తీర్మానించుకుంది. నయనతారదీ ఇదే దారి. డ్యూయెట్లు పాడుకునే పాత్ర అయితే ఏమాత్రం మొహమాటం లేకుండా 'నో' చెప్పేస్తోంది. తమన్నా, కాజల్‌లు ఇప్పుడిప్పుడే ఈ తరహా చిత్రాలకు అలవాటు పడుతున్నారు. నాని నిర్మాతగా తెరకెక్కుతున్న 'అ'లో కాజల్ ఓ కీలక పాత్ర పోషిస్తోంది. నిత్య మేనన్, రెజీనా, కాజల్.. ఈ మూడు పాత్రలే ఈ కథకు మూలం. మరోవైపు తమిళంలో 'క్వీన్'గా కనిపించబోతోంది. తమన్నా 'అభినేత్రి'లో నటించింది. త్వరలోనే తెలుగు 'క్వీన్'గా సందడి చేయబోతోంది.


కీర్తి సురేష్


నవతరం కథానాయికలు ఈ విషయంలో కాస్త ఆచితూచి అడుగులేస్తున్నారు. రకుల్‌ప్రీత్ సింగ్, రాశీఖన్నా వీళ్లంతా 'లేడీ ఓరియెంటెడ్ కథలకు సిద్ధమే' అని చెప్పినా.. ఆ తరహా ప్రయత్నాలకు ధైర్యం చేయడం లేదు. విజయాలు సాధిస్తే సరి, లేదంటే... కమర్షియల్ సినిమాలూ దూరం అవుతాయన్నది వాళ్ల భయం. కీర్తి సురేష్‌కి ఓ అరుదైన అవకాశం దక్కింది. 'మహానటి' సావిత్రిగా కనిపించబోతోంది. సావిత్రిగా కీర్తి సురేష్ అనగానే కొన్ని సందేహాలు పుట్టుకొచ్చాయి. సావిత్రి పాత్రకు కీర్తి ఎలా నప్పుతుంది? అని పెదవి విరిచారు. కానీ.. ఫస్ట్ లుక్ పేరిట వదిలిన చిత్రాలు చూస్తే కీర్తి సురేష్ తప్ప ఆ పాత్రని ఈతరంలో ఎవ్వరూ చేయలేరేమో అన్నంత అందంగా కుదిరిపోయింది. 'మహానటి'తో కీర్తి నిరూపించుకుంటే.. తను మరో సౌందర్య అనిపించుకోవడం ఖాయం. సమంత కూడా ఇప్పుడిప్పుడే ఈ తరహా పాత్రలపై మనసు పెడుతోంది. 'యూ టర్న్' అనే కన్నడ చిత్రాన్ని సమంతతో రీమేక్ చేస్తారని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఆ కథ చేసినా, చేయకపోయినా.. సమంత ప్రయాణం మారడం ఖాయం. ఇప్పటికే 'రాజుగారి గది 2'లో ఓ విభిన్న పాత్రలో మెప్పించింది. ఇక మీదటా.. కథాబలం ఉన్న పాత్రల్లోనే కనిపించబోతోందట. ''రెగ్యులర్ సినిమాలైతే ఇక మీదట చేసేది లేదు. కథానాయికగా ప్రయాణం సాగించిన తొలి రోజుల్లో అయితే నాకు మరో ప్రత్యామ్నాయం ఉండేది కాదు. ఇప్పుడూ అలాంటి సినిమాలే చేస్తే ఇన్నేళ్ల నా అనుభవానికి విలువ ఇవ్వనట్టే'' అని చెబుతోంది సమంత. హారర్, థ్రిల్లర్ ట్రెండ్ వల్ల కొన్నాళ్లపాటు కథలన్నీ నాయికల చుట్టూ తిరిగాయి. ఇప్పుడు వాటిపై కూడా ప్రేమ తగ్గుతోంది. మరో కొత్త జోనర్ పుట్టుకురావాలి. లేదంటే 'భాగమతి', 'మహానటి'లాంటి చిత్రాల్లో ఒక్కటైనా మెరవాలి. అప్పుడే.. హీరోయినిజం మరోసారి వర్ధిల్లుతుంది.


సమంత

అప్పటి ముచ్చట!

ఇద్దరూ ఇద్దరే


కె.వి.రెడ్డి


మార్కస్ బార్‌ట్లీ

క్రమశిక్షణ అంటే ఇద్దరికీ ప్రాణం. ఒకాయన చిత్ర దర్శకుడు... మరొకాయన ఛాయాగ్రాహకుడు.. ఇద్దరూ కలిసి అద్భుతాలు సృష్టించారు. పాతాళ భైరవి, మాయాబజార్, జగదేకవీరుని కథ... ఇవి చాలు ఆ కాంబినేషన్ ఎంత గొప్పదో చెప్పడానికి !

వారే కె.వి. రెడ్డి... మార్కస్ బార్‌ట్లీ. ఆ ఇద్దరూ ఉంటే సెట్‌లో అందరూ ఊపిరి బిగబట్టుకొని పనిచేసే వాళ్లు!

బార్‌ట్లీ షూటింగ్ సమయానికి చాలా ముందు వచ్చేవారు. ఆయన రాగానే అక్కడ లైటింగ్ వాళ్లు తప్ప మరొకరు ఉండకూడదు. సెట్ మొత్తం ఆయనకి అప్పగించి మిగిలిన వాళ్లు బయటకు వెళ్లిపోవాల్సిందే! ఆయన పూర్తిగా సంతృప్తి చెందే వరకు లైటింగ్‌తో ప్రయోగాలు చేసి, సమయానికి రెడీ అనేవారు. ఒకసారి పని మొదలుపెడితే అది పూర్తి అయ్యేవరకు ఆయన కెమెరా విడిచిపెట్టేవారు కాదు. వేవ్ లెంగ్త్ కలిగిన దర్శకుడు కె.వి. రెడ్డి పని విషయంలో, క్వాలిటీ విషయంలో రాజీ పడేవారు కాదు. ఏయన్నార్, ఎన్టీఆర్ లాంటి వారూ ఆయన వద్ద చేతులు కట్టుకొని ఉండాల్సిందే! సెట్టింగ్ ఆయన పాలిట పూజాగృహం... అక్కడ నిశబ్దంగా ఉండాలి. చివరికి నిర్మాతలైన నాగిరెడ్డి, చక్రపాణి లాంటి వారిని సైతం కె.వి. రెడ్డి ఖాతరు చేసేవారు కాదట. ఓ సారి మాయాబజార్ షూటింగ్ జరుగుతోంది. సెట్‌లో కె.వి. రెడ్డి స్క్రిప్ట్ చూసుకుంటూ పాత్రధారుల చేత రిహార్సల్స్ చేయిస్తున్నారు. ఓ మూలగా నిర్మాతలైన నాగిరెడ్డి, చక్రపాణి మాట్లాడుకుంటున్నారు. వారి వైపు కె.వి. రెడ్డి సీరియస్‌గా చూసారు. ఇంకా మాటలు ముగియకపోవడంతో ఎలాంటి మొహమాటం లేకుండా 'ఉడ్ యూ ప్లీజ్ అవుట్...' అని గొంతు పెంచారట. కె.వి. గారికి బీపీ ఎక్కువ. అందుకే మాట్లాడకుండా నాగిరెడ్డి, చక్రపాణి బయటకు వెళ్లిపోయారట. మరోసారి సెట్ బయట ఏఎన్నార్, ఎన్టీఆర్, గుమ్మడి, నాగిరెడ్డి, చక్రపాణి కూర్చున్నారు. ఏయన్నార్ ఏదో జోక్ వేయగానే అందరూ గొల్లుమని నవ్వారు. వెంటనే లోపల నుంచి కె.వి. రెడ్డిగారి నుంచి సింహగర్జన వినిపించింది. దాంతో అందరూ సైలెంట్ అయిపోయారట.

సావిత్రి ఎందుకు రాలేదంటే...


సావిత్రి

మూగమనసులు షూటింగ్ గోదావరి మీద జరుగుతున్న రోజులవి. 'ఈనాటి ఈ బంధమేనాటిదో...' పాటను లాంచిపై ఏయన్నార్, సావిత్రిల మీద చిత్రీకరిస్తున్నారు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. పి.ఎల్. రాయ్ కెమెరా. పాటలో 'ఎవరు పిలిచారనో...' అనే చరణంలో సావిత్రి ఓ పక్కకు బాగా వంగి అభినయం చేస్తున్నారు. లాంచి తాలూకు ప్రొఫెల్లర్‌కు ఆవిడ చీర కొంగు చిక్కింది. లోపల పళ్ల చక్రం సావిత్రిని బలంగా గుంజింది. ఆ మహానటి లాంచీ మీంచి గోదావరిలో పడిపోయారు. అయినా సమయస్ఫూర్తితో ఆమె మునిగిపోకుండా లాంచి అంచును పట్టుకుని వేలాడారు. లాంచి ఆగిపోయింది. మరో పడవలో ఉన్న యూనిట్ సభ్యులు సావిత్రికి చేయూతనిచ్చేందుకు లాంచీలోకి దూకారు. ఆమెకు తాడును అందించారు. సావిత్రి తాడు అందుకున్నారు. కానీ పైకి రావటం లేదు. రండమ్మా అంటూ సహాయకులు అరుస్తున్నారు. అయినా ఆవిడ నీట్లోంచి పైకి రావటం లేదు. పరిస్థితిని ఏయన్నార్ గ్రహించారు. లాంచీలో ఓ మూల ఉన్న కేన్వాస్ పట్టాను సావిత్రికి అందించారు. కాసేపటికి ఆ కాన్వాస్ పట్టాను చుట్టుకుని సావిత్రి బయటకు వచ్చారు. ఆవిడ చీర మొత్తం లాంచీ ప్రొఫెల్లర్‌కు చుట్టుకుపోయింది. అప్పుడు - నీటిలోంచి బయటకు రావడానికి సావిత్రి ఎందుకు తటపటాయించారో, ఏయన్నార్ తెలివిగా కాన్వాస్ పట్టాను ఎందుకు అందించారో సిబ్బందికి అర్థమయింది.

– శ్రీవత్స

పంచ్ డైలాగ్

అధములం కాదు ప్రథములం... బడుగు జాతి కాదు, తెలుగు జాతి!

చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి
- పంపినవారు: టి.సూర్యకుమారి, ప్రకాష్‌నగర్

ఇకపైనా అదే దారిలో..!


బీఏ రాజు

"ఇంటిల్లిపాదీ కలిసి చూసే వినోదాత్మక చిత్రాలే నిర్మిస్తాం. ఆర్జే సినిమాస్ సంస్థ ప్రధాన ఉద్దేశం ఇదే'' అన్నారు బీఏ రాజు. గతేడాది 'వైశాఖం' చిత్రాన్ని అందించారాయన. ఇప్పుడు మరో ప్రాజెక్టుకు రంగం సిద్ధం అవుతోంది. ఆదివారం బీఏ రాజు పుట్టిన రోజు. ఈ సందర్భంగా శనివారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ''లవ్‌లీ', 'వైశాఖం'.. ఇలా ఎప్పుడూ కథాబలమున్న చిత్రాలే మా సంస్థ నుంచి వస్తున్నాయి. ఈ ఏడాదీ కుటుంబ కథా చిత్రమే అందిస్తాం. బి.జయ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం కథ సిద్ధమవుతోంది. మే, జూన్‌లలో సినిమా మొదలవుతుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం. నిర్మాతగా పదిహేనేళ్లు గడిచాయి. మా సంస్థ నుంచి ప్రతిభావంతులైన నటీనటుల్ని, సాంకేతిక నిపుణుల్ని చిత్రసీమకు పరిచయం చేశాం. ఇక మీదటా ఇదే దారిలో కొనసాగుతామ''న్నారు.


జ్ఞానవేల్ రాజా, వంశీ, విఘ్నేష్ శివన్, రమ్యకృష్ణ, కీర్తి సురేష్, సూర్య, అల్లు అరవింద్, మారుతి

'గ్యాంగ్'కు నా సొంత గొంతు వినిపించాను

సూర్య నటించిన ద్విభాషా చిత్రం 'గ్యాంగ్'. కీర్తి సురేష్ నాయిక. రమ్యకృష్ణ కీలకపాత్రధారి. విఘ్నేష్ శివన్ దర్శకుడు. జ్ఞానవేల్ రాజా నిర్మాత. తమిళ, తెలుగు భాషల్లో ఈనెల 12న విడుదలవుతోంది. తెలుగులో యు.వి.క్రియేషన్స్ సంస్థ విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అరవింద్ టీజర్, ఆడియో సీడీని ఆవిష్కరించారు. తొలి సీడీని సూర్య స్వీకరించారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''గజిని' సినిమా నుంచీ సూర్యతో అనుబంధం ఏర్పడింది. ఆయనతో ఐదేళ్లుగా సినిమా తీయాలి అనుకుంటున్నాను. మిత్రులైన జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, బన్నీ వాసులను గ్యాంగ్ అని పిలుస్తుంటాను. సినిమాని తీసి నిలబెట్టేవాళ్లలో వంశీ ఒకడు. విఘ్నేష్ శివన్ చక్కగా తెరకెక్కించాడ''న్నారు. సూర్య మాట్లాడుతూ ''ఈ నిర్మాతలు నాకు గొప్ప అవకాశాన్ని కల్పించారు. రమ్యకృష్ణ పాత్ర ప్రేక్షకుల్ని అలరిస్తుంది. కీర్తి సురేష్ మెప్పిస్తుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు తీర్చిదిద్దిన విధానం కొత్తగా ఉంటుంది. తొలిసారిగా ఈ సినిమా కోసం తెలుగులో నా సొంత గొంతుని వినిపించాను. ప్రేక్షకుల్ని సంతృప్తిపరుస్తాను అనుకుంటున్నాను. 'అజ్ఞాతవాసి'తోపాటు మా చిత్రానికీ స్వరాలు అందించారు అనిరుధ్. రెండూ సంక్రాంతికి విడుదలవుతున్నాయి. రెండింటినీ ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. రమ్యకృష్ణ మాట్లాడుతూ ''నాకు ఎంతో నచ్చి చేసిన ఈ చిత్రంలోని పాత్ర ప్రేక్షకులకు నచ్చుతుంది. యువతరాన్నే కాదు కుటుంబ ప్రేక్షకులనూ మెప్పించే విభిన్నమైన చిత్రంగా దర్శకుడు చిత్రాన్ని మలిచార''న్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా 'అజ్ఞాతవాసి'కి తోడుగా విడుదలవుతోన్న ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతుందని ఆకాంక్షించారు కీర్తి సురేష్. ''జనవరి 12న విడుదలయ్యే మా 'గ్యాంగ్'కు ప్రేక్షకులు గ్యాంగ్‌లు గ్యాంగ్‌లుగా థియేటర్లకి రావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు విఘ్నేష్ శివన్. కార్యక్రమంలో మారుతి, బన్నీ వాసు, వంశీ, వెంకటేశ్వర్లు, శిరీష్, లక్ష్మణ్, శశాంక్ వెన్నెలకంటి, జ్ఞానవేల్ రాజా, రేవంత్, కె.కె.రాజశేఖర్ పాండే తదితరులు పాల్గొన్నారు.

గీతోపదేశం

ఎక్కడో లేదులే దేవుడు
నువ్వెక్కడుంటే అక్కడే ఉన్నాడు
మమతలున్న మనసులో కొలువుంటాడు
కరుణ గల కళ్లల్లో కనిపిస్తాడు

గీతం: ఎక్కడో లేదులే దేవుడు...
చిత్రం: మరపురాని మనిషి
రచన: ఆత్రేయ
- పంపినవారు:
ఎ.గోపాల్, కోడూరు


మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్
మెయిల్ ఐడీ:
cinema@eenadu.net


శ్రియ

నేను అనుకున్నదే చెబుతా!

మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'గాయత్రి'. విష్ణు, శ్రియ జంటగా నటిస్తున్నారు. మదన్ రామిగాని దర్శకుడు. ఫిబ్రవరి 9న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శ్రియ ప్రచార చిత్రం విడుదలైంది. 'నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు, తర్వాత సంగతి తర్వాత' అనే సంభాషణ ఆ ప్రచార చిత్రంపై ఉంది. మధ్య తరగతి గృహిణిగా శ్రియ ఇందులో ప్రాధాన్యమున్న ఓ కీలక పాత్రని పోషించినట్టు చిత్రబృందం తెలిపింది. నిఖిల విమల్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కథ, మాటలు: డైమండ్ రత్నబాబు, ఛాయాగ్రహణం: సర్వేశ్ మురారి, కళ: చిన్న, సంగీతం: ఎస్.ఎస్.తమన్.


మమ్ముట్టి

ఒక వీధిలో ఏం జరిగింది?

మమ్ముట్టి కథానాయకుడిగా ప్లే హౌస్ మోషన్ పిక్చర్ పతాకంపై తెరకెక్కిన చిత్రం 'స్ట్రీట్ లైట్స్'. శ్యామ్‌దత్ సైనుద్దీన్ దర్శకత్వం వహించారు. ఇటీవలే టీజర్‌ని విడుదల చేశారు. ''క్రైమ్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన చిత్రమిది. తెలుగుతోపాటు తమిళం, మలయాళంలోనూ అదే పేరుతో విడుదల చేస్తున్నాం. శ్యామ్ దత్ చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం బాగుంటుంది. ఒక వీధిలో ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. మమ్ముట్టి సినీ ప్రయాణంలో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ''ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: ఆదర్శ్ అబ్రహాం.


రంజిత్


తారా 'జువ్వ'

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా నటిస్తున్న చిత్రం 'జువ్వ'. త్రికోటి పేట దర్శకత్వం వహిస్తున్నారు. డా.భరత్ సోమి నిర్మిస్తున్నారు. ఎమ్.ఎమ్.కీరవాణి స్వరకర్త. చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే ప్రముఖ కథానాయకుడు చిరంజీవి చేతులమీదుగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని, టీజర్‌ని విడుదల చేయనున్నారు. ''కొత్త తరహా కథ, కథనాలతో రూపొందిన చిత్రమిది. 'దిక్కులు చూడకు రామయ్యా' చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించిన త్రికోటి పేట మరోసారి ఇంటిల్లిపాదినీ అలరించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల మూడోవారంలో పాటల్ని, ఫిబ్రవరిలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత. పోసాని కృష్ణమురళి, అలీ, సప్తగిరి, మురళీశర్మ, రఘుబాబు, ప్రభాకర్, విజయ్ చందర్, ఆనంద్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు: ఎం.రత్నం, పాటలు: అనంతశ్రీరాం, వశిష్ఠ.

రంగవల్లిక

18 చుక్కలు,
18 వరుసలు,


మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.






మునీశ్వరి,
శ్రీకాకుళం

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.





కృష్ణకుమారి ,
షాద్‌నగర్,
మహబూబ్‌నగర్

18చుక్కలు,
8వరుసలు.
8 వచ్చే వరకూ
సరిచుక్క

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అనాజ్‌పూర్,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

'నాన్న.. నాకెందుకు లేడమ్మా?'



'తేజావాళ్ల నాన్న ప్రతి సమ్మర్‌కీ టూర్‌కి తీసుకెళతాడట! మరి నాకెందుకు నాన్న లేడమ్మా?'

'నువ్వు కష్టపడుతున్నావ్.. సంపాదిస్తున్నావ్. మధ్యలో మావయ్య పెత్తనమెందుకమ్మా? అతనెందుకు నన్నూ, నిన్నూ కొట్టాలి?' 'మొన్నటి నుంచి నేను చదవలేకపోతున్నానమ్మా! పక్కింటి పిన్నీ నిన్నూ, ఆఫీసులోని అశోక్ అంకుల్‌ని కలిపి.. ఏదో అంటూంటే విన్నా!'

- ప్రశ్నలన్నీ ఇలాగే ఉండక్కర్లేదు. సందర్భాలు ఇవే కావాల్సిన అవసరం లేదు. కానీ నేటితరం ఒంటరితల్లులు పిల్లల నుంచి ఇంచుమించు ఇలాంటి ప్రశ్నలెన్నో ఎదుర్కోవాల్సి ఉంటోంది. వీటికి సమాధానం చెప్పకపోతే ఆ ప్రశ్నలు.. తల్లీ, పిల్లల మధ్య మానసిక కల్లోలానికీ కారణమవుతాయి. పిల్లల పెంపకం విషయంలో ఒంటరితల్లులు ఎదుర్కొనే ఈ కీలకమైన సవాళ్లని దాటడమెలా?

ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్థికంగా, సామాజికంగా నెగ్గుకొస్తున్న ఒంటరి తల్లులు.. ఉద్వేగపరంగా అంత నిబ్బరం చూపలేకపోతున్నారు. తీవ్రమైన మానసిక అలజడిలో పడి కొట్టుకుపోతున్నారు. ఆ ప్రభావం పిల్లల పెంపకంపైనా ఉంటోంది. ముందు అది వాళ్లలో ఎన్ని సమస్యలుగా బయటపడుతుందో.. దానికి కారణాలేమిటో చూద్దాం.

హింసాప్రవృత్తి : ఆ అమ్మాయి బీటెక్ చదువుతోంది. క్లాసులో చాలా మామూలుగానే ఉంటుంది కానీ.. ఇంట్లో మహా కోపిష్టి. ఎంత కోపమంటే వితంతువైన తల్లిపైనా చేయి చేసుకుంటుంది.

అడ్డొస్తే.. అమ్మమ్మా తాతయ్యలనీ వదలదు. ఆమెని నా వద్దకి కౌన్సెలింగ్‌కి తీసుకొచ్చారు. 'ఎందుకిలా ఉన్నావ్?' అని అడిగితే 'నా చిన్నప్పటి నుంచి మా ఇల్లు ఇలాగే ఉంది. ఎప్పుడూ కోపాలూ, అరుపులూ, ఏడుపులూ! అమ్మ నా చిన్నప్పుడు నన్నెంతగా కొట్టేదో..!' అని వాతలు చూపెట్టింది.

- కారణమేంటీ? : చిన్నప్పటి నుంచి ఇంట్లో ఉన్న ఆ హింస ఆ అమ్మాయి ప్రవర్తనని ఇలా మార్చింది. ఆ హింస ఎందుకుంది? ప్రధాన కారణం.. భాగస్వామి మరణం మిగిల్చిన దుఃఖం నుంచి ఆ తల్లి కోలుకోలేకపోవడం. ఆ ఆవేదనా, తండ్రి లేకుండా ఈ పిల్లని ఎలా పెంచుతానో ఏమోననే ఆందోళనా కలిసి కోపంగా వ్యక్తమైంది. అదే ఈ పాపపై హింసగా మారింది! దీన్నే డిఫ్లెక్షన్ అంటారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన, అతనికి దూరమైన తల్లిలో సాధారణంగా కనిపించే సమస్య ఇది!

డబ్బు నీళ్లలా : ఒంటరి తల్లి సంపాదనాపరురాలైతే ఆ పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. అబ్బాయిలు తలకుమించిన విలాసాల్లో ఉంటారు. అమ్మాయిలు హై-ఫై పేరుతో చెడుమార్గాలూ తొక్కుతుంటారు. వీళ్లలో కొందరు తల్లినీ ద్వేషించేవాళ్లుంటారు.

- కారణమేంటీ? : 'తండ్రి ప్రేమ లేదు కాబట్టి.. ఆ లోటు తెలియకుండా పెంచాలి!' అనే ఉద్దేశంతో చిన్నప్పటి నుంచే పిల్లలు అడిగిందల్లా తల్లులు కొనివ్వడం మొదలుపెడతారు. వాళ్లు ఏ కాస్త బాధపడ్డా అదంతా తన పెంపకం లోపమని అపరాధభావనకి లోనవుతారు. తల్లిలోని ఈ బలహీనత గమనించిన పిల్లలు.. చిన్నప్పటి నుంచే ఆమెని ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేస్తుంటారు. పెద్దయ్యాక అదే సమస్యగా మారుతుంది. మరి తల్లిపై ద్వేషమెందుకు? ఒంటరి తల్లులు పిల్లలపై మానసికంగా, ఉద్వేగపరంగా ఎక్కువగా ఆధారపడుతుంటారు. కానీ వాళ్లు టీనేజీలోకి వచ్చాక తమకంటూ ఏకాంతం(ప్రైవసీ) కోరుకుంటారు. అమ్మకి కాస్త దూరమవుతారు. అది పట్టించుకోని అమ్మ.. వాళ్లపై మరింత అధికారం చూపిస్తుంది. ఫలితంగా.. వాళ్ల ద్వేషాన్నీ చవిచూస్తుంది.

అమ్మాయిలలా అబ్బాయిలిలా : ఒంటరి తల్లి పెంపకంలో ఎదిగిన చాలామంది ఆడపిల్లల్లో పరాధీనత(సబ్‌మిసివ్‌నెస్) ఎక్కువగా ఉంటుంది. జీవితంలో ఏ కీలక నిర్ణయాన్నీ సొంతంగా తీసుకోలేరు. అబ్బాయిలు ఇందుకు విరుద్ధంగా ఉంటారు. వారిలో అహం భావం ఎక్కువగా ఉంటుంది. మహిళలెప్పుడూ తనకంటే లోకువనే భావనలోనే ఉంటారు.

- కారణమేంటీ? : 'నేను ఒంటరి ఆడదాన్నీ. మన కుటుంబాన్ని ఆదుకునేవాళ్లు ఎవరూ లేరు..!' అని పిల్లల ముందు తరచూ అంటూ ఉండటం.. బంధువుల ముందు అబలగా కనిపించడం ఇందుకో ప్రధాన కారణం. సహజంగా ఆడపిల్లలు తల్లిని చూసే ఎదుగుతారు కాబట్టి.. వాళ్లలోనూ ఆ ఆత్మన్యూనతే ఉంటుంది. పిరికిగా మారుతారు. అబ్బాయిలు ఇందుకు భిన్నంగా.. 'ఇంట్లో నేనొక్కణ్నే మగాణ్ని. అమ్మకి, చెల్లికీ అంత శక్తీ, జ్ఞానం లేవు కాబట్టి నేనే చూసుకోవాలి!' అనే ధోరణిలో పెరుగుతారు. టీనేజీకి వచ్చినప్పటి నుంచే అందర్నీ అదుపాజ్ఞల్లో పెట్టాలనుకుంటారు. క్రమంగా అది అహంకారంగా మారుతుంది.

అందరికీ కాస్త ఎడంగా! : ఒంటరి తల్లులున్న పిల్లల్లో స్టేజీ ఫియర్, నలుగురి మధ్య కలవలేకపోవడం(సోషల్ ఫియర్), కీలకమైన సమయాల్లో మాట్లాడలేకపోవడం వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. చదువులోనూ వెనకబాటుతనం ఉంటుంది. ఏ విషయానికీ సాహసం చేయరు వీళ్లు!



- ఇదెలా వస్తుంది? : ఒంటరి తల్లులు.. ముఖ్యంగా వితంతువులైతే శుభకార్యాలకి దూరంగా ఉండటం, బంధువుల ఇంటికి తానూ వెళ్లకుండా పిల్లల్ని బయటకు పంపకుండా కట్టడి చేయడం ఓ కారణం. రెండో కారణం.. తన తల్లి పరాయి మగాడితో సన్నిహితంగా ఉంటోందనే వదంతులు. ఇది సున్నితమైందే కాదు.. చాలా తీవ్రమైంది కూడా! పిల్లల సామాజిక ప్రవర్తనపై దుష్ప్రభావం చూపే పెద్ద అంశం ఇది.



డాక్టర్ చల్లా గీత,
మానసిక నిపుణురాలు

ఈ ప్రశ్నలకి జవాబు మీరే కావాలి!

'ఆయన ఎక్కడికి వెళ్లారమ్మా?' - చిన్నారులు ఇలా అడగ్గానే 'మన తలరాత తల్లీ!' అని బొటబొటా కన్నీరు కార్చేయకూడదు. 'ఊరెళ్లాడమ్మా.. నువ్వు పెద్దయ్యాక వస్తారు!' అని అబద్ధమూ చెప్పకూడదు. నిజమే చెప్పండి.. ఉన్న విషయమేంటో నిజాయతీగా పంచుకోండి. మంచోచెడో వాళ్లతో ఇలా పారదర్శకండా ఉండటం జీవితాంతం కొనసాగేలా చూడండి. ఆ నిబ్బరం, పిల్ల లతో పారదర్శకత ఒంటరి తల్లులకి ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలు!

'మావయ్య పెత్తనమేంటీ' - ఇది న్యాయమైన ప్రశ్న! సాధారణంగా ఒంటరి తల్లులున్న ఇంట్లో అన్నదమ్ములే కాదు.. ఆమె తల్లీ, తండ్రి జోక్యం కూడా ఎక్కువగా ఉంటుంది. వీలున్నంత వరకూ ఆ జోక్యాన్ని తగ్గించేందుకే మనం ప్రయత్నించాలి.

'వాళ్ల నాన్న టూర్‌కి తీసుకెళతాడు. మరి నాకు?'

- ఓ తండ్రి పోషించే పాత్రని మీరు తీసుకోవడానికే ప్రయత్నించండి. ఏడాదికోసారి పర్యటనలూ, వారానికోసారైనా స్కూటర్‌లో బయటకు తీసుకెళ్లి చక్కర్లు కొట్టడాలు, చిన్నపాటి సాహసాలు, సినిమాలకు తీసుకెళ్లడాలూ.. మీరూ చేయండి! పిల్లల్లో ఓ తండ్రి తీసుకురాగల ఉత్సాహాన్ని, ధైర్యాన్ని మీరూ తేవచ్చు.

'నేను మగాణ్ని.. నిన్ను కాపాడేవాణ్ని!' - అబ్బాయిల్లో ఈ అహం రాకుండా ఉండాలంటే మీరు ఎప్పుడూ శక్తిమంతంగా కనిపించాలి. ఎప్పటికప్పుడు ధైర్యం తగ్గకుండా చూసుకోండి. మీలో ఆత్మస్థైర్యం నిండడానికి నిపుణుల కౌన్సెలింగ్ తీసుకున్నా మంచిదే. మీ పెంపకంలో ఆడా,మగ ఇద్దరూ సమానమేననే విషయం అబ్బాయికి చెప్పగలగాలి. అప్పుడే అబ్బాయిల్లో అహానికి బదులుగా అసలైన ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆడపిల్లలకీ ఆ ధైర్యాన్ని అందించినవాళ్లవుతారు.

'నన్ను ఒంటరిగా వదిలేయవా.. ప్లీజ్!' టీనేజీ దాటాక పిల్లల నుంచి ఇలాంటి మాటలే వినిపిస్తాయి. దీనికి పరిష్కారం.. మీకంటూ ఓ ప్రత్యేక ప్రపంచం సృష్టించుకోవడమే. పనీ, పిల్లలు ఇవే లోకంగా కాకుండా మీవైన కళలూ, ఇతర వ్యాపకాలకీ చోటివ్వండి. అది మీలో ఒంటరితనం లేకుండా చేస్తుంది. దానివల్ల వచ్చే కోపం, భయం, ఆందోళనలని పిల్లలపై మోపకుండా అడ్డుపడుతుంది.

'నీ గురించి అలా అంటున్నారు!' - ముందే చెప్పినట్టు చిన్నప్పటి నుంచే పిల్లలకీ మీకూ మధ్య ఏ దాపరికమూ లేకుంటే ఈ సమస్యే రాదు. 'చెప్పుడు మాటలు వినడం కాదు. ఏదైనా అమ్మని అడిగాకే ఆలోచించు. ఉద్యోగినిగా నాకు స్నేహితులు ఉండొచ్చు. ఆ విషయాన్ని నలుగురిలా మాట్లాడటం సహజం..' అని చెప్పేందుకే ప్రయత్నించండి. ఒకవేళ మీరు మీ జీవితంలోకి ఎవర్నైనా ఆహ్వానించే ఆలోచన ఉంటే.. దాన్నీ వాళ్లతో పంచుకోవడానికి వెనకాడొద్దు!

పలాజోలు బాగుంటాయా?

? ప్రస్తుతం పలాజోలు అన్ని రంగుల్లో, సెల్ఫ్ డిజైన్లలో వస్తున్నాయి. నాకు కూడా వాటిని వేసుకోవాలని ఉంది కానీ.. ఎత్తు తక్కువగా ఉంటా. దాన్ని వేసుకుంటే ఇంకా పొట్టిగా కనిపిస్తానేమోనని భయంతో వీటిని కొనడంలేదు. కానీ వేసుకోవాలని ఉంది. ఎలా ప్రయత్నిస్తే బాగుంటుంది.

- ఓ సోదరి



డియర్ వసుంధర
ధన్యా గుప్తా
డిజైనర్

✔ పలాజో ప్రస్తుతం అందరినీ అలరిస్తున్న ట్రెండ్. ఇది అందరికీ బాగుంటుంది. పలాజోకి జతగా వేసుకునే టాప్‌ని జాగ్రత్తగా ఎంచుకుంటే చాలు. టాప్ ఏదయినా కాస్త పొట్టిగా ఉండేలా చూసుకోవాలి. పొట్టపైకి ఉండీ కాస్త వదులుగా కనిపించాలి. అప్పుడే కాస్త పొడుగ్గా కనిపిస్తారు. అలాగే క్రాప్‌టాప్, కాలర్ లేని మోడల్ చొక్కాలు కూడా పలాజోకు బాగుంటాయి. ఇలాంటివాటికి చేతులు అయితే త్రీఫోర్త్స్ లేదా ముంజేయి వరకూ ఉండేలా చూసుకోవాలి. రెండువైపులా చీలిక ఉండే చొక్కాలు మాత్రం నడుము కిందకి వచ్చేలా చూసుకోవాలి. ఇక రంగుల కలయికైతే, లేత గోధుమ, పసుపూ, గులాబీ, నీలం, తెలుపు రంగుల్లో పలాజోను ఎంచుకుంటే, వాటిపై ముదురువర్ణాల టాప్‌లు అందంగా కనిపిస్తాయి. అలాగే ముదురు నీలం, నలుపు రంగుల పలాజోపై ఎరుపూ, లేత ఊదా, చాక్లెట్ రంగుల్లో టాప్‌లు ఆకర్షణీయంగా ఉంటాయి. ముదురు రంగుల్లోని పలాజోలకు టాప్‌లు మోకాళ్లవరకూ ఉండేలా చూసుకోవాలి. అలాగే పలాజో వేసుకుంటుంటే చెప్పులు కాస్త ఎత్తుగా ఉండేవి ఎంచుకోవాలి. అప్పుడే మీ ఆహార్యానికి నిండుదనం వస్తుంది. ఆకట్టుకునేలా కూడా కనిపిస్తారు.

బంగారం వెండి

6న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,490	30,480	30,460	30,400
ఆర్నమెంట్	28,470	28,470	28,300	28,300
వెండి (కిలో)	39,950	39,870	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,400	30,400	30,210	30,130
ఆర్నమెంట్	28,150	28,150	28,250	28,180
వెండి (కిలో)	39,500	39,500	39,500	39,300
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,090	30,090	-------	-------
ఆర్నమెంట్	27,980	27,980	2,825	2,818 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	42.11	42.00 గ్రా

నజరానా

ఫౌండేషన్ కావాల్సినదాని కన్నా ముదురు రంగులో ఉందా... కాస్త మాయిశ్చరైజర్ కలిపి ఆ తరువాత రాసుకొని చూడండి.

ఓ మేస్త్రీ.. పోరాటమిది!



దమయంతిది విజయం కాకపోవచ్చు. కానీ తనదైన స్థాయిలో ఆమె అందుకున్న సాధికారత చెప్పుకోదగ్గది. జి.గండపల్లి.. ఒడిశా గంజాంజిల్లాలోని కళ్లికోట బ్లాక్‌లోని ఓ చిన్న గ్రామం. ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దులోని సముద్ర తీరంలో ఉంటుంది. దమయంతికి పద్నాలుగేళ్లప్పుడే పెళ్లిచేశారు. ఇద్దరు పిల్లలు. ఆమెకి ఇరవైఏళ్లు రాకముందే భర్త అనారోగ్యంతో కన్నుమూశాడు. అత్తింటివాళ్ల చులకన తట్టుకోలేక పుట్టింటికే వచ్చేసింది. వ్యవసాయ కూలీగా మారింది. 2013లో మన విశాఖతీర ప్రాంతాన్ని ఫైలిన్ తుపాను ఛిన్నాభిన్నం చేసింది.. గుర్తుందా? అదే తుపాను ధాటికి దమయంతి ఇల్లు కూడా కూలిపోయింది. అలా గూడు పోగొట్టుకున్నవారికి మళ్లీ గృహవసతి కల్పించేలా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.3 లక్షలు ఇచ్చింది. కాకపోతే నిర్మాణ కార్మికుల కొరత కారణంగా ఎవరిల్లు వాళ్లే కట్టుకోవాలని ప్రభుత్వం చెప్పింది. దమయంతికి ఇంట్లో వయోవృద్ధుడైన ఆమె నాన్న తప్ప ఇంకే మగదిక్కూ లేరు. దాంతో ఆమే వెళ్లి మూడునెలలపాటు అన్ని పనులూ నేర్చుకుంది. తమ ఇంటిని తన రెక్కల కష్టంతోనే నిర్మించుకుంది! ఇల్లు కట్టుకుంది సరే..! మరి రోజు గడవడం ఎలా? భవన నిర్మాణ మేస్త్రీగా వెళ్లాలనుకుంది. ఏ కాంట్రాక్టరూ ఒప్పుకోలేదు. 'ఆడదానివి మేస్త్రీగా ఉండటమేంటీ! నీకింద ఎవరూ పనిచేయరు. నీకు అనుభవం చాలదు' అనేశారట. దమయంతి పట్టుదల వీడలేదు. ఆ అనుభవమేంటో సాధిస్తానని దాదాపు ఆరునెలలపాటు గంజాం పట్టణంలో కూలీగానే పనిచేసింది. పునాది తవ్వడం నుంచి టైల్స్ వేయడం దాకా సమస్తం నేర్చుకుంది. ఇప్పుడు ఆమె పనితీరు చూశాక.. గుత్తేదారులు పనులు అప్పగించకుండా ఉండలేకపోయారు. అలా దమయంతి మహిళా మేస్త్రీగా గంజాంలో అందర్నీ అబ్బురపరుస్తోంది.

అక్కడ శిశు మరణాల శాతం తక్కువట...

గర్భం దాల్చడం ఆలస్యం.. అక్కడ కాబోయే తల్లికి చకచకా పరీక్షలు రాసేయరు. బోలెడు మందులూ ఇచ్చేయరు. ఇవన్నీ చేయకున్నా కాబోయే తల్లీ, పుట్టబోయే పాపాయి ఆరోగ్యానికి మాత్రం పెద్దపీట వేస్తారు. అదీ స్వీడన్ ప్రత్యేకత. ఇతర దేశాలతో పోలిస్తే అక్కడ శిశుమరణాల శాతం కూడా తక్కువే. ఇదెలా సాధ్యం అంటారా... చదవండి మరి.



స్వీడన్‌లో మందుల నియంత్రణతోపాటు, అల్ట్రాసౌండ్, స్కానింగ్, ఎక్స్‌రే వంటి పరీక్షలకు గర్భిణులను దూరంగానే ఉంచుతారట. వాటి ప్రభావం పుట్టబోయే పాపాయిలపై పడకుండా ఉండేందుకే ఆ జాగ్రత్తలు తీసుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే మందులైనా, స్కానింగ్‌లైనా. దీంతో గర్భిణులూ, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించే మేటిదేశాల వరసలో స్వీడన్ రెండో స్థానం పొందింది. గర్భిణి ఆరోగ్యపరిరక్షణలో స్వీడన్ 18వ శతాబ్దం నుంచే శ్రద్ధ వహిస్తోంది. స్వీడన్‌లో ఏటా శిశుమరణాల శాతం 3.1శాతానికి మించదు. వందకు 17, అంతకన్నా తక్కువ మందికి మాత్రమే సిజేరియన్ చేస్తారు. నెల తప్పినప్పటినుంచి మహిళల ఆరోగ్యం పట్ల వైద్యులు తీసుకునే జాగ్రత్తలే ఇందుకు కారణమట. అంతేకాదు, స్వీడన్ ప్రభుత్వ నియమాల మేరకు ఆసుపత్రి ఏదైనా సరే గర్భిణికి ప్రసవం అయ్యేవరకు ఉచిత వైద్యం అందిస్తుంది. తరచూ కాకుండా చాలా తక్కువసార్లు మాత్రమే రక్త, మూత్ర పరీక్షలు చేస్తారు. విటమిన్ల లోపం, రక్తహీనత, రక్తపోటు, గుండెకొట్టుకునే రేటు మాత్రమే పరీక్షిస్తారు. మందుల కన్నా ఆహారనియమాలకే పెద్ద పీట వేస్తారు. అలాగే గర్భిణులూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. నవమాసాల్లో, అవసరమైతే, అదీ ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే అల్ట్రాసౌండ్ పరీక్ష చేస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచీ ప్రసవం అయ్యేలోపు ఆ మహిళ ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ఆసుపత్రుల్లో ప్రత్యేక సభ్యులుంటారు. ఆ ప్రత్యేక సభ్యులే ప్రసవం చేసి, తల్లీబిడ్డల్ని ఇంటికి పంపుతారు. ప్రసవం తరువాత తల్లిపాలు ఇవ్వడంలో జాగ్రత్త చెప్పడమే కాకుండా, మూడు రోజులకొకసారి ఇద్దరి ఆరోగ్యాన్నీ పరిశీలించడానికి నర్సులు వెళతారు. చంటిపిల్లలకు టీకాలు కూడా వాళ్లే వేస్తారు. ఉద్యోగినులకు మూడు నెలల ప్రసవ సెలవులూ, పుట్టిన బిడ్డ తండ్రికి కూడా ఆఫీస్ యాజమాన్యం జీతంతోపాటు మూడు నెలల సెలవులూ ఇస్తుంది. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేవరకు ఆ బిడ్డ పేరున అక్కడి ప్రభుత్వం ఆర్థికసాయం కూడా చేస్తుంది.

కాళ్ల అందానికి చక్రం!

కాళ్లు నాజూగ్గా ఉండటానికి ఈ వ్యాయామాలు ఉపయోగపడతాయి. వీటివల్ల కండరాలు దృఢమై కాళ్లు బలంగా ఉంటాయి.


ప్రతి ఆసనాన్ని కాళ్లు మారుస్తూ, ఆరేడుసార్లు గాలి పీలుస్తూ చేయాల్సి ఉంటుంది.




మోకాళ్లపై కూర్చోవాలి. కుడికాలిని మెల్లిగా వెనక్కి జరిపి మోకాలు నేలను తాకేలా, పాదాన్ని చక్రంపై ఆనించాలి. ఎడమకాలిని చిత్రంలో చూపిన విధంగా మోకాలి వరకు మడవాలి. రెండు చేతులను పైకెత్తి నమస్కార ముద్రలో ఉంచి తలను కూడా పైకెత్తాలి.



ఆ స్థితిలోనే ఉంటూ నెమ్మదిగా కుడికాలిని పూర్తిగా వెనక్కి చాచి చక్రంపై ఆనించాలి.



ఇప్పుడు ఎడమకాలితో చక్రాన్ని కదుపుతూ కుడికాలిని వంచాలి. అయితే రెండు చేతులనూ, కుడికాలిని సమాంతరంగా నేలకు ఆనించాలి.



డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు



చిత్రంలో చూపిన విధంగా కుడికాలిని చక్రంపై పెట్టి, ఎడకాలిని మోకాలి వరకు మడిచి శరీరాన్ని ముందుకు వంచాలి. చేతులను ఎడమకాలికి రెండువైపులా నేలపై ఆనించాలి.

ఏరువాక పంటే ఆనందం.. కొత్త అల్లుళ్లు వచ్చే సంబరం! పల్లెలు, పట్టణాలు...
సంక్రాంతి ఆనందాలతో మురిసిమెరిసే సమయం...
వారం ముందు నుంచే హడావుడి...
మనవళ్లకోసం, మనవరాళ్ల కోసం ఏం వండి పెట్టాలనే చర్చ...

పంటలన్నీ ఇంటికి వంటలన్నీ నోటికి

సంక్రాంతి పూర్తిగా పల్లె పండగ అంటే తప్పేం కాదేమో! కోట్లు పెట్టినా పల్లెలోని సంక్రాంతి శోభని నగరాలకు తీసుకురాలేం మరి. ఏరువాక మోసుకొచ్చిన కొత్తధాన్యాలతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో కళకళ్లాడే వేళ ఇది. అందుకు కృతజ్ఞతగా కొత్తకుండలో ... అన్ని పాలూ, ఇన్ని కొత్త బియ్యం.. వేసి పొంగించి మా కుటుంబాన్ని కూడా ఇలా పాలపొంగులా సంతోషాలతో నింపమని సూర్యభగవానున్ని కోరతారు ఇంటిల్లిపాది. ఇదే వేడుకని మనం సంక్రాంతి అంటే.. తమిళులు పొంగల్ అనీ, పంజాబీలు లోహ్రీ అని అంటారు. పేర్లు వేరయినా సంప్రదాయం అదే. కాస్త కారం.. కాస్త తీపి కలిసిన రుచులే అక్కడా వండుతారు. పాలు, నువ్వులు, బెల్లం, కొబ్బరితో పాటూ శరీరాన్ని మనసుని దృఢంగా ఉంచే సంప్రదాయక రుచులు వండే వేళ ఇది. అరిసెలు, జంతికలు, పాకుండలు, కజ్జికాయలు, సకినాలు, అప్పాలు ఇలా బోలెడు చాలా రకాలే చేస్తాం. అందులో కాస్త భిన్నంగా చేసే వాటిని చేసుకుందాం.

అసోంలో: కొబ్బరి లడ్డు ఇక్కడ ప్రధానమైన వంటకం. స్థానికంగా నారీకొలార్ లోరు అంటారు.

గుజరాత్‌లో: కొత్తకుండలో ఉందియు అనే వంట వండుతారు వీళ్లు. మనం గుత్తివంకాయలు మాత్రమే చేస్తాం. కానీ గుజరాతీయులు గుత్తివంకాయలు, గుత్తి బంగాళదుంపలు, బఠాణీలు, అరటికాయలు ఒక్కటి కాదు... ఇలా బోలెడు రకాల కాయగూరలతో ఈ ఉందియు వంటకాన్ని చేస్తారు.



కర్నాటకలో: ఈ పండక్కి నువ్వులు, బెల్లం, కలిపి తింటారు. దీన్నే 'ఇల్లుబెల్ల' అంటారు.

రేగి వడియాలు

కావల్సినవి: రేగిపండ్లు- రెండు కప్పులు, బెల్లం- కప్పు, జీలకర్ర- చెంచా, పచ్చిమిర్చి- ఏడు, ఉప్పు- కొద్దిగా

తయారీ: ముందుగా రేగిపండ్లని శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి. వీటిని గింజలతో సహా రోట్లో జీలకర్ర, ఉప్పు వేసుకుని కచ్చాపచ్చాగా దంచుకోవాలి. బెల్లం, పచ్చిమిర్చి కూడా వేసుకుని మరోసారి దంచుకుని వీటిని ఓ కవర్‌మీద కానీ, కాటన్ బట్టమీద కానీ వడియాల్లా పెట్టుకుని ఎండలో ఆరబెట్టుకోవాలి. పూర్తిగా ఆరిన తర్వాత ఒక డబ్బాలో వేసి ఉంచుకుంటే కావాల్సినప్పుడు తినొచ్చు.



కారం సకినాలు

కావల్సినవి: బియ్యం- కేజీ, నువ్వులు- 200గ్రా, వాము- వందగ్రాములు, పండుమిరపకాయలు- 200గ్రా, వెన్న-50గ్రా, ఉప్పు, నూనె- తగినంత

తయారీ: బియ్యాన్ని శుభ్రంగా కడిగి రాత్రంతా నానబెట్టుకుని తెల్లారి ఓ బట్టలో వేసి వడకట్టేయాలి. ఆ బియ్యాన్ని మరపట్టించి జల్లించుకోవాలి. ఈ పిండిలో వాము, నువ్వులు, వెన్న, ఉప్పు వేసి కలపాలి. దీనికి పండుమిర్చిని రుబ్బి పెట్టుకుని ఈ మిశ్రమం కూడా కలిపి అవసరం అయితే కొద్దిగా నీళ్లు చిలకరించుకుంటూ మరీ జారుగా, మరీ గట్టిగా కాకుండా పిండి కలుపుకోవాలి. తెల్లని శుభ్రమైన కాటన్‌వస్త్రాన్ని తీసుకుని దానిపై పిండిని చేత్తో ఒడుపుగా గుండ్రంగా తిప్పుతూ ఉంటే చిత్రంలో చూపించినట్టుగా సకినాలు తయారవుతాయి. ఎక్కువగా ఉన్న నీటిని ఆ బట్ట పీల్చేసుకుంటుంది. ఇప్పుడు వాటిని తీసుకుని నూనెలో వేయించుకుంటే కమ్మని సకినాలు రెడీ.



పెసర జంతికలు

కావల్సినవి: బియ్యప్పిండి- రెండు కప్పులు, పెసరపప్పు- అరకప్పు, ఉప్పు, కారం, నూనె- తగినంత, వాము- పావుచెంచా

తయారీ: అరగంట ముందుగా పెసరపప్పుని నీటిలో నానబెట్టుకుని కుక్కర్‌లో మెత్తగా ఉడికించుకోవాలి. ఒక పాత్రలో బియ్యప్పిండి, ఉప్పు, కారం, వాము, ఉడికించిన పెసరపప్పు పేస్ట్, బియ్యప్పిండి వేసుకుని ముద్దలా చేసుకోవాలి. మరీ జారుగా కాకుండా జంతికలు వేసుకోవడానికి అనువుగా ఈ ముద్ద ఉండాలి. నూనెలో వేసుకుని జంతికలు తిప్పుకుంటే సరి.



పాల అరిసెలు

కావల్సినవి: బియ్యం- అరకేజీ, బెల్లం- పావుకేజీ, పాలు- కొద్దిగా, నూనె- తగినంత

తయారీ: బియ్యాన్ని రాత్రంతా నానబెట్టి ఉంచి తెల్లారి తడిలేకుండా వడకట్టి పెట్టుకోవాలి. దీనిని మరపట్టించి జల్లించుకోవాలి. ఈ పిండిలో బెల్లం, నువ్వులు.. కొద్దికొద్దిగా పాలు వేసి గట్టి ముద్దలా చేసుకోవాలి. అరచేతిలో కొద్దిగా నూనె రాసుకుని పిండిని గుండ్రంగా అరిసెల్లా తట్టుకుని నూనెలో వేసి బంగారు వర్ణంలోకి రాగానే తీసేయాలి.

గమనిక: పాలు తగినంతే వేసుకోవాలి. ఎక్కువ అయితే బెల్లం కరిగిపోయి అరిసెలు సరిగా రావు.



నువ్వుల బూరెలు

కావాల్సినవి: గోధుమపిండి- అరకప్పు, బెల్లం- అరకప్పు, నువ్వులు- అరకప్పు

తయారీ: ముందుగా నువ్వులని దోరగా వేయించుకుని చల్లార్చుకోవాలి. తర్వాత బెల్లం, నువ్వులని మిక్సీలో వేసుకుని పొడిచేసుకోవాలి. కప్పులో వేడి నీళ్లని తీసుకుని అందులో చేతిని ముంచుతూ బెల్లం, నువ్వుల మిశ్రమాన్ని గట్టిగా ముద్దగా చేసుకోవాలి. ఇప్పుడు గోధుమపిండిని చపాతీపిండిలా చేసుకుని దాన్ని నాలుగైదు సమాన ముద్దలుగా చేసుకోవాలి. . ఇప్పుడు జిప్‌లాక్ బ్యాగ్ లేదా ఒక పాలిథిన్ కవర్ తీసుకుని ఒక బుక్‌మాదిరిగా మధ్యలోకి మడతపెట్టాలి. లోపల, బయటా కూడా నూనె లేదా నెయ్యి రాసుకోవాలి.

మనం ఇందాక తయారుచేసి పెట్టుకున్న గోధుమపిండి ముద్దని చేత్తో వెడల్పుగా చేసుకుని అందులో నువ్వులు, బెల్లం ముద్ద పెట్టుకుని బయటకు రాకుండా చుట్టూ బూరెలా మూసేయాలి. ఇప్పుడు ఈ బూరెను జిప్‌లాక్ కవర్ మధ్యలో ఉంచుకుని పైనుంచి చేత్తో ఒత్తుతూ ఉంటే నువ్వుల బూరె లేదా నువ్వుల పోలి సిద్ధం.

- సకినాల కోసం పిండిని మరపట్టించిన తర్వాత గాలికి వదిలేయకూడదు. తప్పనిసరిగా బట్టని కప్పి ఉంచాలి. లేదంటే స్టీల్ డబ్బాలో వేసి మూతపెట్టుకోవాలి. అలాగే ఈ పిండిని గుప్పెట్లో వేసుకుని గట్టిగా నొక్కి తెరిస్తే వేళ్లసందుల్లోంచి పిండి జలజలా రాలిపోకూడదు. అన్నం ముద్దలా నిలబడి ఉండాలి. అలా ఉండే పిండితో సకినాలు చేస్తే గుల్లగా వస్తాయి.
- పరమాన్నం చేసేటప్పుడు బెల్లాన్ని పొయ్యికట్టే ముందు వేస్తారు చాలామంది. అలా చేస్తే పాలు విరిగిపోయినట్టుగా చూడ్డానికి బాగుండదు. అదే పొయ్యి కట్టి.. తర్వాత వేస్తే పరమాన్నం రంగు బాగుంటుంది.



ప్ర & జ

పాకుండలు మృదువుగా రావాలంటే?

నేను పాకుండలు, అరిసెలు చేస్తుంటే గట్టిగా వస్తున్నాయి. పాకుండలు అయితే విరిగిపోయి పగుళ్లు వస్తున్నాయి. ఇవి తినడం మా వల్ల కాదు అంటున్నారు పిల్లలు. కొంతమంది చేస్తే భలే మృదువుగా వస్తాయి. అవి ఎలా చేయాలో కాస్త చెప్పండి?



ఈ పాకుండలనే కొన్ని ప్రాంతాల్లో పాకం ఉండలు అని అంటారు. వీటి తయారీలో ఏమాత్రం అశ్రద్ధ చేసినా అవి గట్టిగా వస్తాయి. అలా కాకుండా చక్కగా రావాలంటే ఏం చేయాలో చూద్దాం. బియ్యాన్ని తప్పనిసరిగా రాత్రంతా నానబెట్టాల్సిందే. ఏదో మూడు, నాలుగు గంటలు నానబెడితే సరిపోదు. అలాగే నీళ్లు ఒలకపోసి, చిల్లుల గిన్నెలో వేసి ఉంచడం కాకుండా.. మందపాటి కాటన్ బట్టమీద బియ్యాన్ని ఆరవేయాలి. ఇంట్లో మర పట్టిస్తే నాలుగైదు సార్లు మిక్సీ పడతాం కాబట్టి... తేమ ఉండదు. అందుకని నాలుగు చుక్కల నీళ్లు వేసి మరపట్టించుకోవాలి. నాలుగు చుక్కలంటే మనం చిలకరించడం కన్నా తక్కువ నీళ్లు అనుకోవచ్చు. రెండో కీలకమైన విషయం... బెల్లం. పాకుండలకి, అరిసెలకి కేజీ బియ్యానికి ముప్పావుకేజి బెల్లం అన్నట్టు లెక్క వేస్తారు. కొంతమంది రుచికోసం నువ్వులు, కొబ్బరి, ఇలాచీ కలుపుతారు. ఇలా ఏదైనా అదనంగా కలిపితే ఆ మేరకు బెల్లం తగ్గించుకోవాలి. బెల్లం కరిగి మూడు తీగల పాకం వచ్చాక పిండి కలపాలి. చాలామంది ఒక తీగ పాకం రాగానే పిండి కలుపుతారు. దాంతో బెల్లం పలచగా ఉండి ఎక్కువ పిండి పడుతుంది. దాంతో పాకుండలు గట్టిగా అయిపోతాయి. కచ్చితంగా మూడుతీగల పాకం వచ్చేవరకూ చూడాలి. కొందరు నెయ్యి పిండిలో, బెల్లం పాకంలో వేస్తారు. కానీ నెయ్యిని నూనెలో వేసి అప్పుడు ఉండలు వేయించుకుంటే ఉండలకి నెయ్యి పరిమళం అద్దుకుంటుంది.

కొందరు మెత్తని అరిసెలు ఇష్టపడతారు. అలా రావాలంటే బెల్లం కరిగి రెండు తీగల పాకం రాగానే వేడిమీద పిండి వేసి కలపాలి. అంతేకానీ చల్లారాక కలపడం కాదు. మనం కలుపుతుంటే పిండి, బెల్లం పాత్రకు ఏమాత్రం అతుక్కోకుండా గరిటెతోపాటూ పైకి లేచి వస్తూంటే అది సరైన పాకం కింద లెక్క. అవి మెత్తగా ఉంటాయి. మెత్తని అరిసెల కోసం వేరుసెనగ, సన్‌ఫ్లవర్ నూనెలని వాడాలి. తక్కినవి గట్టి వాటికి బాగుంటాయి.

గట్టిగా కావాలనుకుంటే అరిసె మధ్యలో చిన్న చిల్లు పెట్టాలి. అన్నివైపులా గట్టిగా వేగి కరకరలాడుతుంది. అరిసెలని బాండీలో రెండు కంటే ఎక్కువ కాల్చలేం. గబగబా కాల్చే ప్రయత్నం వద్దు. అలాగే నువ్వులని పైన చల్లడం కాకుండా చేత్తో ఒత్తాలి. అలా అయితే అవి ఊడి నూనెలో పడి గందరగోళం కాకుండా ఉంటుంది. కావాలంటే రుచికోసం ఒక స్పూను గసగసాలు వేయించి, పొడిచేసి కలుపుకోవచ్చు.

– శ్రీదేవి, హోటల్‌మేనేజిమెంట్ నిపుణురాలు

అస్త్రం

పంచదార చిలకల కోసం...

పిండి వంటలు చేయడం అంటే మామూలు వ్యవహారం కాదు.. అన్ని సదుపాయాలు ఉంటే కానీ పనులు చకచకా అవ్వవు. ఎంతగా ఆధునిక పరికరాలు వచ్చినా ఇలాంటి సమయంలో మన సంప్రదాయ పరికరాలు ఉంటేనే ఆ వంటకి అందం.. ఆప్యాయత అబ్బుతుంది. కాదంటారా?

- సంప్రదాయ పద్ధతిలో అరిసెలు చేసినప్పుడు.. అరిసెలను ఒత్తి ఎక్కువగా ఉన్న నూనెను తీయాల్సి ఉంటుంది. కొంతమంది మూకుట్లోంచి తీసిన వెంటనే గరిటెతో నొక్కుతారు. మరికొందరు టిష్యూ కాగితంతో ఒత్తుతారు. కానీ చెక్కతో చేసిన సంప్రదాయక ప్రెస్సర్లు మనకి మార్కెట్లో దొరుకుతాయి. కింద చిన్నపీటలాంటిది ఉండి.. పైన పప్పుగుత్తిలాంటిది ఉంటుంది. నూనెలోంచి తీసిన అరిసెలను దీనిపై ఉంచి గుత్తితో ఒత్తితే అధికంగా ఉన్న నూనె బయటకు రంధ్రాల గుండా బయటకు వచ్చి కింద పెట్టిన పళ్లెంలోకి వచ్చేస్తుంది.



- సంక్రాంతి సమయంలో చాలామంది చెక్క గవ్వలు చేస్తుంటారు. చేత్తోనో, పళ్లెం తిరగేసో వీటిని చేస్తుంటారు కానీ... గవ్వల పీట అని మార్కెట్లో దొరుకుతుంది. లేదంటే స్వయంగా చేయించుకోవచ్చు. కొద్దిగా పొడవాటి చెక్కపై గీతలు గీసినట్టుగా ఉంటుంది పరికరం.







- కొన్ని ప్రాంతాల్లో ఈ సమయంలో పంచదార చిలకలని ఇచ్చిపుచ్చుకుంటారు. వీటిని తయారు చేయడానికి కూడా చెక్క అచ్చులు ఉంటాయి. ఇందులో పంచదార పాకం చేసి పోసి పంచదార బొమ్మలు తయారుచేస్తారు. సక్కెర అచ్చు పేరుతో ఇవి ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయి.

పక్కాలోకల్

మందస కోవా.. వారెవ్వా..!

కోవా అంటే గట్టిగా ఉండి బిళ్లల్లాంటివే మనందరికీ గుర్తుకొస్తాయి. కానీ మందస కోవా అలాకాదు.. ద్రవరూపంలో ఉంటుంది. అద్భుతమైన రుచి. తూర్పుకనుమల్లోని కొండ ప్రాంతాల్లో ప్రత్యేక మూలికలని తిని పశువులు ఇచ్చే పాలతో చేసినందువల్లే కోవాకి ఆ రుచి అంటారు స్థానికులు..



ఇప్పటి మాటకాదు.. పదకొండో శతాబ్దంలో మందస సంస్థానాన్ని పాలించిన రాజపుత్ర వంశీయులు శాకాహారులు. వారి కోసం ప్రత్యేకంగా ఈ తరహా కోవా తయారు చేసేవారు. పాలు, పంచదార దీనికి ముడి సరకులు. కట్టెల పొయ్యిపై పెద్ద ఇనుప కళాయిల్లో ఈ కోవాని తయారు చేస్తారు. పాలు పొంగిపోకుండా, అడుగు పట్టకుండా పాకం వచ్చే వరకు చాలా ఓపిగ్గా తెడ్డుతో కలుపుతూ ఉంటారు. చిక్కబడ్డాక పొయ్యి నుంచి దించి చల్లార్స్తారు. పలుకుపలుకుల్లా చూడ్డానికి నోరూరించేలా ఉంటుందీ కోవా. దీనిని ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి విక్రయిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారి కోసం అయితే కోవాని ఇంకా దగ్గరకు రానిచ్చి ముద్దగా చేసి బిళ్లలుగా చేస్తారు. క్రీం కోవా అయితే నిల్వ చేయడం కోసం సీసా మూత తెరవకుండా ఫ్రిజ్‌లో పెట్టాలి. బిళ్లలు అయితే ప్లాస్టిక్ సంచిలో ఉంచి ఫ్రిజ్‌లో 20 రోజుల వరకు నిల్వ చేయవచ్చు. ఐదు లీటర్ల పాలలో 2 కిలోల పంచదార వేసి పొయ్యిపై మరగబెట్టాలి. ఈ పాలకోవా తయారీలో కొందరు నైపుణ్యత సాధించిన వంటవారు(మాస్టర్) ఉంటారు. ప్రత్యేకంగా వారి చేతే కొందరు తయారు చేయిస్తారు. సహజసిద్ధమైన పాలు, పంచదారతో తయారయ్యే ఈ పాలకోవాకు ఓ ప్రత్యేకత ఉంది.

తూర్పుకనుమల్లోని వనమూలికల వల్లే ఆ రుచి...

తూర్పు కనుమలయిన మహేంద్రగిరుల్లో వనమూలిక మొక్కలతో ఉండే పచ్చిక బయళ్లలో మేసే పాడి పశువుల పాలతో ఈ కోవా తయారవుతుంది. అందువలన మందస పాలకోవా ప్రత్యేకమైన రుచితో ఉంటుంది అంటారు తయారీదారులు. ఒకసారి తింటే మళ్లీ తినాలనిపిస్తుంది. తినేవారి మనసును దోచుకుంటుంది.



ధర

క్రీం కోవా అయినా, బిళ్ల కోవా అయినా కిలో రూ. 200. క్రీం కోవా ప్లాస్టిక్ డబ్బాల్లో, బిళ్ల కోవా ప్లాస్టిక్ సంచుల్లో లభిస్తుంది.

చప్పటి కోవా కూడా...

పంచదార లేకుండా కూడా తయారు చేసుకోవచ్చు కేవం పాలతోనే క్రీం, బిళ్ల కోవా తయారు చేసుకోవచ్చు. ఇవి చక్కెర వ్యాధిగ్రస్తులూ తినొచ్చని తయారీదారులు చెబుతున్నారు.

రోజుకి వెయ్యి కిలోలు...

మందసలో రోజుకు వెయ్యి కిలోల వరకు పాల కోవా ఉత్పత్తి అవుతుంది. కుటీర పరిశ్రమలుగా 25 చోట్ల తయారు చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు. వివాహ, శుభ కార్యక్రమాల్లో మర్యాదల కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తారు. దూర ప్రాంతాల్లో ఉండే హితులు, స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులకు ఇక్కడ కొనుగోలు చేసి పంపిస్తారు. అలా మందస పాలకోవా ఖండాంతరాలు దాటి ఎగుమతి అవుతోంది.

– గూన నీలకంఠం, న్యూస్‌టుడే మందస.

మిస్టర్ ట్రంప్.. వీరి శ్రమ అమెరికా కోసం కాదా?



అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో, ఉపాధి సృష్టిలో కీలక భూమిక పోషిస్తున్న లక్షలమంది వలస దారుల్ని వెనక్కి పంపడానికి ట్రంప్ సర్కారు చేస్తున్న ప్రయత్నం ఇంటా, బయటా తీవ్ర విమర్శల్ని ఎదుర్కొంటోంది. స్టెమ్(విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్, గణితం) రంగాలకు వెన్నెముకగా నిలిచే లక్షల మంది నైపుణ్య సిబ్బందిని వెనక్కి పంపడం వల్ల అమెరికా సమాజంలో ప్రతిభావంతులు, అనుభవజ్ఞులకు తీవ్ర కొరత ఏర్పడుతుందని కొందరు అమెరికా శాసనకర్తలు, లాబీయింగ్ గ్రూపులు హెచ్చరిస్తున్నారు. అంతటి భారీ సంఖ్యలో అర్హులైన అమెరికన్లను ఎక్కడ్నుంచి తెస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. వలసవచ్చిన వారు అమెరికాలో ఏర్పాటుచేసిన కంపెనీలు, విదేశీ వృత్తి నిపుణులు చేసిన శ్రమ, సృష్టించిన సంపదను చూసినట్లయితే.. వీరి వాదన నూటికి నూరుశాతం వాస్తవమని రుజువవుతుంది.

అమెరికాలో స్టార్టప్ కంపెనీలు ఏర్పాటుచేసిన భారతీయులు (సొంతంగా లేదా భాగస్వామ్యంతో.. ఈ గణాంకాలు 2015 చివరి నాటివి)

పేరు	కంపెనీ	ఉద్యోగులు
యాష్ అశుతోష్	యాక్టిఫో	350
జ్యోతి బన్సాల్	యాప్ డైనమిక్స్	900
కె.ఆర్. శ్రీధర్	బ్లూమ్ ఎనర్జీ	1200
అపూర్వ మెహతా	ఇన్‌స్టాకార్ట్	300
జోగిందర్ మహమ్మద్	జాస్పర్	425
ధీరజ్ పాండే, అజిత్ సింగ్, మోహిత్ అరోన్	నటానిక్స్	864
లక్స్ శ్రీని	జెనిఫిట్స్	1465
జే చౌద్రీ	జెడ్‌స్కేలర్	600

వృత్తి నిపుణుల్ని వెళ్లగొడితే అమెరికాకు నష్టం కాదా!!

ట్రంప్ విధానాలతో నష్టమేంటి?

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మేధావులు, వృత్తినిపుణులు, స్టార్టప్‌ల సృష్టికర్తలు అమెరికాలో ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్నారు. ఇందులో ఎక్కువమంది భారతీయులున్నారు. ట్రంప్ ప్రయోగిస్తున్న హెచ్-1 బీ వీసా పిడుగుతో లక్షల మంది నిపుణులు అమెరికాను వీడాల్సి ఉంటుంది. ఇది మేధో వలసకు దారితీస్తుంది.

- ఐటీ, ఇతరత్రా సాంకేతికతలో సిలికాన్ వ్యాలీ ప్రస్తుతం ప్రపంచ నాయకత్వ స్థానంలో ఉంది. ప్రభుత్వ తాజా విధానాల వల్ల ఈ నాయకత్వ స్థానాన్ని పోటీదేశాలు తన్నుకుపోయే ప్రమాదం ఉంది. నిపుణులకు ఆ దేశాలు ఎర వేయొచ్చు. నిపుణులకు తమ ద్వారాలు తెరిచే ఉంచుతామని ఇప్పటికే కెనడా నవకల్పనల మంత్రి నవదీప్ బైన్స్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్ ప్రకటించారు.
- సాంకేతికంగా ఎదుగుతున్న ఫ్రాన్స్ తదితర దేశాల వైపు పెట్టుబడులు మళ్లే అవకాశం ఉంది.
- ఒకప్పుడు ప్రపంచ ఆటో రంగం రారాజుగా వెలుగొందిన డెట్రాయిట్ ఇప్పుడు ఎంతటి గడ్డుస్థితిని ఎదుర్కొంటోందో.. సిలికాన్ వ్యాలీ కూడా అలాంటి ప్రమాదాన్నే ఎదుర్కొనవచ్చంటున్నారు.
- లక్షల మంది విదేశీయుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది.
- ప్రస్తుతం సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న వారు ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యనభ్యసించి.. వృత్తి నైపుణ్యం సంపాదించిన వారు. టెక్నాలజీ రంగంలో అమెరికా నాయకత్వ స్థాయిలో ఉండాలన్న ఉద్దేశంతో మునుపటి పాలకులు వీరందరినీ తమ దేశంలోకి ఆహ్వానించడంతో.. కొందరు సొంతంగా, మరికొందరు అమెరికన్ల భాగస్వామ్యంతో పెద్ద పెద్ద కంపెనీలు స్థాపించారు. ఈ కంపెనీల్లో ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన వృత్తి నిపుణులు పనిచేస్తున్నారు.

విదేశీయులు ఏర్పాటుచేసిన కంపెనీలు అమెరికాకు చేస్తున్న సేవలు ఇవీ...

- **ఉబర్:** అమెరికా నగరాల్లో రవాణా వ్యవస్థలో గుణాత్మక మార్పులు తెచ్చింది.
- **స్పేస్‌ఎక్స్:** అమెరికన్లను అంగారక గ్రహంపైకి తీసుకువెళ్లే లక్ష్యంతో పనిచేస్తోంది.
- **క్లౌడ్‌ఫ్లేర్:** అమెరికాలో ట్రాఫిక్, భద్రతకు సంబంధించిన వెబ్‌సైట్లను అభివృద్ధి చేసింది.
- **గస్టో:** అమెరికాలో ఉద్యోగుల వేతన పట్టీలను తయారుచేస్తోంది.
- **స్ట్రైప్:** వ్యాపార, ఇతరత్రా ఖాతాదారులకు ఆన్‌లైన్ చెల్లింపులకు సహకరిస్తోంది.
- **యాప్ డైనమిక్స్, క్లౌడేరా, టానియం, ఎంయూ సిగ్మా:** బలమైన ఐటీ వ్యవస్థలు ఏర్పాటుచేసి ప్రపంచ మార్కెట్లో అమెరికా పోటీపడేలా చేస్తున్నాయి.




- విస్తరించిన ఆర్థికవ్యవస్థ, పుట్టుకొచ్చిన కంపెనీల్ని సమర్థంగా నిర్వహించగలిగేంతటి సంఖ్యలో అమెరికా వృత్తి నిపుణులు లేరు. దీనికి కారణం అమెరికన్లు ఆ దిశగా ఉన్నత చదువులవైపు దృష్టి సారించకపోవడం. ఇప్పుడు హఠాత్తుగా లక్షల సంఖ్యలో నిపుణులు దేశాన్ని వీడితే.. నైపుణ్యానికి తీవ్ర కొరత ఏర్పడుతుంది.
- అమెరికాలో నాలుగు అతిపెద్ద కంపెనీలైన యాపిల్, ఆల్ఫాబెట్, అమెజాన్, ఫేస్‌బుక్‌లు దాదాపు 15 లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. ఇందులో అనేకమంది విదేశీయులు ఉంటున్నారు. వీరంతా అమెరికాకు రాకుండా.. తామున్న చోటే తమ నైపుణ్యాన్ని వినియోగిస్తే.. అది అమెరికా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- సాంకేతిక ఎగుమతుల ద్వారా అమెరికా కోట్ల డాలర్లను ఆర్జిస్తోంది. అమెరికా సృష్టి అయిన ఫేస్‌బుక్, ఐఫోన్, గూగుల్‌పై ప్రపంచం ఆధారపడుతోంది. తదుపరి తరం సాంకేతిక పరిజ్ఞానం అమెరికా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి వస్తే.. అమెరికా పరిస్థితి ఏమిటన్నది ఊహించడం కూడా కష్టం.
- అసందిగ్ధ భవితతో ఇప్పటికే సిలికాన్ వ్యాలీలో పెట్టుబడులు చాలావరకు తగ్గిపోయాయి. ఉబర్ సహా కొన్ని కంపెనీలు ప్రైవేటు పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాయి.
- అంతర్జాతీయ పెట్టుబడుల నిబంధనను అమలుచేయడంలో ట్రంప్ సర్కారు జాప్యం చేయడం వల్ల అమెరికాకు స్టార్టప్‌లను తీసుకువచ్చే విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు.
- వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగాలన్న ట్రంప్ నిర్ణయం వల్ల- శుద్ధ ఇంధన సాంకేతిక పరిజ్ఞానం, ఇంధన స్టార్టప్‌లు అమెరికా నుంచి దూరంగా జరుగుతున్నాయి. ఇది కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థకు శరాఘాతమే.
- యాపిల్, గూగుల్, ఫేస్‌బుక్, గూగుల్, నెట్‌ఫ్లిక్స్‌లాంటివి అమెరికా ఆర్థికవ్యవస్థకు వెన్నుదన్ను అయితే.. బైదు, అలీబాబా, టెన్సెంట్ లాంటి టెక్ కంపెనీలతో చైనా దేశం సిలికాన్ వ్యాలీతో పోటీపడుతోంది. కృత్రిమ మేధ, పరిశోధన, స్టార్టప్‌లపై చైనా వందల కోట్ల డాలర్లను పెట్టుబడి పెడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ సాంకేతిక సామ్రాజ్యంపై అమెరికా గుత్తాధిపత్యానికి తెరపడొచ్చు.

ప్రవాసులు 'సృష్టికర్తలు'!

కొంగొత్త ఆలోచనల్తో.. వినూత్న స్టార్టప్‌లను, శీఘ్రగతిన విస్తరించే ప్రైవేటు కంపెనీల్ని సృష్టించడంలో వలసవచ్చిన వారు క్రియాశీల పోషిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వీరు ఎంతగా పాటుపడుతున్నారో ఈ అంకెల్ని(ఇవి 2016 జనవరి 1 నాటివి) చూస్తే అర్థమవుతుంది.

- అమెరికాలో ఏర్పాటయిన 87 పెద్ద స్టార్టప్ కంపెనీల్లో దాదాపు సగానికి పైగా(44) వలసవచ్చిన వారు ఏర్పాటుచేసినవే. వీటి విలువ దాదాపు 16800 కోట్ల డాలర్లు.
- ఈ కంపెనీల్లో మేనేజ్‌మెంట్, ఉత్పాదక అభివృద్ధి బృందాల్లో ఉంటున్నది దాదాపు 70 శాతం మంది ప్రవాసులే.
- వీటిలో ఒక్కో కంపెనీ అమెరికాలో సగటున 760 ఉద్యోగాలు సృష్టించింది.
- ఈ 44 స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకుల్లో కనీసం ఒక్కరైనా విదేశీయుడు ఉంటున్నారు.
- 87 స్టార్టప్‌లలో కనీసం 62 కంపెనీల్లో కీలకమైన చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, సీఈఓ, వైస్ ప్రెసిడెంట్‌లాంటి ముఖ్యమైన పదవుల్ని నిర్వహిస్తున్నది విదేశీయులే.
- వలసవచ్చిన వారు ప్రధానంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం(ఐటీ), ఆరోగ్యం, ఇంధనం, ఆర్థిక సేవలు తదితర రంగాల్లో సేవలందిస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో కీలక పాత్ర పోషిస్తున్న కొందరు విదేశీయులు



ఏ కంపెనీలో ఎందరు (ఈ గణాంకాలు 2015 చివరి నాటివి)

కంపెనీ	ఉద్యోగులు
స్పేస్‌ఎక్స్	4,000
ఎంయూ సిగ్మా	3,500
పలంతీర్ టెక్	2,000
యాప్ డైనమిక్స్	900
క్లౌడేరా	1,100
ఉబర్ ప్రత్యక్షంగా	900
పరోక్షంగా	1,62,037



ఫేస్‌బుక్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న విదేశీయులు

అతిపెద్ద కంపెనీల తరఫున అమెరికాలో పనిచేస్తున్న విదేశీ వృత్తి నిపుణులు (ఈ గణాంకాలు 2010-14 మధ్య నాటివి)

కంపెనీ	ఉద్యోగులు
ఇన్ఫోసిస్	31,861
విప్రో	26,540
యాక్సెంచర్	13,653
టెక్ మహీంద్ర	12,372
కాగ్నిజెంట్	29,676
మైక్రోసాఫ్ట్	12,335 (నాన్ ఔట్‌సోర్సింగ్)
డెలాయిట్	7927
ఐ గేట్ టెక్	6,312
ఇంటెల్	5953 (నాన్ ఔట్‌సోర్సింగ్)
టీసీఎస్	27,193
ఐబీఎం	9524
హెచ్‌సీఎల్ అమెరికా	5,897
గూగుల్	3929 (నాన్ ఔట్‌సోర్సింగ్)
ఎల్‌అండ్‌టీ	8489
యాపిల్	1873

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఏ దేశం నుంచి ఎందరు? వివిధ దేశాల నుంచి వచ్చి అమెరికాలో బిలియన్ డాలర్ల విలువైన కంపెనీలు ఏర్పాటుచేసిన వారిలో భారతీయులు మొదటి వరుసలో ఉన్నారు.

భారత్	కెనడా	బ్రిటన్	ఇజ్రాయెల్	జర్మనీ	చైనా	ఫ్రాన్స్	ఐర్లాండ్	మరో 12 దేశాల వారు
14	8	8	7	4	3	2	2	ఒక్కొక్కరు చొప్పున



సంధ్య మృతదేహం

మూఢ నమ్మకాలకు అంత్యక్రియలు ఎప్పుడో?

- అరిష్టమంటూ మృతదేహాన్ని అడ్డుకున్న గ్రామస్థులు
- శివారులోనే అంత్య సంస్కారాలు నిర్వహించిన కుటుంబం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆస్పత్రిలో మృతిచెందిన మహిళ మృతదేహాన్ని గ్రామంలోకి తీసుకువస్తే అరిష్టమని భావించిన గ్రామపెద్దలు ఊరి చివరే అడ్డుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో శనివారం జరిగింది. పెద్దపల్లి మండలం మారేడుగొండకు చెందిన పెనుగొండ సంధ్య(19) ఏడు నెలల గర్భిణి. ఇటీవల అనారోగ్యానికి గురైంది. కడుపులోనే శిశువు మృత్యువాత పడగా.. తల్లిప్రాణాలనైనా రక్షించాలన్న ఆతృతతో కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మృత్యువాత పడింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శనివారం గ్రామానికి తీసుకొస్తుండగా.. గ్రామస్థులు శివార్లలోఅడ్డుకున్నారు. మృతదేహం ఊరిలోకి వస్తే అరిష్టమంటూ గొడవకు దిగారు. చేసేది లేని వారు గ్రామ శివారులోనే అంత్యక్రియలు పూర్తిచేశారు. 'తల్లిదండ్రులు చిన్ననాడే మరణించడంతో సంధ్య అనాథగా పెరిగిందని, గ్రామస్థుల కారణంగా అనాథగానే అంత్యక్రియలు పూర్తిచేయాల్సి వచ్చిందని' ఆమె మేనత్త ఓదెలు కన్నీటి పర్యంతమయ్యారు.

విమాన టికెట్ల ధరలపై పరిమితి విధింపునకు కేంద్రం విముఖత

దిల్లీ: విమాన టికెట్లలో పైస్థాయి ధరలకు ఒక పరిమితిని విధించాలంటూ పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సూచనను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. అలా పరిమితిని విధిస్తే 99 శాతం మంది ప్రయాణికులపై అధిక భారం పడుతుందని తెలిపింది. టికెట్ల ధరలపై నియంత్రణను తొలగించటం వల్ల విమానయాన సంస్థల మధ్య పోటీ ఏర్పడి చౌకగా ప్రయాణించే అవకాశం దేశ ప్రజలకు లభించిందని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత విధానంలో ఆలస్యంగా టికెట్లు బుక్ చేసుకునే ఒకటి రెండు శాతం ప్రయాణికులపైనే అధికార భారం పడుతుందని వివరించింది. పైస్థాయి ధరలకు పరిమితి విధిస్తే మిగిలిన 98-99శాతం ప్రయాణికుల టికెట్ల ధరలు పెంచాల్సి వస్తుందని పేర్కొంది. పార్లమెంటు ముందుకు వచ్చిన స్థాయీ సంఘం నివేదికలో ''విమాన టికెట్ల పైస్థాయి ధరలు ముందస్తుగా టికెట్లు రిజర్వు చేసుకున్న వారికన్నా పదింతలు అధికంగా ఉంటున్నాయి. నియంత్రణ ఎత్తివేయటమంటే బాహాటంగా దండుకొనే స్వేచ్ఛనివ్వటం కాదు'' అని కమిటీ ఆక్షేపించింది.

93% భూముల దస్త్రాలపై స్పష్టత

- గ్రామాల్లో 2.38 కోట్ల ఎకరాలకు రికార్డులు
- వ్యవసాయ భూములు 60%, వ్యవసాయేతరాల్లో 5%, సర్కారు వద్ద 35% భూములు
- ఒక్కో రైతుకు సగటున రెండెకరాలు
- 'భూ దస్త్రాల ప్రక్షాళన'పై అధికారుల నివేదిక

ఈనాడు-హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని 93% భూముల దస్త్రాలపై స్పష్టత వచ్చింది. ప్రభుత్వం 30 జిల్లాల్లో 'భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం (ఎల్ఆర్‌యూపీ)' కింద రికార్డుల నవీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా 10,830 గ్రామాల్లోని భూములను రెవెన్యూ బృందాలు పరిశీలించాయి. తమ వద్ద నున్న మాత్రు దస్త్రాల(1బి)ను రైతుల వద్దనున్న సమాచారంతో అనుసంధానించి, రికార్డులను నవీకరించాయి. దీంతో మొత్తం 2,38,08,650.04 ఎకరాలకు సంబంధించిన దస్త్రాలకు స్పష్టత చేకూరింది. 1.42 కోట్ల ఎకరాలు (60% భూమి) రైతుల వద్ద ఉన్నట్లు లెక్క తేలింది. అంటే... ఒక్కో రైతుకు సగటున రెండేసి ఎకరాలున్నాయన్న మాట. ఈ కార్యక్రమంతో గ్రామాల్లోని సర్కారు భూముల లెక్క కూడా తేలింది. ప్రధానంగా వక్ఫ్, అటవీ భూములపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించడతో... రెవెన్యూ బృందాలు వాటి గణాంకాలను బయటకు తీశాయి. రహదారులు, దేవాలయాలు, విద్యుత్తు ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇతరత్రా ఆస్తుల కింద 35% భూమి ప్రభుత్వం వద్ద ఉన్నట్లు గుర్తించారు. రైతుల పేరున ఉండి, వ్యవసాయేతర రంగాల్లో వినియోగిస్తున్న భూములు, పడావుగా వదిలేసినవి 5% ఉంటాయని అధికారులు తేల్చారు.

అత్యధిక సాగుభూమి నల్గొండ జిల్లాలోనే

స్పష్టత వచ్చిన దస్త్రాల పరంగా సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటే... అత్యధికంగా నల్గొండ జిల్లాలో 11,11,821.02 ఎకరాల భూమి ఉన్నట్లు తేలింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 9,55,762.02 ఎకరాలు; రంగారెడ్డి 7,78,212.16; సంగారెడ్డి 7,37,292.26; సూర్యాపేట జిల్లాలో 6,25,790.16 ఎకరాలు సాగులో ఉన్నట్లు తేలింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం పరిశీలించిన భూమి 2,64,848.28 ఎకరాలు కాగా, అందులో 78,627.27 ఎకరాలు మాత్రమే సాగవుతున్నట్లు అధికారులు నిర్ధరించారు.

రాష్ట్రంలో భూ దస్త్రాల సమగ్ర చిత్రమిదీ...

- జిల్లాలు: 30
- మండలాలు: 568
- గ్రామాలు: 10,830
- మొత్తం పరిశీలించిన భూములు: 2,55,98,091.19 ఎకరాలు
- స్పష్టత వచ్చినవి: 2,38,08,650.04 ఎకరాలు (93%)
- స్పష్టతలేనివి: 17,89,595.18 ఎకరాలు (7%)
- స్పష్టంగా ఉన్న రైతుల ఖాతాలు: 71,75,096
- ప్రక్షాళనతర్వాత స్పష్టతవచ్చిన ఖాతాలు: 92%
- స్పష్టత వచ్చిన రైతుల సాగుభూమి: 1,42,12,826.17 ఎకరాలు (60%)
- స్పష్టత వచ్చిన వ్యవసాయేతర భూములు: 11,95,889.10 ఎకరాలు (5%)
- ప్రభుత్వ ఆస్తుల కింద ఉన్నవి: 83,99,934.78 ఎకరాలు (35%)

జిల్లాలవారీగా సాగుభూముల వివరాలు www.eenadu.netలో

సౌదీలో 11 మంది రాకుమారుల అరెస్టు

రియాద్: సౌదీ అరేబియాలో నిరసన చేపట్టిన 11 మంది రాకుమారులను అక్కడి రాచరిక ప్రభుత్వం అరెస్టు చేసింది. ఖర్చుల భారాన్ని తగ్గించుకునే చర్యల్లో భాగంగా.. రాజకుటుంబీకులకు నీటి, విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించేలా ఉన్న విధానాన్ని రద్దుచేస్తూ ఇటీవల సౌదీ రాజు ఉత్తర్వు ఇచ్చారు. దీన్ని వ్యతిరేకిస్తూ.. రియాద్‌లోని చారిత్రక ఖాస్ర్ అల్‌హోక్మ్ రాజభవనం వద్ద రాకుమారులు నిరసనకు దిగారు. నేరమేంటో వెల్లడించకుండానే తమ సోదరుల్లో ఒకరిని ఇటీవల శిక్షించినందుకు.. 'ఆర్థిక పరిహారాన్ని' కూడా వారు డిమాండ్ చేశారు. తప్పుడు డిమాండ్లు చేస్తున్న రాకుమారులను ఖాస్ర్ అల్‌హోక్మ్‌ను విడిచివెళ్లాలని ప్రభుత్వం సూచించందని.. వారు లెక్కచేయక పోవడంతో రాయల్‌గార్డ్స్ అరెస్టులు చేపట్టిందని ప్రభుత్వ సన్నిహిత వార్తా వెబ్‌సైట్ సబ్ఖ్ తెలిపింది. పటిష్ఠ భద్రత కలిగిన హాయిర్ కారాగారానికి వారిని తరలించారని.. ప్రభుత్వం వారిపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

- మరో ఘటనలో నక్సల్ చేతిలో సర్పంచ్ హతం
- బాక్సైట్ మైనింగ్ ప్రాంతంలోనూ విధ్వంసం
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఒకేరోజు వేర్వేరు ఘటనలు

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఒకేరోజు జరిగిన వేర్వేరు ఘటనల్లో ఒక మావోయిస్టు మరణించగా. .మావోయిస్టుల చేతిలో ఒక సర్పంచ్ హతమయ్యారు. మరో చోట ఆరు వాహనాలు దహనమయ్యాయి. బిజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి కర్కా అటవీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మావోయిస్టులు, ఆ జిల్లా రిజర్వ్ పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరగాయి. కాల్పుల అనంతరం గుర్తుతెలియని మావోయిస్టు మృత దేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్-ఝార్ఖండ్ రాష్ట్రాల సరిహద్దులో మావోయిస్టులు శుక్రవారం అర్ధరాత్రి తర్వాత విధ్వంసం సృష్టించారు. 50 మందితో కూడిన బృందం రాయ్‌పూర్‌కు 500 కి.మీల దూరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బలరాంపూర్, ఝార్ఖండ్ రాష్ట్రంలోని లటాహర్ జిల్లాల పరిధిలో అంతర రాష్ట్ర సరిహద్దు వెంట ఉన్న బాక్సైట్ మైనింగ్ క్షేత్రాలపై దాడులు నిర్వహించింది. గనుల తవ్వకానికి ఉపయోగించే పొక్లెయిన్లు, ట్రక్కులు సహా ఆరు వాహనాలను ధ్వంసం చేసింది. అక్కడున్న భద్రత సిబ్బందిని చితక బాదడంతోపాటు..సమీపంలోని వేబ్రిడ్జిని తగులబెట్టారు. ఇంకో ఘటనలో రాయ్‌పూర్‌కు 350 కి.మీ దూరంలోని చింద్గుర్ గ్రామ సర్పంచ్ పండ్రు(45) మావోయిస్టుల చేతిలో హతమయ్యాడు. కాంగర్ ఘాటి ఏరియా దళ సభ్యులు ఈ ఘటనకు పాల్పడినట్టు గుర్తించామని పోలీసు అధికారులు వెల్లడించారు.

దిల్లీలో పొగమంచుతో పలు రైళ్లు ఆలస్యం


రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: దిల్లీలో పొగమంచు కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. తెలంగాణ ఎక్స్‌ప్రెస్ 22 గంటలు ఆలస్యంగా నడిచింది. దిల్లీ నుంచి సికింద్రాబాద్‌కు శుక్రవారం సాయంత్రం 7 గంటలకు రావాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం 5 గంటలకు వచ్చింది. ఆదివారం ఉదయం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ దిల్లీకి సరైన సమయంలోనే బయలుదేరుతుందని సికింద్రాబాద్ స్టేషన్ మాస్టర్ ప్రసాద్ తెలిపారు. జమ్ముతావి నుంచి తిరుపతికి వెళ్లే రైలు, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. దురంతో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రావాల్సి ఉండగా ఆదివారం ఉదయం 6 గంటలకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. రైళ్లు చేరుకునే, బయలుదేరుతున్న సమయాన్ని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

కేసీఆర్ దార్శనికుడు

- తెలంగాణపై ప్రధాని మోదీకి ప్రత్యేక అభిమానం
- కేంద్ర మంత్రి మహేష్‌శర్మ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సుభిక్ష, సుందర రాష్ట్రమని.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర అటవీ, పర్యావరణ, సాంస్కృతిక శాఖ మంత్రి మహేష్‌శర్మ కొనియాడారు. సీఎం కేసీఆర్ గొప్ప పథకాలను అమలు చేస్తున్నారని కితాబునిచ్చారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని సితార హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కాలమానిని, స్టిక్కర్, రాష్ట్ర పర్యావరణ నివేదికలను మంత్రి జోగు రామన్నతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మహేష్‌శర్మ మాట్లాడుతూ 'కేసీఆర్ దార్శనికత ఉన్న నాయకుడు. ఆయన వినూత్న నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి ఆయువు. చరిత్రాత్మక ఘట్టాలకు తెలంగాణ నిలువుటద్దం. అందుకే ఈ రాష్ట్రంపై ప్రధాని మోదీకి ప్రత్యేక అభిమానం. తెలంగాణకు కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తుంది. హరితహారం దేశానికే ఆదర్శం. నాలుగేళ్లలో 230 కోట్ల మొక్కలను నాటడం అంటే మామూలు విషయం కాదు. హెలికాప్టర్‌లో వస్తూ తెలంగాణలో పచ్చదనాన్ని గమనించాను. ఇక్కడ పర్యాటకంతో రాష్ట్ర భవిష్యత్తు మారనుంది' అన్నారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కేసీఆర్ చేపడుతున్న పథకాలతో తెలంగాణ.. దేశంలోనే అనేక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో లైవ్ స్టాక్ హెరిటేజ్ ఫాం నెలకొల్పాలని ఆయన కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, పీసీబీ సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ చక్రవర్తి, సలహాదారు ఎస్‌డీ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో పర్యావరణ నివేదిక: పర్యావరణంపై విశ్వసనీయ సమాచారాన్ని ప్రభుత్వానికి, ప్రజలకు వెల్లడించేందుకు పర్యావరణ నివేదికలు రూపొందించాలని కేంద్రం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం.. పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ)కి ఈ బాధ్యతలు అప్పగించింది.



శనివారం ఆర్ఎఫ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న. చిత్రంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు

ఆవుపేడకు రూ.42 కోట్లా : తప్పుపట్టిన కాగ్

దిల్లీ: రైళ్లలో జీవ మరుగుదొడ్లను (బయోటాయిలెట్లను) అమరుస్తున్నామనీ, దుర్వాసన సమస్య తీరిపోతుందనీ రైల్వే చెబుతున్న మాటలు ఉత్తుత్తివేనని బయటపడింది. భారీ వ్యయంతో 44.8% రైళ్లలో వీటిని అమర్చినా పనితీరు నాసిరకంగానే ఉందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పెదవి విరిచింది. బ్యాక్టీరియాను ఈ మరుగుదొడ్లలో తిరిగి నింపడానికి 3350 ట్రక్కుల నిండా ఆవుపేడ అవసరమవుతుందనీ, దీని నిమిత్తం రూ.42 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందనీ తేల్చింది. జీవ మరుగుదొడ్లలో కింది భాగాన ఒక మురుగు శుద్ధి కర్మాగారం తరహా వ్యవస్థ ఉంటుంది. దీనిలో ఉండే బ్యాక్టీరియా... మానవ మలాన్ని అరిగించుకుని నీరు, మీథేన్ వాయువే మిగిలేలా చేయాలి.

కాగ్ ఏం గుర్తించిందంటే...: 25 వేల జీవ మరుగుదొడ్ల పనితీరును కాగ్ సమీక్షిస్తే ఏకంగా 1,99,689 లోపాలు బయటపడ్డాయి. మామూలు సెప్టిక్ ట్యాంకుల కంటే ఇవి ఏమాత్రం మెరుగ్గా లేవని తేలింది. బెంగళూరు కోచింగ్ డిపో పరిధిలో ఎక్కువ లోపాలు వెలుగుచూశాయి. ఏడు రకాలపై పరిశీలన పూర్తి కాకముందే 10 వేల ట్యాంకుల్ని కొనడం వల్ల పెద్దఎత్తున నిధులు వృథా అయ్యాయని కాగ్ గుర్తించింది. కాగ్ నివేదిక ప్రకారం ప్రతీ మరుగుదొడ్డికీ మూడు పెద్ద బకెట్ల నిండా నీళ్లతో కలిసిన ఆవుపేడ అవసరం. అంటార్కిటికాలో రక్షణ రంగ శాస్త్రవేత్త ఒకరు గుర్తించిన బ్యాక్టీరియాను జీవ మరుగుదొడ్లలో మొట్టమొదట వాడారు. 2017 నాటికి 97,761 మరుగుదొడ్లను బయో టాయిలెట్లుగా మార్చారు. డీఆర్‌డీవో ఇచ్చిన నమూనా అమలులో లోపాలను సరిచేయకుండానే కొత్తవి కొన్నారు. బాక్టీరియాను సమకూర్చుకోవడంలో రైల్వే విఫలం కావడంతో ప్రైవేటురంగం నుంచి లీటరుకు రూ.19 లెక్కన ఆవుపేడను కొని వాడుతున్నారు. వాక్యూం టాయిలెట్లను అన్ని రైళ్లలో అమర్చాలంటే రూ.10,900 కోట్ల అదనపు ఖర్చు తప్పదు.

ఈనాడు బిజినెస్ వారాంతం

చమురు మంటలు

ప్రపంచం చాలా చిన్నది. ఎంతలా అంటే అంతర్జాతీయంగా ఏ పరిణామం చోటు చేసుకున్నా దాని ప్రభావం ప్రతీ ఆర్థిక వ్యవస్థ మీదా ఉంటుంది. 2008లో లేమాన్ బ్రదర్స్ సంక్షోభం కాస్తా.. ప్రపంచ సంక్షోభంగా మారింది. అంతెందుకు ఇటీవలి ఉత్తర కొరియా అనిశ్చితులు.. ప్రస్తుత ఇరాన్ కూడా ప్రపంచాన్ని వణికించాయి. ఏమవుతుందో ఏమో అని అందరూ భయపడ్డారు.. భయపడుతున్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మారినా అంతే. చమురు దిగుమతిపై ఆధారపడే ప్రతీ దేశం ఖజానా బిత్తరచూపులు చూడాల్సిందే. ఇపుడు భారత్ పరిస్థితీ అంతే..!

- ఈనాడు వాణిజ్య విభాగం

ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రెండున్నరేళ్లకు పైగా గరిష్ఠ స్థాయికి చేరాయి. ఇరాన్‌లో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్ ధర 68 డాలర్లకు పైగా చేరింది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌తో కలిసి అణు ఒప్పందం కుదుర్చుకోబోదన్న వార్తలు ఇందుకు నేపథ్యం. ఒప్పందానికి గడువు అయిన జనవరి 13 సమీపిస్తున్న కొద్దీ ఆ భయాలు మరింత ఎక్కువవుతున్నాయి. మన చమురు అవసరాల్లో దాదాపు 80 శాతం దిగుమతుల ద్వారానే అమర్చుకుంటున్న మన భారత్‌పై ఈ పరిణామాలన్నీ ప్రతికూల ప్రభావాలను తెచ్చిపెట్టేవే.

చమురు ధరలు 50-55 డాలర్ల స్థాయిలో ఉన్నంత వరకూ భారత ఆర్థిక వ్యవస్థకు భయం అక్కర్లేదని విశ్లేషకులు చెప్పేవారు. కానీ ఇపుడు అది 68 డాలర్లకు చేరే సరికి 'చమురు మీద సాము'లా తయారైంది. ఇటీవలే ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించడం కోసం ప్రభుత్వం సుంకాలను తగ్గించడం తెలిసిందే. ఇంతకీ చమురు ధరలు తగ్గితే భారత్‌పై ఏ రూపంలో ప్రభావం ఉంటుందో చూద్దాం.

ఈ ఏడాది మరింత పైకి!

గతేడాది నుంచి పెరగడం మొదలుపెట్టిన చమురు ధరలు ఈ ఏడాది కూడా అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా పైకే వెళతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. నవంబరు 2014 తర్వాత కనిపించని 70 డాలర్ల స్థాయిని త్వరలోనే అందుకుంటుందనీ అనుకుంటున్నారు. అయితే ఈ ఏడాది మొత్తం మీద చమురు ధరలు 50-68 డాలర్ల మధ్య కదలాడవచ్చని భావిస్తున్నారు. 2014లో ఏకంగా 107.68 డాలర్లకు చేరిన ధరలు 2016లో 26.05 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 2017లో ఒపెక్ దేశాలు, రష్యాలు ఉత్పత్తి కోత వేయడంతో క్రమంగా ధరలు పుంజుకున్నాయి. ఈ ఉత్పత్తి తగ్గింపు ఒప్పందం ఈ ఏడాదీ కొనసాగుతుంది కాబట్టి ఈ ఏడాదంతా ధరలు పెరుగుతూనే ఉండొచ్చన్నది విశ్లేషకుల భావనగా ఉంది.



1 ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు

ముడి చమురు ధరలు పెరిగే కొద్దీ ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పడుతుంది. ఇప్పటికే డిసెంబరులో జరిగిన రిజర్వ్ బ్యాంక్ పరపతి విధాన సమీక్షపై ఆ ప్రభావం పడింది కూడా. రాబోయే సమీక్షలపైనా ఇది ప్రభావం చూపవచ్చు. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల ద్రవ్య లోటు, కరెంట్ ఖాతా లోటులు కూడా అధ్వానమవుతాయని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ నొమురా అంటోంది. బ్యారెల్ ధర పెరిగే ప్రతీ 10 డాలర్లకు భారత ద్రవ్య లోటు 0.1 శాతం తగ్గుతుంది.

2 పెట్రోలు, డీజిల్ ధరలు

మన దేశంలో డీజిల్ ధరలపై నియంత్రణ ఎప్పుడో ఎత్తివేశారు. ఈ నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరిగితే అది నేరుగా వీటి ధరలపై ప్రభావం చూపుతుంది. ఇప్పటికే దిల్లీలో డీజిల్ లీటరు ధర ఆల్‌టైం గరిష్ఠ స్థాయి అయిన రూ.59.38కి చేరింది. పెరిగిన ముడి చమురు ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడం ద్వారా నేరుగా వినియోగదార్లకు బదిలీ చేశాయే అనుకుందాం. అపుడు ముడి చమురు ధరల ప్రతీ 10 శాతం పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం 0.25 శాతం చొప్పున పెరుగుతుంది.

3 దిగుమతి బిల్లు

బ్యారెల్ ధర ఒక డాలరు పెరిగినా.. భారత దిగుమతి బిల్లు 1.33 బిలియన్ డాలర్ల మేర పెరుగుతుంది. ఇది దేశీయ కరెన్సీ మీద ఒత్తిడి తీసుకువస్తుంది. రూపాయి మారక విలువ(డాలరుతో పోలిస్తే) తగ్గే ప్రతీ రూపాయిపైనా దిగుమతి బిల్లు 1.03 బిలియన్ డాలర్లు పెరుగుతుంది. ఇలా జరగడం వల్ల అధిక ద్రవ్యలోటుకు దారి తీస్తుంది. ఒక వేళ ప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీ(ఓఎమ్‌సీ)లకు పెట్రోలు, డీజిల్ ధరలను పెంచుకోవడానికి అనుమతి ఇవ్వకపోతే.. దిగుమతి బిల్లు మరింత పెరుగుతుంది.

4 వృద్ధి

గతేడాది నవంబరులో పెద్ద నోట్ల రద్దు, జులై 1 నుంచి జీఎస్‌టీ అమలు కానున్న నేపథ్యంలో జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ మూడేళ్ల కనిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పుడిప్పుడే ఆ ప్రభావాల నుంచి బయటపడి పరుగులు తీయడానికి సిద్ధంగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు తాజాగా ముడి చమురు ధరల రూపంలో వృద్ధి వేగానికి కళ్లెం పడేలా కనిపిస్తోంది. బారెల్ ధర 10 డాలర్ల చొప్పున పెరిగే కొద్దీ జీడీపీ వృద్ధి 0.15 శాతం దాకా తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనాలే చెబుతున్నాయి.

5 స్టాక్ మార్కెట్లు

వృద్ధి మందగిస్తే మదుపర్ల సెంటిమెంటు సాధారణంగానే దెబ్బతింటుంది. ప్రస్తుతం మన మార్కెట్లు ఆసియాలోనే అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తున్నాయి. గతేడాది సెన్సెక్స్, నిఫ్టీలు 27% దాకా లాభపడ్డాయి. బలహీన ఆర్థిక వృద్ధి, అధిక షేరు ధరలకు తోడు కార్పొరేట్ ఫలితాలు నిరుత్సాహకరంగా వెలువడడంతో ఎఫ్ఐఐలు ఆగస్టు, సెప్టెంబరులో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. తాజాగా ప్రభుత్వ బ్యాంకులకు మూలధనం ఊతాన్ని ప్రకటించడంతో ఎఫ్ఐఐలు నవంబరులో మన మార్కెట్ల పట్ల ఆకర్షితులయ్యారు. తాజా పరిణామంతో మార్కెట్లు ఏ దిశగా నడుస్తాయో చూడాలి.

ఎందుకు పెరిగాయంటే..

గత కొద్ది రోజులుగా చమురు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ నిల్వలు తగ్గడం ఇందుకు నేపథ్యం. 2014లో 100 డాలర్లకు చేరిన చమురు ధరలు విపరీతమైన ఉత్పత్తి, ఇతరత్రా కారణాల వల్ల 2016 కల్లా 40 డాలర్లకు చేరాయి. ఇది చమురు ఎగుమతి దేశాల ఆర్థిక స్థితిని బాగా దెబ్బతీశాయి. దీంతో పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య(ఒపెక్) పరిస్థితులను చక్కదిద్దడానికి పూనుకుంది. ఉత్పత్తిలో కోత విధించడానికి పూనుకున్నాయి. గత సంవత్సర కాలంగా అదే పనిలో ఉన్నాయి. మార్చి తర్వాత కూడా ఆ కోతను కొనసాగిస్తాయన్న సంకేతాలే గత కొద్ది కాలంలో చమురు ధరలు పెరగడానికి కారణమయ్యాయి. ఈ ప్రభావంతో ఇటీవల బ్యారెల్ ధర 65 డాలర్లకు చేరింది. తాజాగా 68 డాలర్లకు చేరడానికి ఇరాన్ అనిశ్చితులే కారణం.

మనం మారాల్సిన అవసరం ఉందా?

చమురు ధరలు ఇన్నాళ్లు తక్కువగా(50-55 డాలర్లు) ఉండడంతో దిగుమతుల వల్ల పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ఒక వేళ ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మనకు ఎప్పటికైనా ఇబ్బందే. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని దేశీయ చమురు ఉత్పత్తిని పెంచడంతో పాటు షేల్ గ్యాస్, పునరుత్పాదక ఇంధనం దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

3
ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మూడో చమురు దిగుమతిదారు భారతే.

40
2014 తొలి భాగంలో 100 డాలర్లుగా ఉన్న చమురు ధరలు 2016లో 40 డాలర్లకు పరిమితయ్యాయి.

64 బిలియన్ డాలర్లు
2015-16లో దేశ చమురు బిల్లు సగానికి సగం తగ్గి 64 బిలియన్ డాలర్లకు పరిమితమైంది.

4.45 మి.బ్యారెళ్లు
భారత్‌కు రోజుకు 4.45 మిలియన్ బ్యారెళ్ల మేర అవసరం ఉంటోంది.

2040
ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనాల ప్రకారం.. భారత్ 2040 వరకూ ముడి చమురు దిగుమతి విషయంలో ముందుంటుంది.


బ్యాంకులు సమాజం కోసం పనిచేయాలి

- పన్ను చెల్లింపుదార్లు త్యాగాలు చేస్తున్నారు
- వారి విశ్వసనీయత పొందాలి: జైట్లీ



దిల్లీ: దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థకు పరీక్షా కాలం నడుస్తోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదార్లు చేస్తున్న త్యాగాలకు ప్రతిఫలంగా బ్యాంకులు సమాజం కోసం పనిచేసి.. వారి విశ్వసనీయతను తిరిగి పొందాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో పన్ను చెల్లింపుదార్ల సొమ్ము ఉందని, అందువల్ల బ్యాంకింగ్ రంగ బలాన్ని మెరుగుపరచి.. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాల్సిన బాధ్యత ఉందని అభిప్రాయపడ్డారు. యూకో బ్యాంక్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వం తను చేయాల్సిన పని తాను చేస్తోందని.. ఉద్యోగులు, యాజమాన్యాలు సైతం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్‌లో పన్ను చెల్లింపుదార్లంటే కేవలం కార్పొరేట్లు మాత్రమే కాదని.. అందులో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు ఉన్నారని చెప్పారు. మరోవైపు ప్రభుత్వ బ్యాంకులకు మూలధన సాయం చేయడం వల్ల రుణాల వృద్ధి గణనీయంగా పెరిగిందని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ వెల్లడించారు. దేశంలో ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకోవడానికి ఇది సంకేతమని అన్నారు.

కోడిగుడ్లు



6వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	398	వరంగల్	400
చిల్లరగా (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	400
బెంగళూరు	400	చెన్నై	405
7న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	396	నమక్కల్	395

ఒక్క సీఏ కోర్సు పూర్తి చేస్తేనే చాలదు..

ఈనాడు - హైదరాబాద్



కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పైనా ప్రభావం చూపనున్నాయని, సీఏలు కూడా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా కొత్త సేవలు అందించాలని అకౌంటింగ్ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో సీఏలకు కొరత ఉందని, భవిష్యత్తులో ఇంకా పెరగగలదని అంచనా వేస్తున్నారు. విద్యార్థులు కేవలం సీఏ కోర్సును మాత్రమే పూర్తి చేస్తే సరిపోదని, ప్రొడక్ట్ మేనేజిమెంట్ వంటి ప్రత్యేక అంశాల్లో సర్టిఫికేట్ కోర్సులు చేస్తే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. మొత్తం సీఏలలో మహిళలు 25 శాతం ఉన్నప్పటికీ.. ఈ శాతం ఇంకా పెరగాలని అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సీఏ విద్యార్థుల సదస్సులో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడారు.

☛ ఎంఎన్‌సీ కంపెనీలో చేరితే..

బహుళ జాతి కంపెనీల్లో చేరితే అంతర్జాతీయంగా ఎక్కడైనా పని చేయడానికి అవకాశం లభిస్తుంది. ఉత్తమ అకౌంటింగ్ ప్రమాణాలపై పట్టు వస్తుంది. ప్రపంచంలో ఎక్కడికైనా పోవచ్చు. బహుళ జాతి కంపెనీల్లో పని చేయడం దీర్ఘకాల విజయానికి కీలకం.

- జి.చైతన్య, ఫైనాన్స్ అధిపతి, డి.ఇ.షా ఇండియా సాఫ్ట్‌వేర్

☛ ప్రాక్టీస్ చేస్తున్న వారు తక్కువే

దేశంలో కేవలం 90,000 సీఏలు మాత్రమే ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఉద్యోగంలో కంటే ప్రాక్టీస్ చేయడంలో పోటీ తక్కువ ఉంటుంది. భవిష్యత్తు కూడా బాగుటుంది. సంప్రదాయ సేవలను అందించడం కన్నా.. అకౌంటింగ్ అండ్ పే రోల్ అవుట్ సోర్సింగ్, ఐఎఫ్‌సీ సమీక్షలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) అమలు వంటి సేవలను అందించడంపై సీఏలు దృష్టి పెట్టాలి.

- దయానివాస్ శర్మ, మేనేజింగ్ పార్టనర్, లక్ష్మీనివాస్ అండ్ కంపెనీ

☛ లింగ భేదం లేదు

సీఏగా పని చేయడానికి లింగ భేదం లేదు. 2000 సంవత్సరం వరకూ మహిళ సీఏలు చాలా తక్కువ మంది ఉన్నారు. ఆ తర్వాత నిదానంగా పెరుగుతున్నారు. ప్రస్తుతం దేశంలోని మొత్తం సీఏలలో మహిళలు 25 శాతం మంది ఉన్నారు. సామాజిక పరమైన కట్టుబాట్లు, పురుషాధిపత్య వృత్తి, వృత్తి, సాధారణ జీవితం మధ్య సమతౌల్యం వంటి అంశాలు మహిళలకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. మహిళలు, ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. ప్రతి ఏడాది సీఏ ఫైనల్ పరీక్షను దేశ వ్యాప్తంగా 42,000 మంది రాస్తున్నారు. ఇందులో 6-7 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులవుతున్నారు. సాధారణంగా పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఉత్తీర్ణులు అవుతున్నారు. భవిష్యత్తులో సీఏల్లో మహిళల శాతం ఇంకా బాగా పెరగాల్సి ఉంది.

-ఎస్. అపర్ణ, చార్టర్డ్ అకౌంటెంట్

☛ సీఏలపైనా ప్రభావం..

కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు సీఏ వృత్తిపై ప్రభావం చూపనున్నాయి. వీటిని ఉపయోగించి అకౌంటింగ్, ఆడిటింగ్ సేవలను ఆటోమేట్ చేయొచ్చు. ఫ్రాడ్ డిటెక్టింగ్ సేవలను కూడా మెషిన్ లెర్నింగ్ ద్వారా పొందొచ్చు. బ్లాక్ చైన్ టెక్నాలజీ ఓపెన్ డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జరు. ఇరు వర్గాల మధ్య మరింత సమర్థవంతంగా, పారదర్శకతతో లావాదేవీలను రికార్డు చేయగలదు. సాంకేతిక పరిజ్ఞానం నుంచి వచ్చే పోటీకి అనుగుణంగా టెక్నాలజీ ఆధారంగానే సేవలందించే విధంగా సీఏలు సిద్ధం కావాలి.

- అజయ్ గాంధీ, ఎండీ, వింగ్స్ ఇన్ఫోనెట్

సీఏలకు కొరత ఉంది..



దుబాయ్, అబుదాబి, షార్జా, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాల్లో భారత చార్టర్డ్ అకౌంటెంట్లకు మంచి ఆదరణ ఉంది. అకౌంటింగ్‌లో మంచి సామర్థ్యాలు, పని తీరు బాగా ఉండడం వల్లే విదేశాల్లో మన అకౌంటెంట్లకు గిరాకీ. కంపెనీల్లో ఉద్యోగాలతోపాటు ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకోవడానికి కూడా మంచి అవకాశాలు ఉన్నాయి. వాస్తవానికి అవసరాని కంటే అందుబాటులో ఉన్న సీఏలు తక్కువగా ఉన్నారు. భవిష్యత్తులో సీఏల అవసరం మరింత పెంపగుతుంది. 8.5 లక్షల మంది దేశ వ్యాప్తంగా సీఏ కోర్సును పూర్తి చేయడానికి ప్రయత్నిస్తుంటే.. 2.5 లక్షల మంది (దాదాపు 29 శాతం) దక్షిణాది ప్రాంతంలోనే ఉన్నారు. ఐసీఏఐలో సభ్యత్వం ఉన్న మొత్తం 2.7 లక్షల సీఏల్లో 58,000 మంది దక్షిణాదికి చెందిన వారే. ఇటీవలి కాలంలో సీఏ విద్యపై ఎక్కువ మంది మహిళలు ఆసక్తి చూపుతున్నారు. సీఏ కోర్సు పూర్తి చేయడానికి సిద్ధమవుతున్న వారిలో సగానికి సగం మంది మహిళలే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా సహా దక్షిణాది రాష్ట్రాలు, పాండిచ్చేరి దక్షిణ భారత ప్రాంతీయ మండలి (సిర్క్) పరిధిలోకి వస్తాయి.

- అడుసుమిల్లి వేంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్, దక్షిణ భారత ప్రాంతీయ మండలి, ఐసీఏఐ

సర్టిఫికెట్ కోర్సులు చేయాలి



ప్రతి ఏడాది జాబ్ మార్కెట్‌లోకి 3 కోట్ల మంది ప్రవేశిస్తుంటే.. సంఘటిత రంగంలో 4 లక్షల ఉద్యోగావకాశాలే లభిస్తున్నాయి. ప్రత్యేక నైపుణ్యాలు లేని వారికి ప్రాధాన్యం ఉండదు. సీఏ విద్యార్థులు ప్రొడక్ట్ మేనేజిమెంట్, బడ్జెట్ విశ్లేషణ వంటి ప్రత్యేక అంశాల్లో సర్టిఫికేషన్ కోర్సులు చేస్తే ఆయా రంగాల్లోని కంపెనీలు నియామకాల సమయంలో ప్రాధాన్యం ఇస్తాయి. నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకోవడానికి దోహదం చేస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ వంటి సంస్థలు అందించే కోర్సులు కూడా సీఏ విద్యార్థులు చేయొచ్చు.

-మహేశ్వర్ పేరి, ఛైర్మన్ కెరీర్స్ 360

పరేఖ్ వేతనం సహేతుకమే

- నీలేకనీ పాత తప్పులను సరిదిద్దుతున్నారు
- ఇన్ఫీ మాజీ సీఎఫ్ఓ బాలకృష్ణన్



బెంగళూరు: ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, బోర్డు ఛైర్మన్ నందన్ నీలేకనీపై కంపెనీ మాజీ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) వి.బాలకృష్ణన్ ప్రశంసల వర్షం కురిపించారు. పాత బోర్డు చేసిన తప్పులను నీలేకనీ సరిదిద్దుతున్నారని, కొత్త సీఈఓ సలీల్ పరేఖ్ వేతనం సహేతకంగానే ఉందని అభిప్రాయపడ్డారు. 'నందన్ నేతృత్వంలోని బోర్డు సరిగ్గానే వ్యవహరిస్తోంది. పాత బోర్డు చేసిన తప్పులను పునరావృతం కానివ్వడం లేదు. ప్రస్తుత సీఈఓ సలీల్ పరేఖ్ వేతన ప్యాకేజీలో అధిక భాగం చలన (వేరియబుల్)తో ఉండటంతో సహేతుకంగానే కనిపిస్తోంద'ని బాలకృష్ణన్ పేర్కొన్నారు. సీనియర్ స్థాయి కార్యవర్గం (మేనేజ్‌మెంట్)కు పనితీరు ఆధారంగా వేరియబుల్ వేతనాన్ని నిర్ణయించడం బోర్డుకు చాలా కీలకమని వెల్లడించారు. 'అద్భుతమైన వృద్ధి సాధించడం ద్వారా వాటాదార్ల విలువ పెంచమే లక్ష్యంగా బోర్డు చర్యలు తీసుకుంటోంది. బోర్డు ఏదైనా కొత్త నిర్ణయం తీసుకుంటే.. దాన్ని వాటాదార్లకు సరిగ్గా వివరించాలి' అని అన్నారు. ఇటీవల కంపెనీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్‌కు గరిష్ఠ వార్షిక వేతన ప్యాకేజీ రూ.18.6 కోట్లుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో స్థిర వేతనం రూ.6.5 కోట్లు కాగా.. చలన వేతనం రూపంలో రూ.9.75 కోట్లు లభిస్తుంది.

లక్ష్యం వేతనాల పెంపునకు పనికొచ్చింది: 'ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు పాటించిన సంస్కృతి, విలువలను పాత బోర్డు అర్థం చేసుకోలేకపోయింది. ఫలితంగా సీనియర్ కార్యవర్గం వేతనాలు భారీగా పెరిగాయి. మొత్తం సంస్థతో పోలిస్తే భారీ తేడాలు వచ్చాయి. సరైన కారణం లేకుండానే మాజీ సీఈఓ విశాల్ సిక్కా వేతనం గణనీయంగా పెరిగింది. మిగతా సంస్థలోని ఉద్యోగుల జీతాలు కొద్దిగా పెరగ్గా, చలన వేతనం కూడా తగ్గింది' అని బాలకృష్ణన్ తెలిపారు. 2020 నాటికి 20 బిలియన్ డాలర్ల ఆదాయానికి చేరాలన్న లక్ష్యం వేతనాల పెంపునకు ఉపయోగపడిందని ఆయన ఆరోపించారు. అత్యుత్తమ ప్రతిభను గుర్తించడానికి సీఈఓ పారితోషికం సహేతుకంగా ఉండాలని, అదే సమయంలో పోటీ సంస్థలకు సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. వ్యవస్థాపకులు కంపెనీని నడిపించిన సమయంలో.. సీనియర్ కార్యవర్గం వేతనాలు సమంజసంగా ఉండేవని, ఎప్పుడు ఎక్కువగా అనిపించేవి కావని అన్నారు. కష్టసమయాల్లోనూ.. నాయకత్వమే ఆ బాధను భరించేందని వెల్లడించారు. ఒక వాటాదారుగా, బోర్డులో తొందరగా పునర్వ్యవస్థీకరణ జరగాలని బాలకృష్ణన్ చెప్పుకొచ్చారు.

మ్యాట్ నిబంధనలు సడలింపు

దివాలా చర్యలు ఎదుర్కొంటున్నవాటికే

దిల్లీ: కార్పొరేట్ దివాలా చర్యలు ఎదుర్కొంటున్న కంపెనీలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) విధింపు నిబంధనలను ఆదాయపు పన్ను విభాగం సడలించింది. ఆదాయపు పన్ను చట్టంలోని 115జేబీ సెక్షన్ ప్రకారం. . పాత నష్టాలు లేదా లెక్కవేయలేని తరుగుదలలో నుంచి లాభాన్ని తీసివేసి.. ఏదీ తక్కువగా ఉంటే దానిపైన మ్యాట్ విధిస్తారు. 2018-19 మదింపు సంవత్సరం నుంచి.. దివాలా స్మృతి కింద చర్యలు ఎదుర్కొంటున్న కంపెనీలు పాత నష్టాలు (లెక్కవేయలేనివి)తో నుంచి లాభాన్ని తీసివేసి.. మిగిలిన మొత్తంపై మాత్రమే కనీస ప్రత్యామ్నాయ పన్నును విధిస్తారని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. కంపెనీలు ఎదుర్కొంటున్న కష్టాలను తగ్గించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రుణాల ఎగవేసిన కంపెనీలపై.. దివాలా చట్టం కింద జాతీయ కంపెనీ లా ట్రైబ్యూనల్‌ను రుణదాతలు ఆశ్రయిస్తున్న విషయం తెలిసిందే.

పాన్.. ఓసారి చూసుకోండి!

శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)కు ఆధార్‌ను అనుసంధానం చేశారా? ఇంతటితో మీ బాధ్యత పూర్తి కాలేదు. ఓసారి మీ పాన్ చెల్లుబాటులో ఉందా లేదా అనేదీ చూసుకోండి.

2017లో దాదాపు 10లక్షలకు పైగా పాన్ కార్డుల్లో కొన్నింటిని తాత్కాలికంగా నిలిపి వేయడం.. రద్దు చేయడం లాంటివి జరిగాయి. మరి, మీ పాన్ ఆ జాబితాలో లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోండి.

నకిలీ పాన్‌కార్డులను ఏరివేయడానికి.. వాటిని ఆధార్‌తో జత చేయాల్సిందిగా ఆదాయపు పన్ను శాఖ సూచించింది. ఇప్పటికీ ఇంకా ఈ అనుసంధానం పూర్తి చేయని వారికి మార్చి 31, 2018 వరకూ గడువు ఉంది. అయితే, డూప్లికేట్ పాన్‌లను గుర్తించే ప్రక్రియ పూర్తిగా కంప్యూటర్లే నిర్వహిస్తాయి కాబట్టి, కొన్నిసార్లు చిన్న పొరపాటుతో పాన్ రద్దు అయ్యే అవకాశం ఉంది.

ముందుగా మీరు ఆదాయపు పన్ను శాఖ ఈ ఫైలింగ్ వెబ్‌సైటు https:///incometaxindiaefiling.gov.in లోకి వెళ్లి.. అక్కడ ఉన్న Know Your PAN అనే బటన్‌ను క్లిక్ చేయండి. అక్కడ అవసరమైన వివరాలను ఇవ్వడంతోపాటు, మీ మొబైల్ నెంబరును పేర్కొంటే.. ఓటీపీ వస్తుంది. దాన్ని పేర్కొన్న తర్వాత.. మీరు తెలిపిన అన్ని వివరాలూ సరిగ్గా ఉంటే. మీ పాన్ 'ఆక్టివ్'గా ఉందా లేదా? అనే సమాచారం వస్తుంది. ఆక్టివ్‌గా ఉంటే ఇబ్బందేమీ లేదు. ఒక వేళ బ్లాక్ అయినా లేదా డీఆక్టివేట్ అయ్యిందని సమాచారం వస్తే ఏం చేయాలి?



■ మీ పరిధిలోని ఆదాయపు పన్ను శాఖ అసెసింగ్ ఆఫీసర్ (ఏఓ)కు మీ పాన్ యాక్టివేట్ చేయాల్సిందిగా లేఖ రాయాలి. దీనికి ఆదాయపు పన్ను శాఖను ఉద్దేశించి ఇండెమ్నిటీ బాండ్‌ను సిద్ధం చేయాలి. మీ దగ్గర ఉన్న పాన్ కార్డు నకలును, గత మూడేళ్లుగా సమర్పించిన ఆదాయపు పన్ను రిటర్నుల నకళ్లనూ దీనికి జత చేయాలి.

అన్నీ సవ్యంగానే ఉన్నాయని ఆదాయపు పన్ను శాఖ ధ్రువీకరించుకుంటే.. 10-15 రోజుల్లో మీ పాన్ తిరిగి చెల్లుబాటులోకి వస్తుంది.

చేయకండి.. ఈ పొరపాట్లు

ఆర్థిక విషయాల్లో కొన్ని పొరపాట్లు ఇప్పుడు మామూలుగానే కనిపించవచ్చు. కానీ, నాలుగైదేళ్ల తర్వాత వాటి గురించి ఆలోచిస్తే... ఎంత ఖరీదైన తప్పు చేశామో అర్థం అవుతుంది. అందుకే, డబ్బుకు సంబంధించి జాగ్రత్తగా ప్రణాళికలు వేసుకోవాలి. అప్పుడే ఆర్థిక ఆరోగ్యం సాధ్యమవుతుంది. సాధారణంగా మనం చేసే పొరపాట్లేమిటి? వాటిని ఎలా అధిగమించాలో చూద్దామా!

నిధి.. అవసరమా!



అవసరం వచ్చినప్పుడు చూద్దాం.. ఇప్పుడు అంత డబ్బు ఎక్కడ జమ చేస్తాం.. అత్యవసర నిధి గురించి మాట్లాడినప్పుడు చాలామంది ఇచ్చే సమాధానం ఇది. అవసరం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో ఊహించడం కష్టం. అనుకోని ప్రమాదం జరగొచ్చు. అనారోగ్యం రావచ్చు. ఉద్యోగం పోవచ్చు. వ్యాపారంలో నష్టం రావచ్చు. చేతిలో డబ్బు లేదు కదా అని ఖర్చులు ఆగవు కదా.. మరి ఇలాంటప్పుడు ఎలా? అవసరం వచ్చినప్పుడు డబ్బు గురించి మీరు ఎదుర్కొన్న ఒత్తిడిని ఓసారి గుర్తు చేసుకోండి. అత్యవసర నిధి అవసరమా? లేదా అన్నది అర్థం అవుతుంది. గతంలో చేసిన పొరపాటు ఇప్పుడు తిరిగి చేయకుండా చూసుకోండి.

నెలలో మీ ఖర్చులు, రుణ వాయిదాల లెక్క తీయండి. ఆ తర్వాత 3 నుంచి 6 నెలలకు సరిపడా నగదు దగ్గర అట్టిపెట్టుకోండి. దీన్ని సాధారణ పొదుపు ఖాతాలో కాకుండా.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా మ్యూచువల్ ఫండ్లలోని లిక్విడ్ ఫండ్లలో వేయాలి.

అప్పు.. అలవాటు కావడం..



మీ దగ్గర డబ్బు లేకున్నా ఇబ్బంది లేదు.. నెలసరి వాయిదాల్లో కొనుగోలు చేయొచ్చు.. తక్కువ వడ్డీ.. సున్నా శాతం వడ్డీ.. ఇలా ప్రకటనలు ఊరిస్తూనే ఉంటాయి. ఇక క్రెడిట్, డెబిట్ కార్డుల మీద కొనుగోలు చేస్తే నగదు వెనక్కి అంటూ చెబుతుంటారు. వీటికి ఆకర్షితులై అనవసరమైన వస్తువులు కొంటే ఆ తర్వాత ఇబ్బంది ఎదురవ్వవచ్చు. కొంతమంది కార్డుతో కొనుగోలు చేసి.. ఒక కార్డు నుంచి మరో కార్డుకు ఆ అప్పులను మార్చేస్తుంటారు. తాత్కాలికంగా ఇది వారికి కొంత ఉపశమనం ఇవ్వొచ్చు. కానీ, మున్ముందు అది అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి కారణం అవుతుంది. ఇప్పటికే గృహరుణం, వాహనరుణం ఉన్నవారు.. నెలనెలా ఈఎంఐల చెల్లింపు తర్వాత.. ఈ కార్డు అప్పులను తీర్చేందుకు వెసులుబాటు ఉండకపోవచ్చు. అలాంటప్పుడు 24-36శాతం వరకూ ఆ బాకీలపై వడ్డీ భారం పడుతుంది. మన బడ్జెట్, పెట్టుబడులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది.

అందరికన్నా బాగుండాలి..



ఇల్లు కట్టేందుకు రూ.30లక్షల వరకూ ఖర్చవుతుందని ప్రణాళిక వేసుకున్నారు కుమార్. కానీ, అలా చేయాలి.. ఇలా చేయాలి అనే ఉద్దేశంతో ఈ ఖర్చు రూ.50లక్షలకు చేరింది. 'అందరికన్నా బాగా ఉండాలి' ఈ ఒక్క మాటే అతనితో అంత ఖర్చు పెట్టించింది. ఇతరుల ఒత్తిడి మన మీద ఎలా ప్రభావం చూపిస్తుందో తెలుసుకునేందుకు ఇది ఒక ఉదాహరణ. మన శక్తికి మించి ఖర్చు చేసినప్పుడు దాన్ని మళ్లీ కూడబెట్టాలంటే.. పదేళ్లు పట్టొచ్చు. అంతకన్నా ఎక్కువే కావచ్చు.

కొంతమంది సమాజంలో తమ హోదాను చూపించుకునేందుకు పెద్ద ఇల్లు, ఖరీదైన కార్లను కొంటుంటారు. వారి సంపాదనంతా ఈ రుణాల చెల్లింపునకే సరిపోతుంది.. దీంతో ప్రతి చిన్న విషయానికీ రాజీ పడుతుంటారు. ఆనందానికి దూరం అవుతారు. కాబట్టి, సామాజిక ఒత్తిడితో ఎదురయ్యే ఖర్చులను ఎప్పుడూ తప్పించుకునేందుకే ప్రయత్నించాలి.

ఉచిత సలహాలు.. వద్దు!



ఒక్కో వ్యక్తి అవసరాలు ఒక్కోలా ఉంటాయి. కాబట్టి, అందరికీ అన్ని పెట్టుబడులూ సరిపడవు. 'నేను ఆ పథకంలో మదుపు చేశా' అని ఎవరైనా చెప్పగానే మనమూ దాన్నే చూడాలనుకోవడం పొరపాటు. బంధువులు, స్నేహితులు.. ఇలా మీ శ్రేయోభిలాషులకు ఆర్థిక విషయాల్లో అంత అనుభవం ఉండకపోవచ్చు. అలాంటప్పుడు వారిచ్చే సలహా.. మీకు కీడు చేయవచ్చు. ఒక పథకంలో వారు మదుపు చేసి, మంచి చేశారో.. పొరపాటు చేశారో తెలియడానికి కొన్నాళ్లు పడుతుంది. ఆలోపే మీరూ ఆ తప్పే చేసినవారు అవుతారు. కాబట్టి, మీరు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఆ రంగంలో నిపుణులైన వారిని సంప్రదించడం మంచిది. వారిచ్చే సలహాలు స్వీకరించి, మీరూ కొంత సొంత పరిశోధన చేయడం ఉత్తమం.

ఆ బీమా ఉందిగా...!



ప్రస్తుతం వైద్య చికిత్సా ఖర్చులు ఎలా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.. కానీ చాలామంది ఈ విషయంలో కాస్త నిర్లక్ష్య ధోరణితోనే ఉన్నారని అనుకోవచ్చు. యాజమాన్యం అందించే బృంద బీమా మీదే ఎక్కువగా ఆధారపడుతున్నారు. సాధారణంగా ఈ బృంద ఆరోగ్య బీమా రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకూ ఉంటుంది. ఒకవేళ ఖర్చు రూ.6లక్షలు అయ్యిందంటే.. మీ కష్టార్జితానికి రెక్కలు వచ్చినట్లే. అందుబాటులో డబ్బు లేకపోతే అప్పు చేయక తప్పదు. చేయాల్సిందేమిటంటే.. బృంద బీమా ఉన్నా.. సొంతంగా మీరూ ఒక ఆరోగ్య బీమా పాలసీని తీసుకోండి. దీంతో మీకు ఓ భరోసా ఉంటుంది.

ఆలస్యం చేయొద్దు...



'చక్రవడ్డీ ప్రభావాన్ని తక్కువ అంచనా వేయొద్దు' ఆర్థిక నిపుణులు అందరూ చెప్పే మాటే ఇది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంలో చాలామంది పొరపాటే చేస్తుంటారు. పెట్టుబడులను ఒక్క ఏడాది ఆలస్యం చేసినా.. అందే ఫలితాల్లో పెద్ద వ్యత్యాసమే కనిపిస్తుంది. నెలకు రూ.10వేల చొప్పున పదేళ్లపాటు మదుపు చేశారనుకుందాం.. 12శాతం వార్షిక రాబడితో లెక్కవేస్తే.. రూ.21.05లక్షలు అవుతాయి. మరో ఐదేళ్లు అలాగే కొనసాగితే.. అంటే 15 ఏళ్లపాటు కొనసాగిస్తే.. రూ.44.73లక్షలు చేతికి వస్తాయి. చూశారుగా.. ఐదేళ్లలో ఎలాంటి ప్రయోజనం అందిందో. కాబట్టి, తొందరగా ప్రారంభించడమే కాదు.. దాన్ని కొంతకాలం కొనసాగించడమూ ముఖ్యమే.

ఒకే చోట.. నష్టమే..



ఖర్చులపై నియంత్రణ సాధించాం.. పొదుపు మొత్తాన్ని పెంచుకున్నాం.. మదుపు చేయడం ప్రారంభించాం. ఇవన్నీ బాగానే ఉన్నాయి.. కానీ, మదుపు పథకాన్ని ఎంచుకోవడంలో పొరపాటు చేస్తూ నష్టపోయేవారే ఎక్కువ. ఉన్న డబ్బంతా ఒకే షేరులో.. బంగారం, స్థిరాస్తి ఇలా ఒకేచోట మదుపు చేయడం ఎప్పుడూ సరికాదు. దీనివల్ల నష్టభయం అధికంగా ఉంటుంది. కాబట్టి, మన పెట్టుబడులు ఎప్పుడూ.. నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈక్విటీలు, డెట్ మ్యూచువల్ ఫండ్లు, బంగారం, స్థిరాస్తుల రూపంలో ఉండేలా చూసుకోవాలి.

చెప్పకుండా దాచిపెట్టారా?



బొమ్మలు: శ్రీనివాస్

డబ్బు గురించి కొందరికి అమితాసక్తి.. కొందరికి దీని గురించి చర్చించడం ఏమాత్రం నచ్చదు. అందుకే, కుటుంబ సభ్యుల మధ్య డబ్బు, ఆస్తులకు సంబంధించిన చర్చలు వచ్చేది చాలా తక్కువే. కుటుంబ ఖర్చులు తట్టుకోవడం కోసం అప్పులు తెస్తూ ఉండటం.. దాన్ని పట్టించుకోకుండా ఇతర కుటుంబ సభ్యులు ఖర్చు చేస్తూనే ఉండటం ఇబ్బందికరమైన పరిణామమే. కనీసం మూడు నెలలకోసారైనా.. కుటుంబ సభ్యులందరూ ఒకచోట కూర్చొని, కొంత సేపు ఆర్థిక విషయాల గురించి చర్చించుకోవాలి. సాధించాల్సిన ఆర్థిక లక్ష్యాలు, ఉన్న వ్యవధి, పెట్టాల్సిన పెట్టుబడులకు సంబంధించి కచ్చితమైన ప్రణాళిక రాసి పెట్టుకోవాలి. అన్ని అప్పులు.. పెట్టుబడుల గురించి అందరికీ తెలిసేలా చూసుకోవాలి. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. కాబట్టి, కుటుంబ పెద్ద ఎప్పుడూ తనకు సంబంధించిన అన్ని ఆర్థిక విషయాలతో ఒక కుటుంబ పత్రాన్ని తయారు చేసి పెట్టాలి. అనుకోని పరిస్థితులు ఎదురయినప్పుడు ఇది ఎంతో కీలకమైన పత్రమని గుర్తుంచుకోండి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

పదేళ్లపాటు మదుపు కోసం..

కొత్త పథకం

ఈక్విటీల్లో దీర్ఘకాలానికి మదుపు చేయడంతోపాటు.. పన్ను ఆదాకు కూడా ఉపకరించేవి ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్). వీటిలో నిబంధనల మేరకు మూడేళ్లు మదుపు చేసినా సరిపోతుంది. కానీ, ఇటీవల కాలంలో పదేళ్ల దీర్ఘకాలిక వ్యవధిని దృష్టిలో పెట్టుకొని పథకాలు వస్తున్నాయి. ఇలాంటి వాటి జాబితాలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్ టర్మ్ వెల్త్ ఎన్‌హాన్స్‌మెంట్ ఫండ్ ఒకటి. లార్జ్ క్యాప్‌తోపాటు, భవిష్యత్తులో వృద్ధికి అవకాశం ఉందని భావించే మిడ్ క్యాప్ షేర్లలో మదుపు చేయడం ద్వారా మంచి రాబడిని ఆర్జించడం ఈ పథకం పెట్టుబడి వ్యూహం. ఇందులో కనీస పెట్టుబడి రూ.500. మార్చి 21 వరకూ మదుపు చేసేందుకు అవకాశం ఉంది.

■ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని కోసం వైవిధ్యంగా మదుపు చేయాలనుకునే వారికోసం రిలయన్స్ మ్యూచువల్ ఫండ్.. రిలయన్స్ క్యాపిటల్ బిల్డర్ ఫండ్-4 (సిరీస్ డి)ని అందుబాటులోకి తెచ్చింది. ఈక్విటీల్లో 80-100 శాతం వరకూ.. డెట్ పథకాల్లో 0-20శాతం వరకూ మదుపు చేస్తూ.. పెట్టుబడి వృద్ధికి దోహదం చేసేలా చూడటం ఈ ఫండ్ మదుపు వ్యూహం. ఈ క్లోజ్ ఎండెడ్ పథకంలో మదుపు చేసేందుకు చివరి తేదీ జనవరి 12. కనీస మొత్తం రూ.5వేలు. పెట్టుబడిని యూనిట్లు కేటాయించినప్పటి నుంచీ మూడేళ్ల పాటు కొనసాగించాలి.

■ స్థిరాదాయ, డెట్ పథకాల్లో మదుపు చేసే లక్ష్యంతో ఉన్నవారు.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎఫ్ఎంపీ సిరీస్ 82ను పరిశీలించవచ్చు. ఇందులో కనీసం రూ.5వేలు మదుపు చేయాలి. పెట్టుబడిని 1219 రోజులపాటు కొనసాగించాలి. జనవరి 10 వరకూ పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది.

■ సుందరం మ్యూచువల్ ఫండ్ నుంచి వచ్చిన ఈఎల్ఎస్ఎస్ పథకం.. సుందరం లాంగ్ టర్మ్ ట్యాక్స్ అడ్వాంటేజ్ ఫండ్, సిరీస్ 3. ఇందులో కనీస పెట్టుబడి రూ.500. పదేళ్ల దీర్ఘకాలిక వ్యవధి ఉన్న పథకమిది. మార్చి 27 వరకూ ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది.

గృహరుణం

ఈఎంఐ భారం కాకుండా..!

సొంతిల్లు కొనుగోలు చేయడం ఒక కల. జీవితకాలంలో ఇదే ఈ అతిపెద్ద పెట్టుబడి కోసం ఎన్నాళ్లో శ్రమించాలి. రుణం తీసుకుంటే దీర్ఘకాలం పాటు నెలసరి వాయిదాల భారం మోయాలి. గతంలోలాగా కాకుండా.. ఇప్పుడు 30ఏళ్లలోపు వారే ఇల్లు కొనాలనే ఆలోచనకు వస్తున్నారు. ప్రభుత్వం కూడా సొంతిల్లు కొనుగోలు చేసే వారికి పలు ఆకర్షణీయమైన పథకాలు ప్రవేశ పెడుతోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో గృహరుణాల మార్కెట్ దాదాపు 30శాతం మేరకు పెరుగుతుందని అంచనా.

చిన్న వయసులోనే సొంతిల్లు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నా.. బడ్జెట్ పరంగా దీనివల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయా? రుణ వాయిదాలు పోను మిగిలే మొత్తంతో రోజువారీ ఖర్చులను ఎలా తట్టుకోవాలి? ఈ సందేహం చాలా మందికి వస్తోంది. కాబట్టి, ముందుగానే పక్కా ప్రణాళికతో ఉండి, ఈఎంఐ భారం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోనస్‌లను వాడుకోండి...

చాలా కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులకు బోనస్‌లను ప్రకటిస్తుంటాయి. ఈ మొత్తంతో చాలామంది నచ్చిన వస్తువులను కొనడం లేదా విదేశీ యాత్రలకు వెళ్లడం చేస్తుంటారు. అయితే.. దీనిని గృహరుణానికి అదనపు వాయిదాగా చెల్లించే వీలును పరిశీలించాలి. వీలైనంత వరకూ చెల్లిస్తూ ఉంటే.. రుణ వ్యవధి తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. ఫలితంగా ఈఎంఐ మొత్తం తగ్గుతుంది. అదనపు ఈఎంఐ చెల్లింపు అనేది చూడ్డానికి చిన్నదిగానే అనిపించినా.. దీర్ఘకాలంలో దీనివల్ల మంచి ఫలితాలు అందుతాయి. ప్రస్తుతం అన్ని గృహరుణ సంస్థలూ, బ్యాంకులూ చలన వడ్డీ రేటుకు రుణాలు తీసుకున్న వారు ముందస్తు చేసే చెల్లింపులకు ఎలాంటి రుసుములూ విధించడం లేదు. ముందస్తు ఈఎంఐలు చెల్లించడం వల్ల మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరూ బాగుంటుంది.

దీర్ఘకాల వ్యవధి...

గృహరుణానికి వాయిదా చెల్లించిన తర్వాత వచ్చిన ఆదాయంలో ఏమీ మిగలడం లేదు.. ఇలా మీకూ అనిపిస్తోందా.. మీరు ఒక్కరే కాదు. ఇలాంటివారు ఎంతోమంది ఉంటారు. గృహరుణానికి సంబంధించిన వాయిదా.. నెల తొలినాళ్లలోనే వెళ్లిపోతుంది. మిగిలిన దాంతోనే నెలంతా వెళ్లదీయాలి. ద్రవ్యోల్బణానికీ, వేతన పెరుగుదలకూ మధ్య ఎంతో అంతరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్నది పెద్ద చిక్కు ప్రశ్నే. ఇంటి బడ్జెట్‌ను కచ్చితంగా అమలు చేసినా.. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఇలాంటప్పుడు మీ దగ్గరున్న ఏకైక ప్రత్యామ్నాయం గృహరుణ వ్యవధిని పెంచుకోవడమే. దీనివల్ల ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకునే పరిస్థితి వస్తుంది. ఉదాహరణకు.. రూ.60లక్షల గృహరుణానికి 9శాతం వడ్డీ రేటుతో 20ఏళ్ల వ్యవధికి తీసుకున్నారనుకుంటే.. ఈఎంఐ రూ.53,984 చెల్లించాలి. దీన్ని 30 ఏళ్లకు మార్చుకుంటే.. ఈఎంఐ నెలకు రూ.48,277 అవుతుంది. మీ ఆదాయంలో కొంత వృద్ధి వచ్చేవరకైనా ఈ వెసులుబాటును ఉపయోగించుకోండి. మున్ముందు మీ ఆదాయం పెరిగితే.. అప్పుడు మళ్లీ ఈఎంఐను పెంచుకోవచ్చు.



అప్పుడప్పుడూ అసలు చెల్లించండి

కొన్నిసార్లు అనుకోకుండా కొంత సొమ్ము చేతికి రావచ్చు.. ఏదైనా ఆస్తి అమ్మినప్పుడు, మనీ బ్యాక్ పాలసీల నుంచి డబ్బు రావచ్చు. ఇలాంటప్పుడు మీ కోరికలను అదుపు చేసుకొని, గృహరుణంలో అసలు మొత్తానికి ఆ డబ్బును జమ చేయండి. ఇలా అనుకోకుండా వచ్చిన డబ్బును తెలివిగా ఉపయోగించుకోవడం ద్వారా ఎంతో భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు రుణం తీసుకున్న మూడేళ్ల తర్వాత.. రూ.లక్షను మీరు అసలుకు జమ చేశారనుకుందాం.. 9శాతం వడ్డీకి 15ఏళ్లపాటు తీసుకున్న రూ.50లక్షల రుణంలో రూ.1.88 లక్షల వరకూ భారం తగ్గుతుంది. 6 నెలల ముందుగానే రుణం తీరిపోతుంది. ఇలా మీరు అప్పుడప్పుడూ చెల్లిస్తూ ఉన్నారనుకోండి.. వ్యవధి లేదా ఈఎంఐ తగ్గి, మీకు పెద్ద మొత్తంలో ప్రయోజనం లభిస్తుంది. రుణం తీసుకున్న తొలినాళ్లలో ఇలా అప్పుడప్పుడూ అసలు మొత్తాన్ని చెల్లించడం ఆచరణీయం. ఎందుకంటే.. రుణం తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో అసలు మొత్తం తక్కువగా ఉంటుంది. వడ్డీ కోసం మినహాయించుకునేదే అధికంగా ఉంటుంది.

రుణదాతను మార్చండి...

మీరు రుణం తీసుకున్న బ్యాంకు మీకు అన్నివిధాలా అనుకూలంగా ఉండకపోవచ్చు. ఇతర రుణ సంస్థల్లోని నిబంధనలు మీకు నచ్చవచ్చు. ఇలాంటప్పుడు రుణాన్ని మీకు నచ్చిన చోటకు మార్చుకునే వెసులుబాటు ఉంది. దీన్ని బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ అంటారు. అయితే, దీన్ని ఎంచుకునేప్పుడు రుసుముల గురించి ఆలోచించాలి. మీకు మిగిలేదానికన్నా, ఖర్చులు ఎక్కువగా ఉంటే ఇబ్బందే. ఒకవేళ మీకు ప్రయోజనం ఉంటుంది అనుకుంటే.. అప్పుడు మార్చుకునేందుకు ఏ ఇబ్బందీ ఉండదు. ఉదాహరణకు మీరు ప్రస్తుతం 9.75శాతం వడ్డీ చెల్లిస్తున్నారు.. కొత్త బ్యాంకులో 8.35శాతం వడ్డీ ఉందనుకోండి. అప్పుడు మీ ఈఎంఐలో 10-12శాతం వరకూ తేడా వస్తుంది.

- రవీంద్ర సుధాల్కర్, ఈడీ, సీఈఓ, రిలయన్స్ హోం ఫైనాన్స్

ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వడ్డీ రేట్లు

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వార్తలతో కాస్త భయాందోళనలు నెలకొన్నప్పటికీ.. డిపాజిటర్లకు ఇప్పటికీ వీటిపై నమ్మకం పోలేదనే చెప్పాలి. పెట్టుబడికీ, రాబడికీ హామీ ఉండే పథకాలుగా వీటి గుర్తింపు అలాగే ఉంది. స్వల్పకాలిక అవసరాల కోసమే కాకుండా.. దీర్ఘకాలానికి కూడా వీటిలో పొదుపు చేసే వారు అధికంగానే ఉంటారు. చాలా బ్యాంకులు కనీసం 7 రోజుల వ్యవధికీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందిస్తున్నాయి. పొదుపు ఖాతాలో అధిక మొత్తం నిల్వ ఉన్న వారు ఫ్లెక్సీ డిపాజిట్లుగా వాటిని మార్చుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో వివిధ వ్యవధులకు కొన్ని బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్ల వివరాలు మీ కోసం...

బ్యాంకు	వ్యవధి (ఏళ్లలో)			
	ఏడాది లోపు	1-2	2-3	3-5
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.55	6.50	6.50
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.50	6.30
కెనరా బ్యాంక్	6.35	6.50	6.20	6.20
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50	6.50
కార్పోరేషన్ బ్యాంక్	6.25	6.50	6.50	6.50
దేనా బ్యాంక్	6.25	6.50	6.25	6.30
ఐడీబీఐ బ్యాంక్	6.50	6.75	6.25	6.25
ఇండియన్ బ్యాంక్	6.25	6.50	6.25	6.00
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.40	6.60	6.40	6.40
పంజాబ్ నేషనల్ బ్యాంక్	6.25	6.60	6.50	6.25
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.25	6.00	6.00
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.60	6.60
యూకో బ్యాంక్	6.35	6.50	6.40	6.25
యూనియన్ బ్యాంక్	6.75	6.75	6.50	6.50
విజయా బ్యాంక్	6.50	6.60	6.50	6.50
యాక్సిస్ బ్యాంక్	6.50	6.85	6.25	6.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.25	6.75	6.00	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6.50	6.75	6.50	6.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.50	6.85	6.75	6.50
కొటక్ బ్యాంక్	6.70	6.85	6.70	6.50
కరూర్ వైశ్యా బ్యాంక్	6.75	6.75	7.00	7.00
ఫెడరల్ బ్యాంక్	6.50	6.75	6.50	6.50
తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్	6.75-7.00	7.00	6.60	6.60
ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్	6.70-6.80	7.05-6.90	6.80	6.60
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	6.85-7.10	7.10	7.00	6.60
సప్తగిరి గ్రామీణ బ్యాంక్	6.50-6.75	7.10	7.00	7.00
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	6.25-6.50	7.50	7.00	7.00

వడ్డీ రేట్లు శాతాల్లో. జనవరి 6, 2018 నాటికి. (సీనియర్ సిటిజన్లకు 0.25 నుంచి 0.75 శాతం అదనం). ఇవి ఎప్పటికప్పుడు మారవచ్చు. పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పూర్తి వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. - www.BankBazaar.com

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత

- 'జలం..జీవం' కార్యక్రమానికి శ్రీకారం
- కాలనీల్లోనే సేంద్రియ ఎరువు తయారీ
- మననగరం కార్యక్రమంలో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: అవకాశమున్న ప్రతి ఇంట్లో ఆరు నెలల్లోగా ఇంకుడు గుంత ఉండాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. 'జలం.. జీవం' పేరుతో హైదరాబాద్ నగరాన్ని 400 భాగాలుగా విభజించి పర్యవేక్షణ బాధ్యతల్ని అధికారులకు అప్పగిస్తామన్నారు. నిర్మాణసంస్థలు సైతం భవన సముదాయాల నిర్మాణంలో ఇంకుడు గుంతను తప్పకుండా తవ్వాలన్నారు. మియాపూర్‌లో శనివారం జరిగిన 'మన నగరం' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో మియాపూర్, మాదాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్లకు చెందిన కాలనీ సంఘాలు, సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "కోటి మంది జనాభా ఉన్న హైదరాబాద్‌ను ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటే పరిశుభ్రంగా మార్చలేదు. పౌరులు చేయికలిపితేనే ఫలితాలొస్తాయి. వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయాలి. అందుకోసం ఇచ్చిన రెండు చెత్త డబ్బాలను దుర్వినియోగం చేయకూడదు. తడి చెత్తతో ఇంటి వద్దనే ఎరువు తయారు చేయొచ్చు. పొడి వ్యర్థాలను విద్యుత్తుగా మార్చే 20మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం త్వరలోనే జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో ఏర్పాటవుతుంది. అలాగే కాలనీకి ఒకటి చొప్పున సేంద్రియ ఎరువు తయారీ గుంత ఉండాలి. కాలనీలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను అక్కడే ఎరువుగా చేయాలి. ఆ ఎరువు కాలనీ పార్కుతోపాటు ఇంట్లోని మొక్కలకు ఉపయోగపడుతుంది. కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ చేయూతనిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ మహా నగర వాసులకు తాగునీరు, విద్యుత్తు సమస్యలు లేవు. శివార్లలోని మురుగునీటి సమస్యకు వచ్చే ఏడాది పరిష్కారం లభిస్తుంది. రూ.3వేల కోట్లతో భూగర్భ మురుగునీటి పైపులైన్ల ఏర్పాటు పనుల్ని ప్రారంభిస్తాం. ఇప్పటికే రూ.2వేల కోట్లతో శివారు దాహార్తిని తీర్చే ప్రాజెక్టు చేపట్టాం. వాటి పనులు చివరి దశలో ఉన్నాయి"అని వివరించారు. కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'మననగరం' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ప్రభుత్వ కార్యాలయాలల్లో విద్యుత్తు ఆదాకు చర్యలు

విద్యుత్తును ఆదా చేసేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈసీబీసీ (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్)ని విధిగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. భవన నిర్మాణాలకు సంబంధించి చట్టాలను సరిగా అమలు చేయకపోతే హైదరాబాద్ అనుకున్న దిశలో ఆకర్షణీయ నగరం(స్మార్ట్ సిటీ)గా రూపొందలేదన్నారు. దేశంలోనే తొలిసారిగా థర్డ్ పార్టీ మదింపు సంస్థల ప్రతినిధులకు అనుమతి పత్రాలను శనివారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి)లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పట్టణ ప్రణాళికల్లో గణనీయమైన మార్పులు తెచ్చి భవన నిర్మాణ చట్టాలను అమలు చేస్తామని పేర్కొన్నారు.


గోదావరిలో పర్యాటక పడవను ప్రారంభించిన అనంతరం అందులో ప్రయాణిస్తున్న మంత్రి ఈటల రాజేందర్ తదితరులు

కోటిలింగాల తీరంలో జలవిహారం

పర్యాటక శాఖ పడవలను ప్రారంభించిన మంత్రి ఈటల

వెల్గటూరు, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కోటిలింగాల గోదావరి తీరంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం జలవిహారం ప్రారంభమైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పడవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కోటిలింగాల చారిత్రక వైభవాన్ని రాష్ట్ర ప్రజలకు చాటి చెప్పేలా పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి నుంచి కోటిలింగాల, ధర్మపురి, వేములవాడ, కొండగట్టు వరకు వేల కోట్ల రూపాయల అంచనాలతో పర్యాటక వలయాన్ని రూపొందించి అభివృద్ధి పరుస్తామన్నారు. రెండు పడవలను అందుబాటులో ఉంచగా వాటికి శాతవాహన రాజులలో ప్రముఖులైన శాతకర్ణి, పులోమావి నామకరణం చేశారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట తీరాన్ని తాకుతూ రాయపట్నం వరకు ఒక పడవ, పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి జలాశయం వరకు మరో పడవ నడిపేలా ఏర్పాట్లు చేశారు.

రూ.500 కోట్ల ఉపాధి పనులే లక్ష్యం: మంత్రి జూపల్లి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన మూడు నెలల్లో రూ.500 కోట్ల ఉపాధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి కల్పన కమిషనర్ నీతు కుమారి ప్రసాద్‌తో కలిసి అన్ని జిల్లాల అధికారులతో శనివారమిక్కడ మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ జాబు కార్డు ఉన్న ప్రతి కూలీకి 100 రోజుల పని దినాలు కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి సూచించారు. ఈ పథకం కింద చేపడుతున్న పంచాయతీ భవనాలు, వైకుంఠ ధామాలు, పాఠశాల మరుగుదొడ్ల తదితర పనులన్నింటినీ ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ కూలీల వేతనాన్ని బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరిపించి జమ చేయాలని సూచించారు. హరిత హారంలో నాటిన మొక్కలను సంరక్షించడమే కాకుండా వచ్చే ఏడాది కార్యక్రమానికి ఇప్పటినుంచే నర్సరీలను అభివృద్ధి చేయాలన్నారు.

కేసీఆర్ కిట్ 'సర్కారు'కే పరిమితం

ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వివరణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'కేసీఆర్ కిట్' పథకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటు వైద్యకళాశాలలకు వర్తింపజేసే యోచన లేదని.. కేవలం సర్కారు దవాఖానాలకే వర్తింపజేస్తామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ వాకాటి కరుణ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'ఈనాడు'లో శనివారం 'కేసీఆర్ కిట్‌పై ప్రైవేటు కన్ను' శీర్షికన ప్రచురితమైన కథనంపై కమిషనర్ శనివారం వివరణ ఇచ్చారు. పేద గర్భిణీల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులను మెరుగుపర్చడం, అనవసర ప్రసవ శస్త్రచికిత్సలను తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంపొందించడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి తెరాస, తెదేపా నేతలు

రాహుల్‌తో భేటీ

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు చెందిన పలువురు తెరాస, తెదేపా నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. శనివారమిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ సమక్షంలో ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, వైరా తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలోతు రాందాస్‌నాయక్, జూలురుపాడు, సింగరేణి మండలాలకు చెందిన పలువురు తెదేపా, తెరాస కార్యకర్తలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యుడు ఆర్‌సీ కుంతియా, ఎంపీ రేణుక చౌదరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని పార్టీ పరిస్థితులపై రాహుల్‌గాంధీ వారితో చర్చించారు. అనంతరం పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టు పీజీ విద్య సహా ఎన్నికల హామీలు ఏవీ అమలు కాలేదన్నారు.

మంత్రి లక్ష్మారెడ్డి విద్యార్హతలపై స్పష్టత ఇవ్వాలి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రమాణపత్రంలో పేర్కొన్న విద్యార్హతలపై తనకు అనుమానాలున్నాయని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ...గుల్బర్గా విశ్వవిద్యాలయంలో అని ఒకసారి, కర్ణాటక విశ్వ విద్యాలయంలో చదివానని మరోసారి లక్ష్మారెడ్డి చెప్పారని..ఏది నిజమో ధ్రువపత్రాలతో సహా స్పష్టం చేయాల్సిన బాధ్యత మంత్రిపై ఉందన్నారు.

గవర్నర్‌గిరీ పొడిగింపు కోసమే నరసింహన్ తాపత్రయం: వీహెచ్

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ తన గవర్నర్‌గిరీ పొడిగింపు కోసమే ముఖ్యమంత్రులు చెప్పినట్లు వింటున్నారని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి. హన్మంతరావు విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి గవర్నర్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. హైదరాబాద్‌లో తెరాస నేతలు పెట్టిన ఫ్లెక్సీలకు ఏ హోదాలో మంత్రి కేటీఆర్ జరిమానా వేశారని ప్రశ్నించారు.

సర్వశిక్ష, మాధ్యమిక పథకాలు విలీనం!

ఈనాడు, హైదరాబాద్: సర్వ శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ) పథకాలను కేంద్రం విలీనం చేయనుంది. పాఠశాల విద్యకు సంబంధించి రెండు పథకాల వల్ల అయోమయం నెలకొంటోందని పలు రాష్ట్రాలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. కొద్ది నెలల క్రితం విలీనంపై నిర్ణయాన్ని చెప్పాలని ఆయా రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. తెలంగాణ సహా పలు రాష్ట్రాలు సుముఖత వ్యక్తం చేశాయి. అయినా జనవరి 11 నుంచి ఈ రెండు పథకాలకు వేర్వేరుగా ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు(పీఏబీ) సమావేశాలు ఉంటాయని కాలపట్టికను కూడా కేంద్ర మానవ వనరుల శాఖ ప్రకటించింది. తాజాగా వాటిని వాయిదా వేసింది.

టీఆర్‌టీ ఉద్యోగ గైడ్‌కు ఆదరణ

రాష్ట్రంలో ఉపాధ్యాయ నిరుద్యోగుల కోసం టీ-శాట్ నిపుణ, విద్య ఛానెళ్ల ద్వారా టీఆర్‌టీ ఉద్యోగ గైడ్ పేరుతో చేస్తున్న ప్రసారాలకు విస్తృత ఆదరణ లభిస్తోంది టీ-శాట్ సీఈఓ శైలేష్‌రెడ్డి తెలిపారు. కేవలం 15 రోజుల్లో 10 లక్షల వీక్షకులు లభించారని పేర్కొన్నారు.

ఉన్నత విద్యాశాఖ టీజీవో ఆవిర్భావం

నాంపల్లి, న్యూస్‌టుడే: కళాశాల విద్య, సాంకేతిక విద్య, ఇంటర్ విద్యాశాఖల గెజిటెడ్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్య గెజిటెడ్ అధికారుల సంఘం ఆవిర్భవించింది. టీజీవో నగరశాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణల సమక్షంలో శనివారం ఇంటర్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కళాశాల విద్య, సాంకేతిక విద్య, ఇంటర్ విద్యాశాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్య గెజిటెడ్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎం.లక్ష్మారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఎ.పుల్లయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.స్వామి, సలహాదారులుగా యు.వి.ఎస్.ఎన్. మూర్తి, ఒ.రాణి, కె.ఎస్.విజయవల్లి, మహ్మద్ ఫహీముద్దీన్, ప్రధానకార్యదర్శిగా కె.శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. టీజీవో కేంద్ర సంఘంతో అనుసంధానంగా ఈ సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు.



గుత్తులుగా.. సొరకాయలు

సొరకాయలు సాధారణంగా అల్లుకున్న తీగకు అక్కడక్కడా కాస్తాయి. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రానికి చెందిన గురిజాల యల్లయ్య ఇంటి ఆవరణలోని చెట్టు ఒక తీగకు పదిహేను కాయలు గుత్తుల్లా కాశాయి. జన్యు లోపాల వల్ల ఇలాంటికి జరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారిణి రజనీ పేర్కొనగా.. వాటిని చూసేందుకు గ్రామస్థులు బారులుదీరుతున్నారు.

– న్యూస్‌టుడే, మోతె రూరల్

దుర్గగుడిలో అపచారం నిజమే!

- శుద్ధే కాదు.. పూజలూ జరిగాయి
- అర్ధరాత్రి గుడిలోకి ప్రవేశించారు...
- సీఎం చంద్రబాబుకు పోలీసుల నివేదిక
- ఈవో సూర్యకుమారిపై వేటు

ఈనాడు, అమరావతి: దుర్గగుడిలో అర్ధరాత్రి అపచారం జరిగిందని తేలింది. ఆలయంలో శుద్ధి చేయడమే కాకుండా పూజలూ నిర్వహించారని వెల్లడైంది. మహిషాసుర మర్దిని అలంకారమూ చేశారని స్పష్టమైంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే.. ఉన్నతాధికారులకు తెలిసే దుర్గాదేవికి పూజలు జరిగినట్లు పోలీసు విచారణలో తేలింది. గుడివద్ద రక్షణ చర్యలను ఇది ప్రశ్నార్థకంగా చేసిందని ముఖ్యమంత్రికి పోలీసులిచ్చిన నివేదిక పేర్కొంది. బయటి వ్యక్తులు అత్యంత సులభంగా దేవాలయంలోకి ప్రవేశించగలిగారని వెల్లడించింది. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ తరహా పూజలు, ఎందుకోసం చేశారనేదానిపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. బాధ్యురాలిగా గుర్తిస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యకుమారిని వెంటనే విధుల నుంచి తప్పించారు. దేవాదాయశాఖ కమిషనరు అనురాధకు దుర్గ గుడి బాధ్యతలు అప్పగించారు. దుర్గ గుడిలో అర్ధరాత్రి పూజలపై నిజనిర్ధారణ కమిటీతో పాటు పోలీసులు సమాంతరంగా విచారణ నిర్వహించిన విషయం తెలిసిందే. డీసీపీ కాంతిరాణా టాటా ఆధ్వర్యంలో ఏసీపీ, సీఐ ఇతర అధికారులు విచారణ జరిపారు. దాదాపు 20మందిని వారు విచారించారు. వీరిలో ముగ్గురు పూజలు చేసినట్లు అంగీకరించారు. వారి వాంగ్మూలం నమోదు చేశారు. దాదాపు 10మంది సాక్షుల వాంగ్మూలాల నమోదుతో నివేదికను ముఖ్యమంత్రికి విజయవాడ పోలీసు కమిషనర్ గౌతం సవాంగ్ అందజేశారు. నివేదికలోని అంశాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని విలేకరులతో చెప్పారు.

◆ కోడూరు మండలం విశ్వనాథపల్లి శివాలయానికి చెందిన పూజారి పార్థసారధి అలియాస్ రాజాను మొదట పోలీసులు విచారించారు. ముందు రోజు సమాచారం ఇచ్చి తమను పిలిపించారని, డిసెంబరు 26 రాత్రి ఆలయాన్ని శుద్ధిచేసి అలంకరించామని ఆయన చెప్పారు. అతడిచ్చిన సమాచారంతో గుంటూరు జిల్లాకు చెందిన సుజన్‌ను పోలీసులు విచారించారు. అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరణ చేసి పూజలు చేశామని, తర్వాత ఆ అలంకారం తీసి సాధారణ అలంకారం చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారి కవచం తొలగించినట్లు అంగీకరించారు. అలంకరణ కుదరకపోవడంతో మరుసటి రోజు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య దర్శనం నిలిపివేసి మళ్లీ సరిచేసినట్లు సుజన్ తెలిపారు.

◆ శుద్ధి చేసి అలంకరణ చేశామని ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ బాబు విచారణలో అంగీకరించారు. పూజలు చేయలేదని చెప్పారు. ఈవో దగ్గర అనుమతి తీసుకునే శుద్ధి చేశామని తెలిపారు.

◆ శుద్ధికి సహాయకులుగా ఉండాల్సిన పరిచారకులనూ పోలీసులు పిలిచి విచారించారు. సాధారణంగా తామే శుద్ధి చేస్తామని, ఆ రోజున తమను బయటే ఉండమన్నారని పరిచారకులు వాంగ్మూలం ఇచ్చారు. లోపల ఏం జరిగిందో తమకు తెలియదని చెప్పారు.

◆ సీసీ టీవీ ఫుటేజీలనూ పోలీసులు పరిశీలించారు. క్యూలైన్ ఇన్‌స్పెక్టర్ మధు అందులో ఉన్నట్లు కనిపించడంతో ఆయననూ విచారించారు. ఆ సమయంలో తమను బయటకు పంపారని ఆయనా చెప్పారు. ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ వాంగ్మూలాన్నీ నమోదు చేశారు. ప్రధానార్చకుడు తమను బయటే ఉంచారని, లోపల ఏం జరిగిందో తెలియదని ఆయన చెప్పారు.

◆ రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను విచారించగా ప్రధానార్చకుడు, ఇతరులు రాత్రి 12.30 గంటలకు వెళ్లినట్లు తెలిపారు.

◆ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులనూ పోలీసులు విచారించారు. సాధారణంగా అలంకరణ గురువారం చేస్తారని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 10.30 గంటలకు పూర్తి చేస్తారని వివరించారు. కానీ జాప్యం ఎందుకు జరిగిందో తెలియదని చెప్పారు.

◆ ప్రధానార్చకుడు, ఇతర పూజారుల కాల్‌డేటాను పోలీసులు విశ్లేషించినట్లు తెలిసింది. ఆ సమయంలో ఉన్నతాధికారికి కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. ఏం పూజలు చేశారనే దానిపై మాత్రం పోలీసులు స్పష్టత ఇవ్వలేదు.

నేతన్నకు యంత్ర సాయం

- తెలంగాణలో 13 వేల మరమగ్గాల నవీకరణ
- పది జిల్లాల్లో సరఫరా

ఈనాడు, హైదరాబాద్: కార్మిక సంక్షేమం, చేయూత చర్యల్లో భాగంగా తెలంగాణలోని 13 వేల మరమగ్గాలను నవీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నవీకరణకు అవసరమైన యంత్ర పరికరాలను రూ.20 వేలకే సరఫరా చేసేందుకు తయారీ సంస్థలతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. 10జిల్లాల్లో వీటిని పంపిణీ చేయనుంది. కేంద్ర ప్రభుత్వ సాయంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరమగ్గాల నవీకరణ చేపట్టింది. నవీకరణకయ్యే మొత్తం వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. దీనికి అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ గ్రామీణ, నగర జిల్లాలు, భూపాలపల్లి, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, జిల్లాల నుంచి 13 వేల మగ్గాల నవీకరణకు దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఒక్కో మగ్గం నవీకరణ యంత్ర పరికరాల ధర రూ.27 వేలుగా ఉండేది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ ధరను రూ.20 వేలకు తగ్గించింది. ఈ ధరతో యంత్రాలను స్థానికంగానే కొనాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం మరమగ్గాల యంత్రపరికరాల తయారీ సంస్థలతో శనివారం సమావేశం నిర్వహించింది. కేంద్రం ఖరారు చేసిన ధరతోనే మరమగ్గాలను కొంటామని చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ చెప్పారు. చర్చల అనంతరం ఒక్కో మగ్గానికి రూ.20వేలకే యంత్రాలివ్వడానికి సంస్థలు అంగీకరించాయి. ఒప్పందపత్రంపై సంతకాలు చేశాయి.



పంపిణీకి ఏర్పాట్లు: ఒప్పందంమేరకు తయారీ సంస్థలు 13 వేల మగ్గాల నవీకరణ యంత్ర పరికరాలను నెలాఖరులోగా సరఫరా చేయాలి. వార్ప్, వెఫ్ట్, బ్రేకింగ్ డివైస్ వంటి పరికరాలతో కూడిన కిట్‌ను పంపిణీ చేసి, కార్మికుల ఇళ్లలో బిగించాలి. ఒక్కో కార్మికునికి ఎనిమిదేసి మగ్గాల చొప్పున మొత్తం 1600 మందికి వీటిని సరఫరా చేయిస్తామని చేనేత, జౌళి శాఖల ఉన్నతాధికారులు తెలిపారు.

మరిన్ని మగ్గాల నవీకరణ: మరమగ్గాల నవీకరణ పథకంలో అర్హులందరికీ అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పారు. తొలి విడతలో 13 వేలు పంపిణీ చేస్తున్నామని, ఇంకా కార్మికులు దరఖాస్తు చేసుకుంటే వారికి ఈ పథకం కింద పరికరాలకు సరఫరా చేస్తామని వెల్లడించారు.

రాష్ట్రంలో మంటగలుస్తున్న ప్రజాస్వామ్యం: కిషన్‌రెడ్డి

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య హక్కుల విషయంలో గవర్నర్ కలగజేసుకోవాలని భాజపా శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా మంటగలిపేవిధంగా కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం ఉదయం ఖైరతాబాద్ శాసనసభ్యుడు చింతల రామచంద్రారెడ్డితో కలిసి చంచల్‌గూడ జైల్లో ఉన్న మందకృష్ణ మాదిగను కలిసి పరామర్శించారు. ఆ తర్వాత జైలు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణపై రాష్ట్రప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి తాను దిల్లీలో ముస్లిం రిజర్వేషన్లపై ధర్నా చేస్తానని ఒక పక్క ఉపన్యాసాలు ఇస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం ఎవరూ నిరసన తెలపరాదు, ధర్నా చేయరాదని ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు.

సింగరేణి భూగర్భగనిలో విషవాయువు

సురక్షితంగా కార్మికుల తరలింపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి జీడీకే-1 భూగర్భ గనిలో శనివారం సాయంత్రం విషవాయువు వెలువడింది. దీంతో అందులో పనిచేసే 178 మంది కార్మికులను వెంటనే సురక్షితంగా బయటకు తరలించారు. రెండో షిఫ్టు మొదలయ్యే సమయంలో విషవాయువు వెలువడుతున్నట్లు మైనింగ్ సర్దార్ గుర్తించారు. దానికి సంబంధించి గ్యాస్‌ను గుర్తించే లైట్‌తో పరీక్షలు చేయగా విషవాయువు వెలువడుతున్నట్లు నిర్ధరణకు వచ్చారు. వెంటనే అందులో పని చేస్తున్న కార్మికులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించగా హుటాహుటిన అక్కడికి చేరుకుని రక్షణ బృందాలతో సహాయక చర్యలు చేపట్టారు.

డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తకు అరుదైన గౌరవం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డిఫెన్స్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ- డీఆర్‌డీఎల్)కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ చంద్ జైన్‌కు అరుదైన గౌరవం లభించింది. అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ (ఏఐఏఏ) సంస్థ అసోసియేట్ ఫెలోగా ఎంపికయ్యారు. 2018 సంవత్సరానికి ప్రకటించిన జాబితాలో దేశం తరఫున ఆయన ఒక్కరి పేరే ఉండడం విశేషం.

తితిదేకు రూ. 11.11 కోట్ల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు ఓ భక్తుడు భారీ విరాళాన్ని అందించారు. ముంబయికి చెందిన అజయ్‌కుమార్ సాహూ తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిసి విరాళం మొత్తానికి సంబంధించి మూడు చెక్కులను సమర్పించారు. ఈ విషయాన్ని తితిదే ఈవో మీడియాకు వెల్లడించారు.

కొండవీటి జ్యోతిర్మయి నేతృత్వంలో కాశీలో హోమం

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని రైతులు ఆనందంగా ఉండాలని కాంక్షిస్తూ ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి కాశీ క్షేత్రంలో 'లక్ష గాయత్రి మహా మంత్ర హోమం' నిర్వహిస్తున్నట్లు అమ్మ కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు/శ్రీవారి సేన ఛైర్మన్ కేవీవీ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రతువుకు సహకరించాలనుకునేవారు, సామాజిక స్పృహ కలిగినవారు 9848022131 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పీసీబీ పోస్టులకు 11న ధ్రువీకరణపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: కాలుష్య నియంత్రణ మండలిలో సహాయ పర్యావరణ ఇంజినీరు, అనలిస్టు గ్రేడ్-2, స్టెనోకమ్ టైపిస్టు పోస్టులకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 11న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఈ పరిశీలన కమిషన్ కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్లో పొందుపరిచామని వివరించారు.

రిజర్వు కేటగిరీవారీగా ఖాళీల వివరాలు

వైద్యఆరోగ్యశాఖలో భర్తీ చేయనున్న స్టాఫ్‌నర్సు పోస్టులను రిజర్వు కేటగిరీ వారీగా ఖాళీల వివరాలు సిద్ధం చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

సంక్షోభంలో ఉన్నత విద్యారంగం

కేరళ రాష్ట్ర మాజీ మంత్రి బినయ్ విశ్వం

వరంగల్ (కేయూ క్యాంపస్), న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలతో ఉన్నత విద్యారంగం సంక్షోభంలో పడిందని కేరళ అటవీ శాఖ మాజీ మంత్రి బినయ్ విశ్వం ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి కార్యవర్గ సమావేశాలు శనివారం వరంగల్ అర్బన్ జిల్లాలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బినయ్‌విశ్వం మాట్లాడుతూ.. విద్యను కాషాయికరణ చేస్తున్న శక్తులపై నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షకార్యదర్శులు వలీఉల్లాఖాద్రీ, విశ్వజిత్‌కుమార్‌లు ప్రసంగిస్తూ రేపటి నుంచి కార్యవర్గ సమావేశాల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో విద్యార్థులు, జాతీయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తెదేపాను తిరుగులేని శక్తిగా తయారు చేస్తాం

- పార్టీ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు రమణ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ చెప్పారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ ముఖ్య నాయకులతో మాట్లాడారు. అనంతరం రమణ అధ్యక్షతన ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ నెల 18నుంచి తెదేపా ఆవిర్భావదినోత్సవమైన మార్చి 29వరకు నిర్వహించనున్న 'పల్లెపల్లెకు తెదేపా' కార్యక్రమాన్ని ఎలా చేపట్టాలనే దానిపై సమావేశంలో చర్చించారు. తెదేపా పాలనలో చేసిన అభివృద్ధి పనులను, తెరాస పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని రమణ సూచించారు. తెలంగాణ తెదేపా కార్యక్రమాలు బాగున్నాయని చంద్రబాబు ప్రశంసించినట్లు ఆయన చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ. . తెదేపా పుట్టిందే అణగారిన వర్గాల కోసమని ఈ పార్టీని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వంతో పాటు గవర్నర్ కూడా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎంపీ గరికపాటి మోహన్‌రావు పెద్దిరెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డి, బక్కని నర్సింహులు, కొత్తకోట దయాకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌బాబు, చాడ సురేష్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్ రమావత్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై రజనీ, కమల్

కౌలాలంపూర్: మలేసియాలోని కౌలాలంపూర్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో అగ్రనటులు రజనీకాంత్, కమల్‌హాసన్‌లు ఒకే వేదికపై కూర్చోవడం ఆసక్తి కలిగించింది. రాజకీయ రంగ ప్రవేశం చేసినట్టు ఇప్పటికే రజనీకాంత్ ప్రకటించగా, కమల్‌హాసన్ మాత్రం ఇంకా మనసులోని మాట చెప్పలేదు. ఇద్దరి కలయిక రాజకీయ సయోధ్యకు సంకేతమన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 'నడిగర సంగం' భవన నిర్మాణం కోసం విరాళాలు సేకరించడానికి ఉద్దేశించిన కార్యక్రమంలో వారిరువురూ పాల్గొన్నారు.



జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన విజయ్ ఆడలేదు. ప్రపంచ మేటి బ్యాట్స్‌మెన్‌లో ఒకడైన కోహ్లి నిలవలేదు. ధనాధన్ ధావన్ మెరుపులు కొన్ని నిమిషాలే. కొత్త 'గోడ' పుజారా కూడా జట్టును గట్టెక్కించకుండానే కాడి వదిలేశాడు. స్వదేశంలో భీకర ఫామ్ కనబరిచిన రోహిత్ శర్మ కూడా అద్భుతాలేమీ చేయలేదు.

అటు చూస్తే నలుగురిలో ఏ పేసరూ తగ్గట్లేదు. ఏ బంతీ 140 కిలోమీటర్ల కంటే తక్కువ వేగంతో రావట్లేదు. బంతిని కొట్టడం తర్వాత.. కాచుకోవడమే కష్టమవుతోంది. క్రీజులో ఉన్న బ్యాట్స్‌మన్‌కు బంతి బంతీ గండంగా గడుస్తోంది. ఇలాంటి విపత్కర స్థితిలో.. ఒక్కడు నిలిచాడు. దెబ్బలు తిన్నాడు. కొన్ని బంతులకు బెదిరాడు. కొన్ని సార్లు ఆడలేక నిస్సహాయుడయ్యాడు. ఔటయ్యే ప్రమాదాల్ని తప్పించుకున్నాడు.


ఇలా ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. తట్టుకున్నాడు. ఎదురు నిలిచాడు. ఎదురుదాడీ చేశాడు. కొన్ని షాట్లు కళ్లు చెదిరేలా కొట్టాడు. కొన్ని సార్లు అడ్డదిడ్డంగానూ ఆడాడు. ఎలాగైతేనేం 92/7తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును రక్షించాడు. ప్రత్యర్థి ఆధిక్యాన్ని 77 పరుగులకు పరిమితం చేశాడు. ఆపై బ్యాటింగ్‌లో సఫారీల ఆధిపత్యం సాగుతుండగా బంతితోనూ ఆదుకున్నది, మ్యాచ్‌పై ఆశలు నిలిపిందీ అతనే.

కేప్‌టౌన్ టెస్టులో రెండో రోజు ఆటంతా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యదే.

ఒక్కడు.. ఎదిరించాడు

- బ్యాటుతో, బంతితో మెరుపులు
- పతనం తప్పించుకున్న భారత్
- 77 పరుగుల లోటుతో సరి
- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 65/2

పాండ్య అసాధారణ ప్రదర్శన


పాండ్య 93

కేప్‌టౌన్

హార్దిక్ పాండ్య నిలిచాడు.. భారత్‌ను మ్యాచ్‌లో నిలిపాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఒక దశలో 92/7తో ఉన్న భారత్.. 209 పరుగులు చేయగలిగిందటే అది పాండ్య (93; 95 బంతుల్లో 14×4, 1×6) అద్భుత పోరాటం పుణ్యమే. 77 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఒక దశలో 52/0తో నిలిచింది. ఆ స్థితిలో పాండ్య (2/17)నే ఓపెనర్ల వికెట్లు తీసి భారత్ ఊపిరి పీల్చుకునేలా చేశాడు. ఆట ఆఖరుకు దక్షిణాఫ్రికా స్కోరు 65/2. ఆమ్లా (4)కు తోడుగా నైట్ వాచ్‌మన్ రబాడ (2) క్రీజులో ఉన్నాడు. ఇప్పటికే 142 పరుగుల ఆధిక్యంలో ఉన్న సఫారీ జట్టును ఎంత తక్కువకు పరిమితం చేస్తే మ్యాచ్‌పై అంత ఆశలుంటాయి. మూడో రోజు ఉదయం భారత బౌలర్ల ప్రదర్శనను బట్టే మ్యాచ్ ఫలితం నిర్ణయమవుతుంది.

ఉదయం ఉక్కిరిబిక్కిరి..: తొలి రోజు 11 ఓవర్లకే మూడు ప్రధాన వికెట్లు పడిపోయాయి, ఓవర్‌నైట్ స్కోరు 28/3. ఇక మిగిలిన స్పెషలిస్టు బ్యాట్స్‌మెన్ పుజారా, రోహిత్ మాత్రమే. దీంతో ఉదయం వాళ్లిద్దరూ పట్టుదలతో, పూర్తి రక్షణాత్మకంగా ఆడారు. 18 ఓవర్లలో భారత్ చేసింది 29 పరుగులు మాత్రమే. పరిస్థితుల్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న సఫారీ పేస్ చతుష్టయం.. ఒంటి మీదికి దూసుకొచ్చే బంతులతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఫిలాండర్ వరుసగా ఐదు మెయిడెన్లు వేయడం విశేషం. మోర్నీ మోర్కెల్, రబాడలను ఎదుర్కోవడం పుజారా, రోహిత్‌లకు చాలా కష్టమైంది. రబాడ వేసిన ఒక ఓవర్లో ప్రతి బంతికీ రోహిత్ (59 బంతుల్లో 11) పరీక్ష ఎదుర్కొన్నాడు. ఆ తర్వాతి ఓవర్లోనే అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకుని రబాడ ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత అశ్విన్ (12) అండతో పుజారా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 76/4తో భారత్ లంచ్‌కు వెళ్లింది. ఐతే విరామం తర్వాత తొలి బంతికే ఫిలాండర్ ఔట్‌స్వింగర్‌ను ఆడబోయి పుజారా (26; 92 బంతుల్లో 5×4) స్లిప్‌లో చిక్కడంతో భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చూస్తుండగానే అశ్విన్, సాహా (0) కూడా ఔటైపోయారు.

మధ్యాహ్నం ఎదురుదాడి: భారత్ స్కోరు 92/7కు చేరుకోవడంతో 150 చేయడం కూడా అసాధ్యంలానే కనిపించింది. ఇలాంటి స్థితిలో పాండ్య ఎదురు నిలిచాడు. ఒక ఎండ్‌లో భువనేశ్వర్ పాతుకుపోయే ప్రయత్నం చేయగా.. మరో ఎండ్‌లో పాండ్య ఎదురుదాడికి దిగాడు. 5 పరుగుల వద్ద అంపైర్ అతడిని క్యాచ్ ఔట్‌గా ప్రకటించగా.. సమీక్ష కోరి బయటపడ్డాడు హార్దిక్. తర్వాత 15 పరుగుల వద్ద అతడిచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఎల్గర్ వదిలేశాడు. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకున్న పాండ్య.. బ్యాట్ ఝులిపించాడు. మెరుపు షాట్లతో 46 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. 34వ బంతికి ఖాతా తెరిచిన భువి కూడా తర్వాత ధాటిగా ఆడాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. భారత్ 185/7తో టీకి వెళ్లింది.


భువి 25

సాయంత్రం అలా..: లంచ్ లాగే టీ విరామం కూడా భారత్ లయను దెబ్బ తీసింది. విరామం నుంచి రాగానే భారత్ చకచకా వికెట్లు కోల్పోయింది. భువి (25; 86 బంతుల్లో 4×4)ని మోర్నీ ఔట్ చేయడంతో 99 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హార్దిక్, భువి కలిసి 27.3 ఓవర్లు బ్యాటింగ్ చేయడం విశేషం. అండగా నిలిచిన భువి ఔటైపోవడంతో హార్దిక్.. ఇక తెగించి ఆడాల్సిన అవసరమొచ్చింది. ఈ క్రమంలో రబాడ బౌన్సర్‌కు అప్పర్ కట్ ఆడబోయి వికెట్ కీపర్‌కు చిక్కాడు. తర్వాత ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ మార్‌క్రమ్ (34; 43 బంతుల్లో 7×4) ధాటిగా ఆడి భారత బౌలర్లను ఆత్మరక్షణలోకి నెట్టాడు. ఎల్గర్ (25) కూడా బాగా ఆడాడు. ఐతే చివర్లో హార్దిక్ వరుస ఓవర్లలో వీళ్లిద్దరినీ ఔట్ చేసి ఊరటనిచ్చాడు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1; ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16; పుజారా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 26; కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5; రోహిత్ ఎల్బీ (బి) రబాడ 11; అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12; పాండ్య (సి) డికాక్ (బి) రబాడ 93; సాహా ఎల్బీ (బి) స్టెయిన్ 0; భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 25; షమి నాటౌట్ 4; బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబాడ 2; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (73.4 ఓవర్లలో ఆలౌట్) **209**

వికెట్ల పతనం: 1-16, 2-18, 3-27, 4-57, 5-76, 6-81, 7-92, 8-191, 9-199; **బౌలింగ్:** ఫిలాండర్ 14.3-8-33-3; స్టెయిన్ 17.3-6-51-2; మోర్నీ మోర్కెల్ 19-6-57-2; రబాడ 16.4-4-34-3; కేశవ్ మహరాజ్ 6-0-20-0

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34; ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్య 25; రబాడ బ్యాటింగ్ 2; ఆమ్లా బ్యాటింగ్ 4; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (20 ఓవర్లలో 2 వికెట్లకు) **65; వికెట్ల పతనం:** 1-52, 2-59; **బౌలింగ్:** భువనేశ్వర్ 6-3-16-0; బుమ్రా 4-0-14-0; షమి 5-1-15-0; పాండ్య 4-0-17-2; అశ్విన్ 1-0-3-0

ఏ సెషన్లో ఎన్ని?

భారత్ బ్యాటింగ్

లంచ్‌కు ముందు
ఓవర్లు: 25
పరుగులు: 48
వికెట్లు: 1

లంచ్ తర్వాత
ఓవర్లు: 25
పరుగులు: 109
వికెట్లు: 3

టీ తర్వాత
ఓవర్లు: 12.4
పరుగులు: 24
వికెట్లు: 3

దక్షిణాఫ్రికా బ్యాటింగ్
ఓవర్లు: 20
పరుగులు:65
వికెట్లు: 2

స్టెయిన్ ఔట్



భారత బ్యాట్స్‌మెన్‌కు స్వల్ప ఉపశమనం. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా పేస్ దాడి తీవ్రత కొంచెం తగ్గబోతోంది. ఆ జట్టు సీనియర్ ఫాస్ట్‌బౌలర్ డేల్ స్టెయిన్ ఇక ఈ మ్యాచ్‌లో బౌలింగ్ చేయడు. రెండో రోజు పాదానికి గాయం కావడంతో స్టెయిన్ మైదానం నుంచి నిష్క్రమించాడు. పాదం లోపల చిట్లినట్లు తేలడంతో స్టెయిన్ ఈ మ్యాచ్‌కే కాక, సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు.

చాంపియన్

చరిత్రలో ఒక ఇన్నింగ్స్!

ఈనాడు క్రీడావిభాగం

పాండ్య 15 పరుగులకే క్యాచ్ ఔట్ కావాల్సింది. ఎల్గర్ వదిలేస్తే బతికిపోయాడు. 71 పరుగుల వద్ద పాండ్యను స్టంపింగ్ చేసే అవకాశాన్ని డికాక్ చేజార్చాడు. అంత మాత్రాన పాండ్య ఇన్నింగ్స్ విలువ తగ్గిపోతుందా..? దీన్ని ఒక సాధారణ ఇన్నింగ్స్‌గా చూడగలమా..?

గత పదేళ్లలో ప్రపంచంలోని మేటి జట్ల పేస్ బౌలింగ్ విభాగాలన్నింటినీ చూడండి. వాళ్ల బౌలింగ్ ప్రదర్శనల్ని గుర్తు తెచ్చుకోండి. ఏ మ్యాచ్‌లో అయినా.. నలుగురికి నలుగురు ఫాస్ట్ బౌలర్లూ తమ అత్యుత్తమ స్థాయిలో బౌలింగ్ చేయడం.. సమష్టిగా ఇలా ముప్పేట దాడి చేయడం.. నిలకడగా 140-145 కిలోమీటర్ల మధ్య వేగంతో బంతులు విసరడం.. బ్యాట్స్‌మెన్ ఒంటి మీదికి దూసుకొచ్చేలా క్రమం తప్పకుండా బౌన్సర్లు విసరడం.. బంతి బంతికీ బ్యాట్స్‌మెన్‌ను పరీక్షించడం చూశారా? వేరే జట్ల సంగతేమో కానీ.. భారత్ ఆడిన మ్యాచ్‌ల్లో మాత్రం ఎన్నడూ ఇలాంటి పరిస్థితి కనిపించలేదు! ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తరహా పేస్ దాడిని గత కొన్నేళ్లలో తాము చూడలేదని వ్యాఖ్యాతలే అన్నారంటే వారి బౌలింగ్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఒకరిద్దరు ప్రధాన పేసర్లు.. మిగతా వాళ్లు సహాయకులు అని కాకుండా.. నలుగురూ ప్రధాన బౌలర్ల తరహాలోనే బంతులేశారు. నలుగురూ అత్యంత ప్రమాదకరంగా కనిపించారు. వాళ్లు బంతులేసిన తీరు చూస్తే.. ఎలాంటి బ్యాట్స్‌మన్ అయినా.. ఏ బంతికైనా ఔటవుతాడనే అనిపించింది. అలాంటపుడు ఒకట్రెండు జీవనదానాలు వచ్చినంత మాత్రాన బ్యాట్స్‌మన్ నిలుస్తాడన్న గ్యారెంటీ ఏమీ లేదు. కాబట్టే పాండ్య ఇన్నింగ్స్‌కు అంతటి విలువ. జిడ్డు బ్యాటింగ్ చేయడమూ కష్టమే.. ఎదురుదాడి చేయాలన్నా కష్టమే అన్నట్లుగా సాగింది సఫారీల బౌలింగ్. బ్యాట్స్‌మెన్ ఎదురుదాడి చేయాలని చూస్తే అరౌండ్ ద వికెట్ వచ్చి ఒంటి మీదికి రబాడ బంతులేసిన వైనం చూస్తే వారి బౌలింగ్ ఎంత ప్రమాదకరంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. బ్యాట్స్‌మెన్‌ను గాయపరచడానికి కూడా వెనుకాడేది లేదన్నట్లుగా బంతులు సంధించారు సఫారీ బౌలర్లు. పాండ్య సైతం రెండు మూడు దెబ్బలు తిన్నాడు కూడా. అయినా అతను బెదరలేదు. 14 ఫోర్లు, ఒక సిక్సర్ బాదినా.. 93 పరుగులు చేసినా.. హార్దిక్ ఆద్యంతం తడబడుతూనే ఉన్నాడు. అతడిని క్రీజులో సౌకర్యంగా ఏమీ ఉంచలేదు. అలా పడ్డాయి బంతులు మరి. అతను బౌండరీలు బాదిన బంతులేవీ అంత తేలికైనవి కావు. మీదికొస్తున్న బౌన్సర్లను వెనక్కి వంగి, ఎగురుతూ అప్పర్ కట్లు ఆడటం ద్వారా కొన్ని బౌండరీలు రాబడితే.. ఆఫ్ సైడ్ పడ్డ కొన్ని బంతులకు స్లిప్‌లో దొరికిపోయే ప్రమాదం ఉన్నప్పటికీ సాహసోపేత రీతిలో కట్ షాట్లు ఆడి ఫోర్లు సాధించాడు. ఒకసారి ముందుకొచ్చి మిడ్‌వికెట్ దిశగా ఫ్లిక్‌తో సాధించిన బౌండరీ.. అర్ధసెంచరీ సాధించే క్రమంలో ఎక్స్‌ట్రా కవర్స్‌లో ఆడిన లాఫ్టెడ్ షాట్.. ఇవేవీ అంత తేలిగ్గా సాధ్యమైనవి కావు. ఆ షాట్లను ముందే పాండ్య ముందే అనుకుని ఆడినట్లు కూడా కనిపించవు. ఆ సమయానికి ఎలా కుదిరితే అలా ఆడేశాడు పాండ్య. చూడ్డానికి చాలా షాట్లు అంత అందంగా అనిపించి ఉండకపోవచ్చు. వాటిలో కళాత్మకత లేకపోవచ్చు. కానీ పాండ్య సాధించిన ప్రతి పరుగూ, ప్రతి బౌండరీ జట్టుకు ఎంతో మేలు చేసినవే. అత్యంత విలువైనవే. అందుకే ఇదో ప్రత్యేకమైన ఇన్నింగ్స్. పాండ్య ఇన్నింగ్సే లేకపోతే ఈపాటికి మ్యాచ్ ఫలితం నిర్ణయమైపోయేది. భారత్ ఓటమికి సిద్ధమై ఉండేది. ఇప్పటికీ ప్రమాదం తప్పినట్లేమీ కాదు. ఆతిథ్య జట్టుదే పైచేయి. ఐతే పట్టుదలతో పోరాడితే ఓటమి తప్పించుకోవడం కష్టమేమీ కాదనడానికి పాండ్య ఇన్నింగ్సే రుజువు. బౌలింగ్‌లోనూ రాణించడం ద్వారా తన కంటే ఎంతో సీనియర్లతో నిండిన జట్టుకు స్ఫూర్తిగా నిలిచాడు. ఈ స్ఫూర్తితో కోహ్లీసేన పోరాడాలి. మ్యాచ్‌ను సాధించాలి.

- ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే గొప్ప ఆల్‌రౌండర్లలో ఒకడైన భారత దిగ్గజం కపిల్ దేవ్ 59వ పుట్టిన రోజు నాడే అతడికి సరైన వారసుడు కాగల సత్తా తనకుందని బ్యాటుతో, బంతితో పాండ్య చాటిచెప్పడం కొసమెరుపు.

తైజుకు సింధు షాక్

- అహ్మదాబాద్‌పై చెన్నై విజయం
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్



చెన్నై: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో శనివారం చెన్నై స్మాషర్స్ జట్టు 2-1తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై విజయం సాధించింది. మొదట పురుషుల డబుల్స్‌లో రెకినాల్డ్-నందగోపాల్ జంట 15-13, 15-12తో క్రిస్ అడకాక్- యాంగ్‌లీ ద్వయంపై నెగ్గడంతో అహ్మదాబాద్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఐతే తర్వాతి మ్యాచ్‌లో సింధు 15-11, 10-15, 15-12తో ప్రపంచ నంబర్‌వన్ తైజు యింగ్‌ను మట్టికరిపించడంతో చెన్నై స్కోరు సమం చేసింది. మూడో మ్యాచ్‌ను చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోగా.. ఆ జట్టు ఆటగాడు లెవెర్డెజ్ 15-12, 12-15, 14-15తో సౌరభ్ వర్మ చేతిలో ఓడిపోయాడు. ఐతే చెన్నై చివరి రెండు మ్యాచ్‌ల్లో పుంజుకుని పోరులో విజేతగా నిలిచింది. అహ్మదాబాద్ ట్రంప్ మ్యాచ్ అయినా నాలుగో మ్యాచ్‌లో సెన్సోంబూన్సుక్ (చెన్నై) 15-10, 12-15, 15-14తో హెచ్.ఎస్.ప్రణయ్‌పై నెగ్గగా.. పీవీ సింధు, సుమీత్ రెడ్డి జోడీ 15-14, 15-13తో రెగినాల్డ్- కమిలా జుల్ (అహ్మదాబాద్) జంటను ఓడించింది.

డాకర్ ర్యాలీలో భారత బైకర్ సంతోష్



లిమా (పెరు): భారత బైకర్ సీఎస్ సంతోష్ నాలుగోసారి డాకర్ ర్యాలీలో బరిలోకి దిగాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైందిగా పేరున్న ఈ ర్యాలీ శనివారం ఇక్కడ మొదలైంది. ఈ పోటీలో సంతోష్ మరో ఇద్దరితో పాటు హీరో మోటార్ స్పోర్ట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2015లో తొలిసారి ఈ రేసులో పాల్గొన్న అతడు.. 36వ స్థానంలో నిలిచాడు. కానీ తర్వాతి రెండు ప్రయత్నాల్లో రేసును పూర్తి చేయలేకపోయాడు. పెరూలో మొదలైన ఈ రేసు బొలివియాను దాటుకుని ఈ నెల 20న అర్జెంటీనాలో ముగుస్తుంది. 60 దేశాల నుంచి దాదాపు 500 మంది ఈ రేసులో పోటీపడుతున్నారు. ఇది మామూలు రహదారిపై జరిగే రేసు కాదు. రేసును పూర్తి చేయడానికి విపరీతమైన వేడిలో కొండలు, గుట్టలు, ఎడారి ప్రాంతాల గుండా దాదాపు 9 వేల కిలోమీటర్లు ప్రయాణించాల్సివుంటుంది.

చెన్నై బ్యాటింగ్ కోచ్‌గా హసి

ముంబయి: చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైకెల్ హసి నియమితుడయ్యాడు.

పట్టు బిగించిన ఆసీస్


ఖవాజా

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ మరో ఓటమికి సిద్ధం కాక తప్పేలా లేదు. ఇప్పటికే సిరీస్‌ను 3-0తో చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా.. చివరి టెస్టునూ సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 346 పరుగులకే కట్టడి చేసిన ఆసీస్.. భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 193/2తో మూడో రోజు, శనివారం ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూ జట్టు రోజు మొత్తంలో రెండే వికెట్లు కోల్పోయి ఆట ఆఖరుకు 479/4తో నిలిచింది. 91 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన ఉస్మాన్ ఖవాజా కెరీర్లో రెండో అత్యధిక స్కోరు (171; 381 బంతుల్లో 18×4, 1×6) చేసి ఔటయ్యాడు. కెప్టెన్ స్టీవెన్ స్మిత్ (83; 158 బంతుల్లో 5×4)తో అతను మూడో వికెట్‌కు 188 పరుగులు జోడించాడు. స్మిత్ ఔటయ్యాక ఖవాజాకు షాన్ మార్ష్ (98 బ్యాటింగ్; 207 బంతుల్లో 10×4) జత కలిశాడు. వీళ్లిద్దరూ మరో శతక భాగస్వామ్యం (101) నమోదు చేశారు. ఖవాజా వెనుదిరిగాక షాన్‌కు అతడి తమ్ముడు మిచెల్ మార్ష్ (63; 87 బంతుల్లో 9×4, 2×6) తోడై.. ఇద్దరూ కలిసి ఆసీస్‌ను తిరుగులేని స్థితికి తీసుకెళ్లారు. 6 వికెట్లు చేతిలో ఉన్న ఆసీస్ ఇప్పటికే 133 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆధిక్యం 300 దాటే వరకు ఆసీస్ ఆడే అవకాశముంది.

టాటా ఓపెన్ మహారాష్ట్ర విజేత సైమన్



పుణె: గిల్లీస్ సైమన్ టాటా ఓపెన్ మహారాష్ట్ర విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన ఫైనల్లో 7-6 (4), 6-2తో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)పై విజయం సాధించాడు. 2015 ఫిబ్రవరి తర్వాత సైమన్‌కు ఇదే తొలి టైటిల్. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 89వ స్థానంలో ఉన్న ఈ ఫ్రాన్స్ ఆటగాడు.. కెరీర్‌లో ఓ దశలో ఆరో ర్యాంకు వరకు వెళ్లాడు. ఈ టోర్నీలో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగాడు. ఇంతకు ముందు చెన్నై ఓపెన్‌గా ఉన్న ఈ టోర్నీ ఈ ఏడాది నుంచే టాప్ ఓపెన్ మహారాష్ట్రగా మారింది.

విలియమ్సన్ సెంచరీ

తొలి వన్డేలో పాకిస్థాన్‌పై న్యూజిలాండ్ విజయం

వెల్లింగ్టన్: పాకిస్థాన్‌తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. విలియమ్సన్ (115) శతకం చేయడంతో శనివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ డక్‌వర్త్ లూయిస్ విధానంలో 61 పరుగుల తేడాతో పాక్‌ను ఓడించింది. విలియమ్సన్‌తో పాటు మన్రో (58), నికోల్స్ (50), గప్తిల్ (48) మెరవడంతో న్యూజిలాండ్ మొదట 7 వికెట్లకు 315 పరుగులు సాధించింది. ఛేదనలో పాకిస్థాన్ వడివడిగా వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే సమయానికి పాక్.. 6 వికెట్లకు 166 పరుగులు సాధించింది. తిరిగి ఆట సాధ్యం కాకపోవడంతో డ/లూ విధానంలో కివీస్ విజేతగా నిలిచింది. పాకిస్థాన్ తరఫున ఫకర్ జమాన్ (82 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

గోడ కట్టేస్తారు..



- 18 బిలియన్ డాలర్ల నిధులు కోరిన 'ట్రంప్'
- మెక్సికోలో అసంతృప్తి

ఒకపక్క పొరుగుదేశమైన మెక్సికోలో అసంతృప్తి వ్యక్తం అవుతున్నా, నిధులు వృథా చేయబోతున్నారని మరోపక్క స్వదేశంలో డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులు విమర్శిస్తున్నా... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి పూనుకుంటున్నారు. దీనికి వచ్చే పదేళ్లలో 18 బిలియన్ డాలర్లు (1 బిలియన్ డాలర్లు = సుమారు రూ.6,500 కోట్లు) కేటాయించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాంగ్రెస్‌ను కోరారు. ఈ మేరకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగమైన యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) సవివరమైన ప్రతిపాదనను కాంగ్రెస్‌కు సమర్పించింది. అటు డెమోక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా, అనుకూలంగా కాంగ్రెస్ తమ వాద ప్రతివాదనలను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. ట్రంప్ అనుకున్నట్లుగా కాంగ్రెస్ ఆమోద ముద్ర లభించి గోడ నిర్మాణం మొదలయితే రెండు దేశాల మధ్య అతిపెద్ద సరిహద్దు గోడ రూపుదిద్దుకుంటుంది. దీనిపై మెక్సికోలో ఇప్పటికే నిరసనలు వినిపిస్తున్నారు. అటు అమెరికాలోనూ ఎందుకీ వృథా వ్యయం... అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అది పెద్ద సరిహద్దు

★ అమెరికా దక్షిణ భాగంలో ఉన్న మెక్సికోతో అమెరికాకు దాదాపు 2,000 మైళ్ల పొడవైన సరిహద్దు ఉంది.

★ ఇప్పటికే ఈ రెండు దేశాల మధ్య కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా గోడ ఉంది. కొన్నిచోట్ల కంచె ఉంది. ఇప్పటికే 407 మైళ్ల సరిహద్దుకు రక్షణగా గోడ ఇతర అవరోధాలు ఉండగా, దాన్ని ఇంకా బలోపేతం చేయాలని ప్రతిపాదించారు.

★ తొలిదశలో 316 మైళ్ల సరిహద్దులో కొత్తగా గోడ నిర్మాణం చేపట్టాలనేది ప్రణాళిక.

★ ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం ఈ సరిహద్దు గోడ వెంట సెక్యూరిటీ టవర్లు, నిఘా పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం కోసమే 5.7 బిలియన్ డాలర్లు వెచ్చించాల్సి వస్తుంది. ఇంకా సరిహద్దుకు ఆనుకొని రోడ్ల నిర్మాణానికి 1 బిలియన్ డాలర్లు, సరిహద్దు గార్డుల కోసం 8.5 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టాలి.

★ అనుకున్నట్లుగా నిధులు లభించి గోడ నిర్మాణం మొదలయితే 2027 నాటికి దాదాపు 1,000 మైళ్ల గోడ నిర్మాణం పూర్తవుతుంది.

మెక్సికన్లే అధికం

★ అమెరికాకు ఏటా అత్యధిక సంఖ్యలో వచ్చే విదేశీయుల్లో మెక్సికన్ల సంఖ్య అధికం. ఇందులో అధికారికంగా అన్ని రకాలైన అనుమతులు తీసుకొని వచ్చే వారి సంఖ్య తక్కువ. చాలా వరకూ అక్రమ వలసలే ఉంటాయి.

★ 2014లో అమెరికాలో 1.17 కోట్ల మంది మెక్సికన్లు ఉన్నారు. ఆ సమయంలో అమెరికా వచ్చిన విదేశీ జనాభాలో ఇది 28 శాతం.

★ గత కొంతకాలంగా వలసలపై యూఎస్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవటంతో మెక్సికో నుంచి వచ్చే వారి సంఖ్య తగ్గింది. 2000లో వలసదార్లలో మెక్సికన్లు 29.5 శాతం ఉండగా, 2014 నాటికి ఇది 27.6 శాతానికి తగ్గింది.

★ కానీ ఇతర అన్ని దేశాలతో పోల్చినప్పుడు మెక్సికోతోనే అమెరికాకు ఉన్న ఇబ్బంది ఏమిటంటే... ఇది అమెరికా పొరుగుదేశం. అందువల్ల భూమార్గంలో అక్రమంగా ఆ దేశంలో అడుగుపెట్టే అవకాశం ఉంటుంది. అమెరికా ఉత్తర సరిహద్దున కెనడా ఉన్నప్పటికీ ఆదేశంలో ఇటువంటి సమస్య లేదు. మిగిలిన దేశాల నుంచి అక్రమంగా అమెరికాలో అడుగుపెట్టటం ఎంతో కష్టసాధ్యమైన విషయం. అక్రమ వలసలు అధికంగా ఉన్నందునే మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టాలనే ఆలోచన ముందుకు వచ్చింది.

పలు దేశాల మధ్య అడ్డు 'గోడ'లు

రెండు దేశాల మధ్య సరిహద్దుల్లో రాకపోకలను, అక్రమ వలసలను నియంత్రించే లక్ష్యంతో గోడలు నిర్మించాలనే ఆలోచన చేయటం ఇదే మొదటిసారి కాదు. ఎన్నో దేశాల మధ్య ఇటువంటి అడ్డుగోడలు ఉన్నాయి. రెండు దేశాల మధ్య సరిహద్దు గోడలు నిర్మించటం గత నాలుగు దశాబ్దాల కాలంలో ఎక్కువైన విషయం గమనార్హం. కాకపోతే ఇందులో అత్యధిక భాగం ఇనుప కంచెలే. కాంక్రీటు గోడలు కాదు.

★ పొరుగు దేశాల నుంచి వలసలను నిరోధించటానికి హంగరీ ప్రభుత్వం సెర్బియా, క్రొయేషియా సరిహద్దుల్లో 175 కిలోమీటర్ల పొడవైన నాలుగు మీటర్ల ఎత్తైన అడ్డుగోడను నిర్మించింది.

★ బల్గేరియా ప్రభుత్వానికి టర్కీతో సరిహద్దు ఉంది. టర్కీ నుంచి వలసలను అదుపు చేయటానికి 2014లో బల్గేరియా ప్రభుత్వం 176 కిలోమీటర్ల పొడవైన అడ్డుగోడ ఏర్పాటు చేసింది.

★ స్పెయిన్‌లోని సీటా, మెలిల్లా ప్రాంతాలకు పొరుగున ఉన్న మొరాకో నుంచి అక్రమ వలసదార్లు అడుగుపెట్టకుండా స్పెయిన్ ప్రభుత్వం ఎత్తైన కంచె నిర్మాణం చేపట్టింది.

★ టర్కీకి దక్షిణ ప్రాంతంలో ఉన్న సైప్రస్‌పై 1974లో టర్కీ దాడి చేసి కొన్ని ప్రాంతాలను పట్టుకుంది. ఈ ప్రాంతాలకు, మిగిలిన సైప్రస్‌కు మధ్య సరిహద్దు గోడ నిర్మించారు.

★ గ్రీసు, టర్కీ దేశాల మధ్య కూడా 7 మైళ్ల పొడవైన సరిహద్దు గోడ ఉంది. టర్కీ నుంచి గ్రీసు మీదగా ఐరోపా దేశాల్లోకి అక్రమ వలసలు చోటుచేసుకోకుండా నిరోధించటానికి దీన్ని నిర్మించారు.

★ సౌదీ అరేబియా- ఇరాక్ మధ్య 560 మైళ్ల పొడవైన ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ఇస్లామిక్ స్టేట్ తీవ్రవాదుల నుంచి ముప్పు తప్పించుకోవటానికి సౌదీ అరేబియా ప్రభుత్వం దీన్ని నిర్మించింది.

★ ఇజ్రాయిల్- పాలస్తీనా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందనేది తెలిసిన విషయమే. వెస్ట్ బ్యాంక్ వద్ద పాలస్తీనా నుంచి రాకపోకలను అడ్డుకోవటానికి ఇజ్రాయిల్ ప్రభుత్వం 2002లో బలమైన అడ్డుగోడ నిర్మాణాన్ని చేపట్టింది.

★ టర్కీ- సిరియా మధ్య కూడా ఇటువంటి అడ్డుగోడ వస్తోంది. 500 మైళ్ల పొడవైన ఇనుప కంచె నిర్మాణాన్ని టర్కీ ప్రభుత్వం చేపట్టింది.

కశ్మీర్‌లో బాంబు పేలుడు.. నలుగురు పోలీసులు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని సోపోర్ పట్టణంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు శనివారం బాంబు దాడికి తెగబడ్డారు. ఇందులో ఇండియన్ రిజర్వు పోలీసు విభాగంలోని మూడో బెటాలియన్‌కు చెందిన నలుగురు పోలీసులు మృతి చెందారు. మెరుగుపరచిన పేలుడు పదార్థం (ఐఈడీ)తో ఈ దాడి చేసినట్లు గుర్తించారు. 2015 తర్వాత ఇక్కడ ఇలాంటి బాంబును ఉపయోగించడం ఇదే మొదటిసారి.

సోపోర్ టౌన్‌షిప్‌లోని చోటా బజార్, బడా బజార్‌కు మధ్యలో ఉన్న ఒక మార్గంలో ఓ దుకాణం ఎదుట ఈ బాంబును ఉగ్రవాదులు అమర్చారు. వేర్పాటువాదులు బంద్ నేపథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్నారు. పోలీసు బృందం అక్కడికి రాగానే ఉగ్రవాదులు బాంబును పేల్చారు. ఫలితంగా ఏఎస్ఐ ఇర్షాద్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ అమిన్, కానిస్టేబుళ్లు గులాం నబీ, పర్వేజ్ అహ్మద్ బలయ్యారు. పేలుడు తీవ్రతకు పెద్ద గొయ్యి ఏర్పడింది. చుట్టుపక్కల ఏడు దుకాణాలు దెబ్బతిన్నాయి. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు నిర్వహించిన రెండో దాడి ఇది. గత నెల 31న భారీగా ఆయుధాలు ధరించిన ముష్కరులు పుల్వామాలోని సీఆర్పీఎఫ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి చేసి, ఐదుగురు జవాన్లను బలితీసుకున్నారు. ఈ రెండు దాడులకూ తామే బాధ్యులమని జైషే మహ్మద్ ఉగ్రవాద ముఠా ప్రకటించుకొంది. బాంబు దాడిని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాలు ఖండించారు. దేశ రక్షణ సిబ్బందిని కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ విమర్శించారు.



బాంబు పేలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు. అంతర చిత్రంలో ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు

ముంబయిలోని సినీ స్టూడియోలో అగ్నిప్రమాదం

ముంబయి: ముంబయి శివారులోని కంజూర్‌మార్గ్ (పశ్చిమ)లో ఉన్న సినీవిస్టా స్టూడియోలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఎవరూ గాయపడినట్టు సమాచారం అందలేదని పోలీసు డిప్యూటీ కమిషనర్ అఖిలేష్ సింగ్ చెప్పారు. తొలుత విద్యుత్తు వైర్లలో మంటలు కనిపించాయని తెలిపారు. సంఘటన స్థలానికి ఎనిమిది అగ్నిమాపక శకటాలు, ఆరు నీటి ట్యాంకర్లను పంపించారు.

మోజోస్ బిస్ట్రో యజమాని అరెస్టు

కమలా మిల్స్ ప్రాంగణంలోని మోజోస్ బిస్ట్రో పబ్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది మృతి చెందిన సంఘటనకు సంబంధించి ఆ పబ్ యజమాని యుగ్ కె పాఠక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన రిటైర్డు డీజీపీ స్థాయి ఐపీఎస్ అధికారి కె.కె.పాఠక్ కుమారుడు. ఈ పబ్ భాగస్వామి, నాగ్‌పూర్‌కు చెందిన వ్యాపారి యుగ్ ఆర్ తులిని కూడా పోలీసులు విచారించారు. తొలుత ఈ పబ్‌లోనే మంటలు ప్రారంభమయి ఇతర పబ్‌లకు వ్యాపించాయి.

కేంద్ర బడ్జెట్‌పై మోదీ ముద్ర

స్వయంగా పర్యవేక్షిస్తున్న ప్రధాని



దిల్లీ: కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పాలుపంచుకుంటున్నారు. ఎన్నికల ముందు ప్రవేశపెట్టనున్న చివరి, పూర్తి స్థాయి బడ్జెట్ కానుండడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బడ్జెట్‌పై ప్రధానులు సూచనలు ఇవ్వడం కొత్తేమీ కాకపోయినా, ఈసారి మోదీ మాత్రం అన్ని విషయాలపైనా దృష్టి పెడుతున్నారు. గత నెల నుంచి పలుమార్లు ఆర్థికశాఖ అధికారులతో భేటీ అయ్యారు. ఈ సమావేశాలు కొన్నిసార్లు మూడు గంటల పాటు కొనసాగడం గమనార్హం. ఆయన ముఖ్యంగా ఉద్యోగాల కల్పన, వ్యవసాయ ప్రగతి, పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. వచ్చే వారం ఆర్థికరంగ పరిస్థితిపై ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్తలతో చర్చలు జరపనున్నారు.

నెలాఖర్లో దావోస్‌కు..

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఈ నెలాఖరులో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) సదస్సులో మోదీ పాల్గొననున్నారు. భారత ప్రధాని ఆ సదస్సులో పాల్గొనడం 20 ఏళ్ల తరువాత ఇదే తొలిసారి కానుంది. చివరగా 1997లో అప్పటి ప్రధాని దేవెగౌడ ఈ సదస్సులో ప్రసంగించారు.

నేడు, రేపు పోలీసు ఉన్నతాధికారులతో భేటీ

గ్వాలియర్‌లోని తెకాన్‌పుర్‌లో ఉన్న బీఎస్ఎఫ్ అకాడమీలో ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్న పోలీసు ఉన్నతాధికారుల సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో జరిగే వార్షిక సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు.

రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

- లోక్‌సభ స్పీకర్‌కు పంపిన వెంకయ్య నాయుడు

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై వచ్చిన సభాహక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు లోక్‌సభ స్పీకర్‌కు పంపించారు. రాహుల్ లోక్‌సభ సభ్యుడు కావడంతో తదుపరి చర్యల నిమిత్తం దానిని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. రాహుల్‌పై ఇదవరకే వచ్చిన ఫిర్యాదును సీనియర్ నేత ఎల్.కె.అడ్వాణీ నేతృత్వంలోని నైతిక ప్రవర్తన కమిటీ పరిశీలిస్తోంది. రాజ్యసభ అధికారాలు, నిర్ణయాలను ప్రశ్నించే విధంగా రాహుల్ ట్వీట్ చేశారంటూ భాజపాకు చెందిన రాజ్యసభ సభ్యుడు భూపేందర్ యాదవ్ ఫిర్యాదు చేశారు. దానిని పరిశీలించిన ఛైర్మన్ వెంకయ్య నాయుడు సభా హక్కుల ఉల్లంఘన జరిగినట్టు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రతిష్టకు భంగం కలిగేలా ట్వీట్ చేశారంటూ యాదవ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జైట్లీ అన్న పదాన్ని విరుస్తూ 'జైట్ లై' (లై అంటే ఆంగ్లంలో అబద్ధం అన్న అర్థం) అని పేర్కొన్నారని, ఇది పరువు నష్టం కలిగించే వ్యాఖ్య అని ఆరోపించారు. కావాలనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు.

భాజపా ఇలాంటి విమర్శలు ఎన్నో చేసింది.. కాంగ్రెస్: రాహుల్ గాంధీకి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ స్పందించారు. భాజపా మంత్రులు ఇలాంటి వ్యాఖ్యలు ఎన్నో చేశారని, వారందరికీ నోటీసులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రాజ్యాంగ పదవులు చేపట్టిన మాజీ ప్రధాని మన్మోహన్, మాజీ ఉపరాష్ట్రపతి అన్సారీలపైనా ప్రధాని మోదీ విమర్శలు చేశారని ఆరోపించారు. రాజకీయ వ్యాఖ్యలకు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తూ పోతే, అధికార పక్షంపై చాలా ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

యువతలో క్రమశిక్షణకు ఎన్‌సీసీ అవసరం

దిల్లీ, జయపుర: యువతలో నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతను ప్రోది చేయడానికి నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) చాలా అవసరమని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తెలిపారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ ఎన్‌సీసీలో చేరాలని, దీనివల్ల వారిలో జాతీయ దృక్కోణం ఏర్పడుతుందని చెప్పారు. ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవం శిబిరం-2018ని ఉపరాష్ట్రపతి శనివారం ఇక్కడ ప్రారంభించారు. కళాశాల రోజుల్లో తాను కూడా ఎన్‌సీసీ యూనిఫామ్ ధరించాలని ఉవ్విళ్లూరే వాడనని చెప్పారు. "ఇప్పుడు గౌరవ వందనం కార్యక్రమాన్ని చూసినప్పుడు అదే భావన కలుగుతోంది" అని చెప్పారు.

ప్రపంచం చూపు భారత్ వైపు: అభివృద్ధి, సంస్కరణల పథంలో ముందడుగు వేస్తోన్న మన దేశం వైపే యావత్తు ప్రపంచం ఆశగా చూస్తోందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జయపురలో నిర్వహించిన మాల్వియా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు మాతృభాషను గౌరవించాలని, మాతృభాషలో మాట్లాడాలని కోరారు.



ఎన్‌సీసీ క్యాడెట్లతో ముచ్చటిస్తున్న వెంకయ్యనాయుడు

మందగించిన ఆర్థిక ప్రగతి: రాహుల్

ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విభజన విధానాల కారణంగానే ఆర్థిక ప్రగతి మందగించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 'మేధస్సు'కు ప్రధాని అమలు చేస్తున్న స్థూల విభజన రాజకీయాలు (గ్రాస్ డివిజివ్ పాలిటిక్స్ -జీడీపీ)తోడవడమే ఇందుకు కారణాలని ట్వీట్ చేశారు. గత 63 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా బ్యాంకు రుణాలు తగ్గాయని, ఎనిమిదేళ్లలో లేనంతగా ఉపాధి కల్పన తగ్గిందని, గత 13 ఏళ్లతో పోల్చితే ప్రస్తుతం కొత్త పెట్టుబడులు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ద్రవ్యలోటు పెరిగిందని, దాంతో పలు ప్రాజెక్టులు ఆగిపోయాయని తెలిపారు.

అనుమానాలు నిజమయ్యాయి.. చిదంబరం: ఆర్థిక రంగం మందగిస్తుందన్న అనుమానాలు నిజమయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు కారణంగా అసంఘటిత రంగం తీవ్ర నష్టాలపాలయిందని తెలిపారు. తయారీ రంగంలో ప్రగతి దిగజారిందని, ఎగుమతులు పడిపోయాయని తెలిపారు. చేదు మాత్రలకు ఎంతగా తీపి పూత పూసినా వాస్తవాలు దాచలేరని విమర్శించారు. ఆర్థిక మందగమనం వల్లనే సామాజిక అశాంతి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా మాట్లాడుతూ నోట్ల రద్దు, జీఎస్టీ అమలులో లోపాల కారణంగానే ఆర్థిక ప్రగతిలో తిరోగమనం కనిపిస్తోందని ఆరోపించారు. అహంకారి అయిన ప్రధాని ఆర్థిక విజ్ఞతను విస్మరించారని విమర్శించారు.

ప్రపంచ నేతల ట్వీట్లను తొలగించం

- వివాదాస్పదమైనప్పటికీ వారి సందేశాలకు ప్రత్యేక హోదా
- ట్రంప్ ఖాతాను నిషేధించాలన్న డిమాండ్లపై ట్విటర్ వివరణ

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి అంతర్జాతీయ స్థాయి నేతల ట్విటర్ ఖాతాలకు ప్రత్యేక హోదా ఉంటుందని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినప్పటికీ వారి ఖాతాలను నిషేధించబోమని సామాజిక మాధ్యమ వేదిక ..ట్విటర్ కంపెనీ యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రపంచ స్థాయి నేతల సందేశాలు/వ్యాఖ్యలతో కూడిన ట్వీట్లను తాము అడ్డుకున్నప్పటికీ వారు మౌనం వహించబోరని, మరో రూపంలో తమ అభిప్రాయాలకు ప్రచారం కల్పించుకోగలరని పేర్కొంది. అంతేకాక ఆ స్థాయి నేతల ట్వీట్లను అడ్డుకుంటే ముఖ్యమైన సమాచారం ప్రజలకు అందకుండా పోవటమే కాకుండా దానిపై జరగాల్సిన బహిరంగ చర్చకూ అవకాశంలేకుండా పోతుందని అభిప్రాయపడింది. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ట్రంప్... 'నా వద్ద కూడా అంతకంటే పెద్దదైన, శక్తిమంతమైన అణు మీట ఉంద'ంటూ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచ మానవాళికి ముప్పు కలిగించేలా ఉన్నాయని, ఆయన ట్విటర్ ఖాతాను నిషేధించాలని డిమాండ్ చేశారు. కొందరు అయితే ఏకంగా ట్విటర్ కార్పొరేట్ కార్యాలయం ముందు నిరసనలకూ దిగారు. దీనికి ట్విటర్ స్పందిస్తూ తన కార్పొరేట్ బ్లాగ్‌లో ఈ వివరణను పోస్ట్ చేసింది. అంతర్జాతీయ నేతల ట్వీట్లనూ తాము సమీక్షిస్తామని, కంపెనీ నిబంధనలను వాటికి వర్తింపజేసి ఏ మేరకు అనుమతించాలన్నది నిర్ణయిస్తామని పేర్కొంది. ప్రజాప్రయోజనాలను సదా మదిలో ఉంచుకుని, నిష్పక్షపాతంగా సేవలందించేందుకు శ్రమిస్తామని తెలిపింది.

పాక్‌పై ఒత్తిడికి అన్ని అవకాశాలూ పరిశీలనలో

- అమెరికా స్పష్టీకరణ

వాషింగ్టన్: ఉగ్రవాదంపై చర్యలు తీసుకునేలా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచేందుకు 'అన్ని అవకాశాలూ' తమ పరిశీలనలో ఉన్నాయని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ శనివారం స్పష్టంచేసింది. ఇప్పటికే 200 కోట్ల డాలర్ల సాయం ఆ దేశానికి అమెరికా నిలిపివేసింది. "పాక్ విషయంలో చర్యలు తీసుకోవడానికి, తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌పై కొరడా ఝుళిపించేలా నచ్చజెప్పడానికి.. భద్రతా సాయం నిలిపివేతే కాకుండా మా వద్ద అనేక సాధనాలు ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడంలో అమెరికా నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన పనిలేదు. అన్నిఅవకాశాలూ పరిశీలనలో ఉన్నాయి" అని ట్రంప్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఆ అవకాశాలు ఏంటన్నది వివరించడానికి ఆయన నిరాకరించారు. తమ వద్ద అనేక సాధనాలు ఉన్నాయని, ఏకపక్షంగా కూడా చర్యలు తీసుకోగలమన్నారు. పాక్‌లో తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌కు ఉన్న సురక్షిత ఆవాసాలను నాశనం చేయాలని, అఫ్గానిస్థాన్‌లో దాడులుచేయకుండా.. ఆ ముష్కర ముఠాలను దెబ్బ తీయాలని తాము కోరుతున్నట్లు చెప్పారు. పాకిస్థాన్‌పై తాము ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఆ దేశం తమపై ఏమైనా చర్యలకు దిగితే ఎలా స్పందించాలన్నదానిపై అమెరికా మల్లగుల్లాలు పడుతోంది. అఫ్గానిస్థాన్‌లో పోరాడుతున్న అమెరికా, ఇతర దేశాల బలగాలకు సైనిక సరఫరాలు చేరవేయడానికి పాకిస్థాన్ కీలక మార్గంగా ఉంది. తాజా పరిస్థితులు నేపథ్యంలో అమెరికా సైన్యానికి తమ వాయు,రోడ్డుమార్గాలను మూసివేయాలని పాక్ నిర్ణయించే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై ఆందోళనవద్దని, పాక్ నుంచి అలాంటి సంకేతాలేమీ లేవని అమెరికా రక్షణ మంత్రి జిమ్ మ్యాటిస్ పేర్కొన్నారు. మరోవైపు పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం నిలిపివేసి, ఆ సొమ్మును అమెరికాలో మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఉపయోగించాలన్న సెనేటర్ రాండ్ పాల్ ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు పలికారు.

నేను మహా మేధావిని!

- తన మానసిక స్థితిపై వస్తున్న వదంతులకు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్లతో సమాధానం

వాషింగ్టన్: తన మానసిక ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తం చేస్తున్న వారికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీటుగా జవాబిచ్చారు. ఈ వదంతులు తననేమీ చేయజాలవని, తనెంతో దృఢచిత్తం కలవాడినని పేర్కొంటూ వరుసగా పలు ట్వీట్‌లు చేశారు. తాను మహా మేధావిని కాకుంటే వ్యాపారవేత్తగా, టీవీ స్టార్‌గా, తొలి ప్రయత్నంలోనే అధ్యక్షునిగా ఎన్నికల కావటంలో వరుస విజయాలు ఎలా సాధించగలనంటూ తనకు తానే కితాబు నిచ్చుకున్నారు. "రష్యాతో కుమ్మక్కు అయ్యానన్నారు. ఒక ఏడాదిపాటు తీవ్రంగా శోధించారు. డెమోక్రాట్లు, వారి పెంపుడు శునకాలు అమెరికా ప్రజలకు మస్కా కొట్టారని తేలిపోయింది. ఇక అసత్య వార్తలందించే ప్రధాన మీడియా నా మానసిక ఆరోగ్యం బాగోలేదని కథనాలు వండివార్చుతోంది'' అంటూ ట్రంప్ మండిపడ్డారు. స్థిరమైన మనస్తత్వం, ఆకర్షణీయత తనకున్న రెండు గొప్ప జీవితకాల ఆస్తులని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డెమోక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి హిలరీ కూడా ఇలాంటివెన్నో ఎత్తుగడలు ప్రయోగించినా అవన్నీ వ్యర్థమయ్యాయంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు.

రొయ్యలు తినకూడదంటూ ఫత్వా

హైదరాబాద్: ముస్లింలు రొయ్యలు తినడాన్ని మానుకోవాలంటూ హైదరాబాద్‌కు చెందిన జామియా నిజామియా ఇస్లామిక్ సంస్థ ఫత్వా జారీ చేసింది. 'చేపలు' అన్న వర్గీకరణలోకి రొయ్యలు రావని, అందువల్ల వాటిని తినడం మానుకోవాలని సూచించింది. కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకూడదంటూ కచ్చితమైన నిషేధం ఉందని, మరికొన్నింటిని వదిలివేయాలన్న నిబంధన ఉందని తెలిపింది. రొయ్యలు రెండో వర్గం కిందకు వస్తాయని వివరించింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులతో రాహుల్ భేటీ

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దిల్లీలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. శుక్రవారం నాటి ఈ భేటీలో వివిధ అంశాలపై తమ మధ్య అర్థవంతమైన చర్చ జరిగిందంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మెంగ్ షియాంగ్ ఫెంగ్ నేతృత్వంలోని చైనా బృందం ఆ తర్వాత కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వీకే సింగ్‌తోనూ భేటీ అయ్యారు. డోక్లామ్ ప్రతిష్టంభన నెలకొన్న సమయంలో చైనా రాయబారితో రాహుల్ గాంధీ భేటీ అవటం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అయితే, రాయబారిని కలిసే హక్కు తనకుందని రాహుల్ ఆ విమర్శలను తోసిపుచ్చారు.

పర్యావరణ అనుమతుల్లో రాష్ట్రాలకు అధికారాలు

ఈనాడు, దిల్లీ: పర్యావరణ అనుమతుల (ఈసీ) పరంగా రాష్ట్రాలకు కొన్ని అధికారాలు బదలాయించాలని కేంద్ర సర్కారు యోచిస్తోంది. నీటిపారుదల, మౌలిక సదుపాయాల పనుల వరకు అధికారాల వికేంద్రీకరణకు సమాయత్తమవుతోంది. ప్రస్తుతం 10 వేల హెక్టార్ల భూమి వరకు సాగునీరు అందించే నీటిపారుదల పథకాలకు రాష్ట్రాలే ఈసీ ఇస్తున్నాయి. దీనిని ఇకపై 50 వేల హెక్టార్లను పెంచనున్నారు. బొగ్గు మినహా ఇతర ఖనిజాల తవ్వకాలకు 100 హెక్టార్ల భూమి వరకు ఇకమీదట రాష్ట్రాలే ఈసీ జారీ చేస్తాయి. ప్రస్తుతం ఈ పరిమితి 50 హెక్టార్లే. పంట భూములకు సత్వరం నీళ్లు అందేలా చూడడం, మౌలిక సదుపాయాల పనులు త్వరగా కార్యరూపం దాల్చడం కోసం ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 'ప్రధానమంత్రి వ్యవసాయ సేద్యపునీటి పథకం' కింద దేశంలో 99 పథకాలను 2019 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అనుమతుల మంజూరు నిమిత్తం కేంద్రం తన పరిధిని ఎంత తగ్గించుకోబోతుందో రాష్ట్రాల పరిధి అంత మేర పెరుగుతుంది. 'పర్యావరణ ప్రభావ అంచనా ప్రకటన-2006' లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ రూపొందించిన ముసాయిదా పేర్కొంటోంది.

పెంపుడు ఎలుక చనిపోయిందని..!

ప్రాణాలు తీసుకున్న బాలిక

భోపాల్: పెంపుడు ఎలుక చనిపోయిందన్న మనస్తాపంతో మధ్యప్రదేశ్‌లో ఓ బాలిక ప్రాణాలు తీసుకుంది. భోపాల్‌కు చెందిన దివ్యాన్షి రాఠోడ్ (12) తన ఇంటిలోనే ఉరేసుకుని చనిపోయినట్లు అయోధ్యనగర్ పోలీసులు తెలిపారు. ఏడో తరగతి చదువుతున్న ఆమె పెంచుకునేందుకు గాను గత వారమే ఓ తెల్ల ఎలుకను తీసుకురాగా అది శుక్రవారం చనిపోయింది. కొద్ది నెలల క్రితమే పెంపుడు కుక్క చనిపోగా అప్పట్లో బాలిక తల్లడిల్లిపోయింది. అనంతరం ఎలుక కూడా చనిపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనైంది. ఆ ఎలుకను పాతిపెట్టి.. పూలను ఉంచిన బాలిక అనంతరం తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు.

దివ్యాంగురాలైన కుమార్తెను వదిలించుకోవాలని..!

ఫోన్‌లోనే భార్యకు తలాక్!

గోండా: దివ్యాంగురాలైన కుమార్తెను వదిలించుకోవడానికి ఓ వ్యక్తి ఫోన్‌లోనే భార్యకు తలాక్ చెప్పినట్లు పోలీసులు శనివారం తెలిపారు. యూపీలోని చదౌవాకు చెందిన ముబారక్‌అలీ 17ఏళ్ల క్రితం బల్హారీకి చెందిన షకీనా బానోను వివాహమాడాడు. ప్రస్తుతం అతను ముంబయిలో ఉంటుండగా.. దివ్యాంగురాలైన కుమార్తె కరిష్మా(14)తో కలిసి షకీనా తన తండ్రి ఇంటిలో ఉంటున్నారు. కాగా ఇటీవల కుమార్తెకు చికిత్స కోసం షకీనా భర్తను డబ్బులు అడగ్గా.. అతను ముంబయి నుంచే తలాక్ చెప్పడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు.

ఆసియాన్ దేశాల మధ్య బలమైన ఆర్థిక బంధం

జకర్తా: సమష్టి భద్రత, సమష్టి సంపద అనే రెండు ప్రధాన సూత్రాల ఆధారంగా ఆసియాన్ దేశాల మధ్య ఒక ప్రాంతీయ ఏర్పాటు ఉండాలని భారత్ భావిస్తోందని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. ఈ దేశాల మధ్య దృఢమైన, గతిశీలమైన ఆర్థిక బంధం ఉండాలనీ ఆమె ఆకాంక్షించారు. మూడు రోజుల విదేశీ పర్యటనలో ఉన్న ఆమె శనివారం జకర్తాలో ఆసియాన్ ఇండియా నెట్‌వర్క్ మేధావుల అయిదో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ప్రారంభించారు. ఆసియాన్ దేశాలు పరస్పరం నౌకాయాన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంస్కృతిక వారసత్వ అనుబంధాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జకర్తాలో భారత సంతతి ప్రజలు నిర్వహించిన మరో కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు.

పాక్ మంత్రిపై సయీద్ పరువునష్టం నోటీసు

లాహోర్: ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి, జమాత్-ఉద్-దావా (జేయూడీ) అధిపతి హాఫీజ్ సయీద్ పాక్ రక్షణమంత్రి ఖుర్రమ్ దస్తగిర్‌కు రూ. 10కోట్లకు పరువునష్టం నోటీసు పంపాడు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయమివ్వడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మండిపడిన నేపథ్యంలో.. సయీద్‌కు చెందిన జేయూడీ, ఎఫ్ఐఎఫ్ తదితర సంస్థలేవీ విరాళాలు సేకరించకుండా పాకిస్థాన్ ఇటీవల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా పాక్ మంత్రి - ఉగ్రవాదులు ఇక బడిపిల్లలపై కాల్పులు జరపలేరని.. ఈ నిర్ణయం అమెరికా ఒత్తిళ్లతో తీసుకోలేదంటూ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సయీద్ పంపిన లీగల్ నోటీసులో - 14 రోజుల్లోగా తనకు లిఖితపూర్వంగా క్షమాపణ చెప్పాలని.. భవిష్యత్తులో ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. పాక్ మంత్రి తన వ్యాఖ్యల ద్వారా తనతోపాటు, తన సంస్థల ఖ్యాతిని దెబ్బతీశారంటూ నోటీసు పంపాడు. మరోవైపు.. జమాత్-ఉద్-దావా (జేయూడీ) సహా 71 సంస్థల్ని నిషిద్ధ జాబితాలో చేర్చాలని పాకిస్థాన్ నిర్ణయించింది.

ఇమ్రాన్‌ఖాన్‌కు మూడో పెళ్లి!

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అధినేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ మూడోసారి వివాహం చేసుకున్నారంటూ ఆ దేశ మీడియాలో కథనాలొచ్చాయి. ఈ వార్తలను ఇమ్రాన్ సన్నిహిత, పీటీఐ వర్గాలు ఖండించాయి. తనకు ఆధ్యాత్మిక మార్గదర్శిగా ఉన్న ఓ మహిళను.. లాహోర్‌లో జనవరి 1న ఇమ్రాన్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారని ఇటీవల పాక్ పత్రికలు ప్రచురించాయి. సదరు మహిళకూ గతంలో వివాహమైంది. అయితే ఆధ్యాత్మిక కారణాలతో తాము విడిపోయినట్లు ఆమె మాజీ భర్త వెల్లడించారు. పీటీఐ కోర్‌కమిటీ సభ్యుడు ముఫ్తీ సయీద్ ఈ నిఖాను జరిపించాడని వార్తలు వచ్చాయి. అయితే వివాహం గురించి ధ్రువీకరణగానీ, ఖండనగానీ ఆయన చేయలేదు. ఇమ్రాన్ వివాహం చేసుకోలేదని తాను కచ్చితంగా చెప్పగలనని.. చేసుకున్నా అది సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఉంటుందని ఇమ్రాన్‌ఖాన్ రాజకీయ కార్యదర్శి నయీముల్ హఖ్ తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00